ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 9-3-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 208 రూ. 5-00 పేజీలు 22+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఒకవైపు సకల జనుల సంతోషం..
మరోవైపు ఆర్థిక పురోగమనం..

ఇలా ఆర్థిక రంగాన్ని ఉరకలెత్తించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తూనే మరోవైపు వివిధ వర్గాల ప్రజలందరి శ్రేయోదాయకంగా సాగింది రాష్ట్ర బడ్జెట్! భిన్న రంగాల ప్రజల చిరకాల ఆశలకు, ఆకాంక్షలకు భరోసా కల్పిస్తూ.. ఏడాదిలో రాబోతున్న ఎన్నికలకు తగ్గట్టే 'సర్వ జన సంతృప్తి'కి పట్టం కట్టింది. ఆర్థికంగా వెనకబడిన, సామాజికంగా ఇక్కట్లు ఎదుర్కొంటున్న వర్గాలు, మహిళలు, యువతకు భారీ కేటాయింపులతో నిండు భోజనం వడ్డించారు ఆర్థిక మంత్రి యనమల! నిరుద్యోగులకు కొండంత ధైర్యాన్నిచ్చారు. దేనికీ లేదనకుండా కీలక రంగాలన్నింటికీ పుష్కలంగా కేటాయింపుల పండగ చేశారు. నిధులివ్వడంలో కేంద్రం నిర్లిప్తంగా మొహం చాటేస్తున్నా.. రాష్ట్రంలో తగినంత ఆదాయం లేకున్నా.. విత్త మంత్రి కేటాయింపుల విషయంలో మాత్రం ఎక్కడా వెనకాడలేదు. పైగా 28 కొత్త పథకాలనూ తెరపైకి తెచ్చారు. మరీ ముఖ్యంగా.. 'లోటు బడ్జెట్‌కు ఇక ఇక్కడితో చెల్లు' అంటూ.. 2018-19 ఆర్థిక సంవత్సరానికి మిగులు బడ్జెట్‌ను ప్రతిపాదించటం నిజంగా విశేషమే!

'ప్రజలే ముందు' నినాదంలో భాగంగా మా ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఉజ్వలమైన సమసమాజాన్ని ఏర్పరచగలిగే సంక్షేమాధారిత ప్రజా బడ్జెట్ ఇది. – యనమల

రాష్ట్ర బడ్జెట్ 2018 - 19

బడ్జెట్ మొత్తం (రూ. కోట్లలో)
1,91,063.61

రెవెన్యూ వ్యయం
1,50,271.99

మూలధన వ్యయం
28,678.49




బడ్జెట్ కథనాలు
2, 8, 9, 10, 11, 12, 13 పేజీల్లో

అందరి సంక్షేమం

ఎవరికి ఎంత (రూ. కోట్లలో)

రజకులు: 70
దూదేకులు: 40
నాయీ బ్రాహ్మణులు: 35
గీత కార్మికులు: 70
వాల్మీకి/బోయలు: 50
వడ్డెరలు: 50
విశ్వబ్రాహ్మణులు: 50
శాలివాహనులు: 50
ఉప్పరలు: 40
మేదరలు: 30
పూసల/కృష్ణ బలిజలు: 25
వైశ్య కార్పొరేషన్: 30
హిజ్రాలు: 20



బడ్జెట్‌లో అదే ఫోకస్

సామాజిక వర్గాలకు భారీగా పెరిగిన కేటాయింపులు

- రూ.1,91,063.61 కోట్లతో జనాకర్షక బడ్జెట్ రూపకల్పన
- లోటు నుంచి రెవెన్యూ మిగులు రూ. 5,235.24 కోట్లు
- 28 కొత్త పథకాలకు శ్రీకారం
- యువత, మహిళలు, బీసీలను ఆకట్టుకునే యత్నం
- పోలవరానికి రూ. 9000 కోట్లు
- బీసీ సంక్షేమానికి రూ.6210 కోట్లు
- మైనార్టీలకు రూ.1102 కోట్లు
- కాపులకు రూ. 1000కోట్లు
- నిరుద్యోగభృతికి రూ. 1000 కోట్లు
- ఆదరణ పథకానికి రూ.750 కోట్లు
- బడికొస్తా పథకానికి రూ.160 కోట్లు
- సాంఘిక సంక్షేమానికి రూ.3,221 కోట్లు
- గిరిజన సంక్షేమానికి రూ.4,176.61 కోట్లు



నీటిపారుదలకు 33 శాతం పెంపు

గృహకల్పనకు 152 శాతం అధిక నిధులు

రైతే ముందు!

సాగు, అనుబంధ శాఖలకు రూ.19,070.36 కోట్లు

వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సోమిరెడ్డి

ఉరకలేస్తున్న వృద్ధి

- రూ.లక్షా ఏడు వేల నుంచి రూ.లక్షా 42 వేలకు పెరిగిన తలసరి ఆదాయం
- 41 లక్షల హెక్టార్లలో పంటలు
- రూ.650కోట్లతో తంగెడంచలో మెగాసీడ్ పార్కు
- రొయ్యల ఎగుమతిలో తొలిస్థానం
- 12 శాతం పెరిగిన గనుల ఆదాయం
- సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి

11లో

ఇదీ సంగతి!



మాట్లాడుకుందాం..!

- చంద్రబాబుకు ప్రధాని మోదీ ఫోన్
- ఎన్‌డీఏలోనే ఉన్నాం.. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించండి
- సీఎం చంద్రబాబు జవాబు

ఈనాడు – అమరావతి

కేంద్ర ప్రభుత్వం నుంచి తెదేపా మంత్రులు వైదొలగాలని నిర్ణయించిన నేపథ్యంలో ప్రధాని మోదీ గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫోన్ చేశారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కూర్చుని మాట్లాడుకుందామని ప్రతిపాదించారు. తొందరపడొద్దని సూచించారు. 'నిన్న మీరు నాకోసం ఫోన్ చేశారు. అప్పటికే రాత్రి బాగా ఆలస్యమైంది. గురువారం ఉదయమే రాజస్థాన్ పర్యటనకు వెళ్లి తిరిగొచ్చిన వెంటనే ఫోన్ చేస్తున్నా' అని మోదీ పేర్కొన్నట్లు తెదేపా వర్గాల సమాచారం. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 'రాష్ట్రానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి నాలుగేళ్లపాటు వేచి చూశాం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటనతో ఇక ఆ సమస్యల పరిష్కారం సాధ్యం కాదని అర్థమైంది. ప్రభుత్వంలో కొనసాగలేమన్న నిర్ణయం తీసుకున్నాం. ఆ విషయం మీకు చెప్పేందుకే ఫోన్ చేశాను. ఆరు గంటలకు మా మంత్రులు మీవద్దకొచ్చి రాజీనామా లేఖలు అందిస్తారు' అని సీఎం చంద్రబాబు బదులిచ్చారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై మాట్లాడదామన్న మోదీ ప్రతిపాదనపై స్పందిస్తూ.. 'కేంద్ర బడ్జెట్‌కు ముందుగానే మీకు సవివరమైన నివేదిక ఇచ్చాను. మేమింకా ఎన్‌డీఏలోనే ఉన్నాం. మంత్రి పదవులు ముఖ్యం కాదు. ప్రజల దృష్టి కోణమే ప్రధానం. ఇప్పుడైనా మేం ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించండి' అని సూచించారు. ప్రధానమంత్రి ఫోన్ చేసిన నేపథ్యంలో గురువారం రాత్రి అమరావతిలో అందుబాటులో ఉన్న మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నారాయణ, అచ్చెన్నాయుడు, పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, కాలవ శ్రీనివాసులు, మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్ తదితరులతో ముఖ్యమంత్రి చంద్రబాబు కొద్దిసేపు సమావేశయ్యారు. ప్రధాని ప్రస్తావించిన అంశాలు, దానికి తానిచ్చిన జవాబును మంత్రులకు వివరించారు. ప్రధానికి రాజీనామా లేఖలు సమర్పించాక అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరిలతోనూ చంద్రబాబు ఫోన్లో మాట్లాడారు.



ఇద్దరు కేంద్ర మంత్రుల రాజీనామా

- సంయుక్తంగా ప్రధానికి లేఖలు అందించిన అశోక్‌గజపతి, సుజనాచౌదరి

ఈనాడు, దిల్లీ: తెలుగుదేశం పార్టీ తరపున కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న పౌరవిమానయానశాఖ మంత్రి అశోక్‌గజపతిరాజు... శాస్త్ర, సాంకేతికశాఖ సహాయమంత్రి సుజనాచౌదరి తమ పదవులకు రాజీనామాలు చేశారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ఇక్కడి 7-లోకకల్యాణ్‌మార్గ్‌లో ప్రధాని నరేంద్రమోదీని కలిసి ఇద్దరూ సంయుక్తంగా రాజీనామా లేఖలు సమర్పించారు. ప్రజా సెంటిమెంట్‌ను గౌరవించి కేంద్రం నుంచి వైదొలగాలని తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తామిద్దరం రాజీనామాలు చేసినట్లు ప్రకటించారు. ఇద్దరితో ప్రధాని సుమారు 10 నిమిషాల పాటు సంభాషించారు. కారణాలను వారు

(మిగతా 2లో)



దిల్లీలో విలేకర్ల సమావేశంలో అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి

చంద్రబాబుతో కలిసి పనిచేయడం గర్వకారణం

రాజీనామా చేసిన భాజపా మంత్రులు

14లో



మహిళా దినోత్సవం సందర్భంగా శాసనసభ కమిటీ హాల్‌లో కేకు కట్‌చేసి మహిళా ప్రతినిధులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మహిళకు సౌలభ్యం

- 50% రాయితీపై శానిటరీ ప్యాడ్లు
- 1.50 కోట్ల మందికి రూ.120 కోట్లతో ప్రణాళిక
- కొత్త ఆర్థిక సంవత్సరంలో పేదయువతులకు పెళ్లి కానుక
- మహిళాదినోత్సవం సందర్భంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో 12 నుంచి 50 ఏళ్ల వయస్సు గల మహిళలకు 50 శాతం రాయితీపై శానిటరీ ప్యాడ్లు పంపిణీ చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం అసెంబ్లీలో ప్రకటించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.50 కోట్ల మంది మహిళలకు ప్రయోజనం చేకూరేలా రూ. 120 కోట్లతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామని వెల్లడించారు. శానిటరీ ప్యాడ్ల వినియోగంలో మహిళలు ఆరోగ్యంగా ఉంటారన్న ఉద్దేశంతో ఖరీదైన వీటిని రాయితీపై అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పేద యువతులకు పెళ్లి ఆర్థికంగా భారం కారాదనే ఎన్టీఆర్ పెళ్లి కానుకను కొత్త ఆర్థికసంవత్సరం నుంచి అమలు చేసేలా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ఎస్సీలకు రూ.40 వేలు, బీసీలకు రూ.30 వేలు చొప్పున అందిస్తామని, వివాహం ఖరారయ్యాక ఖర్చుల కోసం రూ.20 వేలు, మిగతా మొత్తాలు వివాహసమయంలో ఇవ్వనున్నామని వివరించారు. ఆడపిల్లకు ఎదురు కట్నమిచ్చి అబ్బాయిలు పెళ్లి చేసుకునే రోజులు రాబోతున్నాయని ఆయన వ్యాఖ్యానించగా....పలువురు ఎమ్మెల్యేలు ఇప్పటికే చాలా చోట్ల ప్రారంభమయ్యిందని అనడంతో సభలో నవ్వులు విరిశాయి. తెదేపా మొదటి నుంచి మహిళా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, వారంతా కూడా తెదేపాకు అండగా నిలుస్తున్నారని, ఆస్తిలో మహిళలకు సమాన హక్కు స్వర్గీయ ఎన్టీ రామారావు కల్పించారన్నారు. డ్వాక్రా సంఘాలకు ఇవ్వాల్సిన రూ.4 వేల కోట్లలో రూ.2 వేలు కోట్లు మహిళాదినోత్సవం సందర్భంగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. సభలో స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత, ఇతర ఎమ్మెల్యేలు కూడా మాట్లాడారు.

అందరి సంక్షేమం

ఈనాడు – అమరావతి

ఏడాదిలో వస్తున్న ఎన్నికలను... ప్రజల ఆశల్ని, ఆకాంక్షల్ని దృష్టిలో ఉంచుకుని... ఎవరికీ లేదనకుండా... కాదనకుండా... అటు అభివృద్ధిని, ఇటు సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూ, సామాజిక బాధ్యతనీ విస్మరించకుండా... ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు 2018-19 సంవత్సరానికి రాష్ట్ర ఆర్థిక పద్దుని గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. సాధారణ ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వం ప్రవేశపెట్టే పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే కావడంతో... సమాజంలోని అన్ని వర్గాలనూ ఆకట్టుకునేలా జనాకర్షక బడ్జెట్‌ను రూపొందించారు. ఇప్పటికే అమల్లో ఉన్న కొన్ని పథకాలకు కేటాయింపులు భారీగా పెంచుతూనే, 28 కొత్త పథకాలనూ ప్రవేశపెట్టారు. ఇది వరకు కేవలం నామమాత్రపు నిధులతో సరిపెట్టే కొన్ని పథకాలకు, విభాగాలకు ఈసారి అనూహ్యంగా కేటాయింపులు పెరిగాయి. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల్ని, యువత, మహిళల్ని ఆకర్షించే ప్రయత్నం చేశారు. స్వయం సహాయక సంఘాలతో సంఘటితమైన మహిళల్ని, విద్యార్థినుల్ని ఆకట్టుకునేలా శానిటరీ నాప్‌కిన్స్ పథకానికి శ్రీకారం చుట్టారు. తెదేపా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా నిరుద్యోగ భృతి పథకానికి ఈ బడ్జెట్‌లో ఏకంగా రూ.వెయ్యి కోట్లు కేటాయించారు. పశువులకు బీమా, పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్‌లు, హిజ్రాల సంక్షేమం, కొన్నేళ్ల తరువాత లిడ్‌క్యాప్‌కి నిధులు కేటాయించారు. ఆర్యవైశ్యుల డిమాండ్ అయిన వారి ఉపాధి, సంక్షేమానికి తొలిసారి రూ.30కోట్లు ఇచ్చారు. ఆదరణ పథకాన్ని సరికొత్త రీతిలో అమలు చేసేందుకు ఏకంగా రూ.750 కోట్లు కేటాయించారు. సగం ధరలకే పేదలకు జనతా వస్త్రాలిచ్చేందుకు రూ.200 కోట్లు పెట్టారు. ఇలా దాదాపు అన్ని సామాజిక వర్గాల చిరకాల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని, ఆయా వర్గాల్ని సంతృప్తి పరిచేలా కేటాయింపులు చేశారు. కేవలం జనాకర్షక పథకాలకే పరిమితం కాకుండా.. సామాజిక బాధ్యతకూ పెద్ద పీట వేశారు. ఒక పక్క వనరుల కొరత వేధిస్తున్నా, కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థికంగా చేయూత లభించే భరోసా పెద్దగా లేకున్నా... బడ్జెట్ కేటాయింపుల్లో దూకుడుగానే వ్యవహరించారు. ఏకంగా రూ.1,91,064 కోట్లతో భారీ బడ్జెట్ రూపొందించారు. దీనిలో రెవెన్యూ వ్యయం రూ.1,50,272 కోట్లుగా, మూలధన వ్యయాన్ని రూ.28,678 కోట్లుగా పేర్కొన్నారు. ప్రభుత్వ రుణాల చెల్లింపునకు రూ.10,851 కోట్లు కేటాయించారు. రాష్ట్ర విభజన తర్వాత 2014-15 నుంచి ఇంతవరకు ప్రతి బడ్జెట్‌లోనూ కేటాయింపులు సగటున రూ.15 వేల కోట్ల వరకు పెరుగుతూ వస్తుండగా, గత సంవత్సరానికీ ఇప్పటికీ కేటాయింపులు ఏకంగా రూ.34,064.21 కోట్లు పెంచేయడం విశేషం. విభజన తర్వాత రాష్ట్రం ఆర్థిక లోటుతో కొట్టుమిట్టాడుతుండగా... 2018-19లో బడ్జెట్‌లో రూ.5,235.24 కోట్ల రెవెన్యూ మిగులు చూపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అలాగే ద్రవ్యలోటు అంచనా 24,205 కోట్లుగా చూపించారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన బకాయిలన్నీ కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్న ఆశాభావంతోనే రెవెన్యూ మిగులు బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్నట్టు ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో పేర్కొనటం విశేషం.



శాసనసభలో యనమల రామకృష్ణుడి బడ్జెట్ ప్రసంగం.. ప్రతిపాదనలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కేంద్ర నిధులపై భారీ అంచనాలు..!

రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరే ఆదాయ వనరుల్లో కేంద్ర పన్నుల్లో వాటా రూపంలో రూ.33,930 కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ ద్వారా రూ.50,696 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల ద్వారా రూ.65,535 కోట్లు వస్తాయని అంచనా వేశారు. 2017-18 సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలకు, 2018-19 బడ్జెట్ అంచనాలకు మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. 2017-18 సవరించిన అంచనాల ప్రకారం కేంద్ర పన్నుల్లో వచ్చే వాటా రూ.29,001 కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ రూపంలో వచ్చేది రూ.37,548 కోట్లు మాత్రమే ఉంది. రాష్ట్ర సొంత పన్నుల ద్వారా సమకూరిన ఆదాయం కూడా రూ.52,715 కోట్లుంది. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర సొంత వనరులు భారీగా పెరుగుతాయనే భరోసా లేకున్నా... బడ్జెట్ పరిమాణాన్ని మాత్రం పెంచేశారు. రాష్ట్ర వనరుల్లో కీలకమైన జీఎస్‌టీ ద్వారా రూ.38,448 కోట్లు వస్తాయని అంచనా వేశారు. కిందటేడాది ఈ విభాగంలో రూ.32,893 కోట్లుగా సవరించిన అంచనాల్లో పేర్కొనటం గమనార్హం. ఎక్సైజ్‌లోనూ ఏకంగా రూ.రెండు వేల కోట్లు పెరుగుదల ఆశించటం అత్యాశ కావచ్చన్న విమర్శ లేకపోలేదు.

ప్రాధాన్య రంగాలకు పెద్దపీట..!

2017-18 సవరించిన బడ్జెట్ అంచనాలతో పోలిస్తే 2018-19లో కేటాయింపులు 21.70 శాతం ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, నీటిపారుదల, ఆరోగ్యం వంటి రంగాలకు పెంచారు. ఆర్థిక సేవల రంగాలకు 19.89 శాతం, సామాజిక సేవా రంగాలకు 30.92 శాతం, సాధారణ సేవలకు 14.16 శాతం చొప్పున అదనంగా పెంచారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు 35.91 శాతం, నీటిపారుదల, వరద నియంత్రణకు 32.95 శాతం, క్రీడలు, యువజన సర్వీసులకు 62.70 శాతం, గృహ నిర్మాణానికి 152 శాతం చొప్పున పెంచారు. రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్టుకి ఈ బడ్జెట్‌లో రూ.9వేల కోట్లు కేటాయించడం ద్వారా ఈ ప్రాజెక్టు పనులు సాఫీగా సాగేలా జాగ్రత్త పడినట్లు కనిపిస్తోంది. రైతు రుణమాఫీ, డ్వాక్రా సంఘాలకు పెట్టుబడి నిధి వాయిదాలు వడ్డీతో సహా చెల్లించేందుకు తగిన విధంగా కేటాయింపులు చేశారు. కూలీల కొరతతో వ్యవసాయ యాంత్రీకరణకి అందరూ మొగ్గు చూపుతున్న నేపథ్యంలో కిందటేడాదికన్నా రూ.103 కోట్లు పెంచి... రూ.250 కోట్లు కేటాయించారు.

అన్ని వర్గాలకూ సముచిత ప్రాధాన్యం

అన్ని వర్గాలను ఆదుకునేందుకు, ఆకర్షించేందుకు ఈ బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యమిచ్చారు. ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి..!


- ఎస్సీ, బీసీ కులాలకు చెందిన వధువుల వివాహానికి ఆర్థిక సాయానికి చంద్రన్న పెళ్లి కానుక పథకం కింద చెరో రూ.వంద కోట్లు.
- బీసీల్లోని చేతివృత్తుల వారికి ఆదరణ పథకాన్ని మళ్లీ ప్రవేశపెడుతూ రూ.750 కోట్ల కేటాయింపు. 2.55 లక్షల మందికి లబ్ధి.
- చేనేత కార్మికులు ఉత్పత్తి చేసే వస్త్రాలన్నింటినీ సేకరించి వాటిని నిరుపేదలకు, అవసరమైన వారికి 50 శాతం రాయితీపై జనతా వస్త్రాలుగా సరఫరా.
- మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదల, రాయితీ ధరలపై వారికి మరపడవలు, వలలు, డీజిల్ అందించే ప్రతిపాదన. 50సంవత్సరాలు పైబడిన మత్స్యకారులకు సామాజిక భద్రత పింఛను.
- గిరిజన ప్రాంతాల్లో అన్ని పంచాయతీలకు అత్యాధునిక ట్రిపుల్ ప్లే సర్వీసులు. వయబిలిటి గ్యాప్ నిధి కింద రూ.90 కోట్లు.
- గిరిజనులకు పోషకాహారాన్ని సమకూర్చేందుకు ఫుడ్ బాస్కెట్‌లు. ఐటీడీఏల్లో మార్కెటింగ్, సరకు నిల్వ మౌలిక సదుపాయాల కల్పనను మరింత బలోపేతం చేయడానికి రూ.50 కోట్లు.
- తల్లులు, పిల్లల్లో పోషకాహార లోపాల్ని సరిదిద్దేందుకు ప్రత్యేక పోషకాహార పథకానికి రూ.383 కోట్లు. ఐఎంఆర్, ఎంఎంఆర్ సూచికలను తగ్గించేందుకు అన్న అమృత హస్తం పథకాన్ని 257 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అమలు.
- కౌమార బాలికల్లో జీవనవిధాన నైపుణ్యాలు, పోషకాహారం, విద్య, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపైన అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన సబల పథకాన్ని శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, ప్రకాశం, కర్నూలు, కడప జిల్లాలకు విస్తరణ.
- ఉన్నత పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లోని కౌమార బాలికలకు, స్వయంశక్తి సంఘాల మహిళలకు, ఇతర కౌమార బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు అందిస్తాం. దీనికోసం రూ.127 కోట్లు.
- హిజ్రాలు గౌరవప్రదంగా జీవించేందుకు వీలుగా ప్రత్యేక విధానం. రూ.20 కోట్లు.
- విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీకి (బడికొస్తా) రూ.160 కోట్లు కేటాయింపు.
- కొత్త డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు. రూ.100 కోట్లతో పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పాఠశాల విద్యార్థులకుల ఇకపై వారానికి మూడు కోడి గుడ్లకు బదులుగా 5 గుడ్లు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా పోషకాహార భోజనం. యువతలో ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేందుకు డిగ్రీ కళాశాల్లో ఆంగ్ల ప్రయోగశాలల ఏర్పాటు. కొత్త విశ్వవిద్యాలయాలన్నింటిలోనూ మౌలిక సదుపాయాలు.
- సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉపాధి కల్పించే నైపుణ్యాలను సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇచ్చి, వారు ఉద్యోగాలు పొందేలా చేయడం కోసం 1000 నైపుణ్య శిక్షణ కేంద్రాలు.
- 10 లక్షల జంతువులకు బీమా. రూ.50 కోట్లు .
- ఐటీ రంగంలో అంకుర వ్యాపార సంస్థలకు ప్రోత్సాహకాలకు రూ.100 కోట్లు.
- ఏపీఎస్ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు కొనుగోలు కోసం రూ.200 కోట్ల గ్రాంట్.
- రాష్ట్రంలోని అన్ని పురపాలక, నగరపాలక సంస్థల పరిధిలో అన్న క్యాంటిన్లు. దీనికి రూ.200కోట్లు కేటాయింపు.
- విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో రూ.75 కోట్లతో ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన. పురపాలక పాఠశాలల బలోపేతం.
- కళలు, సంగీతం, చరిత్ర, విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 7 అకాడమీలు ఈ సంవత్సరం నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తాయని ప్రకటించారు.


యనమల రామకృష్ణుడు ఆర్థిక మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది పదోసారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, రాష్ట్ర విభజన తర్వాత మొత్తం ఆయన పదిసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు.



మరోసారి మంత్రివర్గ విస్తరణ!

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గాన్ని కొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు విస్తరించే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. భాజపా మంత్రుల రాజీనామాల ఆమోదంతో ఏర్పడిన రెండు ఖాళీల్ని కొత్తవారితో భర్తీ చేయక తప్పదని అంటున్నారు. అవి రెండూ వైద్య, ఆరోగ్యం, దేవాదాయం వంటి కీలక శాఖలే. ఎక్కువ రోజులు ఖాళీగా ఉంచే పరిస్థితి ఉండదు. శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాలకు జవాబులిచ్చే బాధ్యత, బడ్జెట్ ప్రతిపాదనలు, బిల్లులకు సంబంధించిన వ్యవహారాలు చూసేందుకు సీనియర్ మంత్రులకు వీటి బాధ్యతలు అప్పగించినా... అది తాత్కాలికమే అవుతుంది. ఏడాది కాలంలోనే ఎన్నికలు రానున్న నేపథ్యంలో రాజకీయ సమీకరణాల దృష్ట్యా కొద్ది వారాల్లోనే విస్తరణ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మంత్రివర్గంలో ముస్లిం మైనారిటీలకు ప్రాతినిధ్యం లేదు. కిందటి ఎన్నికల్లో భాజపాతో ఎన్నికల అవగాహన కుదుర్చుకున్న నేపథ్యంలో మైనారిటీలు పార్టీకి కాస్త దూరమయ్యారన్న భావనుంది. వారి సంక్షేమానికి తీసుకున్న చర్యలతో ఆ వర్గం పార్టీకి సన్నిహితం అవుతోందని నాయకులు భావిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ చర్యలు బాగానే ఉన్నా... రాజకీయంగా కూడా తగిన గుర్తింపు ఇస్తే పార్టీకి మరింతగా ఆకర్షితులవుతారన్న వాదనుంది. వైకాపా నుంచి ఆ వర్గానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీలో చేరగా... తెదేపాకి చెందిన నేత ఎమ్మెల్సీగా ఉన్నారు. ప్రకాశం, కడప వంటి జిల్లాల నుంచి ఒక్కరు చొప్పునే మంత్రివర్గంలో ఉన్నారు. భాజపా మంత్రుల రాజీనామాలతో రాజకీయంగా కీలక ప్రాధాన్యమున్న పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల ప్రాతినిధ్యం కాస్త తగ్గింది. ఈ పరిణామాల దృష్ట్యా విస్తరణ చేయొచ్చని భావిస్తున్నారు.





పదేళ్లలో మూత్రపిండ వ్యాధుల బాధితులు రెట్టింపయ్యారు

దిల్లీ: దేశంలో మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్నవారి సంఖ్య.. పదేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు రెట్టింపయ్యిందని భారతీయ వైద్యుల సంఘం (ఐఎంఏ) తెలిపింది. ఇది మరింత పెరిగే అవకాశముందని అంచనా వేసింది. ఇటు పట్టణ ప్రాంత వయోజనుల్లో మధుమేహం, అధిక రక్తపోటుకు గురైనవారి సంఖ్య కూడా 20% పెరిగిందని పేర్కొంది. ఈ మేరకు భారతీయ వైద్య పరిశోధన మండలి జరిపిన అధ్యయన వివరాలను ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎన్ టండన్ వెల్లడించారు. ప్రజల జీవనశైలిలో మార్పులతో మూత్రపిండ వ్యాధులు పెరిగాయని ఆయన అన్నారు. వైద్యుల సూచన లేకుండా ఔషధాలు తీసుకోవడం, భార లోహాలుండే సంప్రదాయ మందులను వాడటమూ మూత్రపిండాలకు హాని చేస్తుందని చెప్పారు. వ్యాధులు ముదిరిన దశలో చికిత్సలకయ్యే ఖర్చులు.. సగటు భారతీయుల స్థోమతకు మించి ఉంటున్నాయని అన్నారు. ఇటు గురువారం ప్రపంచ మూత్రపిండ దినోత్సవం సందర్భంగా.. ఐఎంఏ మూత్రపిండ వ్యాధుల నివారణ ప్రాజెక్టును ప్రారంభించింది.

హోదా భావోద్వేగ అంశంగా మారింది

- సుజనా, అశోక్‌గజపతిరాజు

ఈనాడు, దిల్లీ: ప్రత్యేకహోదా భావోద్వేగ అంశంగా మారిందని కేంద్ర మంత్రులు సుజనాచౌదరి, అశోక్‌గజపతిరాజు వెల్లడించారు. ప్రజాసెంటిమెంట్‌ను గౌరవించడంతో పాటు, తమ పార్టీ అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా చేశామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి రాజీనామాలు సమర్పించిన అనంతరం పార్టీ సహచరుడు అశోక్‌గజపతిరాజుతో కలిసి సుజనాచౌదరి గురువారం రాత్రి తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ఏమన్నారంటే..

ఒక జాతీయ పార్టీ దగా చేస్తే... మరొకటి మోసం చేసింది: సుజనాచౌదరి

"ఆ రోజు పూర్తి అశాస్త్రీయంగా రాష్ట్రాన్ని విడగొట్టారు. విభజన బిల్లును పాస్ చేసిన విధానం కూడా ప్రజాస్వామ్య ప్రక్రియగా జరగలేదు. పార్లమెంటు ఉభయసభల్లో నాడు విభజన బిల్లు ఎలా పాసైందో అందరికీ తెలుసు. అయినా ఆ గాయాలను మరిచి ముందుకెళ్లాలన్న ఉద్దేశంతోనే ఎన్డీయేతో కలిశాం. ప్రత్యేక హోదా అంశాన్ని సరైన సమయంలో పరిష్కరించలేదు. ఇది వరకు చెప్పిన ప్రత్యేకప్యాకేజీనైనా ప్రకటించిన వెంటనే అమలు చేసి ఉంటే బాగుండేది. కనీసం అది కూడా చేయలేదు. ఒక జాతీయపార్టీ దగా చేస్తే.. మరో జాతీయ పార్టీ మోసం చేసింది. దానివల్లే ఆంధ్రప్రదేశ్ ప్రజలు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ కేంద్రం నుంచి వైదొలగాలని మా అధినేత నిర్ణయించారు. దాని ప్రకారం ప్రధానమంత్రికి రాజీనామాలు సమర్పించాం. ఇప్పుడు మాకు మరింత స్వేచ్ఛ దొరికింది. అనుకున్న లక్ష్యం సాధించడానికి శక్తివంచన లేకుండా పోరాడుతాం..." అని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత సుజనాచౌదరి వెల్లడించారు. "రాజీనామాలు సమర్పించడానికి వెళ్లినప్పుడు ప్రధాని తమను సాదరంగా ఆహ్వానించారు. మేం అందజేసిన కాగితాలన్నింటినీ పరిశీలించారు. ఇప్పటికే చాలా చేశాం కదా? మిగతావి కూడా కొంత అటూఇటూ అవుతాయన్నారు. అయితే 2016 సెప్టెంబర్ 8వ తేదీన ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీలో ఇప్పటివరకూ ఒక్కటి కూడా అమలు స్థాయికి రాలేదు. అందుకే ఈ పరిస్థితి ఇంత వరకూ వచ్చిందని చెప్పాం. ప్రజల్లో చాలా భావోద్వేగాలున్నాయని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాం. జరిగిందేదో జరిగిపోయింది. కచ్చితంగా అన్నీ చేస్తానని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు అండగా ఉంటూ... రాష్ట్ర ప్రజల కోసం సేవ చేస్తానని స్పష్టం చేశారు. రాజీనామాలను దురదృష్టకరంగా ప్రధాని పేర్కొన్నారు. ఇన్నాళ్లు అందరం కలిసి బాగా పనిచేశామని వ్యాఖ్యానించారు. ఆయన మంత్రివర్గంలో పనిచేసే అవకాశం కల్పించినందుకు మేమిద్దరం ఆయనకు ధన్యవాదాలు తెలిపాం..." అని వివరించారు. కేంద్రం ఇచ్చిన నిధులకు మీరు ధ్రువీకరణపత్రాలు సమర్పించలేదట కదా? అన్న ప్రశ్నపై సుజనాచౌదరి తీవ్రంగా మండిపడ్డారు. గవర్నమెంట్ ఫైనాన్షియల్ రెగ్యులేషన్ నిబంధనల ప్రకారం ఇప్పటివరకూ తమకిచ్చిన నిధులన్నింటికీ వినియోగ ధ్రువపత్రాలు సమర్పించామన్నారు. దానిపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి, భాజపా నాయకులు తమ ముందుకొచ్చి అడిగితే చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి వైదొలిగిన మీరు ఆర్థిక బిల్లుకు మద్దతిస్తారా? లేదా? అన్న ప్రశ్నకు బదులిస్తూ... సమయం వచ్చినప్పుడు దానిపై నిర్ణయం తీసుకుంటామని, పార్టీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు వెళ్తామన్నారు. మీరు ఎన్డీయేలో ఎంతవరకూ కొనసాగుతారన్న ప్రశ్నకు బదులిస్తూ 16వ లోక్‌సభే తమకు అంతిమగడువు అన్నారు.

ఇద్దరు కేంద్ర మంత్రుల రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

ఆయనకు వివరించారు. ఆయన ప్రభుత్వంలో పని చేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు దారితీసిన కారణాలను వివరిస్తూ ఒక లేఖను ప్రధానికి ఇవ్వడంతో పాటు, రాష్ట్రపతిని సంబోధిస్తూ రాసిన రాజీనామా పత్రాన్ని దానికి జత చేశారు. అశోక్‌గజపతిరాజు మాత్రం ఎలాంటి కారణాలు చెప్పకుండా తాను పదవికి రాజీనామా చేస్తున్నానని, దాన్ని ఆమోదించాలని కోరారు. మంత్రిగా విధి నిర్వహణలో తగిన విధంగా సహకరించినందుకు ధన్యవాదాలు అని తెలిపారు. అంతకుముందు పార్లమెంటులో తెలుగుదేశం ఎంపీలంతా వీరిని అభినందించారు.

రాజీనామా లేఖల్లో...

"మీ నాయకత్వంలోని మంత్రిమండలి సభ్యుడిగా ఈ దేశానికి, ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. 3 ఏళ్ల నాలుగు నెలలుగా ప్రజావిధానం, పరిపాలనకు సంబంధించిన అంశాల్లో వ్యక్తిగతంగా, రాజకీయంగా అవగాహన పెంపొందించుకొనేందుకు అనువైన వేదికను నాకు కల్పించినందుకు కృతజ్ఞతలు. మీతో కలిసి పనిచేయడాన్ని ఆస్వాదించాను. నా పదవీకాలంలో మీరిచ్చిన మద్దతుకు అభినందనలు. ఏదేమైనప్పటికీ ప్రజాసెంటిమెంట్‌ను గౌరవించడంతో పాటు, మా పార్టీ అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నాను. రాష్ట్రపతిని ఉద్దేశించి రాసిన లేఖను దీంతో పాటు జత చేస్తున్నాను. దాన్ని గుర్తించి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాలని విజ్ఞప్తి చేస్తున్నాను."

ఇట్లు.. వైఎస్ చౌదరి

కేంద్ర మంత్రిమండలి నుంచి నేను తక్షణం రాజీనామా చేస్తున్నాను. దాన్ని ఆమోదించాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. మంత్రిమండలి సభ్యుడిగా కొనసాగిన సమయంలో మీరు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

ఇట్లు.. పి.అశోక్ గజపతిరాజు

మేం సోమరిపోతులం కాదు... దేశానికి తిరిగి ఇచ్చేవాళ్లం: అశోక్‌గజపతిరాజు

విభజన సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత జాతీయపార్టీలపైనే ఉందని కేంద్ర మంత్రి అశోక్‌గజపతి పేర్కొన్నారు. "ఆనాడు అసెంబ్లీ వ్యతిరేకించినా జాతీయపార్టీలన్నీ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను విభజించాయి. ఆరోజు భాజపా మద్దతు ఇవ్వకపోతే విభజన జరిగి ఉండేది కాదు. అందువల్ల న్యాయం చేయాల్సిన బాధ్యత వారిపైనా ఉంది. ఇప్పుడు మళ్లీ మేం గడియారాన్ని వెనక్కు తిప్పమని అడగడం లేదు. ఇచ్చిన హామీలను గౌరవించండి. మేం భారతీయులం... సోమరిపోతులంకాదు. కష్టపడి దేశానికి మా వంతు చేయూతనందిస్తాం. ముఖ్యమంత్రి రాష్ట్రం కోసం కష్టపడుతున్నారు. ప్రభుత్వ స్ఫూర్తితో రైతులు భూములను త్యాగం చేసి రాష్ట్రాభివృద్ధికి తమ వంతు కష్టం ధారపోస్తున్నారు. ఇందుకు కేంద్రం చేయూత తోడైతే రాష్ట్రం మరింత ముందుకెళ్తుంది. మా గురజాడ అన్నట్లు... దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని గుర్తుంచుకుంటే చాలు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలి. దాన్ని ఎలా చేయగులుగుతారో చెప్పాలి..." అని కేంద్రమంత్రి పి.అశోక్‌గజపతి రాజు పేర్కొన్నారు. "మనకు పదవులకంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ముఖ్యమంత్రి ఎప్పటి నుంచో చెబుతూ వస్తున్నారు. ఇప్పుడు మనకో సమస్య ఉందని, దానిపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడం ప్రధానం. ఈ నిర్ణయం ద్వారా ముఖ్యమంత్రి అందరి దృష్టినీ ఆ సమస్యపైకి మళ్లించగలిగారని విశ్లేషించారు. మరికొంత కాలం కొనసాగి ఉంటే ఏమైనా ప్రయోజనం ఉండేదేమోనన్న భావనతో ఏకీభవించను. తాము ఇప్పటికీ ఎన్డీయేలో భాగస్వాములుగా ఉన్నందున కేంద్రం ఏదైనా చేయాలనుకుంటే ఇప్పుడూ చేయవచ్చు. కేంద్రం సహకారం అందిస్తే ఆంధ్ర ప్రజలు వారంతకు వారే ఎదుగుతారు. దేశంలో అందరూ కలిసి బాగుపడాలి తప్పితే నేనొక్కరే బాగుపడాలి... మిగతావారు బాధపడాలన్న భావన మంచిది కాదు.." అని వివరించారు.

రూ.10కే నాలుగు శానిటరీ నేప్కిన్లు

ఆవిష్కరించిన కేంద్రం

దిల్లీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చవక ధరకే శానిటరీ నేప్కిన్లను కేంద్రం అందుబాటులోకి తెచ్చింది. ప్రధాన మంత్రి భారతీయ జన్‌ఔషధి పరియోజన (పీఎంబీజేపీ) కేంద్రాల్లో మే 28 నుంచి వీటిని విక్రయించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర రసాయనాలు, ఎరువులు శాఖ మంత్రి అనంత్ కుమార్ గురువారం తెలిపారు. నాలుగు నేప్కిన్లను రూ.10కి విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాలుగు నేప్కిన్ల ధర రూ.32గా ఉందని, అయితే బడుగు బలహీన వర్గాల్లోని మహిళల కోసం తక్కువ ధరకే వీటిని అందుబాటులోకి తెస్తున్నామని ఆయన చెప్పారు. అంతేకాదు ఇవి పర్యావరణంలో ఇట్టే కలిసిపోతాయని (జీవవిచ్ఛిన్నకర నేప్కిన్లు) వివరించారు. అందరికీ ఔషధాలు, వైద్యాన్ని చేరువ చేయాలనే ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ నేప్కిన్లను ఆవిష్కరించామని చెప్పారు.

గ్రహం అనుగ్రహం

9–3–2018 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
అష్టమి: పూర్తి
జేష్ఠ నక్షత్రం: తె. 4-38 తదుపరి మూల
అమృత ఘడియలు: రా. 7-02 నుంచి 8-46 వరకు
వర్జ్యం: ఉ. 8-34 నుంచి 10-18 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-38 నుంచి 9-25 వరకు
తిరిగి మ. 12-34 నుంచి 1-21 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6-17; సూర్యాస్తమయం: సా.6-04

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కర్నూలు	38.6	21.2
శ్రీకాకుళం	38.0	20.5
రాజమహేంద్రవరం	37.5	21.0
గుంటూరు	37.5	18.1
సూర్యాపేట	37.0	24.0
ఖమ్మం	37.0	20.0
కడప	37.0	19.1
తిరుపతి	36.7	17.0
హైదరాబాద్	36.5	19.8
అనంతపురం	36.3	18.2
ఒంగోలు	35.1	21.5
విజయవాడ	35.1	20.2
తాడేపల్లిగూడెం	33.6	21.2
నరసాపురం	33.0	20.0
నెల్లూరు	33.0	20.0
విశాఖపట్నం	32.0	21.0

జేఈఈ, నీట్ పాఠ్యప్రణాళికలో మార్పు!

- ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ తగ్గించాలని కేంద్రం నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక జాతీయ ప్రవేశ పరీక్షలైన జేఈఈ మెయిన్, అడ్వాన్స్డ్, నీట్ పాఠ్య ప్రణాళికలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. జాతీయ విద్యాపరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) సిలబస్‌ను 50 శాతం తగ్గించాలని కేంద్రం ప్రకటించడం.. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రజల నుంచి సూచనలు ఆహ్వానించడంతో ఈ అంశంపై విద్యావేత్తలు, శిక్షణసంస్థలు, అధ్యాపకుల్లో చర్చ జరుగుతోంది. ప్రధానంగా 11, 12 తరగతుల్లో ఏ మాత్రం మార్పు చేసినా ఆ ప్రభావం జాతీయ పరీక్షలు, ఆపైన తెలుగు రాష్ట్రాల్లోని ఇంటర్ సిలబస్‌పైనా ఉంటుందని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

'విద్యేతర కార్యక్రమాలైన ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, జీవన నైపుణ్యాలపై విద్యార్థులు దృష్టి పెట్టేలా చూడాలి. కేవలం సమాచార బ్యాంకులుగా విద్యార్థులను చూస్తే సమగ్రాభివృద్ధి ఉండదు' అని ఇటీవల కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ వ్యాఖ్యానించారు. ఎన్‌సీఈఆర్‌టీ తయారు చేసిన సిలబస్‌నే సీబీఎస్‌ఈ అనుసరిస్తుంది. పాఠ్యప్రణాళిక భారంగా మారడంపై ఫిర్యాదులు రావడంతో ప్రజల నుంచి సూచనలను ఆహ్వానించారు. ఏప్రిల్ 6వ తేదీ వరకు వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటారు. దేశవ్యాప్తంగా ఆరు నగరాల్లో కార్యశాలలు నిర్వహించి సూచనలు తీసుకుంటారు. తర్వాత కమిటీని నియమించి తుది నిర్ణయం తీసుకుంటారు.

ఆ పాఠ్య ప్రణాళికను అనుసరించాల్సిందే..

జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని తెలుగు రాష్ట్రాల ఇంటర్‌బోర్డులు పాఠ్య ప్రణాళికను రూపొందించుకుంటూ వస్తున్నాయి. నీట్ వస్తుందని 2010లోనే మార్పులు చేయడం గమనార్హం. దానివల్ల 2017 నుంచి నీట్ రాయాల్సి వచ్చినా తెలుగు విద్యార్థులు పెద్దగా సమస్యను ఎదుర్కొనలేదు. కేంద్రం తాజా నిర్ణయం నేపథ్యంలో సీబీఎస్‌ఈ ప్రకారం 11, 12 తరగతుల్లోని పాఠ్యాంశాల్లో మార్పులు చేస్తే.. జేఈఈ మెయిన్, అడ్వాన్స్డ్, నీట్‌కూ సిలబస్ మారుతుంది. ఆ పరీక్షలకు తెలుగు విద్యార్థులు పోటీ పడాలంటే ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల పాఠ్య ప్రణాళిక కూడా మార్పు చేయక తప్పదు.

ఎంత వరకు మారుతుంది?..

గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలు ఎక్కువగా జరగడంతో అక్టోబరు 17న తెలంగాణ విద్యాశాఖ కళాశాలల ప్రతినిధులు, విద్యావేత్తలతో చర్చించింది. ఈ సందర్భంగా భౌతిక, రసాయనశాస్త్రాల సిలబస్ ఎక్కువగా ఉందని, తగ్గించాలని సబ్జెక్టు నిపుణులు సూచించారు. కొంత సిలబస్‌ను పాఠశాల స్థాయిలో ఉంచితే ఇంటర్‌లో భారం తగ్గుతుందని చెబుతున్నారు. గణితం నిపుణుడు శంకర్‌రావు మాట్లాడుతూ మూడో అధ్యాయం, నాలుగో అధ్యాయానికి సంబంధించి అయోమయం ఉందని, కొన్ని అధ్యాయాలు జేఈఈ మెయిన్‌కు పనికొస్తే మరికొన్ని అడ్వాన్స్డ్‌కు పనికొస్తాయని చెప్పారు. ఇంటర్ పరీక్షలకు అన్నీ చదవాల్సిందేనన్నారు. అలా లేకుండా చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.


MAKE EVERY DAY EVENTFUL
Discover Events
There's so much you can do with Facebook Events. Find hundreds of activities based on your interests like weekend football matches, blind food tastings, performance art or whatever else you're into. Just click the 'Events' button to experience all the unique things happening around you.
LIVE WHAT YOU LOVE


మెగా మార్చి. మెగా ఆదా.
మీకిష్టమైన హ్యుండాయ్‌ని ఇంటికి తెచ్చుకుని, అద్భుతమైన ఆఫర్లని అందుకునే సమయం వచ్చేసింది.
20 YEARS CELEBRATION BEGINS
హ్యుండాయ్ కార్లపై ప్రత్యేక ఆఫర్లు
RSA**తో 3 ఏళ్ళ వారంటీ
స్టాండర్డ్ ఫిట్‌మెంట్‌గా స్వచ్ఛ్ కాన్
ప్రత్యేక ఆఫర్
2018 మార్చి 28 వరకే
EON
Benefits up to ₹45,000*
New GRAND i10
Special price at ₹4.39 Lacs (Era (P))
Benefits up to ₹65,000* (P) / ₹75,000* (D)
All New XCENT
Special price at ₹5.39 Lacs (E+(P))
Benefits up to ₹55,000* (P/D)
TUCSON మరియు ELANTRA^ పై ఆకర్షణీయమైన 6.99% ఫైనాన్స్ స్కీమ్ | ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ బెనిఫిట్* | ఫ్యాక్టరీలో బిగించిన CNGతో పాటుగా లభించే XCENT PRIME | ఆకర్షణీయమైన క్యాష్ బెనిఫిట్*
i20 ACTIVE
Benefits up to
₹40,000* (P/D)
ELANTRA
Special Exchange Offer
₹30,000* (P/D)
TUCSON
Special Exchange Offer
₹30,000* (P/D)
Lowest cost## of maintenance.
Book online at https://bookonline.hyundai.co.in
3 YEARS
3 yrs Warranty** with
3 yrs Road Side Assistance
Available as standard fitment across range.
स्वच्छCan
HYUNDAI
• For more details, give a missed call on 08040751740 • Special offer for Govt. employees, select corporates and CAs^^ • Hyundai is now available at DGS&D & CSD/CPC, contact us at ajitrana@hmil.net
Call Centre
1-800-11-4645
098-7356-4645
24X7 Road Assist.
1-800-102-4645
0124-2564645
www.hyundai.co.in
SMS HCARE TO 54242
For HYUNDAI CARE Mobile App
PROMISE® APPROVED USED CAR
Complete peace of mind with 1305 nationwide service outlets and 1061 sales points across 771 cities.
For any National and Bulk deals, contact bulkorder@hmil.net
*Terms & Conditions apply. Special Price for GRAND i10 @ ₹4.39 Lacs applicable only on Era (Petrol) variant. Special Price for XCENT @ ₹5.39 Lacs applicable only on E+ (Petrol) variant. Benefits include cash discount, exchange bonus and benefits for government employees, whichever is applicable. Benefits on GRAND i10 are not applicable for Era (Diesel). Benefits on XCENT are not applicable for E variant (Petrol & Diesel). Schemes may vary from state to state. ^Finance is at the sole discretion of the financier. ^^Offer applicable for retired Govt. employees as well. **3 Years/100,000 kms for EON, GRAND i10, ELITE i20/ACTIVE and XCENT. 3 Years/Unlimited kms for VERNA, CRETA, ELANTRA and TUCSON. RSA stands for Road Side Assistance. ##Source: Cardekho.com for 5 years/50,000 km, average yearly periodic maintenance starts @ ₹1735 (EON Petrol 800cc in Delhi). HMIL reserves the right to withdraw / modify the scheme without prior notice. Visit your nearest Hyundai dealership for more details. Features and specifications as shown may not be part of standard fitment and are subject to change without prior notice. Hyundai urges you to follow traffic rules – these are meant to keep you safe on roads.
FOR INFORMATION CONTACT: VIJAYAWADA: KUSALAVA HYUNDAI, LABBIPET, PH: 9985374311, SAI SWARNA HYUNDAI, RAMAVARAPPADU RING ROAD, PH: 9581251234, LUCKY HYUNDAI, ENIKEPADU PH: 7799911789, BHIMAVARAM: KUSALAVA HYUNDAI, PH: 9866175390
GUNTUR: KUSALAVA HYUNDAI, PH: 9866672302 NELLORE: KUN HYUNDAI, PH: 9849549222 ONGOLE: SRI CHAKRA HYUNDAI, PH: 9949096708
INNOCEAN-011/18 TEL

ఈనాడు

వాగ్దాన భంగం

విభజన చట్టం హామీలకన్నా మిన్నగా మరెన్నో వెసులుబాట్లతో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలకు వెన్నుదన్నుగా నిలుస్తామంటూ నాలుగేళ్ల క్రితం కమలనాథులు అభయమిచ్చారు. 'సీమాంధ్ర, తెలంగాణ ప్రజలు పూర్తి సంతృప్తిగా లేరని తెలుసు... త్వరలోనే ఆ లోటును మేము పూరిస్తా'మన్న భాజపా పెద్దలు నలభై అయిదు నెలలుగా ఉద్ధరించిందేమీ లేకపోబట్టే- తెలుగువారిలో కట్టలు తెంచుకొంటున్నాయి ఆగ్రహావేశాలు! రెండు తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామిక ఆర్థికాభ్యున్నతి కోసం పన్ను రాయితీలు సహా తగిన ఆర్థిక చర్యలను కేంద్రం చేపడుతుందని విభజన చట్టంలోని 94వ షెడ్యూలు చెబుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి వీలుగా భౌతిక, సామాజిక, మౌలిక సదుపాయాల విస్తృతి సహా ప్రగతిశీల పథకాలకు తోడ్పాటునందిస్తామనీ చట్టం హామీ ఇచ్చింది. దాన్ని నిలబెట్టుకొంటున్నామంటూ వెనకబడిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు మోదీ సర్కారు ప్రకటించిన రాయితీలు కేవలం కంటితుడుపే. నవనిర్మాణ దీక్ష చేపట్టి, పునర్నిర్మాణ మహాయజ్ఞం తలపెట్టి ఏపీ, తెలంగాణలు కేంద్ర సాయం కోసం ఎదురుచూస్తుంటే- కాసులు విదల్చని కిరికిరీతో సాగుతున్నది క్రూర పరిహాసమే! ప్రతిష్ఠాత్మక మిషన్ భగీరథ, కాకతీయలకు కాసుల ఊసులేని మెచ్చుకోళ్లతో కేంద్రం సరిపుచ్చుతున్న తీరు తెలంగాణ ప్రభుత్వాన్ని అసహనానికి గురిచేస్తోంది. పూర్తిగా వ్యవసాయ ఆధార రాష్ట్రంగా మిగిలి, 'విత్తు'లేనిదే అభివృద్ధి మొలకెత్తలేని ఆంధ్రప్రదేశ్‌కు- అయిదు కాదు, పదేళ్ల ప్రత్యేక హోదా కల్పిస్తామన్న కమలనాథులు, దరిమిలా ప్రత్యేక ప్యాకేజీకి శ్రుతి చేసినా దాన్నీ అరకొరగానే అమలు చేయబూనడం- తీరప్రాంత రాష్ట్రానికి శరాఘాతంలా మారింది. మిత్రధర్మానికి కట్టుబడి 29సార్లు ప్రత్యేకంగా దిల్లీ వెళ్లి మొత్తుకొన్నా ప్రయోజనం లేకపోయేసరికి- ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి తెదేపా నిష్క్రమించింది. విభజిత రాష్ట్రాలకు కేంద్రం ఇదమిత్థంగా ఏమేమి చెయ్యాలో చట్టం విస్పష్టంగా నిర్దేశించినా, ఆకుకు అందని పోకకు పొందని అభ్యంతరాలతో విత్తమంత్రి అడ్డుపుల్ల వేస్తున్న తీరు- తెలుగువారిని కుపితుల్ని చేస్తోంది!

సీమాంధ్రకు అయిదేళ్లు కాదు పదేళ్ల ప్రత్యేక హోదా కల్పించాలని, రెవిన్యూ లోటు భర్తీ నిమిత్తం కేంద్ర సంచిత నిధి నుంచి రూ.10వేల కోట్లు కేటాయించాలని 2014 ఫిబ్రవరి 20న పెద్దల సభలో భాజపా పెద్దలే అప్పటి అధికార కాంగ్రెసును గట్టిగా నిలదీశారు. బిడ్డ కోసం తల్లిని చంపేశారంటూ తిరుమలేశుని సన్నిధిలో ఏపీకి జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించిన మోదీ- దిల్లీని తలదన్నే రాజధాని నిర్మాణంతోపాటు అన్ని విధాలుగా ఆదుకొంటామని వాగ్దానం చేశారు. సార్వత్రిక ఎన్నికలవేళ పొంగులువారిన సౌహార్దం ప్రభుత్వ ఏర్పాటు తరవాత క్రమంగా ఎలా ఇగిరిపోయిందీ తెలుగువారు గమనిస్తూనే ఉన్నారు. ప్రత్యేక హోదా ఎవరికీ ఇవ్వరాదని పద్నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సు చేసిందని జైట్లీ పదేపదే చెబుతున్నా, అలాంటిదేమీ లేదని ఆర్థిక సంఘం సభ్యులు అభిజిత్ సేన్ లోగడే స్పష్టీకరించారు! పెట్టుబడిదారులు తమ లాభదాయకత చూసుకొంటూనే ఉపాధి అవకాశాలు విస్తరించి ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తారని అలా వచ్చిన సొమ్ముతో రాష్ట్రాలు అభివృద్ధి పథకాలు చేపట్టాలని గతంలో ఉద్బోధించిన జైట్లీకి- పారిశ్రామిక సేవారంగాల్లో ఏపీ మందభాగ్యం తెలియనిది కాదు. ప్రత్యేక హోదాతో ఎక్సైజ్ సహా ఇతర పన్ను రాయితీలు పారిశ్రామికవేత్తల్ని పరుగులు పెట్టించి పరిశ్రమల రంగం బలంగా వేరూనడానికి కారణమవుతాయి. ప్రత్యేక హోదాతో సమాన ప్యాకేజీ అంటూనే- దాన్ని కేంద్ర పథకాల రాయితీలకు పరిమితం చేసి, పన్నుల అంశం ప్రస్తావించేసరికి బిహార్, ఝార్ఖండ్‌ల మాటేమిటంటున్న జైట్లీ- నయవంచనకు నగిషీలు అద్దుతున్నారు. రెవిన్యూ లోటు పూరింపు పైనా పెడసరపు లెక్కలే. విభజన హామీల సక్రమ అమలులో ఎన్‌డీఏ పాలకుల విశ్వసనీయత ఇప్పుడిక ప్రశ్నార్థకమే!

ప్రత్యేక హోదా కోసం పద్నాలుగో ఆర్థిక సంఘానికి చంద్రబాబు చేసిన విజ్ఞాపన అరణ్య రోదనమై పోగా, 2020 నాటికి లోటులో ఉండే ఏకైక రాష్ట్రం ఏపీయేనని అది తీర్మానించింది. ప్రత్యేక హోదా లేకపోతేనేం- కేంద్రం ప్రత్యేక దృష్టి, ప్రత్యేక తోడ్పాటు ఏపీకి అండదండగా నిలుస్తాయన్న వాగ్దానాలూ నేడు వట్టిపోయాయి. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వెనకబడిన ప్రాంతాలకు కోరాపుట్-బలంగిర్-కలహండి(కేబీకే), బుందేల్‌ఖండ్‌ల తరహా అభివృద్ధి ప్యాకేజీ లభిస్తుందన్నది రాజ్యసభలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీ. అది అమలులోకొచ్చేసరికి జిల్లాకు రూ.50 కోట్లవంతున అయిదేళ్లపాటు సాయానికి విత్తమంత్రి ఔదార్యం పరిమితమైంది. చంద్రబాబు రెండు కళ్లుగా పరిగణిస్తున్న పోలవరం, రాజధాని నిర్మాణాలకు సంబంధించి- ఇప్పటిదాకా ఎంతో ఇచ్చామన్నట్లుంది జైట్లీ ధోరణి! వేలకోట్ల రూపాయలు వ్యయమయ్యే ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుకు నాలుగేళ్లలో నాలుగుశాతం నిధులే విదిలించారంటే వాటి నిర్మాణం ఎప్పటికి పూర్తి కావాలి? హోదాకు ఎసరు, ప్యాకేజీకి పరిమితులు పెట్టి, రెవిన్యూలోటు భర్తీకి, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికీ అరకొర నిధులిచ్చి ఏపీ ప్రయోజనాలపై శీతకన్నేస్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వం- తక్కిన రాష్ట్రాలపట్లా అదే తీరుగా వ్యవహరిస్తోందా అన్నది ప్రశ్న. మొన్నటి బడ్జెట్లో బెంగళూరు మెట్రో, ముంబయి సబర్బన్ల విస్తృతికి వేల కోట్ల రూపాయల్ని ప్రత్యేకించిన కమలనాథుల ఔదార్యంలో ప్రస్ఫుటమైన రాజకీయ దృక్కోణాలు రెండు తెలుగు రాష్ట్రాల్ని కుపితుల్ని చేసేవేననడంలో సందేహం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కీలకమైన విభజన హామీల అమలులో విశ్వసనీయత కోల్పోవడం మోదీ సర్కారుకు ఏ విధంగానూ శ్రేయస్కరం కాదు!

సత్వర న్యాయానికి సాంకేతిక సాయం



అందరికీ న్యాయం జరగాలన్నది రాజ్యాంగ అంతస్సూత్రం. ఎలాంటి విచక్షణ లేకుండా పౌరులందరికీ సకాలంలో, సముచిత ఖర్చుకు న్యాయం చేకూరిస్తేనే ప్రజాస్వామ్యం, న్యాయపాలన పటిష్ఠంగా పది కాలాలపాటు వర్ధిల్లుతాయని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. సకాలంలో న్యాయం జరగకపోతే అది పౌరులకు ఎప్పటికీ అందనట్లే లెక్క. అవసరానికి ఆదుకోని న్యాయం కొరగానిదవుతుంది. దీనివల్ల పౌరులు అసలు న్యాయస్థానాలకు రావడం మానుకుంటారని సుప్రీంకోర్టు 2008లోనే హెచ్చరించింది. క్రిమినల్ కేసులు ఎంతకూ పరిష్కారం కాకపోతే పౌరుడి జీవించే హక్కును హరించినట్లవుతుందని మరో కేసులో తేల్చిచెప్పింది. సత్వర న్యాయంవల్ల ప్రభుత్వ వ్యవస్థపట్ల ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. కానీ, దేశ సర్వోన్నత న్యాయస్థానం మొదలుకొని దిగువస్థాయి కోర్టుల వరకు కుప్పలుతెప్పలుగా పేరుకుపోయిన కేసులను చూస్తే సత్వర న్యాయం ఎండమావి అనిపించకమానదు. భారత న్యాయవ్యవస్థ 2015-16 వార్షిక నివేదికలో, పేరుకుపోయిన అపరిష్కృత వ్యాజ్యాల వివరాలు ఉన్నాయి. ఈ నివేదిక ప్రకారం 2016 జూన్ నాటికి సుప్రీంకోర్టులోనే 60 వేల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. 24 హైకోర్టుల్లో 40.54 లక్షల కేసులు, దిగువ కోర్టుల్లో రెండు కోట్ల 80 లక్షలకు పైగా కేసులు పెండింగులో పడిపోయాయి. అన్ని రకాల కోర్టులూ కలిసి ఏడాదికి 25 శాతం పెండింగు కేసులను పరిష్కరిస్తుండగా, అంతే సంఖ్యలో కొత్త వ్యాజ్యాలు వచ్చిపడుతుండటంతో కేసుల కొండ ఎంతకూ తరగడం లేదని బెంగళూరుకు చెందిన 'దక్ష్ ఇండియా డాట్ ఆర్గ్' అనే స్వచ్ఛంద సంస్థ అధ్యయనం తేల్చింది. ఈ దుస్థితిని మార్చడానికి ప్రభుత్వం ఏమాత్రం చొరవ తీసుకోవడం లేదు. భారత్ తన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 0.01 శాతం అంటే రూ.12,000 కోట్లను ఏటా న్యాయవ్యవస్థ మీద ఖర్చుపెడుతోంది. ఇక కక్షిదారులు కోర్టుకు వెళ్లిరావడానికి పెడుతున్న ఖర్చులు జీడీపీలో 0.5 శాతానికి సమానమని దక్ష్ ఇండియా లెక్కగట్టింది. వకీళ్లకు కట్టాల్సిన రుసుములు కలుపుకొంటే ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఈ పరిస్థితిని చక్కదిద్ది, సామాన్యులు భరించగలిగిన ఖర్చులో వేగంగా న్యాయం అందించడానికి విధానపరంగా కీలక చర్యలు తీసుకోవడం ప్రభుత్వ విధి.

నియామకాలు పెరగాలి

జనాభాకు తగిన నిష్పత్తిలో న్యాయమూర్తులు లేని దేశం మనది. ఇక్కడ ప్రతి పది లక్షల జనాభాకు కేవలం 17.88మంది చొప్పున న్యాయమూర్తులు ఉన్నారు. ఆస్ట్రేలియా (41), కెనడా (75), ఇంగ్లాండ్ (51), అమెరికా (107)లతో పోల్చుకుంటే ఇది చాలా స్వల్పం. జనాభా-న్యాయమూర్తుల నిష్పత్తి ఇంత తక్కువగా ఉండటంవల్లే న్యాయం జరగడం ఆలస్యమైపోతోందని 2002నాటి పి.రామచంద్రరావు వెర్సస్ కర్ణాటక ప్రభుత్వం కేసులో సర్వోన్నత న్యాయస్థానం స్వయంగా పేర్కొంది. అప్పట్లో ప్రతి పది లక్షల జనాభాకు కేవలం 10.5 మంది లెక్కన న్యాయమూర్తులు ఉండగా దీన్ని 50కి పెంచాలని సుప్రీంకోర్టు సూచించింది. తరవాత 15 ఏళ్లు గడచిపోయాయి. దేశ జనాభా మరో 25 కోట్లమేరకు పెరిగినా, న్యాయమూర్తుల నిష్పత్తి 17.88కి మాత్రమే చేరుకుంది. న్యాయమూర్తుల బలగాన్ని తక్షణం అధికం చేయనిదే అపరిష్కృత వ్యాజ్యాల భారం తగ్గదని లా కమిషన్ 2014 నివేదికలో స్పష్టం చేసింది. పెండింగ్ కేసులు అలానే ఉండిపోతే కొత్త కేసులను పరిష్కరించేదెప్పుడు? సమస్య పరిష్కారానికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికపై కృషి చేయాలి. ముఖ్యంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి. ఈ సంగతి గ్రహించిన సుప్రీంకోర్టు ఈ-కమిటీ జిల్లా కోర్టుల్లో, దిగువ శ్రేణి కోర్టుల్లో వేగంగా న్యాయం జరగడానికి సమాచార- కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ)ని ఉపయోగించుకోవాలని సిఫార్సు చేసింది. దీన్నే ఈ-కోర్టుల ప్రాజెక్టు అంటున్నారు. దీనికింద కోర్టుల్లో స్వయంచాలిత నిర్ణయ ప్రక్రియకు వసతులు కల్పిస్తారు. కోర్టుల దైనందిన కార్యకలాపాలు వేగంగా జరిగేట్లు చూడటం ద్వారా న్యాయపాలన సామర్థ్యాన్ని ఇనుమడింపజేయవచ్చు. అపరిష్కృత కేసుల భారాన్ని తగ్గించడానికి ఈ-కోర్టుల ప్రాజెక్టు చక్కటి సాధనం. తీర్పులు వెలువడిన కేసులు, పెండింగ్ కేసులు, వివిధ దశల్లో వేర్వేరు కోర్టులు ఇచ్చిన తీర్పుల సమాచారంతో 'జాతీయ న్యాయ సమాచార గ్రిడ్'ను నెలకొల్పారు. దిగువ కోర్టుల్లో ఎక్కడ ఏయే కేసులు అపరిష్కృతంగా ఉన్నాయో తెలుసుకోవడానికి న్యాయాధికారులకే కాదు, పౌరులకూ ఈ గ్రిడ్ తోడ్పడుతుంది. ఈ-కోర్టుల ప్రాజెక్టు కొంత పురోగమించినా జరగాల్సింది ఎంతో ఉంది. అసలీ ప్రాజెక్టు గురించి తెలిసిన న్యాయవాదులు, కక్షిదారులు తక్కువని జాతీయ ఆర్థిక శాస్త్ర పరిశోధన సంస్థ (ఎన్‌సీఏఈఆర్) 2015 నివేదిక తెలిపింది. అదీకాకుండా ఈ-కోర్టులకు విద్యుచ్ఛక్తి, అంతర్జాల అనుసంధానం అరకొరగా ఉంది. వీటి నిర్వహణకు సాంకేతిక సిబ్బందీ కరవే. న్యాయ సేవల వినియోగదారులకూ కంప్యూటర్ పరిజ్ఞానం, అవగాహన తక్కువ. వారికి తగిన శిక్షణా లభించడం లేదు. ఈ కారణాల వల్ల ఈ-కోర్టుల ప్రాజెక్టు జోరందుకోలేదు. దేశమంతటా నిరంతరాయ విద్యుత్ సరఫరా ద్వారా మారుమూల ప్రాంతాలకూ అంతర్జాల సేవలు అందించడం సులువవుతోంది. అంతర్జాలం ద్వారా న్యాయ సలహా పొందడం, ఎలక్ట్రానిక్ పద్ధతిలో కేసులు దాఖలు చేయడం, డిజిటల్ రూపంలో పత్రాలు మార్చుకోవడం, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాక్షులను విచారించడం వంటివి నేడు అధునాతన టెక్నాలజీ వల్ల సుసాధ్యమవుతున్నాయి. వకీళ్లు, న్యాయమూర్తులు, కక్షిదారులు... ఇలా అందరికీ సంతృప్తికరంగా న్యాయపాలన జరపడానికి ఈ-కోర్టుల ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడుతుంది. సమాచార, కమ్యూనికేషన్ పరిజ్ఞానాల (ఐసీటీ) చలవతో ఈ దిశగా కొంత పురోగతి సిద్ధిస్తోంది. సకాలంలో, భరింపదగిన ఖర్చుకే న్యాయం జరగడం సుదూర స్వప్నం కాదన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.



అపరిష్కృత వ్యాజ్యాలు- పరిష్కార మార్గాలు

పూర్వ తీర్పుల అడుగుజాడల్లో...

భారతీయ సమాజంలో మాదిరిగానే న్యాయ వ్యవస్థలోనూ ఆచారాలు, సంప్రదాయాలదే అగ్రాసనం. ఆ మేరకు ఉన్నత న్యాయస్థానాల తీర్పులను దిగువ న్యాయస్థానాలు తు.చ. తప్పకుండా అనుసరిస్తాయి. అదే స్థాయి రాజ్యాంగ ధర్మాసనాలూ పాత తీర్పులకు భంగకరంగా తీర్పులివ్వవు. అంటే రాజ్యాంగ ధర్మాసనాలు వివిధ కేసుల్లో పాత తీర్పుల అడుగుజాడల్లో నడవాల్సిందే. ఒకవేళ పూర్వ తీర్పులతో ప్రస్తుత ధర్మాసనం విభేదిస్తుంటే, వ్యవహారాన్ని తేల్చడానికి ఉన్నత ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరవలసి ఉంటుంది. పూర్వ తీర్పులు లేదా సంప్రదాయాలకు ఇంతటి విలువ ఇవ్వడానికి బలమైన కారణమే ఉంది. గతంలోనే పరిష్కారమైన కేసుల్లో తీర్పులను తిరగదోడటమంటే వివాదాల తేనెతుట్టెను కదిలించడమే అవుతుంది. అప్పుడు దిగువ కోర్టులు గందరగోళానికి గురవుతాయి. దీనివల్ల అపరిష్కృత కేసులు మరింత పెరిగిపోతాయి. కనుక ధర్మాసనాలు తమకు పూర్వ ధర్మాసనాలు ఇచ్చిన తీర్పులను గౌరవించడం సంప్రదాయంగా వస్తోంది. దావూద్ బోహ్రా కేంద్రీయ బోర్డు వెర్సస్ ఏఎన్ఆర్ కేసులో సుప్రీంకోర్టు ఈ అంశాన్ని నొక్కిచెప్పింది. ఏదైనా కేసులో ఓ త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును, మరో కేసులో వేరొక త్రిసభ్య ధర్మాసనం గౌరవించాల్సి ఉంటుందని అయిదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరించింది. ఇటీవల ఇండోర్ అభివృద్ధి ప్రాధికార సంస్థ వెర్సస్ శైలేంద్ర కేసులో సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇందుకు భిన్నంగా వ్యవహరించింది. గతంలో ఓ త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును అది తోసిపుచ్చడంతో సుప్రీంకోర్టు ఈ వ్యవహారాన్ని మరింత పెద్ద ధర్మాసనానికి నివేదించాల్సి వచ్చింది. ఈ విధంగా పూర్వ సంప్రదాయాలను ఉల్లంఘిస్తుంటే దిగువ శ్రేణి న్యాయస్థానాల్లో గందరగోళం ఏర్పడి, కేసుల పరిష్కారం మరింత ఆలస్యమవుతుంది.

క్రమశిక్షణకు పట్టం

సకాలంలో న్యాయం జరగాలంటే పైస్థాయి నుంచి కిందిస్థాయి కోర్టుల వరకు అందరూ న్యాయపరమైన క్రమశిక్షణ, ఔచిత్యాలను పాటించడం అవసరం. న్యాయం జరగడంలో ఆలస్యాన్ని నివారించడానికి ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. వాటి గురించి ప్రజలకు అవగాహన పెరగాలి. లోక్ అదాలత్, మధ్యవర్తిత్వ యంత్రాంగాల సాయంతో చాలా కేసులు పరిష్కరించుకోవచ్చునని చాలామందికి తెలియదు. ఈ లోపాన్ని తక్షణం సరిదిద్దాలి. ప్రత్యామ్నాయాల గురించి చైతన్యం పెంచాలి. రవాణా, పోలీసు చలానా కేసుల పరిష్కారానికి ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రాల్లో కోర్టులు నిర్వహించాలని న్యాయ కమిషన్ సిఫార్సు చేసింది. మొత్తం కేసుల్లో ఈ కోవకు చెందిన పాత కేసులు 37.4 శాతమైతే, కొత్త కేసులు 38.7 శాతం. అధునాతన సాంకేతికతను ఉపయోగించుకోవడంతోపాటు సమర్థులైన వకీళ్లను, న్యాయ సిబ్బందిని తయారుచేసుకోవడం అత్యావశ్యకం. ఇందుకోసం ప్రస్తుత న్యాయవిద్యను తక్షణం సంస్కరించాలి. పాండిత్య ప్రకర్షకు పరిమితమైపోకుండా నిజ జీవిత కేసుల గురించి, వాటిలో వెలువడిన తీర్పుల గురించి న్యాయ విద్యార్థులకు బోధించాలి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న జాతీయ నాయకుల్లో అనేకులు న్యాయవాదులే. వారు పాటించిన ఉన్నత విలువలను నేటి న్యాయ విద్యార్థులకు నూరిపోయాలి. న్యాయవిద్యను సరైన గాడిలో పెట్టినట్లయితే ఉత్తమ న్యాయవాదులు, న్యాయమూర్తులు లభించి, న్యాయం శీఘ్రంగా సమర్థంగా జరుగుతుంది. న్యాయ పాలన సిబ్బందికి కాలానుగుణంగా పునశ్చరణ తరగతులు నిర్వహించాలి. సైబర్ నేరాలపైనా అవగాహన పెంచాలి. ఫోరెన్సిక్ పరీక్షా కేంద్రాలు, అంతర్జాల అనుసంధానం, సమాచార కియోస్క్‌లను విస్తృతంగా స్థాపించాలి. దేశంలో ఫోరెన్సిక్ ల్యాబ్‌ల సంఖ్య చాలా పరిమితం. ఈ పరిస్థితి మారాలి. ప్రతి జిల్లాలో ఓ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలి. న్యాయమూర్తులను ఎక్కువ సంఖ్యలో నియమించినంత మాత్రాన సత్వర న్యాయం సాకారం కాదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, మౌలిక వసతులను విస్తరించడం తప్పనిసరి. భారీ వ్యయంతో కూడుకున్న ఈ అంశాలను ఆచరణలోకి తీసుకురావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజకీయంగా దృఢ సంకల్పం ఉండాలి. అవి న్యాయ వ్యవస్థతో కలిసి సమన్వయంతో పనిచేయాలి. అప్పుడే సామాన్యులకు సత్వర న్యాయం అందజేయడానికి సానుకూల వాతావరణం ఏర్పడుతుంది!

- డాక్టర్ వెన్నుపాటి దివాకర్‌బాబు

(రచయిత- ప్రిన్సిపల్, శ్రీమతి వి.డి.సిద్ధార్థ న్యాయ కళాశాల, విజయవాడ)

రక్షణాత్మక గాఢానుబంధం

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మేక్రాన్ భారత్‌లో నాలుగు రోజులపాటు పర్యటించనున్నారు. ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాల్లో ఒకటైన ఫ్రాన్స్‌తో మన దేశానికి చిరకాలంగా సుహృద్భావ సంబంధాలున్నాయి. మేక్రాన్ పర్యటనలో భాగంగా రక్షణ, సముద్రయానం, అంతరిక్షం, భద్రత, ఇంధన రంగాలకు చెందిన పలు అంశాల్లో కీలకమైన ఒప్పందాలు జరగనున్నాయి. 1998లో భారత్- ఫ్రాన్స్‌ల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. సౌరశక్తి ఉత్పాదన, యుద్ధవిమానాల తయారీ, అంతరిక్షయానం తదితర రంగాల్లో ఫ్రాన్స్ ఆకర్షణీయమైన అభివృద్ధి సాధించింది. మనదేశంలో విదేశీ పెట్టుబడులు పెట్టడంలో ఫ్రాన్స్‌ది తొమ్మిదో స్థానం. ఆ దేశానికి చెందిన దాదాపు వెయ్యి కంపెనీలు భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అదే రీతిలో 120 భారత సంస్థలు ఆ దేశంలో వాణిజ్యాన్ని నిర్వహిస్తున్నాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం మేక్రాన్ తొలిసారి భారత్‌కు వస్తున్నారు. కేవలం తయారీ, సాంకేతిక పరిజ్ఞానం అంశాలకే పరిమితం కాకుండా ఇరుదేశాల మధ్య ప్రజల మధ్య సుహృద్భావ సంబంధాలకు ఆయన రాక దోహదం చేయనుంది. ఐరాసలో భారత శాశ్వత సభ్యత్వానికి, అణుసరఫరాదారుల బృందం (ఎన్ఎస్‌జీ)లో చేరికకు పారిస్ మద్దతిస్తోంది. 2016లో అప్పటి ఫ్రాన్స్ అధ్యక్షుడు హోలాండె మన గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటన సమయంలో కీలక అంశాలపై ఒప్పందాలు కుదిరాయి. ఐరోపా సమాఖ్య నుంచి బ్రిటన్ తప్పుకోవడం, జర్మనీలోని సంక్లిష్ట రాజకీయ పరిస్థితులు, ట్రంప్ అమెరికా సంరక్షణ విధానంతో ఐరోపాలో నాయకత్వ శూన్యత ఏర్పడింది. దీన్ని భర్తీ చేసే కృషిలో నిమగ్నమైన మేక్రాన్‌కు భారత పర్యటన బలం చేకూర్చవచ్చని అంతర్జాతీయ రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

చిరకాల స్నేహం

ప్రచ్ఛన్నయుద్ధం తరవాత ఏకైక అగ్రరాజ్యంగా నిలిచిన అమెరికాకు ప్రస్తుతం చైనా నుంచి సవాలు ఎదురవుతోంది. రష్యా సైతం ఆయుధపోటీని ప్రారంభించింది. ప్రచ్ఛన్నయుద్ధం నాటి రోజులను గుర్తుకు తెస్తున్న పరిణామాలివి. చైనాను నిలువరించేందుకు అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియాలు చతుర్ముఖ కూటమిగా ఏర్పడేందుకు రంగం సిద్ధమైంది. ఇందులో చేరేందుకు ఫ్రాన్స్ ఆసక్తి కనబరుస్తోంది. హిందూ మహాసముద్రంలో చైనాకు ఎటువంటి అవకాశం ఇవ్వకూడదని పలుదేశాలు అభిప్రాయపడుతున్నాయి. భారత్ సైతం ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా మారిషస్, సీషెల్స్‌లకు చెందిన రెండు దీవుల్లో నౌకాదళ స్థావరాలను నిర్మించనుంది. ఆఫ్రికా ఖండంలోని జిబౌటీలో చైనా ఇప్పటికే తన సైనిక స్థావర కార్యకలాపాలు ప్రారంభించిన విషయం తెలిసిందే. జిబౌటీలో ఫ్రాన్స్ స్థావరమూ ఉండటంతో అత్యవసర సమయాల్లో భారత్ వినియోగించుకునేందుకు వీలుగా అనుమతులు ఇచ్చే అవకాశముంది. ఆఫ్రికాలోని మొజాంబిక్ సమీపంలో ఫ్రెంచి సంస్థలు ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటుచేశాయి. వీటిలోనూ మన దేశ సంస్థలకు ప్రవేశం కల్పించడంపై ఆయా సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేయడం ఉభయ దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో మరో ముందడుగుగా భావించవచ్చు. భారత్‌తో సంబంధాలపై మేక్రాన్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రచ్ఛన్న యుద్ధసమయంలో భారత్‌కు ఫ్రాన్స్ మిరాజ్ యుద్ధవిమానాలను విక్రయించింది. ఇటీవలి కాలంలో స్కార్పిన్ జలాంతర్గాములు, రాఫెల్ యుద్ధ విమానాల సరఫరాకు సంబంధించి ఒప్పందం కుదిరింది. స్కార్పిన్ తరగతికి సంబంధించి ఇప్పటికే ఐఎన్ఎస్ కల్వరీ, ఖండేరీలను సాంకేతిక బదలాయింపు ప్రక్రియ ద్వారా ముంబయిలో నిర్మించారు. 1998 పోఖ్రాన్ అణుపరీక్షల అనంతరం భారత్‌పై పలుదేశాలు విధించిన ఆంక్షలను ఎత్తివేసేందుకు ఫ్రాన్స్ చేసిన కృషి విస్మరించరానిది. పౌర అణు ఇంధన రంగంలో భారత్‌తో ఒప్పందం కుదుర్చుకున్న తొలి దేశం ఫ్రాన్స్ కావడం విశేషం. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ ప్రాధాన్యతను గుర్తించిన మేక్రాన్ సర్కారు దిల్లీతో కలిసి క్రియాశీలకంగా వ్యవహరించేందుకు సిద్ధంగా ఉంది. హిందూ మహాసముద్రంలో ఫ్రాన్స్ వ్యూహాత్మక శక్తిగా ఎదగాలంటే అందుకు భారత్ సహకారం తప్పనిసరని 2013లో ఆ దేశం విడుదల చేసిన ప్రకటన పేర్కొనడం గమనార్హం. ప్రపంచ విమాన సంస్థల్లో పేరొందిన ఎయిర్‌బస్ కూడా మేకిన్ ఇండియాలో భాగంగా పలు కార్యకలాపాలను భారత్‌లో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.



నేటినుంచి ఫ్రాన్స్ అధ్యక్షుడి భారత పర్యటన

భారత్‌కు లాభదాయకం

21వ శతాబ్దంలో ఆసియా దేశాల ప్రాబల్యం పెరిగింది. ప్రత్యేకించి భారత్ అంతర్జాతీయంగా కీలకశక్తిగా మారింది. చైనాను అడ్డుకునేందుకు దిల్లీ తోడ్పాటు ఉండాల్సిందేనని అమెరికా, ఫ్రాన్స్‌లు గుర్తించాయి. ఇందుకు అనుగుణంగా ఒప్పందాలు చేసుకుంటున్నాయి. పసిఫిక్, హిందూ మహాసముద్రాల్లో వాణిజ్య నౌకలు సాఫీగా ప్రయాణం సాగించేందుకు వీలుగా దిల్లీలో భారత-ఫ్రెంచి ప్రతినిధుల మధ్య ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం హిందూ మహాసముద్రంలో వాణిజ్య, యుద్ధ నౌకల రాకపోకల వివరాలను ఇచ్చిపుచ్చుకొంటారు. 2015లో అంతర్జాతీయ సౌరశక్తి కూటమిని ఇరువురు కలిసి సంయుక్తంగా నెలకొల్పారు. గతంలో ప్రధాని మోదీ తన పర్యటనలో 19 రంగాలకు సంబంధించి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అంతరిక్ష పరిజ్ఞానంలో ఫ్రాన్స్‌కు చెందిన సీఎన్ఈఎస్ ముందజంలో ఉంది. ఫ్రెంచి గయానాలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి భారత్‌కు చెందిన జీఎస్ఎల్వీ ప్రయోగాలు విజయవంతమయ్యాయి. రక్షణ రంగంలోనూ ఇరు దేశాల త్రివిధ దళాలు సంయుక్తంగా విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. ఆల్ప్స్ పర్వతాల్లో 'శక్తి', జోధ్‌పూర్‌లో 'గరుడ', గోవా తీరంలో 'వరుణ' విన్యాసాలు సాయుధదళాల పనితీరు మెరుగుపరచుకునేందుకు ఉపయోగపడుతుంది. సౌరశక్తి ఉత్పాదనలో ఫ్రెంచ్ సంస్థలు అభివృద్ధి పథంలో ఉన్నాయి. భారత్‌లో సౌరశక్తికి లోటు లేదు. ఈ రంగంలో వీరి కంపెనీల సహకారంతో మరిన్ని సౌరశక్తి విద్యుత్ ఉత్పాదన కేంద్రాలు నిర్మించాలని కేంద్రం యోచిస్తోంది. భారత విద్యార్థులకు అమెరికాలో అవకాశాలు మందగిస్తున్న నేపథ్యంలో పారిస్ తన విశ్వవిద్యాలయాలను విదేశీ విద్యార్థుల ప్రవేశాలకు అనుగుణంగా మారుస్తోంది. సాంకేతిక, వైమానిక, టెలికాం తదితర రంగాల్లో ఆ దేశం కొత్తపుంతలు తొక్కుతోంది. ఉన్నత విద్యాసంస్థల్లో ఇండియా విద్యార్థులకు ప్రవేశాల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవచ్చని విద్యాసంస్థల సమాచారం. మేక్రాన్‌తో పాటు వస్తున్న ప్రతినిధి బృందంలో వాణిజ్యవేత్తలు, ఆయుధ సంస్థల ప్రతినిధులు, రవాణా, వ్యవసాయ రంగ నిపుణులు కూడా ఉన్నారు. మహారాష్ట్రలోని జైతాపూర్ అణువిద్యుత్ కేంద్ర నిర్మాణానికి సాయం అందించేందుకు గతంలో ఫ్రాన్స్ అంగీకరించింది. పలు కారణాల రీత్యా నిర్మాణం ప్రారంభం కాలేదు. దీనిపైనా మేక్రాన్ సానుకూలంగా స్పందించే అవకాశం ఉంది!

- కొలకలూరి శ్రీధర్

విద్య... వినయం


ప్రతిభ పుట్టుకతో వచ్చేది. విద్య- నేర్చుకునేందుకు అనువైనది. మొదటిది భగవద్దత్తం. రెండోది, ప్రయత్నిస్తే సాధ్యం. ఈ రెండూ కలిస్తే, అది వైదుష్యం, నైపుణ్యం, కౌశలం. విద్యతో ప్రతిభను వికసింపజేసి మెరుగులు దిద్దాలి. అప్పుడే ఆ ప్రతిభ ప్రయోజనకరమవుతుంది, విద్య సార్థకమవుతుంది.

సహజసిద్ధమైన ప్రతిభకు ఎవరూ విలువ కట్టలేరు. విద్య అనేది సూర్యరశ్మి. అది లేకుండా, ప్రతిభ అనే అరవిందం వికసించదు. వికాసం లేని ప్రతిభ అనతికాలంలోనే విలువ కోల్పోతుంది. పసిప్రాయంలోనే అనేక రాగాల్ని గుర్తుపట్టడం అనేది ప్రతిభ. కొందరు బాలలు ఎన్నో పద్యాలు వల్లించడం అసామాన్యం. అటువంటి ప్రతిభ, కాలం గడిచినకొద్దీ మరింత వికసిస్తేనే సార్థకత.

ప్రతిభ వికసించడానికి అధ్యయనం అవసరమవుతుంది. ఆయా రంగాల్లో ప్రావీణ్యం సాధించినవారి నుంచి ఔత్సాహికులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అన్నీ తెలుసుకోవాలి. కొత్త విషయాలు, సూత్రాలు, సూక్ష్మాలు, సులువులు క్రమబద్ధంగా గ్రహిస్తుండాలి. విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి. ఆ నిపుణుల స్థాయికి చేరాలన్న తపనతో నిరంతర అభ్యాసం, కఠోర కృషి సాగించాలి. ఎవరికైనా తనకంటే ఉన్నతుల సాంగత్యం లభించాలి. అది లేనప్పుడు ప్రతిభ అంతగా రాణించదు.

విద్య వల్ల వినయం అలవడుతుంది. ఎంత నేర్చుకున్నా, అది కొంతే అని ఎప్పటికప్పుడు తెలిసివస్తుంది. ఎన్నో రెట్లు అధికులు, ఆరితేరిన మహానుభావులున్నారని గ్రహింపు కలుగుతుంది. విద్య, వినయం మధ్య గల సంబంధం పరస్పరాశ్రయం. నిజమైన విద్య వల్ల వినయం చేకూరుతుందన్నది యథార్థం. వినయం ఉంటేనే విద్య సులువుగా అబ్బుతుందన్నదీ అంతే సత్యం!

విద్యార్జనకు వినయం అనేక రకాలుగా సాయపడుతుంది. తాను నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని, యథాశక్తి శ్రమించి సొంతం చేసుకోవాలని వినయవంతుడికి బాగా అవగతమవుతుంది. ఆ వినయ గుణం కారణంగా, అతడు తన కంటే అర్హుణ్ని చూసి ఈర్ష్య చెందడు. తానూ అదే స్థాయికి చేరాలన్న స్పర్ధ పెంచుకొంటాడు. స్పర్ధ అంటే పోటీ, పోలిక. ఉన్నతులతో



అంతర్యామి

పోలిక వల్ల విద్య వృద్ధి అవుతుందని నానుడి. నారదుడు తన గాన నైపుణ్యాన్ని విశేషంగా పెంచుకోవాలని సంకల్పించాడు. అందుకు తుంబురుడితో ఆయనకు ఉన్న పోటీతత్వం ఎంతో ఉపయోగపడిందని పురాణ గాథలు చెబుతాయి.

వినయశీలి తనకంటే ప్రజ్ఞావంతుల్ని విమర్శించడు. నిందించడు. అతడు నేర్చినదానితో తృప్తి చెందడు. నిరంతర విద్యార్థిగా అధ్యయనం కొనసాగిస్తాడు. సరికొత్త జ్ఞాన శిఖరాలు అధిరోహిస్తాడు.

విద్యాధికులైనా కొందరు- అహంభావం లేదా అలసత్వం వల్ల అధ్యయనాన్ని ఒక దశలో నిలిపివేస్తారు. పూర్వం నేర్చినదంతా, కాలం గడిచినకొద్దీ ఇంకిపోతుంది. నూతనంగా నేర్చుకునేది ఉండదు. పూర్వ సాఫల్యాల గురించిన అహంకారమే మిగిలి, ఇంగువ కట్టిన గుడ్డలుగా మిగిలేవారూ కనిపిస్తుంటారు.

విద్య నేర్వాలంటే సద్గురువుల శుశ్రూష చేయాలి. వారితో సాన్నిహిత్యం లభించిన వారు ధన్యులు. ద్రోణాచార్యుల గురుత్వంలో అర్జునుడు తన ప్రతిభకు సానబెట్టుకున్నాడు. రామకృష్ణ పరమహంసతో సాన్నిహిత్యం వల్ల వివేకానందస్వామి ఆధ్యాత్మిక శిఖర అంచుల్ని తాకారు. అలా సిద్ధి పొందిన మహనీయులెందరో ఉన్నారు.

సహజ ప్రతిభ కలిగి, గ్రంథపఠనం సాగించి, పూర్వాచార్యుల ఉపదేశాలు పొంది, పరిపూర్ణత సాధించిన మహనీయులెందరో! రాధాకృష్ణ పండితుణ్ని 'తత్వశాస్త్ర సర్వస్వం'గా నిలిపింది ఆయన నిత్య పరిశీలన స్వభావమే!

ఎంతటి ప్రతిభావంతుడైనా, నేర్చినకొద్దీ వినయమూ పెరగడం విద్య లక్షణం. అందుకే, అన్నీ ఉన్న విస్తరి అణిగిమణిగి ఉంటుందంటారు పెద్దలు!

- మల్లాది హనుమంతరావు

దేశీయ వరి విత్తనాల్లో విలువైన పోషకాలు

- 11న కొర్నెపాడులో రైతులకు ఉచితంగా పంపిణీ
- ముందుకొచ్చిన రైతునేస్తం ఫౌండేషన్

ఈనాడు, గుంటూరు: దేశీయ వరి విత్తనాల సాగును ప్రోత్సహించాలని రైతు నేస్తం ఫౌండేషన్ తాజాగా నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 11న గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులోని రైతునేస్తం ఫౌండేషన్ కార్యాలయంలో ఈ విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేయనుంది. ఈ మేరకు గురువారం గుంటూరులో విలేకరుల సమావేశంలో సంస్థ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడారు. రైతునేస్తం ఫౌండేషన్ ఈ నెల 4వ తేదీకి 100 వారాల పాటు సేంద్రీయ పద్ధతుల్లో సేద్యంపై రైతులకు అవగాహన కల్పించటం పూర్తిచేసుకున్న నేపథ్యంలో ఈ నెల 11న పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అదే రోజు దేశీయ విత్తన ప్రదర్శన ఉంటుందని చెప్పారు. దేశీయ వరి విత్తనాలను కాపాడుకోకపోతే పోషకాలతో కూడిన ఆహారం లభించదని భావించి వాటిని రైతులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. ఆ రోజున ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, వ్యవసాయశాఖ కమిషనర్ ఎం.హరి జవహర్‌లాల్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. విలేకరుల సమావేశంలో విశ్రాంతి జేడీ జి.వెంకటేశ్వరరావు కూడా ఉన్నారు.

శ్రీశైలంలో 800 అడుగుల వరకు నీటి వినియోగం

- సాగర్‌లో 500 అడుగుల మట్టం వరకు..
- రాతపూర్వకంగా అభిప్రాయాలు తెలపండి
- తెలుగు రాష్ట్రాలను కోరిన కృష్ణానదీ యాజమాన్య బోర్డు

ఈనాడు - హైదరాబాద్



శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు త్వరగా ఖాళీ కానున్నాయి. శ్రీశైలంలో 800 అడుగుల వరకు, నాగార్జున సాగర్‌లో 500 అడుగుల మట్టం వరకు నీటిని వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు ఈ నెల 2న జరిగిన సమావేశంలో అంగీకరించారని.. దీనిపై రాతపూర్వకంగా అభిప్రాయం పంపాలని కోరింది. శ్రీశైలంలో కనీస నీటిమట్టం 834 అడుగులు, నాగార్జునసాగర్‌లో 510 అడుగులు కాగా, ఈ మట్టాలకు పైన ఉన్న 33.770 టీఎంసీల నీటిలో తెలంగాణ 24.467 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 9.303 టీఎంసీలు వినియోగించుకొనేలా బోర్డు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు మార్చి ఆఖరులోగానే శ్రీశైలంలో కనీస నీటిమట్టం దిగువకు నీటిని తీసుకోవాలని నిర్ణయించింది. ఈ నెల 6న ఈ మేరకు ఆదేశాలు జారీ చేసిన బోర్డు సభ్య కార్యదర్శి బుధవారం రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లతో ఫోన్లో మాట్లాడారు. శ్రీశైలంలో 800 అడుగుల వరకు, సాగర్‌లో 500 అడుగుల వరకు నీటిని తీసుకొనేలా నిర్ణయం జరిగిందని, దీనిని రెండు రాష్ట్రాలు రాతపూర్వకంగా పంపాలని కోరుతూ గురువారం మరో లేఖ రాశారు. 2న జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో మే నెల వరకు 30.38 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, ఆగస్టు వరకు 46 టీఎంసీలు కావాలని తెలంగాణ కోరింది. దీనికి తగ్గట్లుగా శ్రీశైలంలో 800 అడుగుల వరకు, నాగార్జునసాగర్‌లో 500 అడుగుల మట్టం వరకు ఉన్న నీటిని వినియోగించుకోవడానికి రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు పరస్పరం అంగీకరించారని బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం తాజాగా రాసిన లేఖలో పేర్కొన్నారు.

జాతకం బాగుందనే దాడి చేశా!

- లోకాయుక్తపై దాడి నిందితుడి వెల్లడి
- అధర్మం మీద ధర్మయుద్ధంగా అభివర్ణన



తేజ్‌రాజ్ శర్మ

బెంగళూరు(యశ్వంతపుర), న్యూస్‌టుడే: 'నా జాతకం మహాద్భుతంగా ఉంది! మహాభారతంలో అర్జునుడు జన్మించిన నక్షత్రంలో పుట్టాను. ఈ నక్షత్ర జాతకులు బుధవారం ఏపని తలపెట్టిన విజయం సాధిస్తారని శ్రీకృష్ణుడు బోధించాడు. అందుకే బుధవారం కర్ణాటక లోకాయుక్త జస్టిస్ విశ్వనాథశెట్టిపై కత్తితో దాడి చేశా'నని నిందితుడు తేజ్‌రాజ్ శర్మ పేర్కొన్నాడు. దాడి అనంతరం అరెస్టు చేసి విచారించిన పోలీసులకు నిందితుడు పొంతనలేని సమాధానాలు తెలిపాడు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు- అర్జునుడికి బోధించిన కొన్ని కీలక ఘట్టాలను అనర్గళంగా వివరించాడు. 'అధర్మం మీద ధర్మయుద్ధాన్ని అర్జునుడు ప్రారంభించాడు. నేనూ అంతే. అధర్మంపై ఇప్పుడే పోరాటం ప్రారంభించా. నెల నుంచి ప్రతి బుధవారం లోకాయుక్త కార్యాలయానికి వచ్చి.. న్యాయమూర్తిని కలిసేందుకు ప్రయత్నించా. ఈ బుధవారం కలిసి వచ్చింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నా. అధర్మం మీద ధర్మ యుద్ధాన్ని ప్రారంభించా'నంటూ దాడికి దారితీసిన పరిస్థితులను చెప్పుకొచ్చాడు. తదుపరి విచారణ నిమిత్తం గురువారం నిందితుడిని తుమకూరు తీసుకువెళ్లారు. అతడు ఉంటున్న గదిని పరిశీలించారు. మరోవైపు కేసు విచారణను నేర నియంత్రణ దళం(సీసీబీ)కి అప్పగించినట్లు బెంగళూరు పోలీసు కమిషనర్ సునీల్‌కుమార్ తెలిపారు. డీసీపీ జితేంద్ర కణవార ఈ దళానికి నేతృత్వం వహిస్తారు. లోకాయుక్త కార్యాలయంలో భద్రత లోపాలపైనా దర్యాప్తు చేస్తారు. కత్తిపోట్లకు గురై మల్య వైద్యాలయంలో చికిత్స పొందుతున్న జస్టిస్ విశ్వనాథ్‌శెట్టి ఆరోగ్యం కుదుట పడిందని కమిషనర్ చెప్పారు.

రూ.85వేల కోట్ల అదనపు వ్యయానికి పార్లమెంటు అనుమతి కోరిన కేంద్రం

దిల్లీ: ఈ నెలాఖరుతో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో రూ.85,315 కోట్ల అదనపు నగదు చెల్లింపులకు సంబంధించి పార్లమెంటు అనుమతిని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఆ మేరకు నాలుగో అనుబంధ పద్దును కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ గురువారం లోక్‌సభ ముందుంచారు. ఈ మొత్తంలో రూ.61,215 కోట్లు జీఎస్టీ అమలు వల్ల ఆదాయాన్ని నష్టపోయిన రాష్ట్రాలకు పరిహారం కింద అందజేయటానికి ఉద్దేశించింది. కేంద్ర అమ్మకం పన్ను(సీఎస్‌టీ) కింద చెల్లించే రూ.1384 కోట్లు కూడా దీనిలో కలసి ఉంది. మూల ధన ఆస్తులు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌కు సంబంధించి రూ.15,065.65 కోట్లు కేటాయించారు. మిగిలినది రక్షణ సిబ్బంది పింఛన్లకు, మార్కెట్ రుణాలు, ట్రెజరీ బిల్లుల చెల్లింపులకు కేటాయించారు. అయితే, సవరించిన ద్రవ్య లోటు 3.5శాతంను ఈ అదనపు వ్యయం ప్రభావితం చేయబోదని ఆర్థిక శాఖ పత్రం వెల్లడించింది.

పోలవరం గిరిజన నిర్వాసితుల ఫిర్యాదుల పరిశీలనకు కమిటీ

- నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు భూనిర్వాసితులైన గిరిజనులకు చెందాల్సిన పరిహారాన్ని గిరిజనేతరులు పొందుతున్నారంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. గిరిజనుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఆ జిల్లా డీఆర్‌డీఏ డైరెక్టర్ శ్రీనివాసులును నియమించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయనకు ఐటీడీఏ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్(గిరిజన సంక్షేమశాఖ) సహకారాలు అందించాలని స్పష్టంచేసింది. ఫిర్యాదుల స్వీకరణపై ప్రచారం కల్పించాలని పేర్కొంది. ఈ ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ నివేదిక సమర్పించాలని ఆదేశించింది. విచారణను ఏప్రిల్ 24కు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. పశ్చిమగోదావరి జిల్లా జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, పోలవరం, కుకునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలోని గిరిజనులు పోలవరం ప్రాజెక్టుకు భూములు ఇచ్చారని.. కానీ గిరిజనేతరులు అక్రమంగా పరిహారం పొందుతున్నారని శక్తి అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన డాక్టర్ పి.శివరామకృష్ణ హైకోర్టులో ఈ ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వ్యాజ్యంలో పేర్కొన్నారు.

ఏఐఎంపీఎల్‌బీ ప్రతినిధి నోమానీపై దేశద్రోహం కేసు

లఖ్‌నవూ: దేశద్రోహం అభియోగాలతో ఆల్ ఇండియా ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు(ఏఐఎంపీఎల్‌బీ) ప్రతినిధి మౌలానా సజ్జద్ నోమానీపై యూపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ షియా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ వసీమ్ రిజ్వీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హజ్రత్‌గంజ్ పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరి 9న ఏఐఎంపీఎల్‌బీ సమావేశం సందర్భంగా నోమానీ కావాలనే మతపరమైన మనోభావాలను గాయపరిచినట్లు రిజ్వీ ఆరోపించారు.

కర్ణాటకకు ప్రత్యేక జెండా!



కొత్తగా రూపొందించిన కన్నడ బావుటా

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక రాష్ట్రం కోసం రూపొందించిన ప్రత్యేక మువ్వన్నెల (ఎరుపు, తెలుపు, పసుపు రంగుల) జెండాను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం బెంగళూరులో ఆవిష్కరించారు. 'కర్ణాటకకు ప్రత్యేక పతాకం అవసరమనే చర్చ చాలా కాలంగా సాగుతోంది. ఇది కన్నడిగులందరి ఆకాంక్ష కూడా. ఇందుకు మా ప్రభుత్వం కూడా గొంతు కలిపింది. తదనంతర పరిణామాల్లో రాష్ట్రానికి ప్రత్యేకంగా జెండా ఆవిష్కరించాం' అని సిద్ధు వివరించారు. 'ఇదివరకటి కన్నడ బావుటాలో ఉన్న శుభ సూచకాలైన ఎరుపు, పసుపు రంగులతో కొత్తగా తెలుపు రంగును చేర్చాం. ఇది శాంతికి సంకేతం. తెలుపు రంగులో ప్రభుత్వ లాంఛనాన్ని ముద్రించాం. ప్రత్యేక బావుటాను గుర్తించాల్సిందిగా కోరుతూ కేంద్రానికి ప్రతిపాదన పంపిస్తాం. మొత్తం దేశంలోకెల్లా కర్ణాటకకే ప్రత్యేక బావుటా ఉంది. ఇది కన్నడిగుల ఉనికికి సూచిక. రాష్ట్రాలు ప్రత్యేకంగా బావుటాల్ని కలిగి ఉండరాదనే ఆంక్షలేవీ రాజ్యాంగంలో లేవు. జాతీయ పతాకం కంటే కాస్త దిగువనే రాష్ట్ర ధ్వజం ఎగురుతుంది'అని ఆయన పేర్కొన్నారు.

మండల విద్యాశాఖాధికారిపై దాడి

* చెప్పుతో కొట్టి..కత్తితో దాడికి యత్నం
* సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయినిపై కేసు

అమరావతి, న్యూస్‌టుడే: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సభలో మండల విద్యాశాఖాధికారిపై సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయురాలు దాడి చేసిన ఘటన గుంటూరు జిల్లా అమరావతిలో గురువారం చోటుచేసుకుంది. లింగాపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన ఉమాదేవి, సభ జరుగుతున్న చోటకు చేరుకొని ఎంఈవో ఒ.వి.రామిరెడ్డిని దుర్భాషలాడుతూ చెప్పుతో కొట్టింది. వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించింది. ఘటనపై ఎంఈవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉమాదేవి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గ్రామస్థుల నుంచి ఫిర్యాదు అందగా తాను విచారణ చేసి ఆమెపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారికి సిఫార్సు చేయగా ఆరు నెలలు సస్పెండ్ అయ్యారని, ఇది మనసులో పెట్టుకొని తనపై దాడి చేసినట్లు ఎంఈవో ఫిర్యాదులో పేర్కొన్నారు. రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు అమరావతి పోలీసులు తెలిపారు.



ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న ఎంఈవో రామిరెడ్డి

ఆంగ్‌సాన్ సూచీకిచ్చిన మానవహక్కుల అవార్డు వెనక్కి..

వాషింగ్టన్: మయన్మార్ నేత ఆంగ్‌సాన్ సూచీకి ఇచ్చిన మానవ హక్కుల అవార్డును వెనక్కి తీసుకుంటున్నట్లు అమెరికా హోలోకాస్ట్ స్మారక మ్యూజియమ్ ప్రకటించింది. రోహింగ్యా ముస్లింలపై సైనికచర్యను, వారిని దేశం నుంచి ఖాళీ చేయించేందుకు చేపడుతున్న ప్రక్రియను నిలువరించేందుకు ఆమె ఏమీ చేయలేకపోయారని పేర్కొంది. 1991లో నోబెల్ శాంతి బహుమతి పొందిన సూచీకి ఆరేళ్ల క్రితం హోలోకాస్ట్ ఎలైవీసెల్ అవార్డును అందజేసింది. మయన్మార్ ప్రజల తరపున ఆమె సాహసోపేత నాయకత్వం, త్యాగనిరతికి గాను అప్పట్లో ఈ అవార్డును ప్రకటించింది. తాజాగా దాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటిస్తూ ఆమెకు లేఖ రాసింది.

నారీశక్తితో నవభారతాన్ని నిర్మిద్దాం

- ఆడ శిశువుల భ్రూణహత్యలు తీవ్ర అవమానకరం
- బాలికలను అత్తమ్మలే కాపాడాలి
- బాలికా సంరక్షణను రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ఉద్యమంలా చేపట్టాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- జాతీయ పోషకాహార కార్యక్రమం ప్రారంభం
- 640 జిల్లాలకు 'బేటీ బచావో బేటీ పడావో' విస్తరణ

ఝుంఝును - (రాజస్థాన్)

"నారీశక్తితో నవభారతాన్ని నిర్మిద్దాం. ఆడ శిశువుల భ్రూణహత్యలు అత్యంత అవమానకరం. ఈ దుష్టత్వాన్ని సమాజం నుంచి తరిమేద్దాం. తమ కుటుంబాల్లోని బాలికల పరిరక్షణ బాధ్యతలను అత్తమ్మలు తీసుకోవాలి. వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బాలికా సంరక్షణను ఉద్యమంలా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు. ఆడపిల్లలు కుటుంబానికి భారం కానే కాదనీ... కుమారులనూ, కుమార్తెలను ఒకేలా చూడండని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం ఆయనిక్కడ జాతీయ పోషకాహార కార్యక్రమం (ఎన్ఎన్ఎం)ను ప్రారంభించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ- 'కుటుంబానికి కూతుళ్లు భారం కాదు... గర్వ కారణం! లింగ వివక్షను రూపుమాపుతామనీ, బాలికలకు సమానత్వం అందించే వాతావరణాన్ని సృష్టిస్తామనీ ప్రతినబూనుదాం. భ్రూణహత్యలను రూపుమాపడం అందరి బాధ్యత. దీనిని అరకట్టకపోతే... నేటితరానికి హాని చేసినవారమే కాదూ, భావితరాలకు సంక్షోభాన్ని సృష్టించిన వారమవుతాం" అని అన్నారు. చిన్నారులకు పోషకాహార ఆవశ్యకతను నొక్కి చెప్పారు. దేశవ్యాప్తంగా చేపట్టిన రోగనిరోధక కార్యక్రమం 'మిషన్ ఇంద్రధనుష్'తో వచ్చిన సత్ఫలితాలను వివరించారు. ప్రస్తుతం 161 జిల్లాల్లో అమలవుతున్న 'బేటి బచావో-బేటి పడావో'ను 640 జిల్లాలకు విస్తరించనున్నట్లు ప్రధాని వెల్లడించారు.



గురువారం ఝుంఝునూలో నిర్వహించిన 'భేటీ బచావో. భేటీ పడావో' కార్యక్రమంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

'పీఎం'ను ఎంతైనా తిట్టుకోండి! కానీ...

మీరు 'పీఎం'ను ఎంత తిట్టాలనుకుంటే అంత తిట్టండి. కానీ...'పీఎం' అని ఆలోచన తట్టగానే 'పోషన్ మిషన్ (పీఎం)' అని మాత్రం గుర్తుచేసుకోండి. తరతరాలుగా ఆడ శిశువులు విస్మరణకు, హత్యలకు గురయ్యారు. పర్యవసానంగా నేడు సమాజంలో అసమతుల్యత చోటుచేసుకుంది. ఈ రుగ్మతలను ఒక్కసారిగా రూపుమాపలేం. కానీ, ముందడుగు వేద్దాం. 18వ శతాబ్దపు ఆలోచనాధోరణిని పట్టుకుని వేలాడుతూ, 21వ శతాబ్దపు పౌరులమని చెప్పుకొనే హక్కు మనకు లేదు. హరియాణాలో నాడు ఆడపిల్లల పరిస్థితి చాలా దారుణంగా ఉండేది. బాలికల సంక్షేమ పథకాల బలోపేతానికి రెండేళ్ల క్రితం 'బేటీ బచావో-బేటీ పడావో'ను తీసుకొచ్చాం. దీంతో హరియాణాలో ఎంతో సానుకూల మార్పొచ్చింది" అని ప్రధాని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలుచేసిన కలెక్టర్లకు ఆయన ఉత్తమ పనితీరు ధ్రువపత్రాలను అందజేశారు. బాల-బాలికల లింగనిష్పత్తి మెరుగైన జిల్లాల కలెక్టర్లకూ అవార్డులను ప్రదానం చేశారు. వీటిని అందుకున్న 11 రాష్ట్రాలవారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారూ ఉన్నారు. అంతకుముందు ప్రధాని పలువురు తల్లీకూతుళ్లతో ముచ్చటించారు.

పది కోట్ల మందికి పైగా లబ్ధి...

బాలల్లో పోషకాహారలోపం; సరైన బరువు, ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరించేందుకు డిసెంబరులో కేంద్రం ఎన్ఎన్ఎంకు ఆమోదం తెలిపింది. దీనికి బడ్జెట్‌లో రూ.9,046 కోట్లు కేటాయించింది. దీనిద్వారా మూడేళ్లలో 10కోట్ల మందికిపైగా లబ్ధి పొందుతారని అంచనా. తొలిదశలో 315 జిల్లాల్లో అమలుకానుంది.

త్వరలో చరిత్రాత్మక బిల్లు: మేనకా గాంధీ

బాలికలు, మహిళల అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసే చరిత్రాత్మక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్టు స్త్రీ, శిశు అభివృద్ధిశాఖ మంత్రి మేనకాగాంధీ తెలిపారు. ప్రభుత్వ కృషి ఫలితంగా బాల్య వివాహాలు 47 శాతం నుంచి 20 శాతానికి తగ్గాయన్నారు. పోలీసు నియామకాల్లో మహిళలకు 33% కోటా కల్పించాలని రాష్ట్రాలకు సూచించినట్లు ఆమె వెల్లడించారు.

కున్వర్‌భాయ్ స్ఫూర్తి కలకాలం నిలిచిపోతుంది: మోదీ

దిల్లీ: ఎందరో మహిళలు తమ అసాధారణ త్యాగాలతో మానవ చరిత్రలోనే చెరగని ముద్రను వేశారని ప్రధాని మోదీ శ్లాఘించారు. ఛత్తీస్‌గఢ్‌లోని కోటాభర్రీకి చెందిన కున్వర్‌భాయ్... మరుగుదొడ్లను కట్టుకోడానికి తనకు ఏకైక జీవనాధారంగా ఉన్న మేకలను అమ్మేసిన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. 106 ఏళ్ల కున్వర్‌భాయ్ ఇటీవలే కాలంచేశారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'స్వచ్ఛభారత్'కు ఆమే స్ఫూర్తి ప్రదాత. "ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి కున్వర్‌భాయ్ ఆశీస్సులను తీసుకునే అవకాశం నాకు కలిగింది. ఆ సందర్భం నాకెప్పుడూ గుర్తొస్తుంటుంది. బాపూ కలలు గన్న స్వచ్ఛభారత్ సాకారానికి కృషిచేసే ప్రతి ఒక్కరి హృదయంలో ఆమె జీవిస్తూనే ఉంటారు" అంటూ మోదీ ట్విట్టర్‌లో ఆమెకు నివాళులర్పించారు.

మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి

- కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి డిమాండ్

ఈనాడు, దిల్లీ: అన్ని రంగాల్లోనూ మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం రాజ్యసభలో పలువురు ఎంపీలు మాట్లాడారు. రేణుకాచౌదరి మాట్లాడుతూ "అర్ధరాత్రి మహిళ ఒంటరిగా వీధుల్లో సంచరించగలినప్పుడే నిజమైన స్వతంత్రం వచ్చినట్లని మహాత్మాగాంధీ చెప్పారు. 70 ఏళ్ల తర్వాత కూడా స్వతంత్రం గురించి మహిళలు పోరాడాల్సి వస్తోంది. రాజకీయ నిర్ణయం తీసుకుంటే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు సులభంగా ఆమోదం పొందుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవడం ద్వారా మహిళల్ని గౌరవించాలి.' అని కోరారు.

అప్పుడే దేశం వర్ధిల్లుతుంది: సీతారామలక్ష్మి

మహిళ అంటే శక్తి స్వరూపిణి అని తెదేపా ఎంపీ తోట సీతారామలక్ష్మి తెలిపారు. మహిళలను గౌరవిస్తేనే దేశం వర్ధిల్లుతుందన్నారు. మహిళల అభ్యున్నతికి బలమైన చట్టాలు రావాలని ఆకాంక్షించారు.

హిందూ చట్టం సవరించాలి: విజయసాయిరెడ్డి

మహిళలకు చరాస్తిలోనూ హక్కు కల్పించేలా హిందూ చట్టాలు సవరించాలని వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి కోరారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం రాజ్యసభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్, ఎంపీలు అంబికా సోని, రేణుకా చౌదరి, తోట సీతారామ లక్ష్మి, కుమారి సెల్జా, కనిమొళి

మన కుమార్తెల వాదన వినాలి

వారికి అవకాశాలు కల్పించాలి: రాష్ట్రపతి

దిల్లీ: మన కుమార్తెల వాదనను విని, వారికి అన్ని అవకాశాలనూ కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. మహిళ సమాన హక్కుల కల్పనకు అడ్డుగా నిలిచిన ఆలోచనతీరును మార్చుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్త్రీ, పురుషుల మధ్య వివక్ష చూపడాన్ని.. ఆలోచనతీరులో లోపంగా ఆయన అభివర్ణించారు. దేశ సమగ్రాభివృద్ధి కోసం ఇలాంటి వివక్షకు చరమగీతం పాడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన 'నారీ శక్తి పురస్కారాల'ను అందజేశారు. అక్రమ రవాణాకు గురై, ఆ తర్వాత విముక్తి పొందిన బాధితులను రాష్ట్రపతి కలుసుకున్నారు. అక్రమ తరలింపు మానవత్వానికి వ్యతిరేకంగా జరిగే నేరంగా అభివర్ణించారు.

'చట్టసభల్లో మహిళలకు కోటా' అత్యంత ప్రాధాన్యాంశం

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దిల్లీ: సభ్యుల నిరసనలు, అంతరాయాలతో సోమవారం నుంచి గందరగోళం నెలకొన్న రాజ్యసభలో... గురువారం స్వరాలన్నీ ఒక్కటయ్యాయి! మహిళలపై నేరాలు పెరిగిపోతున్నాయని పార్టీలకు అతీతంగా సభ్యులు గొంతెత్తారు. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే బిల్లును త్వరగా ఆమోదింపజేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. సభ ఆరంభం కాగానే ఛైర్మన్ వెంకయ్యనాయుడు మాట్లాడుతూ- 'దేశం ప్రగతిపథాన పయనించాలంటే... పార్లమెంటులో, శాసనసభల్లో మహిళలకు కోటా కల్పించాలి. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వారు వికసించాలి. మహిళలపై అఘాయిత్యాల నియంత్రణకు నిర్మానుష్య ప్రదేశాల్లో నిఘాను కట్టుదిట్టం చేయాలి. ఏ మతమూ మహిళలను కించపరచదు. కానీ, ఆధునిక జీవన విధానాల్లో వేళ్లూనుకున్న కట్టుబాట్లను రూపుమాపాల్సి ఉంది" అని అన్నారు. మహిళా బిల్లు ఆమోదానికి సంపూర్ణంగా మద్దతిస్తానని కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ అన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు పెరుగుతుండటం పట్ల ప్రతిపక్ష నాయకుడు గులాంనబీ ఆజాద్ ఆందోళన వ్యక్తంచేశారు. ఛైర్మన్ ప్యానెల్‌లో మహిళలకు చోటివ్వాలని బీఎస్పీకి చెందిన సతీశ్ చంద్ర మిశ్రా డిమాండ్ చేశారు.

ఉద్యోగాల్లో సమానత్వం సుదూర స్వప్నమే

- ఐరాస నివేదికలో వెల్లడి

ఐరాస: స్త్రీ, పురుష సమానత్వంలో ఉన్న వ్యత్యాసాలను పూడ్చే విషయంలో గణనీయ పురోగతి సాధించినప్పటికీ మహిళలకు ఉద్యోగాల లభ్యత తక్కువగానే ఉందని ఐరాస కార్మిక నివేదిక పేర్కొంది. వారు.. తక్కువ నాణ్యత ఉన్న ఉద్యోగాలతో సరిపెట్టుకునే అవకాశమే ఎక్కువని వివరించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐరాసకు చెందిన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) ఈ నివేదికను విడుదల చేసింది. "పురోగతి సాధించినప్పటికీ, వాటిని మెరుగుపరచుకోవడానికి హామీలు ఇచ్చినప్పటికీ ఉద్యోగాల్లో మహిళలకు పురుషులతో సమానత్వం ఇంకా సుదూర స్వప్నంగానే మిగిలిపోయింది. ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, వేతన అసమానత, ఇతర రకాల వివక్షలను తొలగించే విషయంలో ఇంకా చాలా చేయాల్సి ఉంది" అని ఐఎల్‌వో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డెబోరా గ్రీన్‌ఫీల్డ్ చెప్పారు. తాజా నివేదికలోని ముఖ్యాంశాలివీ..

- ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా మహిళా కార్మికశక్తి భాగస్వామ్య రేటు 48.5 శాతంగా ఉంది. పురుషులతో పోలిస్తే ఇది 26.5 పర్సంటేజీ పాయింట్ల మేర తక్కువగా ఉంది.
- 2018లో మహిళల్లో నిరుద్యోగ రేటు 6 శాతంగా ఉంది. పురుషులతో పోలిస్తే ఇది 0.8 శాతం అధికం.
- మొత్తంమీద చూస్తే ఉద్యోగాల్లో ప్రతి పది మంది పురుషులకుగాను ఆరుగురు మహిళలకు మాత్రమే ఉద్యోగం దొరుకుతోంది.
- యాజమాన్య హోదా విషయంలో మహిళలతో పోలిస్తే పురుషుల సంఖ్య నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. మేనేజ్‌మెంట్ హోదాలకు చేరుకునే విషయంలో మహిళలకు ఇంకా అడ్డంకులు ఎదురవుతున్నాయి.
- అరబ్ దేశాలు, ఉత్తర ఆఫ్రికాల్లో పురుషులతో పోలిస్తే మహిళల్లో నిరుద్యోగ రేటు రెట్టింపు స్థాయిలో ఉంది. అక్కడి సామాజిక కట్టుబాట్లు మహిళల ఉపాధికి అవరోధంగా ఉన్నాయి.
- తూర్పు ఐరోపా, ఉత్తర అమెరికాలో మాత్రం మహిళల కన్నా పురుషుల్లోనే నిరుద్యోగ రేటు ఎక్కువగా ఉంది.
- ఉద్యోగాల నాణ్యత విషయంలోనూ మహిళలు గణనీయ స్థాయిలో వివక్షను ఎదుర్కొంటున్నారు.

12 వరకు 'నీట్'కు దరఖాస్తు చేసుకోవచ్చు..

దిల్లీ: జాతీయ మెడికల్ ప్రవేశపరీక్ష 'నీట్'కు దరఖాస్తు చేసుకునే గడువును సీబీఎస్ఈ తాజాగా పొడిగించింది. ఈమేరకు మార్చి 12వ తేదీ సాయంత్రం 5.30 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అలాగే ఆన్‌లైన్‌లో రుసుమును 13వ తేదీ రాత్రి 11.50 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. నీట్‌కు నమోదుచేసే (రిజిస్ట్రేషన్) గడువు గురువారంతోనే ముగుస్తున్నప్పటికీ.. ఆధార్ మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ గుర్తింపులను కూడా అనుమతించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో సీబీఎస్ఈ తాజా ప్రకటన చేసింది.

బాలకృష్ణ దోశీకి ప్రిట్జ్‌కర్ పురస్కారం

దిల్లీ: ప్రముఖ భవన రూపశిల్పి (ఆర్కిటెక్ట్) బాలకృష్ణ దోశీ.. ప్రతిష్ఠాత్మక ప్రిట్జ్‌కర్ పురస్కారాన్ని గెలుచుకున్నారు. ఈ గౌరవం దక్కించుకున్న తొలి భారతీయుడు ఆయనే. ప్రస్తుతం బాలకృష్ణ వయసు 90ఏళ్లు. వచ్చే మే నెలలో కెనడాలో ఆయనకు ఈ పురస్కారంతోపాటు.. రూ.65లక్షల నగదు బహుమతినీ అందిస్తారు. ఐఐఎమ్-బెంగళూరు సహా పలు ప్రఖ్యాత కట్టడాలు బాలకృష్ణ రూపొందించినవే. 'పేదల భవన రూపశిల్పి'గానూ ఆయన పేరుకెక్కారు. 1989లో బాలకృష్ణ రూపకల్పన చేసిన ఇండోర్‌లోని చౌక గృహాల సముదాయంలో.. నేడు 80వేలకు పైగా మంది ఆశ్రయం పొందుతున్నారు.

ఇక సీపీఎం కార్యాలయమే మాణిక్ సర్కార్ నివాసం!

అగర్తల: త్రిపురకు రెండు దశాబ్దాల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి.. నిరాడంబర నేతగా పేరుతెచ్చుకున్న మాణిక్ సర్కార్ సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యాలయాన్ని తన నివాసంగా మార్చుకున్నారు. తాజా ఎన్నికల అనంతరం పార్టీ పరాజయం నేపథ్యంలో ఆయన అధికారిక నివాసాన్ని వదిలిపెడుతున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధార్ తెలిపారు. సర్కార్ దంపతుల నివాసానికి గాను పార్టీ కార్యాలయ అతిథిగృహంలో ఓ గదిని కేటాయించినట్లు వెల్లడించారు. కార్యాలయ వంటగదిలో ఏది వండితే అదే తాను తింటానని మాణిక్ సర్కార్ తెలిపినట్లు కార్యాలయ కార్యదర్శి హరిపాద దాస్ తెలిపారు.


నాగాలాండ్ సీఎంగా రియో ప్రమాణం

కోహిమా: నాగాలాండ్ ముఖ్యమంత్రిగా 'నేషనల్ డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ' (ఎన్‌డీపీపీ) నేత నెయిఫియు రియో చేత గవర్నర్ పి.బి.ఆచార్య గురువారం ప్రమాణం చేయించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టడం ఆయనకు ఇది నాలుగోసారి. భాజపా భాగస్వామ్యంతో ఏర్పాటైన 'ప్రజల ప్రజాతంత్ర కూటమి'కి ఆయన నేతృత్వం వహిస్తున్నారు.

నేటి నుంచి ఆర్ఎస్ఎస్ త్రైవార్షిక సమావేశాలు

నాగ్‌పూర్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కీలక త్రైవార్షిక సమావేశాలు శుక్రవారం నాగ్‌పూర్‌లో ప్రారంభం కానున్నాయి. వచ్చే మూడేళ్లలో కార్యాచరణ ప్రణాళిక, ఎజెండాలను ఈ సందర్భంగా రూపొందిస్తారు.

మద్దతు కోసం మహాపాదయాత్ర



పంటకు కనీస మద్దతు ధర, రుణమాఫీ సహా ఇతర డిమాండ్ల సాధనకు మహారాష్ట్రలో రైతు సంఘాలు 180 కిలోమీటర్ల పాదయాత్ర మొదలు పెట్టాయి. ఈనెల 6న నాసిక్ నుంచి ఈ యాత్ర మొదలైంది. 12 నాటికి ముంబయి చేరుకుని మహారాష్ట్ర శాసన సభను ముట్టడించాలని నిర్ణయించారు. ముంబయి-ఆగ్రా జాతీయ రహదారిపై అఖిల భారత కిసాన్ సభ నేతృత్వంలో కొనసాగుతున్న ఈ యాత్రలో దాదాపు 25వేల మంది రైతులు పాల్గొంటున్నారు.

భారత్‌లో దుష్టరాజకీయాలు వేళ్లూనుకుంటున్నాయి

- వచ్చే ఎన్నికల్లో భాజపాను ఓడిస్తాం
- సింగపూర్ పర్యటనలో రాహుల్ వ్యాఖ్యలు

సింగపూర్: భారత్‌లో దుష్ట రాజకీయాలు వేళ్లూనుకుంటున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఎన్నికల విజయాల కోసం భాజపా ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీని కాంగ్రెస్ ఓడిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సింగపూర్‌లోని ప్రతిష్ఠాత్మక లీ క్వాన్‌యూ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీలో ఏర్పాటు చేసిన చర్చా కార్యక్రమంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్‌లో ఉండే బహుళత్వ భావన పట్ల నేనెంతో గర్వపడుతుంటా. కోరుకున్నదేదైనా చేసే, మాట్లాడే అవకాశం ప్రజలకు ఉంది. వారికి ఏ సమస్యా ఎదురుకాదు. ఇప్పుడు మాత్రం సవాలు ఎదుర్కోవాల్సి వస్తోంది" అని రాహుల్ అన్నారు. 70 ఏళ్లుగా కాంగ్రెస్ మైనార్టీ వర్గాల ప్రజలను రక్షిస్తోందని ఆయన చెప్పారు. తీసుకునే ఆహారం, వేసుకునే దుస్తులను బట్టి ఇప్పుడు వ్యక్తులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. జమ్ముకశ్మీర్‌లో పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఏళ్లపాటు తాము పడిన శ్రమ.. ఎన్డీయే ప్రభుత్వ రాకతో బూడిదలో పోసిన పన్నీరైందని రాహుల్ చెప్పారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులూ న్యాయం కోసం ప్రజల వద్దకు రావడం తాను చూశానని అన్నారు. ఇటు సింగపూర్‌లోని భారత సంతతి సీఈఓలు, వ్యాపారవేత్తలతోనూ రాహుల్ సమావేశమయ్యారు. ఉద్యోగాలు, పెట్టుబడులు, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలపై చర్చలు జరిపారు. 2012లో కాంగ్రెస్ తుపానును ఎదుర్కొందని.. ఆ తర్వాతి రెండేళ్లలో పార్టీ అస్థిరపడిందని రాహుల్ అన్నారు. తదనంతర పరిణామాలను అందరం చవిచూశామని చెప్పారు. అయితే ఇప్పుడు పార్టీని తిరిగి కొత్తగా ఆవిష్కరించే అవకాశం దక్కిందని.. భారతీయ విలువలను ప్రతిబింబించే సరికొత్త కాంగ్రెస్‌ను ప్రజల ముందుకు తెస్తామని అయన అన్నారు. సింగపూర్‌లోని చారిత్రక ఐఎన్ఏ స్మారక ప్రాంతంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు రాహుల్ నివాళులు అర్పించారు. ఇటు పర్యటనలో సింగపూర్ ప్రధానిని కూడా ఆయన కలువనున్నారు. అనంతరం మలేసియాలో ఆ దేశ ప్రధానితోనూ సమావేశం కానున్నారు.



'లవ్ జిహాద్' కేసులో హదియాకు ఊరట

దిల్లీ: కేరళలో లవ్ జిహాద్ బాధితురాలిగా చెబుతున్న హదియాకు సుప్రీం కోర్టు ఊరట కల్పించింది. షాఫిన్ జహాన్ అనే ముస్లిం వ్యక్తితో ఆమెకు జరిగిన వివాహాన్ని రద్దు చేస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టేసింది. ఈ అంశానికి సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సాగిస్తున్న దర్యాప్తును కొనసాగించవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అశోకన్ కుమార్తె అయిన అఖిల.. షాఫిన్‌ను పెళ్లి చేసుకొని, ముస్లిం మతంలోకి మారింది. తన పేరును హదియాగా మార్చుకుంది. దీనిపై అశోకన్.. తన కుమార్తె జాడ కోసం కేరళ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఇది 'లవ్ జిహాద్' కేసు, ఆమెను సిరియాకు చేరవేయాలన్నది ఉగ్రవాద ముఠాల కుట్రని వాదించారు. దీంతో హదియా వివాహాన్ని హైకోర్టు రద్దుచేసింది. ఆమెను తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ హదియా భర్త సుప్రీం కోర్టును ఆశ్రయించాడు.

యూకే సాహిత్య బహుమతి తుది జాబితాలో అరుంధతి రాయ్, మీనా..

లండన్: కాల్పనిక సాహిత్యంలో యూకే ఏటా మహిళలకు అందించే ప్రతిష్ఠాత్మక బహుమతికి గాను తుది 16 మంది జాబితాలో ఇద్దరు భారతీయులు నిలిచారు. ఈమేరకు అరుంధతీ రాయ్, మీనా కందసామీలు పోటీలో ఉన్నట్లు లండన్‌లోని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రపంచవ్యాప్తంగా అద్భుతంగా రాసే మహిళలను ఎంపిక చేసి వారిలో విజేతకు 30 వేల పౌండ్లు (దాదాపు రూ. 27 లక్షల) నగదు పురస్కారం అందజేస్తారు.

పాస్‌పోర్టు రద్దు చేస్తే వచ్చేదెలా?

సీబీఐకి గీతాంజలి జెమ్స్ అధినేత లేఖ

దిల్లీ/కోల్‌కతా: వేలకోట్ల రూపాయల పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో సహనిందితుడు, విదేశాలకు పరారైన గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ.. సీబీఐ, ఈడీల దర్యాప్తు తీరుపై తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు. దర్యాప్తు న్యాయబద్ధంగా జరగటంలేదని ఆరోపించారు. తనపై దురుద్దేశంతో, కుట్రపూరితంగానే ఇదంతా చేస్తున్నారని ఆక్షేపిస్తూ సీబీఐకి లేఖ రాశారు. ఈ నెల 7వ తేదీన రాసినట్లుగా ఉన్న ఆ లేఖలో తన పాస్‌పోర్టును రద్దు చేయటాన్ని చోక్సీ తప్పుపట్టారు. పాస్‌పోర్టును రద్దు చేస్తే భారత్‌కు ఎలా తిరిగి రాగలనని ప్రశ్నించారు. ఫిబ్రవరి మొదటి వారంలో తనకు గుండె చికిత్స జరిగినందున కనీసం 4 నుంచి 6 నెలల వరకూ ప్రయాణం చేయలేనని తెలిపారు. అయితే, తాను ఎక్కడ ఉన్నదీ వజ్రాల వ్యాపారి తెలియజేయలేదు.

కోల్‌కతాలో గీతాంజలి దుకాణాలపై ఈడీ దాడులు: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు కోల్‌కతాలోని గీతాంజలి జెమ్స్‌కు చెందిన రెండు దుకాణాలపై దాడి చేసి రూ.8కోట్ల విలువైన వజ్రాభరణాలను, కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ప్రారంభమైన ఈ దాడులు గురువారం కూడా కొనసాగాయి.

నీరవ్ మోదీ, చోక్సీలకు మరోసారి సీబీఐ సమన్లు: పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.13వేల కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టి విదేశాలకు పరారైన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, అతడి వ్యాపార భాగస్వామి మెహుల్ చోక్సీలకు.. సీబీఐ (కేంద్ర దర్యాప్తు సంస్థ) మరోసారి సమన్లు జారీ చేసింది. వీలైనంత త్వరగా ఈ కేసుల విచారణకు హాజరుకావాలని వీటిలో సూచించింది.

పనిచేసే యువతుల్లో పెరుగుతున్న ధూమపానం

హైదరాబాద్: దేశంలోని మెట్రో నగరాల్లోని ఉద్యోగాలు చేసే యువతుల్లో ధూమపానం పెరుగుతోందని ఒక సర్వే తేల్చింది. ఇది ఒత్తిడి తగ్గించే మార్గమని వారు భావిస్తున్నట్లు పేర్కొంది. ఇది చాలా ఆందోళనకర పరిణామమని, ధూమపానం వల్ల గుండె ఆరోగ్యానికి ప్రమాదమన్న సంగతి వారు గుర్తించాలని స్పష్టంచేసింది. అసోచాం సంస్థకు చెందిన సామాజిక అభివృద్ధి ఫౌండేషన్ గత నాలుగు వారాల్లో ఈ సర్వేను నిర్వహించింది.

15వరకు గ్రూప్‌-1 నియామకాల నిలిపివేత

- కౌంటర్లు దాఖలు చేయండి
- ఏపీపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వాలకు ట్రైబ్యునల్ ఆదేశం

ఈనాడు - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్‌-1 నియామకాలను ఈ నెల 15 వరకు నిలిపివేస్తూ ఆంధ్రప్రదేశ్ పరిపాలనా ట్రైబ్యునల్ (ఏపీఏటీ) గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గ్రూప్‌-1 నియామకాలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై కౌంటర్లు దాఖలు చేయాలంటూ ప్రభుత్వంతోపాటు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ)ని ఆదేశిస్తూ విచారణను 15వ తేదీకి వాయిదా వేసింది. గ్రూప్‌-1 నియామకాల్లో అక్రమాలు జరిగాయని, ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపుతో ఇంటర్వ్యూలో తక్కువగా మార్కులు వేయడాన్ని సవాలు చేస్తూ విశాఖపట్నానికి చెందిన జి.రాజేశ్వర మరొకరు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ట్రైబ్యునల్ విచారణ చేపట్టగా పిటిషనర్ల తరఫు న్యాయవాది జొన్నలగడ్డ సుధీర్ వాదనలు వినిపిస్తూ.. 2011లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం జరుగుతున్న నియామకాల్లో ఆది నుంచి అక్రమాలే జరుగుతున్నాయన్నారు. ప్రాథమిక పరీక్షల్లో 6 ప్రశ్నలు తప్పుగా వచ్చాయని హైకోర్టు ఉత్తర్వులతో వాటిని తొలగించి మెయిన్స్ నిర్వహించాలన్నారు. దీనిపై కమిషన్ సుప్రీంకోర్టుకు వెళ్లగా ఎదురుదెబ్బ తగిలిందని, అంతేగాకుండా 2012లో హాజరుకానివారిని తాజాగా నిర్వహించే మెయిన్స్‌కు అనుమతించరాదంటూ ఉత్తర్వులిచ్చినా పట్టించుకోకుండా 10 మందిని అనుమతించిందన్నారు. మెయిన్స్‌లో కూడా అవకతవకలు జరిగాయని, కమిషన్ కొత్తగా స్కేలింగ్ విధానాన్ని పెట్టిందన్నారు. పిటిషనర్ స్కేలింగ్ విధానాన్ని ట్రైబ్యునల్‌లో సవాలు చేయగా దాన్ని రద్దు చేయడంతో పిటిషనర్‌కు ఇంటర్వ్యూలో అవకాశం లభించిందన్నారు. బీసీ-డికి చెందిన పిటిషనర్‌కు మెయిన్స్‌లో 341 మార్కులు, ఇంటర్వ్యూలో 39 మార్కులు వచ్చాయన్నారు. అయితే ఇదే కేటగిరీలో రాత పరీక్షలో 341కంటే తక్కువగా వచ్చినప్పటికీ ఇంటర్వ్యూలో ఎక్కువ మార్కులు వేయడం ద్వారా అర్హత సాధించారన్నారు. పిటిషనర్ స్కేలింగ్ విధానంపై కోర్టుకు వెళ్లడం వల్ల కక్షసాధింపుతో ఇంటర్వ్యూలో ఉద్దేశపూర్వకంగా తక్కువ మార్కులు వేశారన్నారు. ఇతరులకు 5 నుంచి 10 నిమిషాల్లో ఇంటర్వ్యూ పూర్తి చేయగా పిటిషనర్‌కు 25 నిమిషాలపాటు చేశారన్నారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తాజాగా ఇంటర్వ్యూ జరిపేలా ఆదేశాలివ్వాలని కోరారు. వాదనలను విన్న ట్రైబ్యునల్ ఈ ఆరోపణలపై కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను 15వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు నియామక ప్రక్రియ చేపట్టరాదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

అభ్యర్థుల జాబితా తాత్కాలికంగా నిలుపుదల

గ్రూప్‌-1 (2011) ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను తాత్కాలికంగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిలుపుదలచేసింది. వివిధ అంశాలను ప్రస్తావిస్తూ.. దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన ట్రైబ్యునల్ మార్చి 15వ తేదీ వరకు 'స్టే' విధించింది. దీంతో ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ప్రకటించిన జాబితాను తాత్కాలికంగా మాత్రమే నిలిపివేసినట్లు ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ఆచార్య ఉదయ్ భాస్కర్ తెలిపారు. ట్రైబ్యునల్ జారీచేసిన 'స్టే' ఉత్తర్వుల రద్దుకు సానుకూలత పొందేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

ముగ్గురాయి గనిలో సొరంగం!


ముగ్గురాయి గనిలో ఏర్పడ్డ సొరంగం

మంగంపేట(ఓబులవారిపల్లె), న్యూస్‌టుడే: కడప జిల్లా మంగంపేట ముగ్గురాయి గనుల్లో గురువారం ఓ సొరంగం బయటపడింది. ఈ సొరంగం ప్రధాన రోడ్డు పక్కన ఉన్న అగ్రహారం వైపు ఉంది. కొండపైన వేసిన వ్యర్థాల తవ్వకాలు చేపట్టిన సమయంలో ఇది బయటపడింది. సిబ్బంది లోపలకు కొంతదూరం వెళ్లి... ఊపిరి ఆడకపోవడంతో వెనక్కి వచ్చారు. ఇది సొరంగమా... సర్దుబాటా అనే విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీఎండీసీ సిబ్బంది, స్థానికుల వివరాల ప్రకారం శతాబ్దాల క్రితం ఇక్కడ మట్లి రాజులు ఉండేవారని... వారికి సంబంధించి సురభికుంటలో గడి ఆనవాళ్లు ఉన్నట్లు చెబుతున్నారు. సొరంగం తీరు కూడా మనిషి నడిచి వెళ్లాలా ఉందని సిబ్బంది అంటున్నారు. ఈ విషయం బయటికి వస్తే ముగ్గురాయి తవ్వకాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉండడంతో అధికారులు సొరంగాన్ని పూడ్చేశారు. అది సొరంగం కాదని.. గనిలో బ్లాస్టింగ్ చేసినప్పుడు భూగర్భ పొరలు సర్దుకొని ఉంటాయని ఏపీఎండీసీ జీఎం కేధార్‌నాథ్‌రెడ్డి తెలిపారు. పనులకు ఇబ్బంది లేకుండా గుంతను పూడ్చేశామన్నారు.

ఈ దశలో ఆస్తుల జప్తును రద్దు చేయలేం

- పెన్నా కేసులో ఈడీ జప్తుపై జగన్ సంస్థలకు ట్రైబ్యునల్ స్పష్టీకరణ

ఈనాడు, హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో పెన్నా నుంచి వచ్చిన పెట్టుబడులు ముడుపుల రూపంలో వచ్చాయా, ఇందులో ఏదైనా కుట్ర ఉందా అనే విషయాలు ప్రత్యేక కోర్టులో తేలాల్సి ఉందనీ, ఇది తేలకుండా ఈడీ జప్తు నుంచి ఆస్తులను విడుదల చేయాలని ఆదేశాలివ్వలేమని జగన్ సంస్థలకు అప్పిలేట్ ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. అయితే కార్మెల్ ఏసియా నుంచి ఇందిరా టెలివిజన్‌లోకి వచ్చిన రూ.2.50 కోట్లు, జనని ఇన్‌ఫ్రాలోకి వచ్చిన రూ.6.95 కోట్ల జప్తు చెల్లదంటూ ఇటీవల ఉత్తర్వులు వెలువరించింది. పెన్నా కేసులో జగతి పబ్లికేషన్స్, ఇందిరా టెలివిజన్, జనని ఇన్‌ఫ్రాలకు చెందిన రూ.47 కోట్ల ఆస్తులను ఈడీ ప్రాథమిక జప్తు చేయగా దీన్ని అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ధ్రువీకరించింది. దీన్ని సవాల్జేస్తూ జగతి, జనని ఇన్‌ఫ్రా, ఇందిరా టెలివిజన్, కార్మెల్ ఏసియాలు అప్పిలేట్ అథారిటీ(దిల్లీ)లో సవాలు చేశాయి. జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్స్‌లో రూ.45 కోట్లు, కార్మెల్ ఏసియాలో రూ.23 కోట్లు పెన్నా గ్రూపునకు చెందిన పి.ఆర్.ఎనర్జీ హోల్డింగ్ లిమిటెడ్ పెట్టుబడులు పెట్టిందని సీబీఐ ఆరోపించడంతో ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ఇవి ప్రత్యేక కోర్టులోనే తేలాల్సి ఉందని అప్పిలేట్ ట్రైబ్యునల్ పేర్కొంది.

దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కార్తి

ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఈడీ సమన్లు రద్దుకు అభ్యర్థన

దిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా నగదు అక్రమ చలామణి (మనీలాండరింగ్) కేసులో తనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీ చేసిన సమన్లను రద్దు చేయాలని కోరుతూ కార్తి చిదంబరం గురువారం దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ ఎస్.రవీంద్ర భట్ ముందుకు ఈ పిటిషన్ వెళ్లగా దీనిపై విచారణను శుక్రవారం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సీబీఐ కస్టడీలో ఉన్న కార్తి చిదంబరం... సుప్రీంకోర్టు ఆదేశాను సారం దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. నగదు అక్రమ చలామణికే సంబంధించిన కేసును తమ ధర్మాసనం నుంచి వెనక్కుతీసుకొనేందుకు కార్తికి సుప్రీంకోర్టు అనుమతించింది. 2017 మే 15వ తేదీన సీబీఐ తొలి సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) ఆధారంగా ఈడీ తనకు జారీ చేసిన సమన్లు చెల్లవని ప్రకటించాలని కోరుతూ కార్తి ఇదివరకే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుత సీబీఐ కస్టడీ నుంచి తాను విడుదలైన వెంటనే ఈడీ అరెస్టు చేసే అవకాశం ఉన్నందున సమన్లను రద్దు చేసేలా ఆదేశించాలని ధర్మాసనానికి విన్నవించారు. అయితే, మధ్యంతర ఉపశమన ఉత్తర్వుల కోసం దిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం సూచించింది. ఆ మేరకు పిటిషన్‌ను ఉపసంహరించుకొనేందుకు కార్తికి అనుమతించింది. దీనికి ఈడీ తీవ్ర అభ్యంతరం తెలిపింది.

వైద్యం మరీ ఇంత ఖరీదైతే ఎలా?

- చికిత్సల భారాన్ని ప్రజలు భరించలేరు
- కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందే: సుప్రీంకోర్టు

దిల్లీ: దేశంలో వైద్యం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. విపరీతంగా పెరిగిపోయిన వైద్య సేవల ఖర్చులను ప్రజలు భరించటం కష్టమని అభిప్రాయపడింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోక తప్పదని తెలిపింది. దిల్లీ, దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లలోని నాలుగు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఔషధాలు, డయగ్నొస్టిక్ సర్వీసులు తదితరాలకు రోగుల నుంచి వసూలు చేస్తున్న మొత్తాల వివరాలను జాతీయ ఔషధ ధరలనిర్ణయ ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) ఇటీవల అందజేయగా వాటిని పరిశీలించిన ధర్మాసనం గురువారం ఈ వ్యాఖ్యలు చేసింది. దిల్లీలో వాయు కాలుష్యంపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్‌లు మదన్ బి లోకుర్, కురియన్ జోసెఫ్, దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం ముందుకు ఈ అంశం వచ్చింది. ఎన్‌పీపీఏ విశ్లేషణ ప్రకారం అత్యవసర కేసుల విషయంలో వాడుతున్న ఔషధాలకు ఆస్పత్రులు వసూలు చేస్తున్న ధరలు.. అసలు ధరల కన్నా 1192 శాతం అధికంగా ఉంటున్నాయి. కేవలం రూ.14.70లకు లభించే ఓ సూది మందు గరిష్ఠ రిటైల్ ధర (ఎమ్మార్పీ) రూ.189.95 కాగా ఒక ఆస్పత్రి వారు రోగి నుంచి రూ.5,318.60 (పన్నులు సహా) వసూలు చేశారని ఎన్‌పీపీఏ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చింది. ఇలాగైతే ప్రజలు వైద్యం చేయించుకోలేరని, ఈ పరిస్థితిని నివారించటానికి ప్రభుత్వం ఏదో ఒకటి చేయాలని ధర్మాసనం పేర్కొంది. అలాగే వాయు కాలుష్యం ఆరోగ్యంపై చూపే ప్రభావం, సంబంధిత అనారోగ్యాలకు చికిత్స పొందటానికి ప్రజలపై అయ్యే వ్యయంపై ప్రభుత్వం దేశవ్యాప్త అధ్యయనం ఏమైనా చేసిందా అని ధర్మాసనం ఆరా తీసింది. వాయుకాలుష్యం నుంచి రక్షణ పొందటానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించింది. అదనపు సొలిసిటర్ జనరల్ ఏఎన్ఎస్ నాదకర్ణి.. స్పందిస్తూ దేశవ్యాప్తంగా వాయుకాలుష్య సమస్యను అధిగమించేందుకు జాతీయ పరిశుద్ధ వాయు కార్యక్రమాన్ని (ఎన్‌సీఏపీ) నాలుగు వారాల్లో ఖరారు చేయనున్న వెల్లడించారు.

ప్రమాణ పత్రం 700 పేజీలా?

అనాథాశ్రమాలు, చిన్నారుల సంరక్షణ కేంద్రాల్లోని సదుపాయాలు,పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం 700 పేజీల ప్రమాణ పత్రం (అఫిడవిట్) దాఖలు చేయటంపై సుప్రీంకోర్టు మండిపడింది. కేంద్ర మహిళా,శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ దాఖలు చేసిన ఈ ప్రమాణ పత్రంపై జస్టిస్‌లు మదన్ బి లోకుర్, కురియన్ జోసెఫ్, దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. రెండు వారాల్లో స్థాయి నివేదికను సమర్పించాలని విచారణను వాయిదా వేసింది.

చేనేతలకు సంక్షేమ బోర్డు

- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి సేవలు: మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: చేనేత కార్మికుల కోసం రాష్ట్రంలో త్వరలో చట్టబద్ధమైన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు వెనుబడిన తరగతుల, జౌళి పరిశ్రమలశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. గురువారం ఆయన అసెంబ్లీలో ప్రశ్నోత్తర సమయంలో పలువురు సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ చేనేత సంక్షేమ బోర్డు ప్రతిపాదనపై ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించి ఆమోదించారని, కొత్త ఆర్థిక సంవత్సరంలో సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో మరోసారి చీర, దోవతు పథకాన్ని ప్రవేశపెడుతున్నామని, కేవలం చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను మాత్రమే ఇందు కోసం ఉపయోగించి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

వనరులు పరిమితంగా ఉన్నందున రహదారులను పూర్తిగా అభివృద్ధి చేయలేకపోతున్నామని మంత్రి అయ్యన్నపాత్రుడు చెప్పారు. ఎమ్మెల్యేల నుంచి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే వివిధ నియోజకవర్గాల్లో రహదారుల అభివృద్ధికి రూ.2,800 కోట్లు అవసరమని ఇంజినీర్లు అంచనా వేశారని వివరించారు. ఉభయ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో ఆర్‌అండ్‌బీ రహదారులు ఎక్కువగా దెబ్బతింటున్నాయని గుర్తించి బడ్జెట్‌లో ఈ మూడు జిల్లాలకు అదనపు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు.

24వేల ఖాళీలు: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వశాఖల్లో 24,209 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టంచేశారు. వీటిని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎప్పటిలోగా భర్తీ చేయాలనే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

శరవేగంగా ఎయిమ్స్ పనులు

- ప్రజలకు చెప్పేందుకే వచ్చాం
- భాజపా ప్రతినిధుల బృందం వెల్లడి

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలో అఖిల భారత వైద్య విజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఎయిమ్స్) నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని భాజపా ప్రతినిధి బృందం పేర్కొంది. ప్రజలకు వాస్తవాలు కళ్లకు కట్టేందుకే తాము పర్యటిస్తున్నట్లు బృంద ప్రతినిధులు తెలిపారు. మంగళగిరి వద్ద రూ.1,618 కోట్ల అంచనా వ్యయంతో ఎయిమ్స్ నిర్మాణం చేపట్టినట్టు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రిగా రాజీనామా చేసిన కామినేని శ్రీనివాస్ విలేకరులకు చెప్పారు. ప్రస్తుతం రూ.272 కోట్లు ఖర్చుచేసి 17 భవనాలు నిర్మిస్తున్నారన్నారు. మరో రూ.500కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నారని తెలిపారు.


ఎయిమ్స్ నిర్మాణ పనులను పరిశీలించేందుకు వస్తున్న భాజపా రాష్ట్ర నాయకుల బృందం

మౌలిక వసతుల కల్పనలో అడ్డంకులు - మాణిక్యాలరావు: నాలుగునెలలుగా వేగంగా పనులు సాగుతుంటే ముఖ్యమంత్రికి సవివరంగా తెలియజేయకపోవటంతో అపోహలు వచ్చాయని రాజీనామా చేసిన మరో రాష్ట్ర మంత్రి మాణిక్యాలరావు పేర్కొన్నారు. భూమి కేటాయింపు, ప్రహరీ నిర్మాణం, రహదారులు, తాగునీటి విద్యుత్తు టవర్ల మార్పు, సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించి నిర్మించాల్సింది రాష్ట్రప్రభుత్వ శాఖలేనని గుర్తుచేశారు. ఏడాదిన్నరగా ఈ పనులు ఆయాశాఖల పరంగా అడ్డంకులు ఉన్నాయని చెప్పారు. తాడేపల్లిగూడెంలోనూ కేంద్రం రూ.189 కోట్లతో చేపట్టిన ఎన్.ఐ.టి.సంస్థ విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొందని అన్నారు.

ప్రభుత్వ మాటల్లో నిజం లేదు - సోము వీర్రాజు: ఇప్పటి వరకు అబద్ధాలు చెప్పిన వాళ్లు పెద్ద కళ్లు చేసుకుని చూస్తే ఎయిమ్స్ నిర్మాణంలో పురోగతి కనిపిస్తుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బృందంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీపతి, ఎమ్మెల్సీ మాధవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లబోతు వెంకట్రావ్ పాల్గొన్నారు.




తవ్వకాల్లో బయటపడిన ఇనుప పనిముట్టు, మట్టి పాత్ర ★ మెగాలిథిక్ నాగరికత కాలంలో వినియోగించిన అలంకరణ రాళ్లు

గోదావరి తీరంలో మెగాలిథిక్ నాగరికత

- సింధు నాగరికత కంటే ముందే ప్రారంభం!
- పురావస్తు శాఖ తవ్వకాల్లో వెలుగుచూసిన అవశేషాలు

కుక్కునూరు, న్యూస్‌టుడే: గోదావరి తీరంలో క్రీ.పూ. మూడు వేల సంవత్సరాల క్రితమే మానవ జాతి సంచరించినట్లు ఆధారాలు లభించాయి. పుణేలో డెక్కన్ కళాశాల సహకారంతో రాష్ట్ర పురావస్తు శాఖ జరుపుతున్న పరిశోధనల్లో ఆసక్తికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో రుద్రంకోట, తూర్పుగోదావరిలోని రాయినిపేట గ్రామాల్లో 250కు పైగా ఆది మానవుల సమాధులను గుర్తించి తవ్వకాలు చేపట్టారు. ఈ సమాధుల్లో వారి జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఆచార వ్యవహారాలు, చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అనేక ఆనవాళ్లను గుర్తించారు.

ఇనుము వాడకం సింధు నాగరికత(క్రీ.పు. 2500 నుంచి క్రీ.పు. 1750) నుంచి ఆరంభమైందని ఇప్పటివరకు భావిస్తున్నారు. కానీ.. ఈ రెండు గ్రామాల్లో జరిపిన తవ్వకాల్లో బయటపడిన ఇనుము పనిముట్లను పరిశీలిస్తే.. సింధు నాగరికత కంటే ముందే (క్రీ.పు. 3000) వాడినట్లు సమాధుల్లో బయల్పడిన ఇనుము వస్తువులను పరిశీలిస్తే తెలుస్తోంది. దక్షిణ భారతంలో ఆది మానవుల దశ నుంచి కుటుంబవ్యవస్థ ఏర్పడిన మధ్య కాలాన్ని(క్రీ.పూ. 3000 ఏళ్ల - క్రీ.పూ.1000) మెగాలిథిక్ నాగరికత అంటారు. రెండు చోట్ల సమాధుల్లో లభిస్తున్న అవశేషాలను హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)కి పంపి నిర్ధరణ పరీక్షలు చేయించే యోచనలో అధికారులు ఉన్నారు. అవశేషాలు, సమాధుల ఆకృతిని బట్టి మెగాలిథిక్ నాగరికతకు చెందినవిగా భావిస్తున్నామని ఏలూరు పురావస్తు శాఖ అధికారి తిమ్మరాజు తెలిపారు. వారు వాడిన సామగ్రిని పరిశీలిస్తే అప్పటి మనుషులు ఏడు అడుగుల పైబడి ఎత్తు ఉండేవారని.. ఒక్కో కుటుంబానికి ఒక్కో సమాధి చొప్పున నిర్మించినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయని చెప్పారు.

తెదేపాలో చేరిన మార్క్‌ఫెడ్ ఛైర్మన్

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కంచి రామారావు, పలువురు సంస్థ డైరెక్టర్లు గురువారం తెదేపాలో చేరారు. వీరు ఇప్పటివరకూ కాంగ్రెస్‌లో ఉన్నారు. ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తిరువూరు నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు నల్లగట్ల స్వామిదాసు ఆధ్వర్యంలో వీరు తెదేపాలో చేరారు.

రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ ప్రశాంతంగా ప్రారంభమైంది. పొదిలి, కందుకూరు, కలికిరి, డి.సి.పల్లి, కనిగిరి వేలం కేంద్రాలకు రైతులు గురువారం తీసుకొచ్చిన 63 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. తొలి రోజు కిలో పొగాకుకు రూ.160 ధర లభించింది. గత ఏడాదిలో అత్యధిక ధర రూ.162 లభించింది. మొత్తం 10 కంపెనీలు కొనుగోళ్లలో పాల్గొన్నాయి. రాష్ట్రంలో 132 మిలియన్ కిలోల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా వర్షాభావ పరిస్థితులతో 120 మిలియన్ కిలోల ఉత్పత్తి మాత్రమే రైతుల వద్ద ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. సరకు తక్కువ ఉన్నపుడు ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి ఉండగా వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయటం పట్ల రైతు సంఘాల నాయకులు అభ్యంతరం చెబుతున్నారు. శుక్రవారం నుంచి రైతులు ఎక్కువ బేళ్లను తీసుకు రానున్నందున కిలో రూ.175కి కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

బడ్జెట్ 2018-19



పర్యాటక రంగం ప్రత్యేకతలు

- దేశీయ పర్యాటకులను ఆకర్షించటంలో దేశంలో 3వ స్థానం.
- 2015 ప్రపంచ పర్యాటక కౌన్సిల్ నుంచి పాలసీ లీడర్‌షిప్ అవార్డు
- 2017 కేంద్ర ప్రభుత్వ ఉత్తమ పర్యాటక అవార్డు
- తూర్పు కనుమలు, సుప్రసిద్ధ సరస్సులు, సముద్ర తీరాలు.
- ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా భక్తులు సందర్శించే తిరుమల దేవస్థానం.

ప్రసంగంలో పెద్దల మాట



గగనం వైపు చూడండి.. మనం ఒంటరి వాళ్లం కాదు. కలలుకంటూ వాటికి అనుగుణంగా పనిచేసుకుంటూ పోయేవారికి అత్యుత్తమ ఫలితాలు అందించేందుకు సమస్త విశ్వం మన వెంటే ఉంటుంది

-అబ్దుల్ కలాం

2018-19 రాష్ట్ర బడ్జెట్‌లో నీటి పారుదల ప్రాజెక్టులకు కేటాయించిన నిధుల వివరాలు..


ప్రాజెక్టు	బడ్జెట్ కేటాయింపు (రూ. కోట్లలో..)
పోలవరం	9,000
వంశధార ప్రాజెక్టు స్టేజ్-2 ఫేజ్-2	250.44
గాలేరు నగరి సుజల స్రవంతి	430.21
హంద్రీ-నీవా సుజల స్రవంతి	524.32
పూలసుబ్బయ్య వెలిగొండ జలాశయం	334.06
గుండ్లకమ్మ జలాశయం	47
సోమశిల	143.54
పెన్నా డెల్టా	50
తెలుగు గంగ	234.68
కండలేరు ఎత్తిపోతల	2
కణుపూరు కెనాల్ పథకం	12
సోమశిల స్వర్ణముఖి లింక్ కాలువ	21.50
సిద్ధాపురం ఎత్తిపోతల	8
పులివెందుల బ్రాంచి కెనాల్	29.33
మైలవరం కెనాల్	4.85
వంశధార ప్రాజెక్టు స్టేజ్-2 ఫేజ్-1	13.42
తోటపల్లి జలాశయం, గజపతినగరం బ్రాంచ్ కాలువ	143
మహేంద్ర తనయ వరద కాలువ	100
తారకరామ తీర్థసాగరం	40.56
వెంగళరాయసాగరం జలాశయం	1.20
మద్దువలస జలాశయం స్టేజ్-2	34
కొరిసపాడు ఎత్తిపోతల	25
తుంగభద్ర హై లెవెల్ కాలువ స్టేజ్-1	25.10
తుంగభద్ర హై లెవెల్ కాలువ స్టేజ్-2	23.16
పుష్కర ఎత్తిపోతల	48.89
తాటిపూడి	70
ముసురుమల్లి	39.24
ఉత్తరాంధ్ర సుజల స్రవంతి	420.10
పురుషోత్తపట్నం ఎత్తిపోతల	400
చింతలపూడి ఎత్తిపోతల	378
గోదావరి డెల్టా	182.69
పులిచింతల	70
కృష్ణా డెల్టా ఆధునికీకరణ	242.95
నీరు-చెట్టు పథకం	500
ఏపీఎస్ఐడీసీ ఎత్తిపోతల పథకాలకు	175
ఏలేరు జలాశయం	38.72
గురు రాఘవేంద్ర ఎత్తిపోతల	26.01

యాంత్రీకరణకు ప్రాధాన్యం

వ్యవసాయం భారీ సాయం!

రాష్ట్రంలో 55% మానవ వనరులకు వ్యవసాయమే ఆధారం

వ్యవసాయంపై వెచ్చిస్తున్న దానిలో అధిక భాగం రుణ మాఫీకే ఖర్చవుతోంది. ఇది కాకుండా ప్రభుత్వం సూక్ష్మసేద్యం, యాంత్రీకరణ, సూక్ష్మపోషకాల పంపిణీ – వీటికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది.



సూక్ష్మసేద్యం

వర్షాభావ ప్రాంతాల్లో అతి తక్కువ నీటితో అధిక దిగుబడులే దీని లక్ష్యం. ఉద్యాన బడ్జెట్ నుంచి సూక్ష్మ, బిందుసేద్యాలకు రూ.282.36 కోట్లు కేటాయించారు. తర్వాత రూ.462.73 కోట్లకు పెంచారు కూడా. ఇప్పటి వరకూ 60% లక్ష్యం సాధించారు.

యాంత్రీకరణ

రైతులకు ట్రాక్టర్ల కొనుగోలుపై 1.5 - 2 లక్షల వరకూ రాయితీ ఇచ్చే 'రైతు రథం' పథకం దీనిలో కీలకం. మొత్తం యాంత్రీకరణకు రూ.146 కోట్లు, రైతురథం పథకంలో భాగంగా మరో రూ.90 కోట్లు జత చేశారు. మొత్తం 12,670 ట్రాక్టర్ల పంపిణీ చేపట్టగా 60% పూర్తయింది.

సూక్ష్మపోషకాలు

సూక్ష్మపోషకాలను ఉచితంగా పంపిణీ చెయ్యాలని నిర్ణయించడంతో దీనికి కేటాయింపులు పెరిగాయి. గత మూడేళ్లలో రూ.157 కోట్ల వ్యయంతో 1.21 లక్షల టన్నులు పంపిణీ చేయగా ఈ ఒక్క ఏడాదే రూ.98.60 కోట్లతో 1 లక్ష టన్నులు ఉచితంగా అందించారు. దీనివల్ల రూ.719 కోట్ల అదనపు ఉత్పత్తి సాధ్యమైందని అంచనా.

రెయిన్‌గన్: వర్షాభావం నుంచి పంటలను కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన రూ.121 కోట్లతో రెయిన్‌గన్ వ్యవస్థను తెచ్చినా ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయకపోవటంతో లక్ష్యం నీరుగారుతోంది. యంత్రాలన్నీ తుప్పు పడుతున్నాయి.

పశుసంవర్ధక శాఖకు రూ.360 కోట్లు కేటాయించగా రూ.290 కోట్లు ఖర్చయింది. పాతర గడ్డి పంపిణీ పాడి రైతులకు కొంతమేర ఊరటనిచ్చింది. ఉపాధి హామీ అనుసంధానం కొంత ఫలితాలనిచ్చింది. పశువులకు పచ్చిమేత అందించాలనే లక్ష్యం నెరవేరలేదు.

ప్రాధాన్య పథకాలకు కేటాయింపులు.. వ్యయం..

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2014-15	4,536.00	1,350.00
2015-16	5,104.35	4,839.00
2016-17	8,491.14	6,590.35
2017-18	9,090.91	7,860.75 (ఫిబ్రవరి చివరకు)
2018-19	19,070.36	-

- బీమాకూ ధీమా
- సూక్ష్మసేద్యానికి పెద్దపీట

ఈనాడు, అమరావతి: వ్యవసాయానికి బడ్జెట్ దన్ను లభించింది. కీలక పథకాలకు కేటాయింపులు పెరిగాయి. ప్రధానమైన వ్యవసాయ యాంత్రీకరణకు 70.50శాతం నిధులు పెంచారు. గతేడాది దీనికి రూ.146.53కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ఏడాది అదనంగా రూ.103.37 కోట్లు కేటాయించడంతో మొత్తం రూ.250కోట్లకు చేరింది. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత, యాంత్రీకరణకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం డ్రోన్ వినియోగం, రైతురథం కింద ట్రాక్టర్ల పంపిణీ ప్రారంభించింది. ఈ ఏడాది కూడా కొనసాగించేలా నిధుల కేటాయింపు పెంచారు. ఐటీ సేవల కింద ట్యాబ్స్ కొనుగోలు, ఇతర సేవలకు రూ.4.83కోట్లు ఇచ్చారు.

★ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన పథకం కింద ఉద్యానశాఖ పరిధిలో సూక్ష్మసేద్యం అమలు చేస్తున్నారు. దీనికి రూ.966 కోట్ల నుంచి రూ.1,152కోట్లకు పెంచారు. సాగునీటిని ఆదా చేయడంతోపాటు ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడులు తీసేందుకు ఈ పథకాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందుకే నిధులు పెంచారు.

ఫసల్‌బీమాకు భారీగా

రాష్ట్రంలో బీమా చేసే రైతుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. సాగు విస్తీర్ణంలో 50శాతం వరకు బీమా చేసేందుకు మొగ్గు చూపిస్తున్నారు. దీనికి తగ్గట్లుగానే బడ్జెట్ కేటాయింపులు పెంచారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.265.68కోట్లు ఉంటే.. ఈ ఏడాది రూ.485 కోట్లు కేటాయించారు.

బీమా.. పాడి రైతుకు ధీమా

పాడిరైతుకు ధీమా కల్పించేలా ప్రభుత్వం బీమా ప్రకటించింది. ఈ బడ్జెట్లో రూ.50కోట్లు కేటాయించింది. పశువులు, గొర్రెలు, మేకలకు గతంలో బీమా సౌకర్యం ఉన్నా క్రమంగా తొలగించారు. నాలుగేళ్లుగా రూ.లక్షల విలువైన మూగజీవాలు మరణిస్తున్నా రైతుకు పైసా అందడం లేదు. పలువురు శాసనసభ్యులతోపాటు రైతులు కూడా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల వద్ద ప్రస్తావించారు. వారి వినతిని పరిశీలించిన ప్రభుత్వం బీమా కల్పించేలా రూ.50కోట్లు కేటాయించారు.

వృద్ధి భేష్.. (2017-18లో మొదటి అర్ధసంవత్సరానికి)

ప్రాథమిక రంగంలో మొదటి అర్ధ సంవత్సరానికి 25.60శాతం వృద్ధిరేటు నమోదైంది. ఇందులో వ్యవసాయంలో అనుబంధ విభాగాల వారీగా చూస్తే..

శాఖ	శాతం
మత్స్యశాఖ	42.73
ఉద్యానం	18.62
వ్యవసాయం	17.44
పశుసంవర్ధకం	13.68

వ్యవసాయ బడ్జెట్ సమగ్ర స్వరూపం

వ్యవసాయ బడ్జెట్: రూ. **19,078** కోట్లు

(రెవెన్యూ వ్యయం రూ.18,602కోట్లు, పెట్టుబడి వ్యయం రూ.467.38కోట్లు)

ప్రధాన కేటాయింపులు..

నాలుగోవిడత రుణ ఉపశమనం రూ. **4,100** కోట్లు

ఉచిత విద్యుత్తుకు రూ. **2,500** కోట్లు

శాఖల వారీగా కేటాయింపులు (రూ.కోట్లలో)

- వ్యవసాయశాఖ: 7,607.49
- ఉద్యానశాఖ: 1,517.88
- పశుసంవర్ధకం: 1,223.40
- మత్స్యశాఖ : 386
- మార్కెటింగ్ : 208.11
- గ్రామీణ ఉపాధిహామీ అనుసంధానం: 4,730
- ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం: 395
- శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం: 130
- ఉద్యాన విశ్వవిద్యాలయం: 175.12

రైతే ముందు!

ఈనాడు – అమరావతి

రైతు సంక్షేమం కోసం 'రైతే ముందు' నినాదంతో తమ ప్రభుత్వం వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యమిస్తోందని వ్యవసాయ శాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సాగు ఖర్చులు తగ్గించి, పంటల ఉత్పాదకతను పెంచడం ద్వారా రైతులు అధిక నికర ఆదాయం సాధించాలనేది తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. 2018-19 సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ శాఖలకు రూ.19,070.36 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించామన్నారు. దీనిలో రెవిన్యూ వ్యయం రూ.18,602.98 కోట్లు, పెట్టుబడి వ్యయం రూ.467.38 కోట్లు అని పేర్కొన్నారు.



శాసనసభలో గురువారం ఆయన వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. శాసనమండలిలో పౌరసరఫరాలశాఖామంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వ్యవసాయ బడ్జెట్‌ను చదివి వినిపించారు.

ముఖ్యాంశాలు ఇలా...

- రూ.లక్ష వరకూ పంట రుణం తీసుకున్న రైతులు సకాలంలో దాన్ని తిరిగి చెల్లించినట్లయితే వడ్డీ లేకుండా రుణ సదుపాయం వర్తిస్తుంది. దీని కోసం రూ.172 కోట్లు ప్రతిపాదించాం.
- రాష్ట్రంలో మెగాసీడ్‌పార్క్ కంపెనీ లిమిటెడ్ నిర్వహణకు రూ.100 కోట్లు.
- రైతు రుణ విముక్తి నాలుగో విడత కింద రూ.4,100 కోట్లు.
- ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ అనుబంధ రంగాల్లో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.3,980 కోట్లు ఖర్చు చేయాలని కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాం.
- 14 వ్యవసాయ మార్కెట్లు, 89 రైతు బజార్లను ఈ సంవత్సరం ఆధునికీకరిస్తాం.

4 ఏళ్లుగా కేటాయింపులకు మించి ఖర్చులు

ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రభుత్వ శాఖలు నాలుగేళ్లుగా కేటాయింపులకు మించి నిధులు ఖర్చుచేస్తున్నాయి. ప్రభుత్వ ప్రాధామ్యాలకు తగినట్టుగా ఈ వ్యవహారం సాగుతోంది. తొలుత కేటాయింపులు తక్కువగా ఉంటున్నా.. ఆనక అవసరాల మేరకు కొన్ని శాఖల్లో ఖర్చులు పెరుగుతున్నాయి. మరికొన్ని శాఖల్లో మాత్రం అంచనాల స్థాయిలోనూ ఖర్చు ఉండటం లేదు. ఆర్థికశాఖ బీఆర్వోలు విడుదల చేస్తున్నా వాస్తవంగా నిధులు విడుదల చేయకపోవడం వల్ల తమకు సమస్యలు తలెత్తుతున్నాయని ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు. ఆర్థికశాఖ కూడా రాబడుల్ని, వ్యయాన్ని సమన్వయం చేసుకునే క్రమంలో... రాబడి అంచనాలను కూడా పరిగణనలోకి తీసుకుని.. ప్రభుత్వ ప్రాధామ్యాలకు అనుగుణంగా నిధులు ఇస్తూ రావడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయిలో జరుగుతున్న సమీక్షల్ని బట్టి కూడా చెల్లింపుల తీరు ఉంటోంది. ఉదాహరణకు పోలవరం ప్రాజెక్టుకు ఏ చెల్లింపులూ పెండింగులో ఉంచొద్దని ఆర్థికశాఖకు ఉన్నతస్థాయి ఆదేశాలున్నాయి. నాలుగేళ్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గమనిస్తే జల వనరులు, పంచాయతీరాజ్ వంటి శాఖల్లోనే నాలుగేళ్లూ ఖర్చు అంచనాలను మించింది. మరికొన్ని శాఖల్లో ఒకో ఏడాది ఒకో తరహాలో పరిస్థితి కనిపిస్తోంది.

సంవత్సరాల వారీగా బడ్జెట్.. ఖర్చు తీరు(రూ.కోట్లలో)..

సంవత్సరం	బడ్జెట్ మొత్తం	ఖర్చు
2015-16	1,13,049	1,16,885
2016-17	1,35,689	1,52,965
2017-18	1,56,999.40	1,75,000

(తుది లెక్కలు తేలాల్సి ఉంది)

ఇంపే.. కానీ!

- జలవనరులశాఖలో విభిన్న దృశ్యం
- చేపట్టబోయే కొత్త ప్రాజెక్టులూ ఎన్నో

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖలో విభిన్న పరిస్థితి కనిపిస్తోంది. ఏ ఏటికాయేడు సాగునీటి ప్రాజెక్టులపై బడ్జెట్‌లో కేటాయింపులు పెరుగుతున్నా గడువు లోపు ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అవి సరిపోయే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి తోడు ఆయా ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఎప్పటికప్పుడు అంచనాలు పెరిగిపోతున్నాయి. కొత్త ప్రాజెక్టులపైనా రాష్ట్ర జలవనరులశాఖ దృష్టి కేంద్రీకరించింది. ఆ ప్రాజెక్టులను 2019 జూన్‌కు పూర్తి చేయాలనే తలంపుతో ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పోలవరానికి రూ.9,000 కోట్లతో సహా మొత్తం రూ.16,593 కోట్లు జలవనరులశాఖకు కేటాయించింది. ఈ పరిస్థితుల్లో గత సంవత్సరం కన్నా జలవనరులశాఖకు 32శాతం కేటాయింపులు పెంచినా అవి చాలినంత కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే సమయంలో ప్రతి బడ్జెట్‌లోనూ రాష్ట్రం కేటాయించిన మొత్తం కన్నా ఆ తర్వాత ఖర్చు చేస్తున్నది ఎక్కువే ఉంటోంది. 2017-18 సంవత్సరంలో ఏకంగా రూ.15 వేల కోట్లకు అంచనాలు సవరించిన ఉదాహరణ కనిపిస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం గాలేరు నగరి, హంద్రీనీవా, వెలిగొండ, వంశధార రెండో దశ, గుండ్లకమ్మ, పోలవరం వంటి ప్రధాన ప్రాజెక్టులతో పాటు మరిన్ని ప్రాజెక్టుల్లోని కీలకదశలను విడివిడిగా గుర్తించి దాదాపు 50కు మించి ప్రాధాన్య ప్రాజెక్టులుగా భావిస్తూ పూర్తి చేయాలనుకుంటోంది. దీనికి తోడు గోదావరి - పెన్నా అనుసంధానం తొలిదశను దాదాపు రూ.5,500 కోట్ల అంచనా వ్యయంతో ఈ ఏడాది చేపట్టబోతోంది. రూ.5,000 కోట్లకు పైగా అంచనా వ్యయంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కొత్తగా చేపట్టబోతోంది. వైకుంఠపురం బ్యారేజి, చోడవరం బ్యారేజి...ఇలా మొత్తం మూడు బ్యారేజీలకు టెండర్లు పిలవనున్నారు. వెలిగొండ అంచనాలు పెరిగిపోతున్నాయి. చింతలపూడి రెండు దశలకూ రూ.వేల కోట్లు కావాలి. గాలేరు, నగరి- హంద్రీనీవాలు పూర్తి కావాలన్నా రూ.వందల కోట్లు అవసరమే. లక్ష్యాలు ఘనంగా ఉన్నా, ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు అందుకు తగ్గ రీతిలో కనిపించడం లేదు. సాగు నీటి ప్రాజెక్టుల్లో ఎంత పని చేసినా నిధులు ఇస్తామని సీఎం చెబుతూ వస్తున్నారు. కొంత ఇబ్బంది పడుతున్నా ఆ మేరకు ఊతం ఇస్తున్నారనే అభిప్రాయమూ అధికారుల్లో ఉంది.


లోటు నుంచి మిగులు వైపు

- తగ్గిన వ్యవసాయ విద్యుత్తు రాయితీ

ఈనాడు, అమరావతి: ఇంధన శాఖకు 2018-19 బడ్జెట్‌లో రూ.5140 కోట్లు కేటాయించారు. వ్యవసాయరంగానికి ఇచ్చే రాయితీ అంతకు ముందేడాదితో పోలిస్తే తగ్గింది. 2017-18లో రూ.3300 కోట్లు కేటాయించగా, దాన్ని తర్వాత రూ.2700 కోట్లకు సవరించారు. తాజా బడ్జెట్‌లో మాత్రం రూ.2500 కోట్లే కేటాయించారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన విద్యుత్తు బాండ్ల వడ్డీ చెల్లింపులకు గతేడాది రూ.300.61 కోట్లు కేటాయించగా ఈ ఏడాది దాన్ని రూ.652.34 కోట్లకు పెంచారు. దళితవాడల విద్యుదీకరణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.

నదులకు కొత్త నడక

జల వనరుల సమర్థ వినియోగానికి కంకణం కట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ రంగంపై భారీగా వ్యయం చేస్తోంది. ఏటా బడ్జెట్ కేటాయింపుల కంటే చాలా ఎక్కువగా ఖర్చుపెడుతున్న రంగం ఇది! ప్రభుత్వం ప్రధానంగా 4 ప్రాధాన్యతాంశాలను చేపట్టింది.



ఇదీ పురోగతి

▲ పట్టిసీమ:	రూ.1600 కోట్లతో పట్టిసీమ ఎత్తిపోతల నిర్మించి మూడేళ్లలో 170 టీఎంసీల నీటిని కృష్ణా నదికి తరలించారు.
▲ పోలవరం:	ప్రాజెక్టు పనులు గాడిలో పడ్డాయి.
▲ ముచ్చుమర్రి:	పనులు కొంత పూర్తి చేసి శ్రీశైలంలో దిగువ మట్టం నుంచి నీటిని కొంత మేర తీసుకోగలుగుతున్నారు.
▲ గాలేరు నగరి:	కొంతభాగం పూర్తిచేసి ఆయా జలాశయాల్లో నీటిని నింపారు.

మొత్తమ్మీద: నీరందించగలిగే ప్రాజెక్టులు 13 పూర్తయ్యాయి. మరో 16 ఈ నెలాఖరుకు పూర్తికావొచ్చు.

ప్రాజెక్టులకు నిధులు ఇలా (రూ.కోట్లలో)...

ఆర్థిక సంవత్సరం	కేటాయింపులు	ఖర్చు
2014-15	8,463.50	9,223.75
2015-16	5,258.06	9,540.66
2016-17	7,978.80	10,592.46
2017-18	12,770.26	11,326.70 (ఫిబ్రవరి 28 వరకు)
2018-19	16,593.67	-


రుణ ఉపశమనానికి రూ.4,100 కోట్లు

- 10శాతం వడ్డీ కోసమే అధిక కేటాయింపు

ఈనాడు, అమరావతి: రుణ ఉపశమన పథకానికి బడ్జెట్లో రూ.4,100 కోట్లు కేటాయించారు. గతేడాది బడ్జెట్లో కేటాయించిన రూ.3,600 కోట్లతో పోల్చి చూస్తే రూ.500 కోట్లు పెంచారు. అయిదు విడతల్లో రుణమాఫీ అమలు చేస్తున్న ప్రభుత్వం రైతులకు ఏడాదికి పదిశాతం వడ్డీతో కలిపి సొమ్ము చెల్లిస్తోంది. ఈ రూపంలో వడ్డీ భారమే నాలుగేళ్లకు రూ.1,200 కోట్లు అవుతోంది. ఈ నేపథ్యంలో బడ్జెట్లో రూ.4,100 కోట్లు ఇచ్చారు.

రుణ మాఫీ: అగ్రాసనం

రూ.24 వేల కోట్లతో రైతన్నకు అండ



ప్రకటించిన మాఫీ లక్ష్యం: రూ24,000 కోట్లు

ఇప్పటి వరకూ ఇచ్చింది: పంట రైతులకు: 117.6 లక్షల ఖాతాలకు రూ.13,976 కోట్లు; ఉద్యాన రైతులకు: 2.24 లక్షల ఖాతాలకు రూ. 385 కోట్లు

ఆర్థిక ఇబ్బందులు అందని నిధులు: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో బ్యాంకుల నుంచి రూ. 2000 కోట్ల రుణం తీసుకోవాలని నిర్ణయించినా రూ. 1,000 కోట్లే విడుదలయ్యాయి.


ఆగని అర్జీలు: అందిన తొలి అర్జీలు 9 లక్షలు; పరిష్కారమైనవి 7.50 లక్షలు

ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ రంగ వ్యయంలో సింహ భాగం రుణ మాఫీకే ఖర్చు చేస్తోంది.



11 దఫాలు అవకాశం ఇచ్చినా ఇప్పటికీ రుణమాఫీ అర్జీలు అందుతూనే ఉన్నాయి. గతేడాది చివర్లో అనంతపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో వినతులు స్వీకరించగా ఒక్కోచోట 3,000 నుంచి 11,000 అందాయి. వీటిని విడతల వారీ పరిష్కరించి సొమ్మిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. కానీ రైతులకు సరైన సమాచారం ఉండటం లేదు. తిరస్కరించినా కారణాలు తెలియడం లేదు. మాఫీ సొమ్మును బ్యాంకులకు విడుదల చేసినా ఆ సొమ్ము తమ ఖాతాలకు చేరక 40% పైగా రైతులు ఇంకా నిరీక్షిస్తూనే ఉన్నారు.

ప్రసంగంలో పెద్దల మాట



"కష్టాలు చుట్టుముట్టినా.. వాటికి తలవంచకుండా ముందుకు సాగడమే బలం"

-మహాత్మా గాంధీ

రాజధాని నగలివీ...

2050 నాటికి 600 కి.మీ.ల రోడ్ నెట్‌వర్క్ నిర్మాణం

2050 నాటికి 35 లక్షల జనాభాకు ఆవాసాలు, 15 లక్షల ఉద్యోగాల కల్పన

రాజధానిలో పచ్చదనం, జల సంరక్షణకు 20% భూభాగం కేటాయింపు. నదికి అభిముఖంగా 20 కి.మీ.ల మేర పర్యాటక ప్రాంత అభివృద్ధి



ఎదుగుదలలో ఎదురులేదు!

2014 జూన్ నెలలో ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎన్నో కీలక విజయాలు సాధించింది. వాటిలో కొన్ని...

- సులభతర వాణిజ్య నిర్వహణలో 2016లో 1 ర్యాంకు (ఇచ్చింది- డీఐపీపీ, ప్రపంచబ్యాంకు)
- ప్రజాసేవ, ఆర్థిక పరివర్తనలో ప్రపంచస్థాయి నాయకత్వాన్ని అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు గోల్డెన్ పీకాక్ అవార్డు
- ప్రైవేటురంగ పెట్టుబడుల్ని ఆకర్షించటంలో 1 ర్యాంకు (ఇచ్చింది ఆర్‌బీఐ 2015-16లో)
- సమర్థ ఇంధన ఆదా, సంరక్షణ పద్ధతుల అమలులో (2017లో) 1 ర్యాంకు
- రొయ్యల ఉత్పత్తిలో ప్రపంచంలో 3 ర్యాంకు
- ప్రపంచ సముద్ర ఎగుమతుల్లో 1 ర్యాంకు
- 2016-17లో ఉత్పాదక రంగంలో మూడు అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటి
- వ్యాపార పెట్టుబడుల ఆకర్షణ సామర్థ్యం ఉన్న రాష్ట్రాల్లో 3 ర్యాంకు (2017లో)
- బెరైట్స్ ఉత్పత్తిలో 1 ర్యాంకు
- దేశంలో డ్రెడ్జింగ్ హార్బర్‌ను నిర్మిస్తున్న తొలి రాష్ట్రం
- దేశంలోని పరిశుద్ధ నగరాల్లో (స్వచ్ఛ సర్వేక్షణ) వైజాగ్‌కు 3 ర్యాంకు (2017లో)
- దేశంలోనే సున్నపురాయి ఉత్పత్తిలో 3 స్థానం
- విద్యుత్తు పంపిణీ నష్టాలు 2016-17లో దేశంలోనే అతి తక్కువ
- 9 నెలల్లో 23 వేల కి.మీ.ల ఫైబర్‌ట్రంక్ ఏర్పాటు లక్ష్యం పూర్తిచేసిన తొలి రాష్ట్రం
- 2016-17లో విద్యుత్ రంగంలో సాధించిన అవార్డులు 26
- వ్యవసాయం, ఉత్పాదకత, సేవల రంగాల్లో 10% వృద్ధి
- పర్యాటకంలో అత్యుత్తమ రాష్ట్రంగా కేంద్రం నుంచి జాతీయ అవార్డు
- 2017లో సీఎన్‌బీసీ నుంచి 'స్టేట్ ఆఫ్ ది ఇయర్' అవార్డు



సరికొత్తగా 28



ఈనాడు డిజిటల్, ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో 37 పథకాలను కొత్తవిగా పేర్కొంది. వాటిలో కొన్ని పాతవే అయినా గత బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయనందున కొత్తవిగా పరిగణించింది. మొత్తంగా చూస్తే 28 పథకాలు పూర్తిగా కొత్తవి. వీటిలో 9 మానవ వనరుల అభివృద్ధి శాఖకు సంబంధించినవే. ఒకే బడ్జెట్‌లో ఇంత భారీ ఎత్తున కొత్త పథకాలు ప్రవేశపెట్టడం చాలా అరుదు. వీటన్నింటి కోసం మొత్తం రూ. 5,147.73 కోట్లు కేటాయించింది. చేతివృత్తుల వారు అత్యాధునిక పరికరాలు సమకూర్చుకోడానికి ఆర్థిక సాయం కోసం గతంలో అమలు చేసిన ఆదరణ పథకాన్ని పునరుద్ధరించింది. ఇళ్ల స్థలాలకు భూ సేకరణ, ఎస్సీల కోసం భూముల కొనుగోలు తదితర పథకాలకు భారీగా నిధులు కేటాయించింది. మెడ్‌టెక్ జోన్‌కు గతంలోనూ కేటాయింపులు చేసినా కొత్త పథకంగానే పేర్కొంది. కొత్తగా ప్రకటించిన వాటిలో ఎక్కువ శాతం సంక్షేమ పథకాలే. మహిళలకు సంబంధించి డ్వాక్రా సంఘాల మహిళలు, విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్ల పంపిణీ, పోషకాహారం లోపం కలిగిన తల్లులు, చిన్నారుల కోసం పౌష్టికాహార సరఫరా, చంద్రన్న బీసీ, ఎస్సీ పెళ్లి కానుక తదితర పథకాలను ప్రకటించింది. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నభోజనంలో ప్రస్తుతం వారానికి మూడు కోడిగుడ్లు ఇస్తుండగా..ఇకపై అయిదు ఇవ్వనుంది. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు కూడా ఇకపైన పౌష్టికాహారాన్ని అందించనుంది. రాష్ట్రవ్యాప్తంగా సీఆర్‌డీఏ పరిధిలో కేవలం నాలుగు అన్న క్యాంటిన్లు ఉండగా...రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లోనూ వీటిని ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో ఐటీ రంగ అభివృదిలో అంకుర సంస్థలకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. అంతర్జాలం అనుసంధానత, సాంకేతికత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఫైబర్‌గ్రిడ్‌కు తొలిసారిగా బడ్జెట్‌లో రూ. 600 కోట్లు కేటాయించింది. ఈ-ప్రగతికి ప్రాధాన్యం కల్పించింది. కొత్త పథకాల జాబితాలో పేర్కొనప్పటికీ నిరుపేదలకు, అవసరమైన వారికి 50 శాతం రాయితీపై జనతా వస్త్రాలు సరఫరా చేస్తామని బడ్జెట్‌లో పేర్కొంది. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణమే తప్ప... ఇప్పటివరకూ వాటి నిర్వహణపైన శ్రద్ధ పెట్టింది లేదు. ఈ బడ్జెట్‌లో తొలిసారి నిర్వహణ కోసం భారీగా నిధులు కేటాయించింది.

- పంచాయతీలకు 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ. 20,185.98 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్ కంటే ఇది 6.39 శాతం అదనం.
- ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద రహదారుల కోసం రూ. 336.35 కోట్లు, వంతెనల కోసం మరో రూ. 10.15 కోట్లు కేటాయించారు.
- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రహదారుల పనుల కోసం రూ. 50 కోట్లు
- రాష్ట్రీయ గ్రామస్వరాజ్య అభియాన్(ఆర్‌జీఎస్‌బీ): రూ. 36 కోట్లు

తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం కొత్తవిగా ప్రకటించిన పథకాల వివరాలు

	పథకం	కేటాయింపులు (రూ.కోట్లలో)
1.	మెగా సీడ్ పార్క్	100
2.	పశువుల బీమా	50
3.	బీసీలకు చంద్రన్న పెళ్లి కానుక	100
4.	ఆదరణ	750
5.	ఏపీ ఫైబర్ గ్రిడ్	600
6.	వన సంజీవని(ఎస్ఎంసీ పనులు)	75
7.	వన విహారి(ఎకో టూరిజం)	10
8.	వన విహారి (ఎస్ఎంసీ పనులు)	10
9.	నగర వనం (అడవుల పెంపకం)	25
10.	ఇళ్ల స్థలాల భూ సేకరణ	575
11.	పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి (ఎంఎస్ఎంఈ)	200
12.	ఈ- ప్రగతి	200
13.	స్టార్టప్‌ల కోసం..	100
14.	ఏపీ ఎలక్ట్రానిక్స్, ఐటీ ఏజెన్సీ(ఏపీఈఐటీఏ)	60
15.	అన్న క్యాంటిన్లు	200
16.	మున్సిపల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన	50
17.	శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎన్టీఆర్ జలసిరి	100
18.	డ్వాక్రా మహిళలకు శానిటరీ న్యాప్‌కిన్లు	100
19.	పాఠశాల విద్యార్థులకు వారానికి 5 గుడ్లు పంపిణీ	266.72
20.	విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్ల సరఫరా	27
21.	ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతుల ఏర్పాటు	70
22.	పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ	100
23.	జూనియర్ కళాశాలల్లో డిజిటల్ తరగతుల కోసం..	25
24.	ఇంటర్ విద్యార్థులకు పౌష్టికాహార భోజన పథకం	23
25.	జూనియర్ కళాశాలల్లో ఆంగ్ల భాష ప్రయోగశాలల ఏర్పాటు	15
26.	పాలిటెక్నిక్ కళాశాలల్లో వర్చువల్ ల్యాబ్స్, డిజిటల్ తరగతి గదులు	16
27.	ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రయోగశాలల ఆధునికీకరణ	50
28.	ఎస్సీలకు చంద్రన్న పెళ్లి కానుక	100
29.	ఎస్సీల భూ కొనుగోలు పథకం	100
30.	గిరిజన ప్రాంతాల్లో బ్రాడ్‌బ్యాండ్ సదుపాయ కల్పన	90
31.	ఐటీడీఏ పరిధిలో మార్కెట్, గిడ్డంగుల సదుపాయాలు	50
32.	గిరిజనుల కోసం ఫుడ్ బాస్కెట్ల ఏర్పాటు	40
33.	గిరిజనులకు భూ కొనుగోలు పథకం	20
34.	ఆర్టీసీ బస్సుల కొనుగోలు	200
35.	పోషకాహార లోప తల్లులు, చిన్నారులకు ప్రత్యేక పౌష్టికాహారం	360
36.	హిజ్రాల సంక్షేమం	20
37.	మెడ్‌టెక్ జోన్	270
	మొత్తం	5,147.73

కేంద్ర సహకారం ఎంతుంటుందో...!

- గ్రాంట్ ఇన్ ఎయిడ్‌పై సందేహం
- రాష్ట్ర బడ్జెట్‌లో కేంద్రం నుంచి రావాల్సింది ఎక్కువే

ఈనాడు–అమరావతి: రికార్డు స్థాయిలో రూ. 1.91లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం... ఆ మేరకు ఆర్థిక వనరుల్ని సమీకరించుకోవాలంటే కేంద్ర ప్రభుత్వ మద్దతు అత్యవసరం. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో కేంద్రం సహాయ సహకారాలు ఏమేరకు అందుతాయన్న సందేహం రాజకీయ వర్గాల్లో ఉంది. రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌లో... కేంద్రం నుంచి లభించే పన్నుల ఆదాయంలో వాటా, వివిధ పథకాల కింద నిధుల రూపంలో ఏకంగా రూ. 84,626కోట్లు వస్తాయని ప్రతిపాదించింది. అంటే కేంద్రం నుంచి అందే మొత్తం తాజా బడ్జెట్ పరిమాణంలో అధిక భాగం ఆక్రమించింది. వీటిల్లో రూ. 33,930కోట్లు కేంద్ర పన్నుల ఆదాయంలో రాష్ట్రం వాటా, 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రెవిన్యూ లోటు భర్తీ కింద రాష్ట్రానికి వచ్చే నిధులు కలిసి ఉన్నాయి. ఇవి మంజూరవటానికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ రూపంలో వస్తాయని భావిస్తున్న రూ. 50,696కోట్లపైనే ప్రస్తుతం సందేహాలన్నీ. కేంద్రం అమలు చేస్తున్న 67 రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల నిధులు ఈ రూపంలోనే రాష్ట్రాలకి అందుతాయి. వీటిల్లో కొన్ని పథకాలకు కేంద్రం కేటాయించే నిధుల్లో సింహభాగం రాష్ట్రం వాడుకున్న సందర్భాలూ గత కొన్నేళ్లలో ఉన్నాయి. నరేగాతోసహా 12 పథకాల కింద 2017-18లో కేంద్రం అక్టోబరు వరకు రూ. 52,120కోట్లు విడుదల చేస్తే... అందులో రూ. 6,220కోట్లు(11.93శాతం) రాష్ట్రం సాధించింది. మొత్తంగా గరిష్ఠ స్థాయిలో వినియోగించుకున్న పథకాలే ఎక్కువగా ఉన్నాయి. కేంద్ర మంత్రులు, కార్యదర్శుల్ని పదేపదే కలవటం, పక్కాగా ప్రతిపాదనలు అందించటం, ఆర్థిక సంవత్సరం ఆఖర్లో వృథాగా ఉన్న నిధులు రాష్ట్రానికి వచ్చేలా చూడటం వంటి చొరవతోనే అధికంగా నిధులు వినియోగించుకునే పరిస్థితి ఉంది. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో అంతకుముందులా ఆయా మంత్రిత్వశాఖల్ని సంప్రదించే పరిస్థితి ఉండకపోవచ్చు. కేంద్రం పాత ధోరణిలో నిధుల విడుదలకి సహకరిస్తే మాత్రం ఎలాంటి సమస్య ఉండదు.

రాష్ట్ర వనరుల్లో పన్నుల ఆదాయం పైనా...

రాష్ట్ర వనరుల్లోనూ అంచనాలు ఏమేరకు వాస్తవికంగా ఉన్నాయన్న సందేహాలూ లేకపోలేదు. రాష్ట్ర సొంత వనరుల్లో పన్నుల ఆదాయం రూ. 65,535కోట్లు వస్తుందని అంచనా వేశారు. ఇది 2017-18 సవరించిన అంచనాల కన్నా రూ. 12,820కోట్లు అధికం. 2016-17 వాస్తవ ఆదాయంతో పోలిస్తే ఏకంగా రూ. 21,354కోట్లు అధికం. తాజాగా లెక్కించిన మేరకు అధికంగా ఆదాయం వస్తుందా? అంచనా వాస్తవ రూపం దాలుస్తుందా అన్న సందేహాలున్నాయి. పన్నుల ఆదాయంలో కీలకమైన జీఎస్టీలో రాష్ట్ర వాటాలోనూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాలు రూ. 32,893కోట్లు కాగా... 2018-19 బడ్జెట్‌లో రూ. 38,448కోట్లు వస్తాయని లెక్కించారు. ఇది రూ. 5,555కోట్లు అధికం. ఎక్సైజ్ ఆదాయంలోనూ భారీగా పెరుగుదల వస్తుందని భావించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు సవరించిన అంచనాల్లో ఎక్సైజ్ ఆదాయం రూ. 5,886 కోట్లు. ఇప్పుడు రూ. 7,357కోట్లు వస్తుందని అంచనా వేశారు. రూ. 1,471కోట్లు అధికం. ఇంత మేర ఆదాయం ఎలా పెరుగుతుందన్నది ప్రశ్నార్థకమే.

ఇళ్లకు రూ.3,679 కోట్లు

ఈనాడు, అమరావతి: గ్రామీణ, పట్టణ గృహనిర్మాణానికి 2018-19 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 3,679.53 కోట్లు కేటాయించింది. 2017-18 కేటాయింపుల(1,465.55 కోట్లు) కంటే 152.36శాతం అధికం. ఇతర ప్రభుత్వశాఖలకంటే అత్యధికంగా పేదలగృహ నిర్మాణంకోసం నిధులు కేటాయించారు.

- మూడేళ్లలో కేటాయించిన, గత ప్రభుత్వ హయాంలో మిగిలిన ఇళ్లన్నీ పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఈసారి భారీగా కేటాయింపులు చేశారు
- 2016-17, 2017-18లో ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ (గ్రామీణ్) పథకంలో కేటాయించిన ఇళ్లకు రూ. 27.08 కోట్లు
- ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై, గ్రామీణ్) ఇళ్ల కోసం రూ. 38.37 కోట్లు
- ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై, పట్టణ) ఇళ్లకు రూ. 182 కోట్లకుపైగా కేటాయింపు
- వివిధ ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాల చెల్లింపులకు రూ. 184.02 కోట్లు
- ఇళ్ల స్థలాల సేకరణకు రూ. 50 కోట్లు.

గ్రామీణ, పట్టణ పేదల గృహనిర్మాణాలకు, ఉద్యోగుల వేతనాలు, గృహాల నిర్వహణ, పరిపాలన ఖర్చుల కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు, వ్యయం..

సంవత్సరం	కేటాయింపులు	ఖర్చు (రూ.కోట్లలో)
2014-15	1,146.11	650.27
2015-16	897.42	1,678.49
2016-17	1,132.83	668.00
2017-18	1,465.55	3,000.00 (ఫిబ్రవరి నెలాఖరు వరకు)

ఒక్కరోజులో ఆంధ్రప్రదేశ్



- రోజూ తెరిచే జన్‌ధన్ ఖాతాలు: 2,500
- సగటు సౌర విద్యుదుత్పత్తి: 9-9.5 మిలియన్ యూనిట్లు (2017-18)
- మున్సిపల్ వ్యర్థాలతో విద్యుదుత్పత్తి: 63 మెగావాట్లు (6,440 టన్నుల నుంచి)
- విద్యుత్ వినియోగం: 137 మిలియన్ యూనిట్లు
- ఓడరేవుల ద్వారా సరకు రవాణా: 3,50,000 టన్నులు
- ఆహార ధాన్యాల ఉత్పత్తి: 42,900 టన్నులు
- రోడ్లపై తిరిగే ఆర్టీసీ బస్సులు: 11,962
- వాహనాల రిజిస్ట్రేషన్లు: 2,925
- ఎల్ఈడీ బల్బులతో ఆదా: 4,00,000 డాలర్లు (ఉజాలా పథకం)
- రోజూ వచ్చే పర్యాటకులు: 4,60,000

పోల'వరం' ఎలా...!

ఈనాడు–అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ. 9,000 కోట్లు కేటాయించింది. 2019 జూన్ నాటికి పాక్షికంగాను, అదే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి స్థాయిలోను ప్రాజెక్టును పూర్తి చేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొంటున్న నేపథ్యంలో ఈ నిధులు ఏ మూలకు సరిపోవు. ఈ ప్రాజెక్టు మొత్తం పూర్తి కావాలంటే ఎంత లేదన్నా ఇంకా రూ. 43 వేల కోట్లు కావాలి. 2019 డిసెంబరు లోపు ఈ నిధులు రావాలి. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వమే నిధులు ముందుగా ఖర్చు చేసిన తర్వాత ఆనక కేంద్రం చెల్లిస్తోంది. ఈ క్రమంలో కేంద్రం నుంచి నిధుల విడుదలలో ఆలస్యమవుతోంది. ఇంకా రూ. 2,500 కోట్ల బిల్లుల పెండింగు ఉంది. ఈ ప్రాజెక్టుకు రూ. 58 వేల కోట్ల మేర సవరించిన అంచనాలకు ఇంకా కేంద్రం ఆమోదం తెలియజేయాల్సి ఉంది.

పోలవరంపై ఇంతవరకు చేసిన ఖర్చు : 13,053.91 కోట్లు
జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత ఖర్చు: 7,918.04 కోట్లు
కేంద్రం ఫిబ్రవరి వరకు ఇచ్చిన మొత్తం: 4,932.26 కోట్లు

కేంద్రం వైఖరి ఏమిటి?: కేంద్ర ప్రభుత్వం నీటిపారుదల ఖర్చు మాత్రమే ఇస్తాననగా ఆ మేరకు రూ12,294.40 కోట్లు రావాల్సి ఉంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చేసిన పూర్తి ఖర్చు తిరిగి రావాలంటే కేంద్రం సవరించిన అంచనాలు ఆమోదించాల్సిందే. పోలవరం సాకారం కావాలంటే కేంద్రం సహకారం ముఖ్యం. తాజా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాల నేపథ్యంలో పరిణామాలు ఎలా ఉంటాయోననే ఆసక్తి సర్వత్రా ఉంది.

10 వేల కోట్లతో కొంత నీరిచ్చే అవకాశం...: పోలవరం జలాశయంలో నీరు నిల్వ ఉంచి కాలువల ద్వారా మళ్లించే స్థాయి +41.15 మీటర్ల వరకు భూ సేకరణ, పునరావాసం పూర్తి చేయాలంటే మొత్తం ఇంకా రూ. 2884.66 కోట్లు అవసరమవుతాయని లెక్కించారు. ఆ మేరకు ప్రధాన డ్యాం పూర్తి కావాలంటే రూ. 5741.52 కోట్లు కావాలి. మరో వైపు ఎడమ కాలువ పూర్తి చేసేందుకు రూ. 1500 కోట్లు అవసరం. ఈ మేరకు నిధులు ఖర్చు చేస్తే పూర్తి స్థాయిలో పోలవరంలో నీరు నిలబెట్టలేకపోయినా కాలువల ద్వారా నీటిని మళ్లించే స్థాయిలో ప్రాజెక్టు పూర్తి చేసే అవకాశమూ ఉంది.

బడ్జెట్ 2018-19



విస్తరిస్తున్న ఓడరేవులు

- సముద్రయాన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్' ఏర్పాటు.
- లాజిస్టిక్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు.
- నూతన రాజధాని అమరావతి సమీపంలో మచిలీపట్నం పోర్టు నిర్మాణం.
- భావనపాడు, కేఎస్ఈజడ్ పోర్టు ప్రతిపాదన.
- పర్యాటకులను ఆకర్షించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 9 జెట్టీల నిర్మాణ ప్రతిపాదన.

ప్రసంగంలో పెద్దల మాట

"అవిద్య అజ్ఞానానికి దారితీస్తుంది. అజ్ఞానం అనైతికతకు బాట లువేస్తుంది. అనైతికతతో అభివృద్ధిలేమి గోచరిస్తుంది. అభివృద్ధి లేమితో డబ్బులేని పరిస్థితులు ఏర్పడతాయి. అఖరికి ఈ పరిస్థితులు నిమ్నవర్గాల పీడనానికి దారితీస్తాయి. అవిద్య ఎన్నో విపరిణామాలను సృష్టిస్తుంది"

-మహాత్మా జ్యోతిబా పూలే



సంక్షేమ.. ప్రజా బడ్జెట్

- కేటాయింపుల్లో సంక్షేమ రంగానికి పెద్దపీట వేశాం
- సామాజిక-ఆర్థిక సమతుల్యత సాధించాలనేది లక్ష్యం
- శాసనసభలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి యనమల
- మండలిలో ప్రవేశపెట్టిన పురపాలకశాఖ మంత్రి నారాయణ

ఈనాడు - అమరావతి

ప్రజలే ముందు నినాదంలో భాగంగా తమ ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. సామాజిక-ఆర్థిక సమతుల్యత సాధించాలనే ప్రభుత్వ తపనను నెరవేర్చేలా 2018-19 బడ్జెట్ కేటాయింపుల్లో సంక్షేమ రంగానికి పెద్దపీట వేశామన్నారు. ఉజ్వలమైన సమసమాజాన్ని ఏర్పరచగలిగే సంక్షేమాధారిత ప్రజా బడ్జెట్ ఇదని వ్యాఖ్యానించారు. శాసనసభలో గురువారం ఆయన రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఉదయం 11.29 గంటలకు ఆయన ప్రసంగం ప్రారంభమైంది. శాసనమండలిలో మంత్రి పి.నారాయణ బడ్జెట్ ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని ప్రతిపౌరుడు ఆనందంగా ఉండటానికి తమ బడ్జెట్ కేటాయింపు ప్రతిపాదనలు దోహదపడతాయని యనమల అన్నారు. శాంతి, సామరస్యాలతో కూడిన మెరుగైన ఆనంద సూచికల సాధనకు యువత ముందుకు రావాలన్నారు. 2018-19 సంవత్సరానికి రెవిన్యూ మిగులుతో బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు.

"కేంద్రం ఉదాసీనత కనబరచకుంటే మరింత వృద్ధి, ప్రగతి సాధించేవాళ్లం. విభజన చట్టం, రాజ్యసభలో అప్పటి ప్రధానమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల తీవ్ర ఆర్థిక లోటుతో సతమతమవుతున్న రాష్ట్రంపైన బాగా ప్రభావం చూపుతోంది. కేంద్రం నుంచి సానుకూలత ఉంటే మరింత వృద్ధి, ప్రగతి సాధించేవాళ్లం. అయినా గత మూడేళ్లలో రాష్ట్రం సగటున 10.96 శాతం వృద్ధి సాధించింది. రాష్ట్ర పునర్నిర్మాణానికి నాలుగేళ్ల సమయం చాలా తక్కువ. ఈ నేపథ్యంలో ఇప్పటివరకూ మనం సాధించిందేమిటి... స్వల్ప, దీర్ఘకాలిక ప్రాధాన్యాలు ఎలా ఉండాలనేది నిర్ణయించుకునేందుకు ఇది సరైన సమయం. అన్ని హామీలు అమలయ్యే వరకూ, ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలతో సమానంగా నిలిచే వరకూ పట్టుదలతో పోరాడతాం" అని యనమల అన్నారు. 2016-17లో రూ.1,23,664గా ఉన్న తలసరి ఆదాయం 2017-18 నాటికి రూ.1,42,054కు పెరిగిందని 14.87 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. ఎస్సీ, బీసీ కులాలకు చెందిన వధువుల వివాహానికి ఆర్థికసాయం చేసేందుకు గాను చంద్రన్న పెళ్లి కానుక పథకం కింద చెరో రూ.వంద కోట్లు కేటాయించామన్నారు. బీసీల్లోని చేతి వృత్తుల వారికి ఉద్దేశించిన ఆదరణ పథకం ద్వారా 2.55 లక్షల మంది లబ్ధిపొందుతారని రూ.750 కోట్లు నిర్దేశించామని తెలిపారు. చేనేత కార్మికులు ఉత్పత్తి చేసే వస్త్రాలన్నింటినీ సేకరించి వాటిని నిరుపేదలకు, అవసరమైనవారికి 50 శాతం రాయితీపై జనతా వస్త్రాలుగా సరఫరా చేస్తామన్నారు. మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదల, రాయితీ ధరలపై వారికి మర పడవలు, వలలు, డీజిల్ అందించే యోచన ఉందన్నారు. 50 సంవత్సరాలు పైబడిన మత్స్యకారులకు సామాజిక భద్రత పింఛను ఇస్తామన్నారు.

బడ్జెట్‌లో రంగాలవారీ కేటాయింపులు

రంగం	బడ్జెట్‌అంచనా (రూ.కోట్లలో) 2017–18	బడ్జెట్‌అంచనా (రూ.కోట్లలో) 2018–19	వృద్ధిశాతం
1. వ్యవసాయం అనుబంధ రంగాలు	9090.91	12,355.32	35.91
2. గ్రామీణాభివృద్ధి	19,565.44	20,815.98	6.39
3 నీటిపారుదల, వరద నియంత్రణ	12,770.26	16,978.23	32.95
4. విద్యుత్	4274.75	5052.54	18.19
5. పారిశ్రామిక ఖనిజాలు	2085.96	3074.87	47.41
6. రవాణా	3946.19	4653.74	17.93
7. సాధారణ విద్య	20,384.72	24,185.75	18.65
8వైద్యం	7020.63	8463.51	20.55
9. గృహ నిర్మాణం	1456.55	3679.53	152.62
10. సమాచార, ప్రజాసంబంధాలు	155.97	224.81	44.14
11. సంక్షేమం	11,361.52	13,722.98	20.78
12. కార్మిక, ఉపాధి రంగం	468.80	902.19	92.45



'నిస్పృహ నుంచి ఆశ, భ్రమల నుంచి విశ్వాసం, నిరాదరణ నుంచి అభివృద్ధి దిశగా మనం కొనసాగుతున్నాం. సమర్థ వనరుల సమీకరణ, ప్రభావవంతమైన యాజమాన్యం, వనరుల కేటాయింపులో ఏకీకరణ విధానం, సాంకేతిక ప్రయోజనాలను విరివిగా ఉపయోగించుకోవడం ద్వారా ఇది సాధ్యపడింది. ప్రతి సంక్షోభాన్నీ అవకాశంగా మలచుకున్నాం. కేంద్రం ఉదాసీన వైఖరి కనబరచకుంటే మరింత వృద్ధి, ప్రగతి సాధించగలిగేవారం'

నిరాదరణ.. ఉదాసీనత!

ఆంధ్రప్రదేశ్‌కు చేయూతనివ్వడంలో కేంద్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంపై ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు చేసిన వ్యాఖ్యానాలివి. బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టేముందు ప్రస్తుత పరిస్థితులను మననం చేసుకోవలసిన పరిస్థితి ఉందంటూ ఆయన కేంద్ర ప్రభుత్వ వైఖరి గురించి కొన్ని అంశాలను ప్రస్తావించారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరచిన హక్కులను, రాజ్యసభలో ఆనాటి ప్రధాని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న ఉదాసీనత ఇప్పటికే తీవ్రలోటుతో సతమతమవుతున్న అభివృద్ధి గతిపై ప్రభావం చూపుతోందన్నారు. ఒక నిశ్చితమైన దృక్పథంతో నిర్దిష్ట విధానాన్ని అనుసంధానించడంద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ పరిస్థితులను ఎదుర్కొందని తెలిపారు.

'అసమంజసంగా జరిగిన రాష్ట్ర విభజనవల్ల ప్రధాన ఆర్థిక ఆధారాలైన రాజధాని నగరం, ఆదాయం చేకూర్చే సేవారంగం వంటివి కొరవడిన పరిస్థితుల్లో రాష్ట్ర పునర్నిర్మాణానికి నాలుగేళ్ల కాలం చాలా తక్కువే. కేంద్ర ప్రభుత్వం నుంచి సకాలంలో సహాయం అందకపోవడం సమస్యను మరింత జటిలం చేసింది. ఇన్ని సమస్యలున్నా వీటికి అతీతంగా గత మూడేళ్లలో రాష్ట్రం సగటున 10.96% (రెండంకెల) వృద్ధిని సాధించింది. జాతీయ సగటు వృద్ధి 7.30% మాత్రమే. ఎన్నో సవాళ్ల మధ్య కూడా పట్టుదల దృఢచిత్తంతో మనం సాధిస్తున్న పురోగతి ఒక ఆశాజనకమైన ధైర్యాన్ని, విశ్వాసాన్ని కలిగిస్తోంది' అన్నారు. విభజన హామీలు అమలయ్యేదాకా, ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలతో సమానంగా నిలిచేవరకూ పట్టుదలతో పోరాడాలని చెబుతూ.. 'ఎన్ని కష్టాలెదురైనా పరిస్థితులకు లొంగకపోవడమే నిజమైన బలం' అంటూ మహాత్ముడు చెప్పిన సూక్తిని ఉదహరించారు. కేంద్రం నుంచి స్పందన కరవైనా తమ సర్కారు ఆంధ్రప్రదేశ్‌ను 2022 నాటికి దేశంలో, 2029 కల్లా ప్రపంచంలో ఉత్తమ రాష్ట్రంగా..అంతిమంగా 2050 నాటికి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించే కేంద్రంగా రూపొందించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ప్రపంచ పోటీని తట్టుకుని నిలబడేలా...

ప్రపంచ పోటీని తట్టుకుని నిలబడేలా ఆంధ్రప్రదేశ్ ఏటికేడు తన ర్యాంకును మెరుగుపరచుకుంటూ పోతోంది. 2015లో ప్రపంచంలో 145వ ఆర్థిక వ్యవస్థగా ఏపీ ఉండేది.

- 2016-17లో గ్లోబల్ కాంపిటీటివ్ ఇండెక్స్(జీసీఐ)లో ఆంధ్రప్రదేశ్ 36వ ర్యాంకు (4.57) ను సొంతం చేసుకుంది.

దేశం	స్కోరు	ర్యాంకు
స్విట్జర్లాండ్	5.81	1
సింగపూర్	5.71	2
అమెరికా	5.70	3
జర్మనీ	5.57	5
జపాన్	5.48	8
తైవాన్, చైనా	5.28	14
ఆంధ్రప్రదేశ్	4.57	36
భారత్	4.52	39
రష్యా	4.51	43
బ్రెజిల్	4.06	81

మురుగు వదులుతోంది

- పట్టణాభివృద్ధికి 2018-19 బడ్జెట్‌లో రూ.7740.80 కోట్లను (గత ఏడాది కన్నా 48.65 శాతం అదనం) కేటాయించారు.
- కేంద్ర ప్రభుత్వం ఆకర్షణీయ నగరాలుగా ఎంపిక చేసిన విశాఖ పట్నం, కాకినాడ, అమరావతి, తిరుపతితో పాటు అదే పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసే శ్రీకాకుళం, ఏలూరు, ఒంగోలు, కర్నూలు, అనంతపురం, నెల్లూరు పట్టణాలకు బడ్జెట్‌లో రూ.800 కోట్లు, నగరపాలక సంస్థల, పురపాలక సంఘాల్లో అన్న క్యాంటీన్ల పథకం అమలుకు రూ.200 కోట్లు కేటాయించారు.
- నగర పంచాయతీలతో పాటు గ్రేడ్-3 పురపాలక సంఘాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా రూ.119 కోట్లు, పట్టణాల్లో మురుగునీటిపారుదల వ్యవస్థ (యూజీడీ)ను మెరుగు పరిచేందుకు రూ.300 కోట్లు, షెడ్యూల్డ్ కులాల ఆవాసాల్లో మౌలిక సదుపాయాలకు రూ.600 కోట్లు, విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా రూ.75 కోట్లు ప్రతిపాదించారు.

ఐటీ మేటి!

రాష్ట్రంలోని ఐటీ, ఎలక్ట్రానిక్స్ యూనిట్లు **487**

ఉద్యోగాల సంఖ్య **44,000**

2014 నుంచి ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వార్షిక వృద్ధి **50%**

'మీ సేవ' కేంద్రాల సంఖ్య **7,400**

లావాదేవీల సంఖ్య **11 కోట్లు**

రాష్ట్రంలో ఆప్టికల్ కేబుల్ పొడవు: **23,000** కి.మీ.

ఇంక్యుబేషన్ స్థలం **40,000** చదరపు అడుగులు

1 నం-1

హైబ్రీడ్ క్లౌడ్, హైబ్రీడ్ స్టేట్ డేటా కేంద్రాన్ని అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం క్రైజాలా, మొబైల్ గవర్నెన్స్ పైలెట్ ప్రాజెక్టును చేపట్టిన మొదటి రాష్ట్రం కృత్రిమ మేధస్సు పరిశ్రమ కోసం ప్రత్యేకంగా 'ఏఐ క్లౌడ్ హబ్ పాలసీ' తెచ్చిన తొలి రాష్ట్రం.

2 ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకతలు

- ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల బహుముఖ విస్తరణకు అనువైన విధానాలు
- టైర్-1 నగరాలతో పోల్చితే అతి తక్కువ వ్యయంతో ఐటీ కార్యకలాపాల నిర్వహణకు వీలు.
- బ్లాక్‌చైన్, ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్... వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని త్వరితంగా అంది పుచ్చుకుంటున్న రాష్ట్రం.

3 సంస్కరణలు

- రాష్ట్రంలో మరో 4 ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్స్, 4 ఐటీ ఎస్ఈజడ్ ఏర్పాటుకు ప్రయత్నాలు.
- 2019 నాటికి కోటి మంది గ్రామీణ ప్రజలను ఐటీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు
- విశాఖపట్టణాన్ని దేశ ఆర్థిక నగరంగా, యానిమేషన్-గేమింగ్ నగరంగా తీర్చిదిద్దే యత్నం.
- రాష్ట్రంలోని ప్రతి గ్రామానికీ ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించే - 'డిజిటల్ ఆంధ్రప్రదేశ్' పథకం.
- ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) రంగం కోసం విజ్ఞాన కేంద్రం ఏర్పాటు.

4 భవిష్యత్తు లక్ష్యాలు

- ఇ- సేవల్లో దేశంలోనే అగ్రస్థానాన్ని సాధించటం.
- 100 ఇంక్యుబేటర్లు, యాక్సలరేటర్ల స్థాపన
- ఐటీలో 2 బిలియన్ డాలర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీలో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడుల సమీకరణ యత్నాలు
- రాష్ట్రాన్ని 'సిలికాన్ కారిడార్ ఆఫ్ ఇండియా'గా తీర్చిదిద్దటం



వ్యవసాయ బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టేందుకు వెళ్తున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో మహిళా ప్రతినిధులు

సంతోషాంధ్ర

"ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆనందమే ప్రభుత్వ సర్వోన్నత లక్ష్యం. ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లోనూ ప్రజల సుఖ సంతోషాలే ముందు వరుసలో ఉంటాయి" - ముఖ్యమంత్రి చంద్రబాబు

- ప్రపంచ ప్రజల సుఖ సంతోషాల్ని ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి పరిష్కారాల నెట్‌వర్క్(ఎస్‌డీఎస్ఎన్) ఏటా అంచనావేస్తుంది. వాటిని 'ప్రపంచ సంతోష నివేదిక'లో ప్రచురిస్తుంది.

సంతోష నివేదికలో

ఆంధ్రప్రదేశ్ స్థానం **74** స్కోరు **5.36** (జోర్డాన్‌తో సమానం)

భారతదేశం స్థానం **122** స్కోరు **4.31**

సంతోష ర్యాంకుకు ఆధారం

- జీడీపీ
- దయాగుణం
- సామాజిక మద్దతు
- వ్యాపారం
- ప్రభుత్వాల్లో అవినీతి
- జీవన విధానంలో స్వేచ్ఛ...



- 2017లో రాష్ట్ర ప్రభుత్వం 'సంతోష శాఖ'ను ఏర్పాటు చేసింది. మధ్యప్రదేశ్ తర్వాత ఇలాంటి శాఖను ఏర్పాటుచేసిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశే!

రూ.5235 కోట్ల మిగులు సాధ్యమేనా?

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ తర్వాత తొలిసారి ఆర్థిక మంత్రి యనమల రెవెన్యూ మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రెవెన్యూ ఖర్చుల కన్నా రెవెన్యూ ఆదాయం ఎక్కువగా ఉంటుందని లెక్కిస్తున్నారు. కేంద్రంతో తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ స్థాయి రెవెన్యూ ఆదాయం సాధ్యమవుతుందా? అన్న ప్రశ్న ఇప్పటికీ వేధిస్తూనే ఉన్నా రూ.5235.23 కోట్ల మిగులు బడ్జెట్‌ను 2018-19 సంవత్సరానికి శాసనసభలో ప్రతిపాదించారు. కొత్త రాష్ట్రం ఏర్పడ్డాక అంచనాలను, వాస్తవ లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే ఎప్పుడూ మిగులు దక్కింది లేదు. పైగా రెవెన్యూలోటు బడ్జెట్ అంచనాలను మించిపోయింది.

రెవెన్యూ లోటు, రెవెన్యూ మిగులు అంటే...!

రెవెన్యూ ఖర్చుకు, రెవెన్యూ ఆదాయానికి మధ్య ఉన్న తేడాయే లోటు లేదా మిగులు. రెవెన్యూ ఖర్చు కన్నా రెవెన్యూ ఆదాయం ఎక్కువగా ఉంటే అది మిగులుగా లెక్కిస్తాం. అదే ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువయితే లోటుగా పరిగణించాల్సి ఉంటుంది.

రెవెన్యూ ఆదాయం అంటే: అన్ని రకాల పన్నులు, పన్నేతర రూపంలో వచ్చే ఇతర ఆదాయాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు కలిపితే రెవెన్యూ ఆదాయం అవుతుంది.


రెవెన్యూ ఖర్చు: ప్రభుత్వం రోజువారీ నిర్వహణకు అయ్యే ఖర్చు, వడ్డీల చెల్లింపులు, రహదారులు, కాలువలు, ఇతరత్రా మరమ్మతులకు చేసే ఖర్చు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సందర్భంలో చేసే సహాయ ఖర్చులన్నీ ఇందులోకి వస్తాయి.

అంచనాలకు...వాస్తవాలకు తేడా ఇలా..


2014-15లో రూ.6063 కోట్ల రెవెన్యూ లోటుగా అంచనావేశారు. అదే 2015-16కు వచ్చేసరికి రూ.7,300 కోట్లు రెవెన్యూ లోటుగా లెక్కించారు. 2016-17లో రెవెన్యూ లోటు రూ.4868 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఆ తర్వాత 4,597 కోట్లకు సవరించారు. వాస్తవ లెక్కలు తేలేసరికి ఇది ఏకంగా రూ.17,193 కోట్ల లోటుగా తేలింది. అదే సమయంలో 2017-18 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు కేవలం రూ.415 కోట్లుగానే లెక్కించారు. ప్రస్తుతం సవరించిన అంచనాల మేరకు అది ఏకంగా రూ.4018 కోట్లకు చేరింది. వాస్తవ లెక్కలు తేలేసరికి అది ఏ స్థాయికి ఉంటుందో చూడాలి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం రూ.5235 కోట్ల రెవెన్యూ మిగులుగా చూపిస్తూ బడ్జెట్ ప్రవేశపెట్టారు. మరోవైపు రెవెన్యూ ఆదాయాల్లో 33,929 కోట్లు కేంద్ర నుంచి పన్నుల్లో వాటాగా దక్కుతుందని లెక్కించారు. నిజానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది కేవలం రూ.29వేల కోట్లు మాత్రమే ఉన్నట్లు సవరించిన అంచనాలు పేర్కొంటున్నాయి. పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా ప్రస్తుత సంవత్సరం సవరించిన అంచనాలతో పోలిస్తే రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఏకంగా 12 వేల కోట్లు పెంచి చూపించారు. పన్నేతర ఆదాయమూ రూ.1200 కోట్ల మేర పెంచి చూపించారు. అదే సమయంలో రెవెన్యూ వ్యయమూ అంచనాలకు మించి పెరిగే అవకాశమే కనిపిస్తోంది.

గతిశీల ఆర్థిక వ్యవస్థ

రాష్ట్ర విభజన తర్వాత ప్రణాళికా బద్ధ ద్రవ్య నిర్వహణపై ప్రభుత్వం దృష్టిపెట్టడం వల్ల దీర్ఘకాలిక రుణాలు, రెవెన్యూలోటు, ద్రవ్యలోటు బాగా తగ్గాయి. జీఎస్‌డీపీలో లోటు శాతాల తీరు ఇలా...



ప్రసంగంలో పెద్దల మాట



"మొక్క తాలూకూ ఫలాలు తన కోసం కాదని తెలిసీ నాటేవాడే జీవిత పరమార్థాన్ని క్రమంగా అర్థంచేసుకోగలుగుతాడు"

-రవీంద్రనాథ్ ఠాగూర్

విజన్ 2029కీలక లక్ష్యాలు

- **సమ్మిళిత ఆర్థిక వృద్ధి** 12%
- **సంచిత పెట్టుబడుల అంచనా** రూ.84 లక్షల కోట్ల నుంచి రూ.97 లక్షల కోట్ల మధ్య
- **మానవాభివృద్ధి సూచీ** 0.9 విలువకు పైగా..
- **ప్రపంచ పోటీ సూచీలో** తొలి 15 దేశాల్లో ఒకటిగా..
- **ఉపాధి** 1.44 కోట్ల అదనపు ఉద్యోగాల సృష్టి.




ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమగ్రస్వరూపం (రూ.కోట్లలో)

వివరం	2016–17 వాస్తవ గణాంకాలు	2017–18 బడ్జెట్ అంచనాలు	2017–18 సవరించిన అంచనాలు	2018–19 బడ్జెట్ అంచనాలు
ఎ. ప్రారంభ నిల్వ	–414.85	–447.84	–231.57	–3,193.88
బి. రెవెన్యూ వసూళ్లు	98,984.48	1,25,495.81	1,23,254.01	1,55,507.22
1. కేంద్ర పన్నుల్లో వాటా	26,263.81	29,138.82	29,001.26	33,929.85
2. పన్ను ఆదాయం	44,181.45	53,716.99	52,715.92	65,535.00
3. పన్నేతర ఆదాయం	5,192.84	5,092.00	3,988.82	5,346.60
4. గ్రాంట్లు	23,346.38	37,548.00	37,548.00	50,695.77
సి. మూలధన వసూళ్లు	67,897.48	31,491.74	32,885.93	35,552.49
5. బహిరంగ మార్కెట్ రుణాలు	20,783.26	26,819.60	25,800.00	29,605.06
6. స్వల్పకాలిక రుణాలు	29,154.16	1,500.00	1,500.00	1,500.00
7. కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు	814.25	0.00	1,500.00	1,000.00
8. ఇతర రుణాలు	9,170.98	1,700.00	1,700.00	1,356.00
9. డిపాజిట్లు, లావాదేవీలు (నికరం)	5,945.37	1,032.14	1,945.93	1,591.43
10. రుణాలు, అడ్వాన్సులు	2,029.49	440.00	440.00	500.00
11. ఇతర వసూళ్లు				
12. కంటింజెన్సీ నిధి	–0.05			
డి. మొత్తం వసూళ్లు	1,66,881.96	1,56,987.56	1,56,139.94	1,91,059.72
ఇ. రెవెన్యూ వయం	1,16,178.21	1,25,911.62	1,27,272.01	1,50,271.99
13. ఇందులో వడ్డీ చెల్లింపులు	11,697.36	14,782.52	14,756.17	15,076.83
ఎఫ్. మూలధన వ్యయం	15,180.76	21,959.35	22,875.28	28,678.48
జి. రుణాలు, అడ్వాన్సులు	563.82	1,119.28	1,149.98	1,261.96
హెచ్. మూలధన చెల్లింపులు	34,775.89	8,009.13	8,524.96	10,851.16
ఐ. మొత్తం వ్యయం	1,66,698.69	1,56,999.39	1,59.822.25	1,91,063.60
జె. ముగింపు నిల్వ	–231.57	–459.67	–3,913.88	–3,917.77
కె. రెవెన్యూ లోటు/ మిగులు (బి-ఇ)	–17,193.72	–415.80	–4,018.00	5,235.23
ఎల్. ద్రవ్యలోటు	–30,908.82	–23,054.44	–27,603.27	–24,205.21
ఎం. ప్రాథమిక లోటు	–19,211.45	–8,271.91	–12,847.10	–9,128.37

సమర్థవంతమైన పరిపాలనే లక్ష్యంగా ప్రభుత్వం వినూత్నమైన రీతిలో అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో 'ఆర్‌టీజీ' కేంద్రాన్ని నెలకొల్పింది. ప్రభుత్వ పథకాల అమలు తీరు నుంచి భూగర్భ జలాల లభ్యత, వాతావరణ పరిస్థితులు, ముఖ్యమైన సంఘటనలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించటం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం.

- 'ఇ-ప్రగతి' పేరుతో నెలకొల్పిన రాష్ట్రవ్యాప్త 'ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్చర్'- 33 ప్రభుత్వ శాఖలు, **315** విభాగాలు, **745** సేవల తీరుతెన్నులను పర్యవేక్షిస్తుంది.
- వివిధ విభాగాల పరిపాలనా వ్యవహారాలను ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కీలకంగా పని చేస్తున్న 'కోర్' (చీఫ్ మినిస్టర్స్ ఆఫీస్ రియల్‌టైమ్ ఎగ్జిక్యూటివ్) డ్యాష్‌బోర్డు దేశవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. నీతిఆయోగ్ దీన్ని అభినందించటమే కాదు, ఇతర రాష్ట్రాలూ అనుసరిస్తే మేలని సూచించింది.

పాలన.. వేలికొసన!



- ఆసియాలోని అతిపెద్ద కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం.
- 13 జిల్లాల కేంద్రాలతో సంపూర్ణ అనుసంధానం.
- రాష్ట్రవ్యాప్తంగా 25,000 కి.మీ. ఫైబర్‌గ్రిడ్ ద్వారా ఆర్‌టీజీసీ పర్యవేక్షణ

ఆర్‌టీజీ పర్యవేక్షణలో ఇంకేం తెలుస్తాయి?

- సెన్సార్ల ద్వారా భూగర్భ జలాల పర్యవేక్షణ
- వాతావరణ పరిస్థితులపై అంచనా
- రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి లభ్యతపై పర్యవేక్షణ
- ఈ– ఔషధి
- బయోమెట్రిక్, ఐరిస్ ద్వారా ఎన్టీఆర్ భరోసా పథకం అమలు తీరుతెన్నులపై నిఘా
- వీధి దీపాల నిర్వహణపై పర్యవేక్షణ
- పోలీసు సీసీ కెమేరాలు
- మొబైల్ అప్లికేషన్ ద్వారా గ్రామీణాభివృద్ధి కార్యకలాపాల నిర్వహణ



ఆర్థికంగా ముందడుగులు

ఎగుమతుల్లో పురోగమనం



- ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్‌ది తొమ్మిదో ర్యాంకు. మొత్తం ఎగుమతుల్లో **2.80%** వాటా. **2016-17**లో మొత్తం ఎగుమతులు రూ.**80460** కోట్ల డాలర్లు.
- సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్‌ది కీలక పాత్ర.
- వివిధ రంగాలకు సంబంధించి రాష్ట్రంలో **23** ప్రత్యేక ఆర్థిక మండళ్లు(సెజ్‌లు) పనిచేస్తున్నాయి.
- వాహనాలు, విమాన, నౌక, తత్సంబంధిత రవాణా పరికరాల ఎగుమతులు ఏపీ నుంచి ఎక్కువగా జరుగుతాయి.

ఆర్థిక వృద్ధికి నూతన జవసత్వాలు



- గత రెండేళ్లుగా రాష్ట్రంలో సగటు జీఎస్‌డీపీ వృద్ధిరేటు **11.28%** నమోదవుతోంది.
- **2016-17** ఆర్థిక సంవత్సరంలో దాదాపు **57** పెద్ద, మెగా పారిశ్రామిక ప్రాజెక్టుల ఏర్పాటు. **23,756** మందికి ఉపాధి కల్పన. వ్యవస్థీకృత రంగంలో **9,900** సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుచేసి.. **1,07,609** మందికి ఉపాధి కల్పన.
- ప్రైవేటు నిర్మాణ సంస్థల సహకారంతో ప్రభుత్వం 'ఆర్థిక నగరాల్ని' నిర్మిస్తోంది. విద్య, ఆరోగ్యం, షాపింగ్, వినోదాల విషయంలో స్వయం సమృద్ధిని సాధించేలా ఇవి ఉంటాయి.
- శిక్షణ పొందిన మానవ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయి.

పెట్టుబడులకు ఊతం

గత మూడున్నరేళ్లలో రాష్ట్రానికి హామీగా లభించిన రూ.**1,31,500** కోట్ల పెట్టుబడులతో ఇప్పటికే వివిధ రంగాల్లో ఉత్పత్తి మొదలయింది. మరో రూ.**3,14,200** కోట్ల పెట్టుబడులు పురోగమన దశలో ఉన్నాయి. ప్రపంచంలోని అనేక దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి.



ఉరకలేస్తున్న వృద్ధి

ఈనాడు – అమరావతి

అవరోధాలు అధిగమిస్తూ అడుగులేస్తున్న ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, సేవల రంగాల్లో సానుకూల ఫలితాలు సాధిస్తోంది. తలసరి ఆదాయంలో మెరుగైన వృద్ధి కనబరుస్తోంది. అసమానతలను తొలగించి ప్రజలకు ఆరోగ్యం, సంపద, మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరాన్ని 'సామాజిక ఆర్థిక గణన-2017-18' గుర్తు చేసింది. ఈ నివేదికను ప్రభుత్వం గురువారం శాసనసభలో ప్రవేశపెట్టింది. రంగాలవారీ ప్రాధాన్యంలో భాగంగా వ్యవసాయంలో కరవునివారణ చర్యలను వివరించింది. సంక్షేమానికి ఏటా రూ.60వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ప్రతి కుటుబానికి రూ.10వేల ఆదాయం అందించే పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది.

రాష్ట్ర తలసరి ఆదాయం


2015–16	రూ.1,07,276
2016–17	రూ.1,23,664
2017–18(అంచనా)	రూ.1,42,054

2017-18 జీవీఏ అంచనాలు

(రంగాల వారీగా రూ.కోట్లలో)

సంవత్సరం	వ్యవసాయం	పారిశ్రామికం	సేవలు
2015-16	1,20,927	1,22,588	2,02,688
2016-17	1,38,957	1,31,657	2,21,760
2017-18	1,63,635	1,42,837	2,41,967

- ప్రభుత్వం ఈ ఏడాది 2,358 డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేస్తోంది. 3,500 పాఠశాలల్లో వర్చువల్ తరగతులను అంతర్జాల సౌకర్యంతో అందుబాటులోకి తెస్తోంది.
- 2016-17 ఖరీఫ్‌లో 39.70లక్షల హెక్టార్లలో సాగవ్వగా.. 2017-18 ఖరీఫ్‌లో 40.72లక్షల హెక్టార్లలో పంటలు వేశారు. 2016-17లో 149.16లక్షల టన్నులు పండించగా ఈ ఏడాది అంచనా 157.59 టన్నులు.
- కర్నూలు జిల్లా తంగెడంచలో 579 ఎకరాల విస్తీర్ణంలో రూ.650కోట్ల వ్యయంతో మెగాసీడ్ పార్కు ఏర్పాటు చేస్తున్నారు.



- రాష్ట్రంలో మత్స్యరంగం 14.5లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. 2017-18లో దేశం నుంచి రొయ్యల ఎగుమతిలో తొలిస్థానం, ఉత్పత్తిలో 70శాతం వాటా రాష్ట్రానిదే. కోడిగుడ్ల ఉత్పత్తిలో రూ.1,582.74కోట్లతో రెండోస్థానం. మాంసం ఉత్పత్తిలో 4, పాల ఉత్పత్తిలో 5వస్థానం మనదే.
- పట్టణ ప్రజలకు ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఎన్టీఆర్ వైద్యపరీక్షలు, చంద్రన్న సంచార చికిత్స, జాతీయ ఉచిత డయాలసిస్, ఆరోగ్య ఏటీఎంలు, ముఖ్యమంత్రి బాల స్వస్థ్య భరోసా, స్వస్థ్య విద్యా వాహిని పథకాలను ప్రారంభించారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా 14.08లక్షల మందికి శస్త్రచికిత్సలు చేశారు.
- చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహమిచ్చేందుకు రూ.100కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు. 13 శాఖలకు సంబంధించి 1,946 చిన్న, పెద్ద పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదిరాయి.

1 పండ్లు, సుగంధద్రవ్యాల ఉత్పత్తిలో ఏపీది మొదటిస్థానం మిర్చి, కోకో, నిమ్మ, ఆయిల్‌పామ్, బొప్పాయి, టమోటా ఉత్పాదకతలోనూ తొలి స్థానం

- జీడిమామిడి, మామిడి, బత్తాయిలో రెండో స్థానంలో నిలిచింది. **2**

వాణిజ్యం.. ఎగుమతులు


రాష్ట్రం నుంచి ఎగుమతులు: ఆక్వా, వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాణాధార మందులు, ఖనిజాలు, ఖనిజ ఉత్పత్తులు, సాఫ్ట్‌వేర్

సంవత్సరం	ఎగుమతులు (విలువ రూ.కోట్లలో)
2016-17	80,559.87
2017-18(నవంబరు వరకు)	50,404.75

- రూ.లక్ష వరకు పంటరుణాలకు వడ్డీలేని రుణాల పథకం కింద 2016-17లో రూ.249.48కోట్లు చెల్లించారు. రూ.3లక్షల లోపు పంట రుణం తీసుకుని ఏడాదిలోగా చెల్లించిన వారికి పావలా వడ్డీ కింద రూ.5.43కోట్లు జమ చేశారు. 2017-18లో ఇప్పటిదాకా వడ్డీలేని రుణాల కింద రూ.128.41కోట్లు, పావలా వడ్డీ కింద రూ.3.45కోట్లు అందజేశారు.
- చంద్రన్న చేయూత ద్వారా 87 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రూ.8,604 కోట్ల పంపిణీ


జాతీయంకన్నా ఎక్కువే!

సుస్థిర కృషి, వినూత్న విధానాల వల్ల రాష్ట్రం రెండంకెల వృద్ధిరేటును సాధిస్తూ వస్తోంది. ఇది జాతీయ సగటుకన్నా ఎక్కువగానే ఉంది. ప్రభుత్వ ప్రత్యేక వ్యూహాలు రెండంకెల అభివృద్ధి సాధన దిశగా విజయవంతమైన ఫలితాలు ఇచ్చాయి. గత మూడేళ్లలో ఏపీ వృద్ధిరేటు సగటున 10.96 శాతం నమోదవ్వగా, భారత ఆర్థిక వ్యవస్థ 7.31 శాతం మాత్రమే ఉంది.



తలసరి ఆదాయం పెరిగింది

ఆదాయ వనరులు తక్కువ.. ఉపాధిఅవకాశాలు అంతంతమాత్రం.. ఉద్యోగాలివ్వగలిగే సంస్థలూ పెద్దగా లేవు.. ఇదీ రాష్ట్ర విభజన నాటికి ఆంధ్రప్రదేశ్ పరిస్థితి. కానీ నవ్యాంధ్రప్రదేశ్ నాలుగేళ్లలోనే ఆదాయార్జన దిశగా బలమైన అడుగులు వేసింది. రాష్ట్రంలో తలసరి ఆదాయం నాలుగేళ్లలో దాదాపు 50 శాతం పెరిగింది. జాతీయ సగటుతో పోల్చినా తలసరి ఆదాయం ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉంది.



(స్థిర ధరల ప్రకారం– మూలం=2011–12)

ఈ 5 ఏళ్లలో 'రెట్టింపు'!

- **లక్ష కోట్ల నుంచి 2 లక్షల కోట్ల దిశగా బడ్జెట్..**
- **అంచనాలకు మించి వాస్తవ ఖర్చు**

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ తర్వాత కొత్త రాష్ట్రం అనేక ఆపసోపాలు పడుతూ ముందుకు సాగుతోంది. ఈ స్థితిలోనూ రాష్ట్ర బడ్జెట్ స్వరూపం పెరుగుతూ వస్తోంది. 2014-15లో (నవ్యాంధ్ర తొలి ఆర్థిక సంవత్సరం)లో రూ.1,11,824 కోట్ల బడ్జెట్ అంచనాతో కొత్త ప్రయాణం మొదలు కాగా.. రానున్న ఆర్థిక సంవత్సరానికి ఈ మొత్తం రూ.1,91,063 కోట్లకు చేరింది. అలానే 2018-19లో దాదాపు రూ.5,235 కోట్ల మేర రెవెన్యూ మిగులు ఉంటుందని యనమల అంచనా సమర్పించారు. రెవెన్యూ ఆదాయం 1.55 లక్షల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో వాస్తవ ఖర్చు అంచనాలను మించినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

రాష్ట్ర బడ్జెట్ స్వరూపం.. ఖర్చు ఇలా

2014–15: ప్రణాళికా వ్యయం రూ.32,730 కోట్లు కాగా, ప్రణాళికేతర వ్యయం రూ.1,05,719 కోట్లుగా నమోదైంది. మొత్తం మీద రూ.1.38 లక్షల కోట్ల మేర బడ్జెట్ ఖర్చు జరిగింది.

2015–16: రూ.1,13,048 కోట్ల అంచనాతో బడ్జెట్ ప్రవేశపెట్టగా.. రూ.1,49,000 కోట్లకు పైగా ఖర్చు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.88,647 కోట్ల రెవెన్యూ ఆదాయం సాధించారు. మూలధన వసూళ్లు రూ.60,953 కోట్లుగా నమోదయ్యాయి.

2017–18: బడ్జెట్ అంచనా రూ.1,56,999 కోట్లు కాగా.. ప్రస్తుతానికి సవరించిన బడ్జెట్ రూ.1,59,822 కోట్లుగా లెక్క కట్టారు. వాస్తవ ఖర్చు ఎంతో వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికే తేలుతుంది.

బడ్జెట్ స్వరూపం.. (రూ.కోట్లలో)

సంవత్సరం	అంచనా	వాస్తవ ఖర్చు
2014-15	1,11,824.00	1,38,449.60
2015-16	1,13,048.98	1,49,434.96
2016-17	1,35,688.99	1,66,698.69
2017-18	1,56,999.39	1,59,822.25 (సవరించిన అంచనాలు)
2018-19	1,91,063.60	--

సర్వే చెప్పిన సంగతులు

- ★ 2017-18లో జీఎస్‌డీపీ పెరుగుదల రేటు 11.22 శాతం. రాష్ట్ర పన్నుల ఆదాయం రూ.52,717 కోట్లు
- ★ 2018లో నిర్వహించిన మూడో భాగస్వామ్య సదస్సులో 737 ఎంవోయూలు, 4.39 లక్షల కోట్ల పెట్టుబడులు, 11 లక్షల ఉద్యోగాలు
- ★ 2017-18 డిసెంబర్ నాటికి ఐటీ రంగంలో ఉద్యోగాల కల్పన 43,987
- ★ రాష్ట్రంలో పేదరికం 9.2 శాతం (దేశంలో 21.92 శాతం)
- ★ ఎల్‌పీజీ కనక్షన్లలో ఏపీదే తొలిస్థానం. 2017-18లో 12.46లక్షల కనక్షన్లు ఇచ్చారు.
- ★ గతేడాది 95.36 లక్షలుగా ఉన్న వాహనాలు ఇప్పుడు 103.58 లక్షలకు చేరాయి.
- ★ చౌకదుకాణాల్లో ఈ-పోస్ యంత్రాల అమలుతో రూ.1525.87 కోట్లు మిగులు.
- ★ ఎన్టీఆర్ భరోసా కింద 58లక్షల మంది పింఛన్లు తీసుకుంటున్నారు. ప్రధానమంత్రి-చంద్రన్నబీమా పథకంలో 2.46కోట్లమంది నమోదయ్యారు.

బడ్జెట్ ముఖ్యాంశాలు (రూ.కోట్లలో)

మొత్తం బడ్జెట్	1,91,064
రెవెన్యూ వ్యయం	1,50,272
మూలధన వ్యయం	28,678
రుణ చెల్లింపులు	10,851
మొత్తం రెవెన్యూ వసూళ్లు	1,55,507
కేంద్రం నుంచి వచ్చేవి	
కేంద్రపన్నుల్లో వాటా	33,930
గ్రాంట్లు	50,696
రాష్ట్ర పన్నుల ద్వారా ఆదాయం	65,535
అమ్మకపుపన్ను	38,448
ఎక్సైజ్	7,357
మోటర్, వాహన పన్ను	3,687
స్టాంపులు, రిజిస్ట్రేషన్	4,880
రాష్ట్ర పన్నేతర ఆదాయం	5,346
గనులు, ఖనిజాలు	2,500
అటవీ	600
రెవెన్యూ మిగులు అంచనా	5,235
ద్రవ్య లోటు అంచనా	–24,205
రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)	8,70,330

రెవెన్యూ వ్యయం	
జీతాలు	39,121
పింఛన్లు	15,427
వడ్డీ చెల్లింపులు	15,076
వేతనేతర	7,387
నిర్వహణ	1,604
రాయితీలు, గ్రాంట్లు	
రైతులకు రుణ రాయితీలు	4,100
విద్యుత్తు రాయితీ	2,500
ధాన్యం రాయితీ	3,140
సంక్షేమ పథకాలు	
ఎస్సీ కాంపొనెంట్	11,228
ఎస్టీ "	4,177
బీసీ "	12,200
కాపు సంక్షేమం	1000
ఈబీసీ సంక్షేమం	700
బ్రహ్మణ సంక్షేమం	75
మైనార్టీల సంక్షేమం	1,102
ఆర్యవైశ్యుల సంక్షేమం	30



బడ్జెట్ 2018-19

వైమానిక రంగం.. వేగం.. వేగం..

- 2017-18 లో 38 లక్షల మంది విమాన ప్రయాణికులతో.. దేశంలోనే అత్యధిక వృద్ధి రేటు
- రూ. 88.50 కోట్లతో కర్నూలు వద్ద ఓర్వకల్లులో విమానాశ్రయం అభివృద్ధి పనులు షురూ.
- విశాఖపట్టణం, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి విమానాశ్రయాల్లో సామర్థ్య పెంపు సన్నాహాలు.
- భోగాపురం, దగదర్తిలో నూతన విమానాశ్రయాల నిర్మాణానికి సన్నాహాలు.
- 2019 నాటికి రాష్ట్రంలోని వివిధ విమానాశ్రయాల ద్వారా 50 లక్షల మంది ప్రయాణించే ఏర్పాట్లు.

ప్రసంగంలో పెద్దల మాట

సమానత్వం అనేది ఆదర్శం కావొచ్చు.. ఏదేమైనా దీన్ని పాలనాసూత్రంగా ప్రతి ఒక్కరూ అంగీకరించాల్సిందే

-అంబేడ్కర్



అప్పుల కుప్ప ఆంధ్రప్రదేశ్!

వచ్చే ఆర్థిక సంవత్సరం చివరకు అప్పుల భారం 2.49 లక్షల కోట్లకు...

ఆంధ్రప్రదేశ్ అప్పుల ఊబిలోకి జారుకుంటోంది. ఏటా రాబడుల కన్నా ఖర్చులు పెరుగుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వం అప్పులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇవి కూడా అంచనాలను మించిపోతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 2,49,435 కోట్లకు ఈ అప్పుల భారం చేరుతుందని అంచనా వేశారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని దాటి రుణాలు సంపాదించే క్రమంలో కొత్త మార్గాలు అన్వేషిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తోంది. ఇందుకోసం కార్పొరేషన్‌లకు అప్పులు తీసుకునేందుకు మంత్రిమండలిలో ఆమోదం పొంది... వాటి పరిమితిని పెంచి బ్యాంకుల నుంచి రుణాలు పొందుతోంది. ఆ రుణాలను పీడీ ఖాతాలకు రప్పిస్తూ అక్కడి నుంచి ప్రభుత్వం తీసుకుని వ్యయం చేస్తోంది.

రాష్ట్రోత్పత్తితో పోలిస్తే హెచ్చు తగ్గులే...

రాష్ట్ర అప్పులను రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తితో పోల్చి చూస్తుంటారు. ఆ రకంగా చూస్తే రాష్ట్ర అప్పుల వాటా తగ్గుతూ... ఎగబాకుతూ వస్తోంది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో 28.25 శాతానికి ఇది పరిమితమవగా... ఆ తర్వాత 28.50 శాతానికి, 2016-17 సంవత్సరంలో ఇది గరిష్ఠంగా 28.79శాతానికి చేరింది. 2017-18లో సవరించిన అంచనాలను పరిశీలిస్తే మళ్లీ అప్పుల భారం స్థూల ఉత్పత్తితో పోలిస్తే కొంత తగ్గింది. అది 28.40శాతానికి చేరింది. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మరికొంత పెరిగి 28.66శాతం వద్దకు చేరుతుందని ఆర్థిక శాఖ అంచనాలు రూపొందించింది.

ప్రభుత్వంపై ఉన్న రుణభారం వివరాలు (రూ. కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	బహిరంగ మార్కెట్	కేంద్రం నుంచి	ఇతర సంస్థల నుంచి	చిన్నమొత్తాల పొదుపు నుంచి	పీఎఫ్, డిపాజిట్లు, రిజర్వు నిధులు	మొత్తం (రూ.కోట్లలో)
2014–15	78440.87	9500.31	6316.87	15166.75	39318.65	1,48,743.45
2015–16	94925.71	8957.90	4854.56	15923.94	49191.49	1,73,853.60
2016–17	112630.20	9025.33	13360.58	14792.12	51505.81	201314.04
2017–18 (స.అంచనాలు)	134550.09	9283.21	14369.48	13579.68	53,450.77	2,25,234.04
2018–19 అంచనాలు	157779.19	9218.10	15028.63	12367.24	55042.21	2,49,435.37

రెవెన్యూలోటు సర్దుబాటు కాలేదు

ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత రాష్ట్ర రెవెన్యూ లోటును కేంద్రం భర్తీ చేయాల్సి ఉంది. 2014-15లో రాష్ట్రం రెవెన్యూ లోటును రూ.16079 కోట్లుగా లెక్కించింది. దానిని కేంద్రం భర్తీ చేయాలని కోరింది. ఈ విషయంలో ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సరైన పొంతన లేదు. రాష్ట్రం ఏ ఆధారాలు చూపి అడుగుతున్నా...ఇక్కడి నుంచి ఆర్థికశాఖ అధికారులను పంపి చర్చలు జరిపినా ఫలితం రాలేదు. రాష్ట్రానికి సంబంధించి రావాల్సిన రెవెన్యూ రాబడులను పరిగణనలోకి తీసుకుని ఏర్పడిన లోటును భర్తీ చేస్తామని.... పింఛన్లు, రుణమాఫీ, పీఆర్సీ బకాయిలతో తమకు సంబంధం లేదని కేంద్రం చెబుతోంది.

ఉద్యోగుల జీతాలకూ ఇబ్బందులే!

కేంద్రం నుంచి రాష్ట్రానికి పన్నుల వాటా ఆశించిన సమయంలో రాకపోవడం, ప్రతి నెలా ఒకటో తేదీ నాటికి చెల్లింపుల భారం రాష్ట్రంపై ఎక్కువగా ఉండటంతో ఉక్కిరిబిక్కిరవుతున్న పరిస్థితులున్నాయి. ఒక్కోసారి ఉద్యోగుల జీతభత్యాలు, బిల్లుల చెల్లింపులకూ సమస్యలు ఎదురవుతున్నాయి. సిబ్బంది జీతాలు, సామాజిక, ఇతర పింఛన్లు, ఇతరత్రా రాయితీల కోసమే ప్రతి నెలా రూ.4500 కోట్లు సర్దుబాటు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మరో వైపు అప్పులకు ప్రతి నెలా వడ్డీలు చెల్లించాలి. ఈ ఆర్థిక సంవత్సరంలో నికర రుణాలు దాదాపు రూ.24 వేల కోట్ల వరకు ఉన్నట్లు లెక్కిస్తున్నారు.

పౌర సరఫరాల శాఖకు కేటాయింపులు, ఖర్చు తీరు.. (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2014-15	2232	2204
2015-16	2715	2518
2016-17	2769	2560
2017-18	2800	3341

సంక్రాంతి కానుకలు, తోఫాలు

పౌర సరఫరాల శాఖ 2015లో తెల్లకార్డుదారులకు 'సంక్రాంతి' కానుకనిచ్చింది. అప్పట్నుంచి యేటా ఈ కానుకలను కొనసాగిస్తోంది. ముస్లింకు రంజాన్ తోఫా, క్రిస్టియన్లకు క్రిస్మస్ కానుక అందిస్తోంది. చౌకధర దుకాణాల్లో ఇ-పాస్ యంత్రాల్ని ఏర్పాటు చేసింది. ఈ అదనపు ఖర్చుల కారణంగా ఈ శాఖకు రూ.1800 కోట్ల బకాయిలున్నాయి.

- చక్కెరపై కేంద్రం రాయితీని ఉపసంహరించుకున్న నేపథ్యంలో ఈ ఏడాది జనవరి నుంచి రాష్ట్రం ఏటా రూ.250 కోట్ల మేర ఖర్చు భరించి చక్కెరను రాయితీపై పంపిణీ చేస్తోంది.
- 2018 మార్చి నుంచి కందిపప్పు, శనగపప్పు ఒక్కో కార్డుకు నెలకు కేజీ (రూ.40) చొప్పున పంపిణీ ప్రారంభించింది.

పౌరసరఫరాల శాఖకు రూ.3495 కోట్లు

ఈనాడు అమరావతి: పౌరసరఫరాల శాఖకు 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ. 3495 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.3వేల కోట్లు కేవలం బియ్యం రాయితీకే ఇచ్చారు. నిత్యావసర సరకుల ధరల స్థిరీకరణకు పౌరసరఫరాల సంస్థకు అదనపు కేటాయింపులను ప్రతిపాదించినా ఎంతమొత్తమనేదీ ప్రకటించలేదు. 100 శాతం గ్యాస్ లక్ష్య సాధనలో భాగంగా ఎస్సీ, గిరిజన ప్రాంతాల్లోని పేదలకు రాయితీపై మిగిలిపోయిన గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేసేందుకు బడ్జెట్‌లో ఆమోదం తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి కందిపప్పు, శనగపప్పును రాయితీపై పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా కేవలం కందిపప్పు కోసం రూ.270 కోట్ల మేర వ్యయం కానుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. వీటికి అదనపు నిధులు తర్వాత ప్రభుత్వం కేటాయిస్తుందా...ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ నుంచే సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుందా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

బీసీల సంక్షేమానికి రూ.6,210 కోట్లు

- **కాపులకు వెయ్యి కోట్లు**

వెనుకబడిన తరగతుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.6,210.63 కోట్లు కేటాయించారు. ఈ ఏడాది (2017-18) బడ్జెట్ కేటాయింపు కంటే ఇది 23 శాతం ఎక్కువ. **వివిధ వర్గాలకు కేటాయింపులు:** కాపు సంక్షేమానికి రూ.1,000 కోట్లు

- వివిధ కులాల సమాఖ్యలకు రూ.550 కోట్లు
- ఆదరణకు రూ.750 కోట్లు
- వైశ్యుల సంక్షేమానికి: రూ.30 కోట్లు
- విద్యార్థులకు బోధన ఫీజుల చెల్లింపు, ఉపకార వేతనాల పంపిణీ, ఎన్టీఆర్ విద్యోన్నతి, విదేశీ విద్య కార్యక్రమాలకు: రూ.1246.20 కోట్లు
- చందన్న పెళ్లి కానుకకు: రూ.100 కోట్లు.

రుతు రుమాళ్ల పంపిణీకి రూ.127 కోట్లు

ఈనాడు అమరావతి: స్త్రీ, శిశు, కౌమార బాలికలు, వికలాంగులు, హిజ్రాల సంక్షేమానికి రూ.3,008 కోట్లు కేటాయించారు. కౌమార విద్యార్థినులకు రుతు రుమాళ్ల (శానిటరీ నాప్‌కిన్) అందించేందుకు తొలిసారిగా రూ.27 కోట్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఇతర కౌమార బాలికలకు నాప్‌కిన్‌లు ఇచ్చేందుకు మరో రూ. 100 కోట్లు ప్రతిపాదించారు. 'సబల' పథకాన్ని ప్రస్తుతం ఉన్న 4 జిల్లాల నుంచి మరో 6 జిల్లాలకు విస్తరించారు. దీనికోసం రూ.60 కోట్లు ప్రతిపాదించారు. దివ్యాంగుల సంక్షేమానికి రూ.121 కోట్లు, హిజ్రాల సంక్షేమానికి రూ.20 కోట్లు కేటాయించారు.

క్రీడలకు 42% పెంపు

క్రీడలకు కేటాయింపులు 42 శాతం పెరిగాయి. గతేడాది రూ.211కోట్లు కేటాయించగా ఇప్పుడు రూ.300 కోట్లకు పెంచారు. ప్రధానంగా వ్యాయామ విద్యకు రూ.50 కోట్లు ప్రతిపాదించారు.

పేద బీసీ విద్యార్థులకు విదేశీ విద్య

వెనుకబడిన తరగతుల వారి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయిస్తోంది.

ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం

ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.10 లక్షల వరకు ఖర్చు చేస్తోంది.

- పథకానికి గత ఏడాది(2016-17) చేసిన ఖర్చు- రూ.17.37 కోట్లు
- 2017-18లో బడ్జెట్ కేటాయింపులు- రూ.79.11 కోట్లు. ఇప్పటిదాకా చేసిన ఖర్చు-రూ.33.51 కోట్లు.

బోధనా రుసుములు, ఉపకార వేతనాల ఖర్చే ఎక్కువ

- బీసీ సంక్షేమానికి చేస్తున్న బడ్జెట్ కేటాయింపుల్లో ఎక్కువగా ఖర్చుచేస్తున్నది- విద్యార్థుల బోధనా రుసుములు, ఉపకార వేతనాలు, వసతి గృహాల నిర్వహణ కోసం. ఈ పద్దు కింద 2017-18లో ఇప్పటిదాకా చేసిన ఖర్చు- రూ.1646.22 కోట్లు.(2016-17లో రూ.2,057 కోట్లు)
- బీసీ భవన నిర్మాణాలకు కేటాయింపు రూ.45.50 కోట్లు. ఇప్పటిదాకా ఖర్చు- రూ.5 కోట్లు



- బీసీల్లో వివిధ వర్గాల స్వయం ఉపాధి కోసం 2017-18లో కేటాయింపు రూ.644 కోట్లు.

ఇప్పటిదాకా విడుదలైంది- రూ.277 కోట్లు. ఫిబ్రవరి నెలాఖరు వరకు సబ్సిడీ కింద ఖర్చు- రూ.387.65 కోట్లు. లక్ష్యానికి మించి నిధులు విడుదలచేసినా బ్యాంకులు పూర్తిగా సహకరించక 25% నిధులు(సబ్సిడీ) బ్యాంకుల్లో మూలుగుతున్నాయి.

బీసీ సంక్షేమానికి కేటాయింపులు, ఖర్చు (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపులు	ఖర్చు
2014-15	2,665.09	2,242.16
2015-16	3,210.12	2,573.50
2016-17	5,113.94	4,699.80
2017-18	5,015.70	3,537.21

(ఫిబ్రవరి నెలాఖరు వరకు)

ఎస్సీ, ఎస్టీలకు 'ఉప'కార ప్రణాళికలు!

ఉప ప్రణాళిక నిధులు ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేస్తున్నాయి. మూడేళ్లుగా క్రమం తప్పకుండా ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో అనేక సదుపాయాలు కల్పిస్తున్నారు.

- 2017-18లో ఎస్సీ ఉప ప్రణాళికకు కేటాయింపు- రూ.1,000 కోట్లు
- ఎస్టీ ఉప ప్రణాళిక కింద కేటాయింపు- రూ.500 కోట్లు
- ఈ మొత్తంలో ఇప్పటిదాకా చేసిన ఖర్చు- 65 శాతానికిపైగా

'గిరిజన సంక్షేమం'లో ఖర్చు తీరు ఇదీ..

- గిరిజన సంక్షేమానికి 2017-18 బడ్జెట్‌లో కేటాయించిన రూ.3528.74 కోట్లలో ఇప్పటిదాకా 90 శాతానికి పైగా వెచ్చించారు.
- విద్యార్థుల బోధనా రుసుములు, ఉపకార వేతనాలకు ఖర్చు- 40-45 శాతం మేర
- విద్యార్థులకు మెరుగైన విద్యా పథకాల కోసం ఖర్చు- 15 శాతం నిధులు
- వసతి గృహాల నిర్వహణ, గురుకులాల అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు- 25-30 శాతం నిధులు
- విద్య, వైద్యం, ఉపాధి వంటి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. రహదారులు, వాగులపై వంతెనలు వంటివి మెరుగు పరిచారు. ఉపాధి హామీ పథకంలో మారుమూల గ్రామాలకు సైతం రూ.900 కోట్లతో రహదారి సౌకర్యాన్ని కల్పించే పనులు వివిధ దశల్లో ఉన్నాయి.



కేటాయింపులు ఇలా...

- విద్యార్థుల ఉపకార వేతనాలు, బోధనా రుసుములు, వసతి గృహాలకు 35 శాతానికిపైగా నిధులు
- ఎన్టీఆర్ విద్యోన్నతి, విదేశీ విద్య కార్యక్రమాలకు ఖర్చు- మరో 25 శాతం నిధులు
- ఎస్సీల్లో పేదలకు గృహ నిర్మాణ, వ్యవసాయ ఉపాధి కార్యక్రమాలకు ఖర్చు- మరో రూ.75 కోట్లు

ఎస్సీ సంక్షేమ బడ్జెట్ (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపులు	ఖర్చు
2014-15	2,031	2,026
2105-16	3,807	3,124
2016-17	3,236	3,143
2017-18	3,685	3,423

(ఫిబ్రవరి నెలాఖరుకు)

అమృతహస్తం, గిరి గోరుముద్దలు

- స్త్రీ శిశు సంక్షేమానికి పెద్దపీట



స్త్రీ, శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. గతంలో 40 శాతం ప్రాజెక్టుల వరకే పరిమితమైన 'అన్న అమృతహస్తం' పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని (100%) ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకూ విస్తరించారు. ఈ పథకం కింద గర్భిణీలు, బాలింతలకు ఒక పూట భోజనం అందిస్తున్నారు.

- పోషకాహార లోపం ఉన్న గిరిజన ప్రాంత చిన్నారుల కోసం 'గిరి గోరుముద్దలు' పథకం కింద నూరు శాతం అంటే ఆరేళ్లలోపు వయస్సున్న 1.40 లక్షల మంది పిల్లలకు రోజూ గుడ్డు, పాలు అదనపు పోషకాహారంగా అందిస్తున్నారు.
- గత రెండేళ్లలో 11,700 నూతన అంగన్‌వాడీ భవనాల్ని మంజూరు చేశారు.
- ఈ శాఖకు బడ్జెట్ కేటాయింపుల కంటే వాస్తవంగా మంజూరుచేసే మొత్తం ఎక్కువుంటుంది. ఈ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొన్ని పథకాలకు కేంద్రం నిధులు సమకూరుస్తుంది..ఆ మొత్తం కూడా మంజూరైన నిధుల్లో కలిసి ఉంటోంది.

స్త్రీ శిశుసంక్షేమ శాఖకు కేటాయింపులు, ఖర్చు తీరు (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు	ఖర్చు
2014-15	2040	1623
2015-16	1513	1320
2016-17	2056	1471
2017-18	2615	1910

(ఫిబ్రవరి నెలాఖరు వరకు)

సాంఘిక సంక్షేమానికి రూ.3,221 కోట్లు

ఈనాడు, అమరావతి: సాంఘిక సంక్షేమానికి రూ.3,221 కోట్లు కేటాయించారు. ఎస్సీ సంక్షేమంతో పాటు, ఎస్సీ కాంపోనెంట్, ఉప ప్రణాళికకు కలిపి బడ్జెట్‌లో రూ. 11,228 కోట్ల నిధులు చూపారు. విద్య, ప్రజల సంక్షేమం, స్వయం ఉపాధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

కేటాయింపులు ఇలా..

- భూముల కొనుగోళ్లకు రూ.100 కోట్లు
- చంద్రన్న పెళ్లి కానుకకు: రూ.100 కోట్లు
- ఎస్సీ ఉపప్రణాళిక పనులకు రూ.21.94 కోట్లు
- గుంటూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహ స్థాపనకు రూ.30 లక్షలు

గిరిజన సంక్షేమానికి రూ.4,176.61 కోట్లు

గిరిజన సంక్షేమ కార్యక్రమాలకు బడ్జెట్‌లో రూ.4,176.61 కోట్లు కేటాయించారు. 2017-18 కేటాయింపుల (రూ.3,528.25 కోట్లు)తో పోలిస్తే 18 శాతం అదనపు నిధులు చూపారు. విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిచ్చారు.

వివిధ కార్యక్రమాలకు కేటాయింపులు

- గిరిపుత్రిక కల్యాణ పథకానికి రూ.8.23 కోట్లు
- ఎస్టీ ఉప ప్రణాళికకు రూ.60 కోట్లు
- తాగునీటి సరఫరాకు రూ.15 కోట్లు
- రహదారులకు రూ.10 కోట్లు

- ఐటీడీఏలకు: రూ.50 కోట్లు
- 'ఫుడ్ బాస్కెట్' పథకానికి రూ.40 కోట్లు

బడి సొబగులకు వినూత్న విధానం

ఏటా విద్యారంగానికి కేటాయిస్తున్న నిధుల్లో సింహభాగం జీతభత్యాలకే పోతుండటంతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం వినూత్న విధానానికి శ్రీకారం చుట్టింది. తొలిసారిగా 'హైబ్రిడ్ యాన్యూటి' విధానంలో రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అన్ని బడుల్లో రూ.4,848 కోట్లతో సదుపాయాలు కల్పించనుంది.

జీతాల ఖర్చే ఎక్కువ!

పాఠశాల విద్యాశాఖకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచుతున్నా.. సిబ్బంది, ఉపాధ్యాయుల వేతనాల్లో వస్తున్న మార్పుల కారణంగా కేటాయింపుల కంటే ఖర్చు ఎక్కువవుతోంది. పీఆర్సీ బకాయిలు, డీఏ ఇతరాత్ర చెల్లింపులు కారణంగా 2015-16, 2017-18 సంవత్సరాల్లో కేటాయింపుల కంటే వ్యయం పెరిగింది. చివరికి కేంద్ర పథకాలైన ఏకరూప దుస్తుల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకాలకు రాష్ట్రం వాటా ఇవ్వడంతోటే సరిపోతోంది.

యాన్యూటి అంటే..

గుత్తేదార్లే ముందుగా తమ నిధులు, బ్యాంకు రుణాలతో పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం, ప్రహరీలు, మరుగుదొడ్లు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. వారు తీసుకున్నన రుణాలకు ప్రభుత్వం పూచీకత్తు ఇస్తుంది. మొదటి విడతగా 24 నెలల తర్వాత.. చేసిన పనుల్లో 40% ప్రభుత్వం చెల్లిస్తుంది. మిగతా 60 శాతాన్ని రాబోయే ఐదేళ్లల్లో రిజర్వు బ్యాంకు వడ్డీ, 3% ప్రోత్సాహకంతో పాటు, నిర్వహణ కింద 1.5-2% కలిపి చెల్లిస్తారు.

ఇదీ పాఠశాల బడ్జెట్..(రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపులు	వ్యయం
2014-15	12,386	11,025
2015-16	14,347.25	13,689.28
2016-17	14,995.30	13,209.02
2017-18	17,492.81	16,618.16 (ఫిబ్రవరి 15వరకు)
2018-19	21,612.30	

- లక్ష్యం: 3,500 పాఠశాలల్లో వర్చువల్ తరగతుల ఏర్పాటు.
- తొలిదశ: ఈ ఏడాది 1,216 బడుల్లో ఏర్పాటు చేస్తున్నారు.

విద్యారంగానికి రూ.24,960 కోట్లు

ఈనాడు, అమరావతి: మధ్యాహ్నభోజనం కింద విద్యార్థులకు వారానికి ఐదు కోడి గుడ్లు ఇచ్చేందుకు ఈ బడ్జెట్‌లో రూ.266కోట్లు కేటాయించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేసేందుకు రూ.23కోట్లు కేటాయించారు. రాష్ట్ర బడ్జెట్‌లో సాధారణ విద్య, సాంకేతిక విద్య విభాగాలకు కలిపి మొత్తంగా రూ.24,960.90కోట్లు కేటాయించారు. ఇందులో పాఠశాల, ఇంటర్ విద్యకు రూ.21,612.30కోట్లు, సాంకేతిక విద్యకు రూ.818.02కోట్లు, ఉన్నత విద్యకు 2,530.58కోట్లు ఇచ్చారు. మొత్తంగా విద్యాశాఖకు గతేడాది సవరించిన బడ్జెట్ రూ.20,224.58కంటే ఈసారి రూ. 4,736.32 కోట్లు అదనంగా ఇచ్చారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల వేతనాలకు నిధులు కేటాయించారు. డిజిటల్, వర్చువల్ తరగతులకు ప్రాధాన్యం లభించింది. మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేకంగా రూ.వంద కోట్లు ఇచ్చారు. ఉన్నత పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లోని కౌమార బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కళాశాల విద్యకు వచ్చేవారు ప్రస్తుతం 32.4శాతం ఉండగా దీన్ని 2022నాటికి 40శాతానికి తీసుకువచ్చే లక్ష్యంతో బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. వచ్చే ఏడాది 37వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణనిచ్చేందుకు నిధులు కేటాయించారు. 45పాలిటెక్నిక్‌ల భవనాల నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చారు.

వర్సిటీలకు పెంపు: రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలకు గతేడాది రూ.812.23కోట్లు కేటాయించగా, ఈసారి రూ.1059.66కోట్లు కేటాయించారు. ఇందులో రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయానికి, జవహర్‌లాల్‌నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ, అనంతపురంలకు రూ.253.59కోట్లు కేటాయించారు. క్యాపిటల్ గ్రాంట్ కింద రూ.231.76కోట్లు కేటాయించారు. ఆదికవి నన్నయ్య, అంబేద్కర్, రాయలసీమ, ఉర్దూ, యోగివేమన, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాలకు రూ.40 కోట్ల చొప్పున మౌలిక వసతులకు ఇచ్చారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినుల వసతిగృహానికి రూ.20కోట్లు ఇచ్చారు. కృష్ణాకు రూ.71.76కోట్లు, రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక వర్సిటీకి రూ.50కోట్లు కేటాయించారు.

వచ్చే ఏడాది పాఠశాల విద్య లక్ష్యాలు

- 8,9 తరగతులకు కలిపి సైకిళ్ల పంపిణీ: 3.63లక్షలు
- ప్రతిభా ఉపకారవేతనాలు: 4,020మందికి
- వర్చువల్ తరగతులు: 4000.



ప్రసంగంలో పెద్దల మాట

"మన ఆలోచనల ప్రతిరూపమే మనం. మాటలు అప్రాధాన్యం. ఆలోచనలే మనల్ని నడిపిస్తాయి. ఆలోచనల విషయంలో అప్రమత్తంగా ఉండండి"

-స్వామి వివేకానంద




రాజధాని నగలివీ...

- ప్రతి 5-10 నిముషాల నడక దూరంలో పార్కులు, ప్రజోపయోగ ప్రదేశాల నిర్మాణం
- నీరు వృథాగా పోకుండా.. వరదల్ని తట్టుకుని నిలబడేలా నగర నిర్మాణం
- రోడ్లు, మెట్రో, జలమార్గాల్ని వినియోగించుకుని వారసత్వ, పర్యాటక నెట్‌వర్క్ అభివృద్ధి

వేగంగా సాగునీరు

- నీటి యాజమాన్యంలో డ్రోన్ ఆధారిత సమాచార సేకరణ, జియో-ట్యాగింగ్ వంటి అధునాతన పద్ధతుల అమలు.
- నీటి వనరులపై సమగ్ర పర్యవేక్షణకు డ్యాష్ బోర్డు ఏర్పాటు.
- 2016-17లో రికార్డు స్థాయిలో రాయలసీమకు 144 టీఎంసీల సరఫరా.
- 3.12 లక్షల ఎకరాలకు సూక్ష్మ సేద్య సదుపాయం.
- నీటి వనరుల భద్రతకు చట్టం, వర్షపు నీటి నిల్వకు చర్యలు
- నీరు-చెట్టు, పంట సంజీవని, జల సంరక్షణ ఉద్యమ స్ఫూర్తి పథకాలతో నీటి సంరక్షణ, సమగ్ర వినియోగం
- పోలవరం ప్రాజెక్టును సత్వరం పూర్తిచేసేందుకు కసరత్తు

ఆంధ్రప్రదేశ్‌లో సాగు భూమి 1.99 కోట్ల ఎకరాలు దీనిలో 52 శాతానికి సుస్థిర సాగునీటి సదుపాయం ఉంది.



51% రాష్ట్రంలో సాగు యోగ్యం కాని భూమి 2.03 కోట్ల ఎకరాలు

26% సాగు యోగ్యమైన, నీటి సదుపాయమున్నభూమి 1.03 లక్షల ఎకరాలు

17% సాగు యోగ్యమైన, నీటి సదుపాయం కల్పించాల్సి ఉన్న భూమి 69.6 లక్షల ఎకరాలు

6% సాగుయోగ్యమైన, వివిధ ప్రాజెక్టుల కింద త్వరలో నీరు అందనున్న భూమి 26.1 లక్షల ఎకరాలు

పరిశ్రమలు ఘనతలు

ప్రధానంగా వ్యవసాయాధార రాష్ట్రమైనా.. పారిశ్రామిక రంగంలో అనూహ్య వృద్ధి సాధించటం ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత. 2016-17లో రాష్ట్ర పారిశ్రామిక రంగం రెండంకెల వృద్ధి నమోదు చేసింది.

2015 జూన్ తర్వాత 25,000 పారిశ్రామిక అనుమతులు.

కోస్టల్ ఎకనామిక్ జోన్ (సీఈజడ్) ఏర్పాటు ప్రతిపాదన

ద॥ కొరియా ఆటోదిగ్గజం నుంచి 2 బిలియన్ డాలర్ల పెట్టుబడి సమీకరణ

రాష్ట్రం ప్రత్యేకతలు

- దక్షిణాదిలో పరిశ్రమలకు 24/7 విద్యుత్తు ఇస్తున్న తొలి రాష్ట్రం
- 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' లో మొదటి స్థానం
- పరిశ్రమలకు స్థలాల కోసం భూమి బ్యాంకు ఏర్పాటు
- ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకే భూమి లభ్యత.
- పరిశ్రమలకు ఆన్‌లైన్లో 'సింగిల్ డెస్క్' ద్వారా సత్వర అనుమతులు

భవిష్యత్తు ప్రణాళిక

- 974 కి.మీ పొడవైన సముద్ర తీరాన్ని వినియోగిస్తూ ఎగుమతులకు ప్రోత్సాహం
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు యోచన.
- వాహనాల విడిభాగాల తయారీ యూనిట్లకు ప్రోత్సాహం
- కర్నూలు, కృష్ణా జిల్లాల్లో అతిపెద్ద ఆహార ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు యత్నం
- విశాఖ, తిరుపతి, అనంతపూర్‌లలో ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీ క్లస్టర్ల స్థాపన

ఊరిస్తున్న భృతి

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో నిరుద్యోగులకు త్వరలోనే నిరుద్యోగభృతి అందే అవకాశం ఉంది. తాజా బడ్జెట్‌లో ఇందుకోసం రాష్ట్రప్రభుత్వం ఏకంగా రూ.1000 కోట్లు కేటాయించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగభృతి పంపిణీ కోసం రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ అందులో ఒక్క రూపాయి కూడా ఇప్పటివరకు ఖర్చు చేయలేదు. 2014 ఎన్నికల ప్రణాళికలో తెదేపా ఇచ్చిన హామీల్లో అమల్జేయాల్సిన ప్రధాన హామీల్లో ఇదొక్కటి. దీనిపై కసరత్తు చేసిన మంత్రివర్గ ఉపసంఘం, యువజనాభ్యుదయ శాఖ లబ్ధిదారుల సంఖ్య(ఉజ్జాయింపుగా), ఎవరెవరికి ఇవ్వాలనే విషయంపై ఒక అంచనాకు వచ్చినప్పటికీ లబ్ధిదారుల ఎంపిక మార్గదర్శకాలు ఖరారు కాకపోవడం, మంత్రిమండలి, ప్రభుత్వ ఆమోదం పొందకపోవడంతో పథకం అమల్లోకి రాలేదు. ప్రస్తుతం ఇక సంవత్సరకాలమే మిగిలి ఉండటంతో ఈ ఏడాది ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుద్యోగభృతిని అమలు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. "ఈ పథకం మాకు చాలా ప్రధానం.. దీనికి పూర్తిస్థాయిలో మద్దతుగా నిలుస్తామ"ని ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ యువజనాభ్యుదయ శాఖ అధికారులతో నిర్వహించిన బడ్జెట్ సన్నాహక సమావేశంలో స్పష్టం చేసిన సంగతి ఇక్కడ ప్రస్తావనార్హం. తాజా రూ.1000 కోట్ల కేటాయింపుతో కలిపి యువజనాభ్యుదయ శాఖకు మొత్తమ్మీద రూ.1307కోట్లు కేటాయించారు. ఈ మొత్తం గతేడాది కేటాయింపు చేసిన రూ.778కోట్లపై 68శాతం పెరుగుదల ఉంది.

10 లక్షల మందికి ప్రయోజనం?

ఇప్పటివరకూ రాష్ట్రంలో 10లక్షల మంది నిరుద్యోగులు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఒక్కొక్కరికీ నెలకు సరాసరి రూ.వేయి చొప్పున నిరుద్యోగభృతినిస్తే నెలకు రూ.100 కోట్లవుతుంది. ఏడాదికి రూ.1200 కోట్ల మేర అవసరమవుతుందని అంచనా వేశారు. గతేడాది రూ.500 కోట్లు కేటాయించిన నేపథ్యంలో ఇప్పుడు రూ.వేయి కోట్లు కేటాయించారు. ఇంటర్, ఆపైన విద్యార్హత ఉన్న నిరుద్యోగులకే భృతి కల్పించాలని ఇప్పటివరకూ చేసిన కసరత్తులో ప్రాథమిక నిర్ణయానికి వచ్చారు. రాష్ట్ర యువజన విధానాన్ని ఖరారు చేశాక, ఆ విధానం ఆధారంగా నిరుద్యోగభృతిని అమల్జేయాలని నిర్ణయించారు.

నగదు భృతిని అందిస్తున్న పలు రాష్ట్రాలు

దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని అందిస్తున్నాయి. ఇందుకు దారిద్ర్యరేఖకు దిగువున(బీపీఎల్) గల కుటుంబాలకు చెందిన యువతను, 8వ తరగతి నుంచి ఉన్నతస్థాయి చదువులు చదివిన వారిని అర్హులుగా గుర్తిస్తున్నాయి. కనిష్ఠంగా రూ.100 నుంచి గరిష్ఠంగా రూ.2000 వరకూ ఈ భృతిని ఇస్తున్నాయి. మిగిలిన అన్ని రాష్ట్రాల కంటే హర్యానాలో అత్యధికంగా నిరుద్యోగులకు రూ.2 వేల వరకూ సహాయం అందిస్తున్నారు.

రాష్ట్రం/ కేంద్రపాలితప్రాంతం	నెలకు ఇస్తున్న నిరుద్యోగ భృతి	పరిగణిస్తున్న అర్హతలు
1. హిమాచల్‌ప్రదేశ్	రూ.1000 రూ.1500 (దివ్యాంగులు)	ఇంటర్ ఆపైన ఇంటర్ ఆపైన
2. అస్సాం	రూ.500	-
3. బిహార్	రూ.200	బీపీఎల్
4. ఛత్తీస్‌గఢ్	రూ.500	చదువుకుని ఉద్యోగంలేకపోవడం
5. హర్యానా	రూ.1000 రూ.1500 రూ.2000	మెట్రిక్ చదివినవారికి మెట్రిక్ ఉత్తీర్ణులకు డిప్లొమా/ గ్రాడ్యుయేట్లు ఆపై
6. మణిపూర్	రూ.100 నుంచి రూ.200	-
7. మిజోరాం	రూ.250	-
8. మేఘాలయ	రూ.500	-
9. పంజాబ్	రూ.150-600	-
10. రాజస్థాన్	రూ.600	-
11. తమిళనాడు	రూ.300-450	-
12. త్రిపుర	రూ.1000	18 ఏళ్లు దాటి ప్రభుత్వ ఉద్యోగంలేని అంధులకు
13. ఢిల్లీ	రూ.1500	-
14. అండమాన్, నికోబార్	రూ.400	-
15. చండీగఢ్	రూ.150-400	-
16. పుదుచ్చేరి	రూ.200-500	-


మైనారిటీలకు 'మెజారిటీ' నిధులు

ఈనాడు, అమరావతి: మైనారిటీ బడ్జెట్ రూ.వేయి కోట్ల మైలురాయిని దాటింది. 2017-18 కేటాయింపులు రూ.840 కోట్లు కాగా.. దానిపై 31 శాతం పెంచి వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.1102 కోట్లు ప్రతిపాదించారు. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో రూ.645 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు.

కేటాయింపులు ఇలా..

- మైనారిటీ విద్యార్థులకు విదేశీ విద్యోన్నతి పథకం కింద 2017-18లో రూ.5 కోట్లు ఇవ్వగా ఇప్పుడు.. ఆ మొత్తాన్ని రూ.30 కోట్లకు పెంచారు.
- దుల్హన్ పథకం నిధులను రూ.60 కోట్ల నుంచి 80 కోట్లకు పెంచారు.
- ఆదాయం లేని మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్స్, మౌజమ్‌లకు వేతనాల బడ్జెట్‌ను రూ.24 కోట్ల నుంచి 75 కోట్లకు పెంచారు.
- ముస్లిం మైనారిటీలకు ఇచ్చే బ్యాంకబుల్ రుణాలను రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పెంచారు.
- క్రిస్టియన్ మైనారిటీలకు గతేడాది ఇచ్చిన రూ.35 కోట్లను రూ.75 కోట్లకు పెంచడం గమనార్హం.

అమరావతి.. అసలు ఖర్చు ముందుంది!



మొదట్లో ప్రణాళికలు, డిజైన్ల రూపకల్పనపైనే దృష్టి పెట్టటం వల్ల మొదటి రెండేళ్లూ 'అమరావతి' నిర్మాణానికి పెద్దగా నిధులు కేటాయించలేదు. రాజధాని కోసం వాస్తవంగా నిర్మాణ పనులు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. పరిపాలన నగరం, రహదారులు, ఎల్పీఎస్ లేవుట్‌లలో మౌలిక వసతుల నిర్మాణం వంటి పనుల్ని పెద్దఎత్తున ఆరంభిస్తున్నారు. రాజధానిలో ఒక్క మౌలిక వసతుల కల్పనకే సుమారు రూ.45,000 కోట్లకుపైగా ఖర్చవుతుందని అంచనా. కేంద్రం ఇప్పటి వరకు రూ. 15వేల కోట్లు ఇచ్చింది.

చేసిందిది
2014-15 నుంచి ఇప్పటివరకు..
- తాత్కాలిక సచివాలయానికి: రూ. 500 కోట్లు
- మౌలిక వసతుల కోసం: రూ. 596 కోట్లు
- రైతులకు కౌలు చెల్లింపునకు: రూ. 460.63 కోట్లు
- పింఛన్లకు: రూ. 177.43 కోట్లు

కౌలు, పింఛన్లకే!

రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఎక్కువ శాతం రాజధానికి భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు చెల్లింపు, రాజధాని గ్రామాల్లోని భూమిలేని నిరు పేదలకు నెలవారీ సామాజిక పింఛన్ల చెల్లింపునకే సరిపోతోంది.

రాజధానికి నిధులు (రూ. కోట్లలో)...

సంవత్సరం	కేటాయింపులు	విడుదల చేసిన నిధులు	వ్యయం
2014-15	-	210.6	210.6
2015-16	300	300	300
2016-17	1215	200	200
2017-18	1061	419	419



పర్యాటకానికి అంతే!

- రూ.290 కోట్లు కేటాయింపు
- గతేడాది కంటే రూ.10 కోట్లే అదనం

ఈనాడు, అమరావతి: పర్యాటక రంగం.. బడ్జెట్ కేటాయింపుల్లో ఆకట్టుకోలేకపోయింది! ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.10 కోట్లు మాత్రమే అదనంగా కేటాయిస్తూ 2018-19 సంవత్సరానికి రూ.290 కోట్ల బడ్జెట్ ప్రతిపాదించారు. అదనంగా కేటాయించిన రూ.10 కోట్లను కూడా అమరావతిలో, జిల్లా కేంద్రాల్లో శిల్పారామాల ఏర్పాటుకు ఇచ్చారు.

కేటాయింపులు ఇలా..

- రూ.190 కోట్లు: గ్రామీణ పర్యాటకాభివృద్ధి, జాతీయ/అంతర్జాతీయ ప్రదర్శన (ఎగ్జిబిషన్లు)ల నిర్వహణ, స్థానిక పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి.
- రూ.40 కోట్లు: రాష్ట్రంలో కొత్త పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు.
- రూ.10 కోట్లు: గిరిజన ప్రాంతాల్లో జాతీయ పర్యాటక ఉత్సవాల నిర్వహణ, కొత్తగా రిసార్టుల నిర్మాణం.
- రూ.10 కోట్లు: విజయవాడలో భవానీద్వీపం అభివృద్ధికి.
- రూ.10 కోట్లు: వివిధ పర్యాటక ప్రాజెక్టుల నిర్వహణకు.
- రూ.10.22కోట్లు: అధికార భాషా సంఘానికి.

రాజధానికి అంతంతే!


ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతికి రాష్ట్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో రూ.689.14 కోట్లు కేటాయించింది. ఈ మొత్తంలో రాజధానిలో భూమిలేని పేదలకు పింఛన్లకు రూ.65.60 కోట్లు, రాజధాని నిర్మాణానికి భూసమీకరణలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు చెల్లింపునకు రూ.166.53 కోట్లు కేటాయించింది. రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.457.01 కోట్లు కేటాయించింది. ఈ బడ్జెట్‌లోను రాజధానిలో మౌలిక వసతుల అభివృద్ధికి కేటాయింపులు స్వల్పంగానే ఉన్నాయి. మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రపంచబ్యాంకు నుంచి సీఆర్‌డీఏ రూ.3200 కోట్ల రుణం తీసుకుంటోంది. రుణం మంజూరు ప్రక్రియ త్వరలోనే కొలిక్కి వస్తుందని భావిస్తున్నారు. ప్రపంచబ్యాంకు రుణం మంజూరు చేస్తే సీఆర్‌డీఏ మ్యాచింగ్ గ్రాంట్‌గా 30 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. దానికోసమే ప్రభుత్వం ఈ రూ.457.01 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది.

రహదారుల నిర్మాణానికి రూ.341 కోట్లు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా ప్రధాన రహదారుల నిర్మాణానికి 2018-19 బడ్జెట్‌లో రూ.341 కోట్లు కేటాయించారు. గత ఏడాది కంటే ఈ కేటాయింపులు 67.16 శాతం అధికం. ఇక గ్రామీణ రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.100 కోట్లు కేటాయించింది. నిరుడుతో పోలిస్తే కేటాయింపులు కొంతమేరకు తగ్గాయి. 2017-18తో పోలిస్తే తాజా బడ్జెట్‌లో రవాణా, రోడ్లు, భవనాల శాఖకు 16 శాతం మేరకు అధికంగా నిధులు కేటాయించారు.

ప్రజా రాజధాని అమరావతి

ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి రాజధాని నగరంగా తీర్చిదిద్దుతున్నారు. 2050 నాటికి 35 లక్షల మంది నివసించేలా ఈ నగర నిర్మాణం జరుగుతుంది. ఇది ప్రపంచ ఆర్థిక కూడలిగా తయారవుతుంది. అత్యుత్తమ మౌలిక సదుపాయాల కల్పన వల్ల ప్రజలు, పెట్టుబడులు, ఉద్యోగాలకు ఇది కేంద్ర బిందువుగా అవుతుంది.



క్రీడల నగరం
- అంతర్జాతీయ క్రీడా స్టేడియంల నిర్మాణం
- క్రీడల గ్రామం • ఆక్వాటిక్ సెంటర్
- ఇండోర్ స్పోర్ట్ ఏరియా • స్పోర్ట్స్ మాల్, తదితరాలు

మీడియా నగరం
- ప్రపంచ స్థాయి ప్రొడక్షన్ సదుపాయాలు
- మీడియా • సృజనాత్మక పరిశ్రమ ఏర్పాటు
- సినిమాలు • పబ్లిషింగ్ • గేమింగ్ ఇతరత్రా..

న్యాయ నగరం
- హైకోర్టు • ప్రాంతీయ కోర్టులు, ట్రైబ్యునళ్లు • లా స్కూళ్లు
- న్యాయ పరిశోధన సంస్థలు • నాలెడ్జ్ సెంటర్, తదితరాలు

మేధో నగరం
- ప్రపంచస్థాయి విశ్వ విద్యాలయాలు
- బహుళ విధ విద్యాసంస్థలు
- పరిశోధన, అభివృద్ధి సంస్థలు • జాతీయ గ్రంథాలయం
- స్టార్టప్/ఇంక్యుబేషన్ కేంద్రాలు, తదితరాలు

పర్యాటక నగరం
- మత సంబంధ పర్యాటకం
- వారసత్వ పర్యాటకం • థీమ్ పార్కులు
- సైన్స్ సెంటర్ • మ్యూజియంలు, తదితరాలు

పరిపాలనా నగరం
- ప్రభుత్వ ఆవరణ • అసెంబ్లీ
- సచివాలయం
- అంతర్జాతీయ బ్యూరోక్రాటిక్ సంస్థలు, ఎంబసీలు
- రాష్ట్రస్థాయి మంత్రిత్వశాఖలు, తదితరాలు

ఆర్థిక నగరం
- కేంద్ర వ్యాపార జిల్లా(సీబీడీ)
- బ్యాంకులు • బ్యాంకులేతర ఆర్థిక సంస్థలు
- పెట్టుబడుల బ్యాంకులు
- కార్పొరేట్ కేంద్ర కార్యాలయాలు, తదితరాలు

ఆరోగ్య నగరం
- సూపర్ స్పెషాలిటీ ఆరోగ్య కేంద్రాలు
- వైద్య ప్రతిభా కేంద్రాలు • వైద్య పర్యాటకం
- బయో మెడికల్ పరిశోధన సంస్థలు
- ప్రత్యామ్నాయ వైద్య పరిశోధన కేంద్రం, తదితరాలు

ఎలెక్ట్రానిక్ నగరం
- ఐటీ క్యాంపస్‌లు, ఎలెక్ట్రానిక్స్ పారిశ్రామిక కూడళ్లు
- పరిశోధక ప్రయోగశాలలు • ఇంక్యుబేషన్ కేంద్రాలు
- శిక్షణ సంస్థలు • గోదాములు, తదితరాలు

ఇదీ అమరావతి ముఖచిత్రం..

రాజధాని కేంద్ర ప్రాంతం(సీడ్ కేపిటల్) 6.84 చదరపు కిలోమీటర్లు

రాజధాని నగరం(కోర్ కేపిటల్) 217 చ.కి.మీ.లు

రాజధాని ప్రాంతం(కేపిటల్ రీజియన్) 8603 చ.కి.మీ.లు

స్మార్ట్ సిటీ సదుపాయాలతో అమరావతిలో మొత్తం 9 సిటీల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమయింది. ఈ 9 సిటీల్లో సకల సదుపాయాలు కల్పించేలా అన్ని రకాల నిర్మాణాలూ జరుగుతాయి.

రోడ్ గ్రిడ్ నత్తనడక!

ప్రతి జిల్లా కేంద్రం నుంచి రాజధానికి చేరేలా రహదారి వ్యవస్థను తీర్చిదిద్దడం, గ్రామీణ రోడ్ల నుంచి హైవేల వరకు రహదారుల నిర్మాణం, నౌకాశ్రయాలు, జాతీయ రహదారుల్ని కలుపుతూ రోడ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రహదారి హారం(రోడ్ గ్రిడ్)ను ప్రతిపాదించింది. దీనికి ప్రత్యేక కేటాయింపులేమీ లేక.. ఇది పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు.

వివిధ పథకాల కింద గత నాలుగేళ్లలో రూ.7621 కోట్లతో 10,279 కి.మీ. మేర రోడ్లను అభివృద్ధి పరిచారు. 167 వంతెనలు నిర్మించారు. ఈ ఏడాది 2,793 కి.మీ. మేర రోడ్డును వెడల్పు చేశారు.

వంతెనలు, రహదారుల మరమ్మతులకు తగిన నిధుల్లేవు.

రాయలసీమ జిల్లాల్ని రాజధాని అమరావతితో కలిపే అమరావతి ఎక్స్‌ప్రెస్ వే పనులు ముందుకు సాగడం లేదు.

రహదారులు, భవనాల శాఖకు కేటాయింపుల తీరు (రూ.కోట్లలో)..

సంవత్సరం	కేటాయింపులు	వ్యయం
2014-15	2683	2677
2015-16	3082	3784
2016-17	3493	3617
2017-18	4029	3900
2018-19	4703	-

ఆర్థిక స్వాతంత్ర్యంతోనే గౌరవం

- అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణించాలి
- విద్యతోనే సమాజంలో మార్పు
- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు డిజిటల్ - విజయవాడ




జ్యోతిని వెలిగించి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో పరిటాల సునీత, జస్టిస్ రోహిణి, సుధామూర్తి, నన్నపనేని రాజకుమారి తదితరులు ★ రూ.కోటి విరాళం ఇచ్చిన స్వరాజ్యలక్ష్మికి సత్కరిస్తున్న చంద్రబాబునాయుడు

'మహిళలు తమ ఖర్చుల కోసం చిన్నప్పుడు తల్లిదండ్రులపైనా, పెళ్లయ్యాక భర్తపైనా, వృద్ధాప్యంలో పిల్లలపైనా ఆధారపడాల్సి వస్తోంది. దీంతో వారిని చులకనగా చూస్తున్నారు. పురుషులతో సమానంగా పనిచేస్తూ... ఆర్థిక స్వాతంత్ర్యం సాధిస్తేనే సమాజంలో గౌరవం లభిస్తుంది' అని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం సమీపాన గ్రీవెన్స్‌హాలులో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ- మహిళలు శారీరకంగా బలహీనులనీ, వృత్తులకు పనికిరారన్నది ఒకప్పటి మాట. ఇప్పటి ఉద్యోగాలకు శారీరక శ్రమ అవసరంలేదు. కంప్యూటర్ల రాకతో మేధాశక్తి అవసరం. ఇది నేటి మహిళలకు కావాల్సినంత ఉంది. అందుకే మహిళలను ప్రోత్సహించడానికి ఉద్యోగాల్లో 33% రిజర్వేషన్లు కల్పించాం. స్థానిక సంస్థల్లో తొలుత 8% రిజర్వేషన్ కల్పించాం. ఇప్పుడది 50 శాతానికి పెరిగింది. చట్టసభల్లోనూ వారికి 50% రిజర్వేషన్ వచ్చినప్పుడే సమాజం బాగుపడుతుంది. డ్వాక్రా, మెప్మా బృందాలు 90 లక్షల మంది సభ్యులతో, 9 లక్షల సంఘాలుగా అవతరించి, మంత్రిత్వశాఖగా రూపుదిద్దుకొంది. ఇంకా కొంతమంది తల్లిదండ్రులు పిల్లల విషయంలో ఆడ, మగ అనే తేడా చూపిస్తున్నారు. వారంతా మారుతున్న పరిస్థితిని గమనించాలి. కట్నం సమస్య కూడా లేదు. అవసరమైతే ఎదురిచ్చి పెళ్లి చేసుకునే పరిస్థితి వచ్చింది. డ్వాక్రా రుణాల మాఫీ కింద ఇప్పటికే రూ.8 వేల చొప్పున అందించాం. మిగతా రూ.2 వేలను వారి వారి ఖాతాల్లో జమ చేస్తాం. పట్టణ ప్రాంత మహిళలు నచ్చిన రంగంలో ముందుకెళ్లేందుకు 'మెప్మా' ఆధ్వర్యాన ఎంత ఖర్చు చేయడానికైనా సిద్ధంగా ఉన్నాం.

భార్యను అడిగి ఖర్చులకు డబ్బులు తీసుకుంటా...

మహిళలు సమర్థవంతులైతే... వారి ఇళ్లు క్రమశిక్షణతో ఉంటాయి. ఖర్చులకు అవసరమైతే నేను ఇప్పటికీ నా భార్యను అడిగి డబ్బులు తీసుకుంటాను. బాలికలు మధ్యలో చదువు మానకుండా ఉండేందుకు 'బడికొస్తా' కార్యక్రమాన్ని చేపట్టి, 1.8 లక్షల సైకిళ్లను పంపిణీ చేశాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో వివాహాలు చేసేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని తొలగించేందుకే 'పెళ్లి కానుక' పథకాన్ని తీసుకొచ్చాం. 1.6 లక్షల కుటుంబాలకు శానిటరీ నాప్కిన్స్‌ను అందిస్తూ స్త్రీల ఆరోగ్యాన్ని కాపాడుతున్నాం" అని అన్నారు.

అంతకుముందు ఆయన.. అంగన్‌వాడీ కార్యకర్తలు; డ్వాక్రా, మెప్మా సంఘాల మహిళలు; సాధికారమిత్రలకు అంతర్జాతీయ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ మహిళా సంఘ సభ్యులకు మూడోవిడత పసుపు కుంకుమ పథకం కింద.. రూ.309.25 కోట్ల పెట్టుబడి నిధిని అందించారు. పలు రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత, జస్టిస్ రోహిణి, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నారాయణ, నక్కా ఆనంద్‌బాబు, విజయవాడ మాజీ మేయర్ పంచమర్తి అనురాధ, గుంటూరు జడ్పీ ఛైర్‌పర్సన్ జానీమూన్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి కె.సునీత, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి, హైమావతి, ఎం.ఎం.శ్రీలేఖ, అంగన్‌వాడీ సీడీపీవోలు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి రూ.కోటి విరాళం

రాజధాని అమరావతి నిర్మాణం కోసం నీరుకొండకు చెందిన ముప్పవరపు స్వరాజ్యలక్ష్మి ముఖ్యమంత్రికి రూ.కోటి విరాళంగా అందించారు. రాజధాని నిర్మాణానికి విరాళం ఇవ్వడం అభినందనీయమని, ఎంతోమందికి ఆమె స్ఫూర్తిగా నిలుస్తారని చంద్రబాబు అన్నారు.

ఆకృతులపై సీఎం సమీక్ష

ఈనాడు, అమరావతి: రాజధానిలో నిర్మించనున్న ముఖ్యమంత్రి నివాసం, క్యాంపు కార్యాలయం, రాజ్‌భవన్, దర్బారుహాలు నిర్మాణ ఆకృతులు ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ)పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెయిన్‌కు చెందిన రికార్డో భోఫిల్, ఎఫ్‌హెచ్‌డీ గ్రూప్, ఆర్‌ఎస్‌పీ సంస్థల ప్రతినిధులు ఆయా నిర్మాణాలకు తాము రూపొందించిన ఆకృతులను సీఎంకు వివరించారు. పరిశీలించిన సీఎం కొన్ని మార్పులు సూచించి.. సవరించిన ఆకృతులను తీసుకురావాలని సూచించారు. అంతకుముందు సచివాలయం భవనానికి సంబంధించిన సవివర ఆకృతులపై నార్మన్ ఫోస్టర్ కంపెనీ ప్రతినిధులు ప్రజంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు.



విజయవాడలో నిర్వహించిన ప్రదర్శనలో భారీగా పాల్గొన్న ఆశా వర్కర్లు

ఆశావర్కర్ల భారీ నిరసన ప్రదర్శన

గాంధీనగర్ (విజయవాడ) న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు విజయవాడలో గురువారం భారీ ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆశావర్కర్ల సంఘం ఇచ్చిన 'చలో విజయవాడ' పిలుపు మేరకు 13 జిల్లాల నుంచి ఆశావర్కర్లు ఉదయం 9 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్‌కు చేరుకొని అలంకార్ కూడలిలోని ధర్నాచౌక్‌కు ప్రదర్శనగా బయలుదేరారు. రాష్ట్ర స్థాయి అధికారులు వచ్చి తమకు స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని చెప్పి అలంకార్‌కూడలి సమీపంలో ఎండలోనే నిల్చున్నారు. ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించాలని, ఆరోగ్య కార్డు మంజూరు చేయాలని, అర్హులైనవారికి ఏఎన్‌ఎంలుగా శిక్షణ ఇవ్వాలని నినదించారు. కొందరు బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు నిలువరించారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆశా కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. మధ్యాహ్నం సీఐటీయూ, ఆశావర్కర్ల సంఘం నాయకులను పోలీసులు అరెస్టు చేసి నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించినా ఆందోళనను సాయంత్రం వరకు కొనసాగించారు. సమస్యలపై చర్చించేందుకు ఏప్రిల్ 10లోగా వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శితో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో కార్యకర్తలు ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించారు.

ఏపీలో విద్యాసంస్థలకు రూ.295 కోట్లు విడుదల

ఈనాడు, దిల్లీ: ఏపీ విభజన చట్టంలో పేర్కొన్న కేంద్ర విద్యా సంస్థలైన ఐఐటీ, ఐఐఎం, నిట్, ఐఐటీడీఎంలకు రూ.295.19 కోట్లు విడుదల చేశామని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. గురువారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు టీజీ వెంకటేశ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ ఈ మేరకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

అలా ఇచ్చి.. ఇలా తీసుకుంటారా?

- రూ.350 కోట్లు వెంటనే తీసుకోవడంపై ఆగ్రహం
- కేంద్రంపై మండిపడ్డ ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు - అమరావతి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి జనవరి 31న రూ.350 కోట్లు విడుదల చేశారని, ఆ వెంటనే మళ్లీ ప్రధాని ఆమోదం లేదంటూ వెనక్కి తీసుకున్నారని, ఇదెక్కడి న్యాయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. "ఇదేనా మీరు రాష్ట్రానికి చేస్తున్న సాయం? అసెంబ్లీలో బుధవారం నేను ఎంత హుందాగా మాట్లాడాను... దిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఎలా మాట్లాడారు? భారతదేశాన్ని కాపాడే బాధ్యత మాకు ఉంది. సెంటిమెంట్లు, రాజకీయాలతో నిధులు రావని అంటారా?.." అని ఆయన కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.

'నిధులిస్తామని ఒప్పుకున్నాకే ఎన్నికల్లో మీతో కలిసి పని చేశాం... ఇప్పుడిలా అంటే ఎలా? ఎవరి మీదా నాకు కోపం లేదు... రాజకీయాల్లో ఉన్న వారంతా జాతి ప్రయోజనాలు ఆశించి పని చేయాలి. ప్రజల మనోభావాలను గౌరవించాలి... అన్యాయం జరిగితే సవరించుకోవాలి...' అని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. "వాళ్లు (కాంగ్రెస్) చేశారు కాబట్టి ఇప్పుడు మేమూ చేస్తామంటే ఎలా? ఈశాన్య రాష్ట్రాలకు చేస్తున్న సాయమే మాకూ చేయాలని కోరాం.. ఎందుకు ఇవ్వరు? అదే రాష్ట్రాల కోసం ప్రత్యేకంగా మళ్లీ పారిశ్రామిక రాయితీలు ఇస్తారా? ఇదేం పద్ధతి?..." అంటూ ప్రశ్నించారు. 'జాతీయ పార్టీల తీరు మారాలి. ప్రస్తుతం వ్యవహరిస్తున్న విధానం తగదు... ఒకసారి సమీక్ష చేసుకుంటే మంచిది...' అని సూచించారు. తెలుగు జాతి ఆత్మ గౌరవం కోసం సినిమాలు పక్కన పెట్టి తెదేపాని స్వర్గీయ ఎన్టీ రామారావు తీసుకొచ్చారు... కాంగ్రెసేతర పార్టీలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి జాతీయ ప్రయోజనాలకు పని చేసిన చరిత్ర తెదేపాకు ఉందని చంద్రబాబునాయుడు వివరించారు.

ఆ ఇద్దరు రాష్ట్ర మంత్రులు బాగా పని చేశారు

భాజపాకు చెందిన మంత్రులు కామినేని శ్రీనివాసరావు, మాణిక్యాలరావు ఎంతో బాగా పని చేశారని, ఎవరిపైనా ఒక శాతం కూడా విమర్శలు రాలేదని సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. తమ పదవులకు రాజీనామా చేసి మంత్రులిద్దరూ అసెంబ్లీలో మాట్లాడాక సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. రాజకీయ కారణాలతో ఇద్దరూ రాజీనామా చేసినా.... మంత్రులుగా ప్రభుత్వంలో బాగా పని చేశారని, వైద్య, ఆరోగ్య, దేవాదాయ, ధర్మాదాయశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని మెచ్చుకున్నారు.

రాజకీయంగా అవకాశాలు కల్పిస్తాం

మైనారిటీలతో సమావేశంలో ముఖ్యమంత్రి

ఈనాడు డిజిటల్, అమరావతి: మైనారిటీలకు రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామని, అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. పేద మైనారిటీలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని హామీఇచ్చారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌లో మైనార్టీ వర్గాలతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. అమరావతిలో ఇస్లామిక్ సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సమావేశానికి హాజరైన ముస్లింవర్గాల ప్రతినిధులు కోరారు. మంత్రి కళావెంకట్రావు, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

అమరావతిలో వైల్డర్‌నెస్ పార్కు

అమరావతిలో 20 ఎకరాల్లో వైల్డర్‌నెస్ పార్కును త్వరగా ఏర్పాటు చేయాలని ప్రగతి గ్రీన్ మిడోస్ అండ్ రిసార్ట్ సంస్థను ముఖ్యమంత్రి ఆదేశించారు. రిసార్టులు, పుష్పవనాలు, మూలికా వనాలతో ఈ పార్కు ఆహ్లాదభరితంగా ఉంటుందని, నడక, సైకిల్ ట్రాకులు, రెస్టారెంటు, కృత్రిమ అరణ్యం వంటివి దీనిలో ఉంటాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎన్టీఆర్ క్యాంటీన్ల భవనాలకు సంబంధించి ఎల్అండ్‌టీ సంస్థ ప్రతిపాదించిన ఆకృతులు అంత ఆకర్షణీయంగా లేవని సీఎం అన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా జయదేవ్ కుమారుడు

త్వరలో హీరోగా సినీరంగ ప్రవేశం



తండ్రి గల్లా జయదేవ్‌తో అశోక్

ఈనాడు, దిల్లీ: గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ కుమారుడు అశోక్ గల్లా గురువారం తెలుగుదేశం కార్యాలయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆకర్షణీయమైన ఉంగరాల జుట్టుతో కనిపించిన ఆయన్ని చూసి అందరూ ఎవరో అనుకున్నారు. జయదేవ్ కుమారుడని ఎంపీ శివప్రసాద్ అందరికీ పరిచయం చేశారు. ఆయన జుట్టును చూసి ఎంపీ దివాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. నీ కొడుకును సాయిబాబా చేస్తున్నావా? అని జయదేవ్‌ను నవ్వుతూ అడిగారు. హీరోను చేస్తున్నట్లు ఎంపీ శివప్రసాద్ చెప్పడంతో వివరాలు తెలుసుకోడానికి అక్కడున్న వారంతా కుతూహలం చూపారు. మురళీమోహన్ స్పందిస్తూ అశోక్ జుట్టు చాలా అందంగా, కొత్తగా ఉందంటూ తన పక్కన కూర్చోబెట్టుకొని మాట్లాడారు. దిల్ రాజు నిర్మాతగా రాజమౌళి బృందంలో పనిచేసిన ఆర్‌కే అనే కొత్త దర్శకుడితో త్వరలో సినీరంగ ప్రవేశం చేయబోతున్నట్లు చెప్పడంతో అభినందించారు. అమెరికాలో సినీరంగానికి చెందిన వివిధ అంశాల్లో ప్రత్యేక కోర్సులు చేసినట్లు జయదేవ్ మురళీమోహన్‌కు చెప్పారు.

నాలుగోరోజూ అదే పంథా

- ఆందోళన సాగించిన తెదేపా, తెరాస, వైకాపా

ఈనాడు, దిల్లీ: పార్లమెంటు మలివిడత బడ్జెట్ సమావేశాలు నాలుగోరోజూ ఆందోళనల మధ్య వాయిదాపడ్డాయి. గురువారం మహిళా దినోత్సవం సందర్భంగా రాజ్యసభలో ఈ అంశంపై చర్చ జరిగింది. ఇది మినహా ఉభయసభల్లో ఇతరత్రా కార్యకలాపాలేమీ జరగలేదు. గత మూడురోజుల మాదిరిగానే లోక్‌సభలో తెదేపా, తెరాస, వైకాపా, ఏఐఏడీఎంకే, తృణమూల్ సభ్యులు తమ డిమాండ్లపై ఆందోళనలు కొనసాగించారు. రెండ్రోజుల పాటూ సభ లోపలా, వెలుపలా ఆందోళనచేసిన శివసేన గురువారం విశ్రమించింది. ప్రభుత్వం నుంచి తెదేపా వైదొలగుతున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో- ఆ పార్టీ సభ్యులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ డిమాండ్లతో ప్రత్యేకంగా ముద్రించిన పసుపు టీషర్టులను ధరించి పార్లమెంటు లోపలా, బయటా ఆందోళనలు చేశారు. వైకాపా సభ్యులు ఎప్పట్లాగే పార్లమెంటు ప్రధాన ద్వారం వద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన కొనసాగించారు. తెరాస పార్లమెంటు బయట ఆందోళన చేయకపోయినా... సభ ప్రారంభమైన తర్వాత లోక్‌సభ వెల్‌లోకి వచ్చి ఆందోళన సాగించింది. తెదేపా, వైకాపా, ఏఐఏడీఎంకే, తృణమూల్, తెరాస సభ్యులంతా ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టారు. దీంతో స్పీకర్ సభను తొలుత 12 గంటలకు, తర్వాత శుక్రవారానికి వాయిదావేశారు. రాజ్యసభ తొలుత 2 గంటలకు, తర్వాత శుక్రవారానికి వాయిదా పడింది.

సాయం చేయలేదనడం అన్యాయం: హరిబాబు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ఏమీ సాయం చేయలేదని కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని నిందించడం బాధాకరమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గం నుంచి మిత్రపక్షమైన తెదేపా మంత్రులు వైదొలగడంపై ఆయన విచారంవ్యక్తంచేశారు. గురువారం పార్లమెంటు ప్రాంగణంలో హరిబాబు విలేకరులతో మాట్లాడారు. "మూడున్నరేళ్లుగా వివిధ కార్యక్రమాల ద్వారా రాష్ట్రానికి ఆర్థికసాయం అందించింది. ప్రత్యేకహోదాకు సమానమైన ఆర్థికప్రయోజనాలు సమకూర్చడానికి కేంద్రం సిద్ధమైనప్పటికీ ఏమీ చేయలేదని ఆరోపించడం అన్యాయం. ఏపీ అభివృద్ధి కావాలన్నదే భాజపా లక్ష్యం. ఈ మూడున్నరేళ్లలో ఏపీకి ఎన్డీఏ ప్రభుత్వం చేసినంత సాయం దేశానికి స్వాతంత్ర్యం అనంతరం ఏ కేంద్ర ప్రభుత్వమూ ఏ రాష్ట్రానికీ చేయలేదన్నది నా నమ్మకం. ఏపీని ప్రత్యేకంగా పరిగణించి చట్టంలో చెప్పినవీ, చెప్పనివీ పెద్దఎత్తున చేసినప్పటికీ ఈ తరహా ఆరోపణలు బాధాకరం. కేంద్రం నుంచి తెదేపా మంత్రులు వైదొలిగినప్పటికీ.. రెండు ప్రభుత్వాల మధ్య సహకారం ఆగకూడదని కోరుకుంటున్నా. ప్రత్యేకహోదాకు సమానమైన సాయం చేస్తామన్నప్పటికీ హోదాయేకావాలని పట్టుబట్టడంలో అర్థంలేదు. ప్రత్యేకహోదాలో పన్నురాయితీలు భాగంకాదు. హోదాకు, పన్నురాయితీలకు సంబంధం లేదు" అని హరిబాబు చెప్పారు.






గురువారం పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న తెదేపా ఎంపీలు ★ ప్రత్యేక హోదా కోసం గురువారం దిల్లీలో ఆందోళన చేపట్టిన ఏపీ కాంగ్రెస్ నేతలను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు ★ ఏపీ కాంగ్రెస్ మహిళా కార్యకర్తలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు ★ ప్రత్యేక హోదా కోసం నిరసన ప్రదర్శన చేపట్టిన ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి సభ్యులు

రాజ్యసభ ఎన్నికలను బాయ్‌కాట్ చేయాలి

- తెదేపా, వైకాపాలకు రఘువీరా పిలుపు
- దిల్లీలో కొనసాగిన 'హోదా' ఆందోళనలు

ఈనాడు, దిల్లీ: రాజ్యసభ ఎన్నికలను తెదేపా, వైకాపా బాయ్‌కాట్ చేయాలని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి కోరారు. తక్షణమే ఎన్డీయే నుంచి తెదేపా బయటకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం దిల్లీలో ఏపీ కాంగ్రెస్, 'ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి' ఆధ్వర్యంలో కొనసాగిన ఆందోళనలు, పార్లమెంటు ముట్టడి కార్యక్రమాల్లో నేతలు ఈ వ్యాఖ్యలు చేశారు. తొలుత ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి, ఆంధ్ర మేధావుల ఫోరం, సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య, ఏఐఎస్ఎఫ్, విద్యార్థి ఐకాసలు, ఏపీ భవన్ నుంచి అర్ధనగ్న ప్రదర్శనగా ఏపీ భవన్ నుంచి బయల్దేరి పార్లమెంటుకి 200 మీటర్ల దూరంలోని కేంద్రీయ సచివాలయ మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటుకొని వెళ్లడానికి యత్నించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం వారందరినీ పోలీసులు అరెస్టు చేసి మందిర్ మార్గ్ స్టేషన్‌కు తరలించి మధ్యాహ్నం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు వీధిలో ఏపీపీసీసీ ఆధ్వర్యంలో మూడో రోజు ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష నిర్వహించారు. అనంతరం రఘువీరా, ఎంపీ కేవీపీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పార్లమెంటు ముట్టడికి బయల్దేరారు. పార్లమెంటు వీధి పోలీసు స్టేషన్ సమీపంలో వీరిని పోలీసులు అడ్డగించి స్టేషన్‌కు తరలిస్తుండగా.. రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఆందోళనలో ఎంపీ సుబ్బరామిరెడ్డి, మాజీ ఎంపీ జేడీ శీలం, రామచంద్రయ్య, ఏపీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తొడకొట్టి.. మీసం మెలేస్తూ

వైకాపా ఎంపీలకు జేసీ దివాకర్‌రెడ్డి సవాల్

ఈనాడు, దిల్లీ: తొడకొట్టి, మీసం మెలేస్తూ తేల్చుకుందాం రమ్మంటూ అనంతపురం ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి వైకాపా ఎంపీలకు సవాల్ విసిరారు. గురువారం పార్లమెంటు ఆవరణలో గాంధీ విగ్రహం ఎదుట తెలుగుదేశం ఎంపీలు, వారికి అభిముఖంగా ఉన్న ప్రధాన గేటు వద్ద వైకాపా ఎంపీలు ఆందోళన చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. వైకాపా ఎంపీల వద్దకు వెళ్లిన దివాకర్‌రెడ్డి.. తొడగొట్టి మీసం మెలేస్తూ మీకు ధైర్యం ఉంటే ప్రజల్లోకి వెళదాం రండి.. ఎవరి సత్తా ఏమిటో అక్కడ తేల్చుకుందాం.. అంటూ విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలకు సవాల్ విసిరారు. కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కయిన వైకాపా నాయకులు ప్లకార్డులు పట్టుకొని ఆందోళన పేరుతో డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ధైర్యమైన నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు.



గురువారం పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద నినాదాలు చేస్తున్న వైకాపా ఎంపీలకు సవాలు చేస్తున్న తెదేపా ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి

జైట్లీ ప్రకటనలో కొత్తేమీ లేదు

- చంద్రబాబు ఎన్నికల డ్రామా ఆడుతున్నారు
- ప్రత్యేక హోదా ఇస్తామన్నవారికే మద్దతు: వైకాపా అధినేత జగన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్

ఈనాడు డిజిటల్- ఒంగోలు: ప్రత్యేక హోదాపై కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటనలో కొత్తదనమేమీ లేదని, సెప్టెంబర్ 2015న ఇదే చెప్పారని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నాడు ఇవే మాటలను స్వాగతించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇప్పుడు వ్యతిరేకించడం కేవలం ఎన్నికల డ్రామా అని విమర్శించారు. బుధవారం నాటి అరుణ్‌జైట్లీ ప్రకటనలపై చంద్రబాబు అతిగా స్పందించారన్నారు. ప్రకాశం జిల్లా సంతరావూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏడాదిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజల్లో ప్రత్యేకహోదా ఆకాంక్ష, రాజీనామాలు చేస్తామని వైకాపా అల్టిమేటం ఇచ్చినందుకే చంద్రబాబు తలొగ్గాల్సి వచ్చిందన్నారు. కేంద్రంలో తమ మంత్రుల రాజీనామాలకు నిర్ణయించుకున్నప్పుడు దిల్లీ పెద్దలతో ఫోన్లో మాట్లాడడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదాపై 14వ ఆర్థిక సంఘం సభ్యుడు అభిజిత్ సేన్ రాసిన నోట్‌ను తాను ఇదివరకే బయటపెట్టానన్నారు. అందులో హోదా ఇవ్వవద్దని ఎక్కడా లేదని చెప్పారు. అసలు 14వ ఆర్థిక సంఘానికి, ఏపీ ప్రత్యేక హోదాకు సంబంధమే లేదని జగన్ వ్యాఖ్యానించారు. 14వ ఆర్థిక సంఘం ప్రతిపాదనలు ఇవ్వకముందే రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలని అప్పటి కేంద్ర మంత్రివర్గం ఆమోదించి, ప్రణాళికా సంఘానికి ఉత్తర్వులు జారీచేసిందని గుర్తుచేశారు. 14వ ఆర్థిక సంఘం చెప్పలేదన్న విషయం తనకు ఇప్పుడు తెలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అనడాన్ని జగన్ తప్పుపట్టారు. 2015 సెప్టెంబరులో అరుణ్‌జైట్లీ ప్రకటించినప్పుడే తాను ఈ విషయం చెప్పానన్నారు. ఈనెల 21న తాము పెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి తెదేపా మద్దతివ్వాలని.. లేదంటే మీరు పెడితే వైకాపా మద్దతివ్వడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. చంద్రబాబుకు సమయం ఇవ్వడానికే ఆ తేదీని నిర్ణయించామని.. ముందుకు జరపడానికి కూడా సిద్ధమేనన్నారు. మొత్తం 25 మంది ఎంపీలు పార్లమెంటు చివరిరోజున రాజీనామాలు చేస్తే కేంద్రంపై ఒత్తిడి పెరిగి దేశమంతటా చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు తనకు 25 మంది ఎంపీలను ఇస్తే ప్రత్యేకహోదా ఇచ్చేవారికే కేంద్రంలో మద్దతిస్తానని జగన్ అన్నారు.

చంద్రబాబుతో కలిసి పనిచేయడం గర్వకారణం

- రాజీనామా చేసిన భాజపా మంత్రుల ఉద్ఘాటన

ఈనాడు, అమరావతి: భాజపాకు చెందిన కామినేని శ్రీనివాస్, మాణిక్యాలరావు గురువారం ఉదయం తమ మంత్రి పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ముఖ్యమంత్రికి అందజేశారు. అనంతరం వీరిద్దరూ శాసనసభకు వచ్చి సభలో సహచర మంత్రులు, సభ్యులనుఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న సాయాన్ని వివరిస్తూనే ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థతను ప్రస్తావించారు. ఆయనతో కలిసి పనిచేయడాన్ని గర్వంగా భావిస్తున్నామన్నారు.

కేంద్రం సహకారం, సీఎం సమర్థతతోనే రాష్ట్రాభివృద్ధి



కేంద్రం సహకారం, ముఖ్యమంత్రి సమర్థతే రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతోంది. కేంద్రం అండతోనే పోలవరం పనులు వేగంగా సాగుతున్నా యి. రాష్ట్ర ప్రగతికి చంద్రబాబు ఎంతో కష్టపడుతున్నారు. ఆయనలా కష్టపడే వారెవరూ ఈ సభలో లేరు. నా పనితీరును విశ్లేషిస్తూ.. ఇటీవల ఆయన అజాతశత్రువు వంటూ కితాబునివ్వడం సంతోషంగా భావిస్తున్నా. తెదేపా ఆవిర్భావంలో నేను ఆ పార్టీలో చేరినా కొన్ని కారణాలతో కొన్నాళ్లు దూరంగా ఉండి వెంకయ్యనాయుడి సూచనతో గత ఎన్నికల ముందు భాజపాలో చేరా. వెంకయ్యనాయుడు, పార్టీ సహకారంతో మంత్రివర్గంలో స్థానం దక్కింది. నాకు అప్పగించిన బాధ్యతలను త్రికరణ శుద్ధితో నిర్వహించా. **- కామినేని శ్రీనివాస్**

ప్రజలు మమ్మల్ని అర్థం చేసుకుంటారు..



రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలు మమ్మల్ని అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం. ఎంతో సంయమనంతో వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి బాధను మేమూ అర్థం చేసుకుంటున్నాం. మంత్రి పదవిలో లేకపోయినా ఆయన వెన్నంటి ఉంటాం. రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం కట్టుబడి ఉంది. ఇప్పటికీ మేము మిత్రులమే. శత్రువులం కానే కాదు. కేంద్రం సహకారంతోనే అమరావతి, పోలవరం నిర్మించుకుంటున్నాం. చిన్న పట్టణాల్లోనూ జాతీయ స్థాయి విద్యాసంస్థలు వచ్చాయి. పోలవరం ముంపు గ్రామాలను తెలంగాణ నుంచి రాష్ట్రంలో చేర్చాలని చంద్రబాబు కోరిన వెంటనే ప్రధాని ఆర్డినెన్స్ జారీ చేయించారు. చంద్రబాబు మంత్రివర్గంలో చేరాక కీలకమైన కృష్ణా, గోదావరి పుష్కరాలు నిర్వహించే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. నా సొంత నియోజకవర్గంలో వైద్య కళాశాల, ఏడీజే కోర్టు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రిని చివరిసారిగా కోరా. **-పి.మాణిక్యాలరావు**

ఛాంపియన్



ఉనద్కత్ 3/38

కుర్రాళ్లతో నిండిన టీమ్‌ఇండియాకు స్ఫూర్తినిచ్చే విజయం..ముక్కోణపు టీ20 టోర్నీ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంక చేతిలో అనూహ్యంగా ఓడిన భారత జట్టు గొప్పగా పుంజుకుంది. సూపర్ ఫామ్‌లో ఉన్న శిఖర్ ధావన్ (55; 43 బంతుల్లో 5×4, 2×6) మరోసారి చెలరేగడంతో గురువారం రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించి టోర్నీలో బోణీ కొట్టింది. భారత్ తన తర్వాత మ్యాచ్‌లో సోమవారం లంకతో తలపడనుంది.


సూపర్ శిఖర్

- మెరిసిన ధావన్
- రాణించిన శంకర్, ఉనద్కత్
- బంగ్లాపై భారత్ ఘన విజయం



"భారత జట్టు నుంచి అందరూ ఆశించే ప్రదర్శన ఇదే. లంకతో ఓటమి తర్వాత మా తప్పుల్ని సమీక్షించుకున్నాం. బౌండరీ పెద్దగా ఉండడం వల్ల బ్యాట్స్‌మెన్‌కు భారీ షాట్లు కష్టమయ్యాయి. బౌలర్లు మా ప్రణాళికలకు తగ్గట్టుగా బంతులేశారు. క్యాచింగ్‌లో మేమింకా మెరుగుపడాలి. ఇంతకంటే మెరుగైన ఫీల్డింగ్ చేసే సత్తా ఈ జట్టుకుంది. రాబోయే మ్యాచ్‌ల్లో తప్పులు పునరావృతం కాకుండా చూసుకుంటాం"

– కెప్టెన్ రోహిత్‌శర్మ



'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' విజయ్ శంకర్ (2/32)



ధావన్ 55

కొలంబో

భారత్ గాడిలో పడింది. ఓపెనర్ శిఖర్ ధావన్ మరోసారి మెరుపు ఇన్నింగ్స్ ఆడిన వేళ ముక్కోణపు టీ20 సిరీస్‌లో భారత్ తొలి విజయాన్ని నమోదు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా.. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' విజయ్ శంకర్ (2/32), జయ్‌దేవ్ ఉనద్కత్ (3/38) విజృంభించడంతో 8 వికెట్లకు 139 పరుగులే చేసింది. ధావన్ మెరుపులతో లక్ష్యాన్ని భారత్ 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

ధావన్ మళ్లీ..: ఏమా షాట్లు.. ఏమా బ్యాటింగ్! శిఖర్ ధావన్ మరోసారి చెలరేగాడు. ధనాధన్ బ్యాటింగ్‌తో భారత్‌కు అలవోక విజయాన్ని అందించాడు. తొలి ఓవర్ నుంచే అతని జోరు మొదలైంది. తన శైలి కట్ షాట్లు, డ్రైవ్‌లు ఆడిన ఈ ఓపెనర్.. సులభంగా పరుగులు సాధించాడు. కెప్టెన్ రోహిత్‌శర్మ (17; 13 బంతుల్లో 3×4)తో కలిసి తొలి వికెట్‌కు శుభారంభం అందించాడు. ఐతే ముస్తాఫిజుర్ బంతిని వికెట్ల మీదకు ఆడుకుని రోహిత్ ఔట్ కావడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన రిషబ్ పంత్ (7) ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అతను రూబెల్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. స్వల్ప విరామంలో రెండు వికెట్లు పడినా ధావన్ ఆగలేదు. తస్కిన్ బౌలింగ్‌లో లాంగ్‌ఆన్ మీదుగా అద్భుతమైన సిక్స్ అందుకున్నాడు. రైనా (28; 27 బంతుల్లో 1×4, 1×6) నుంచి అతనికి మంచి సహకారం లభించింది. మహ్మదుల్లా బంతిని స్టాండ్స్‌లోకి కొట్టి అర్ధసెంచరీకి చేరువైన శిఖర్.. ఆ తర్వాత ఓవర్లో రెండో బంతిని బౌండరీ దాటించి అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ టోర్నీలో అతనికిది వరుసగా రెండో అర్ధసెంచరీ. ఐతే రూబెల్ బౌలింగ్‌లో పుల్ షాట్‌కు ప్రయత్నించి రైనా ఔటైనా.. ఆ తర్వాత ధావన్ కూడా వెనుదిరగడంతో భారత్ 126/4తో నిలిచింది. రన్‌రేట్ అదుపులో ఉండడంతో మనీష్ పాండే (27 నాటౌట్; 19 బంతుల్లో 3×4), దినేశ్ కార్తీక్ (2 నాటౌట్)తో కలిసి ఎలాంటి ఒత్తిడి లేకుండా లాంఛనాన్ని పూర్తి చేశాడు.

ఆకట్టుకున్న పేసర్లు: టాస్ గెలిచి బంగ్లాదేశ్‌ను బ్యాటింగ్‌కు దించిన భారత్ అందుకు తగ్గ ప్రతిఫలం పొందింది. పేసర్లు జయ్‌దేవ్ ఉనద్కత్, విజయ్ శంకర్ కట్టుదిట్టంగా బంతులేయడంతో బంగ్లా వేగంగా పరుగులు చేయలేకపోయింది. 35 పరుగులకే తమిమ్ ఇక్బాల్ (15; 16 బంతుల్లో 2×4), సౌమ్య సర్కార్ (14; 12 బంతుల్లో 1×4, 1×6) ఔటయ్యారు. ఉనద్కత్ బౌలింగ్‌లో చాహల్ పట్టిన చురుకైన క్యాచ్‌కు సౌమ్య సర్కార్ వెనుదిరగ్గా.. శార్దూల్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టి ఊపు మీద కనిపించిన తమిమ్.. షార్ట్ పిచ్ బంతిని భారీ షాట్‌గా కొట్టబోయి షార్ట్ ఫైన్‌లెగ్‌లో ఉనద్కత్‌కు చిక్కాడు. శంకర్ వేసిన ఓవర్లో రెండుసార్లు ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న లిటన్‌దాస్ (34; 30 బంతుల్లో 3×4) ఆ తర్వాత నిలబడి ఆడాడు. వీలు చిక్కినప్పుడల్లా అతను బంతిని బౌండరీ దాటించడంతో బంగ్లా ఆ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. కానీ బంగ్లా క్రమం తప్పకుండా వికెట్లు చేజార్చుకుంది. గంటకు 130 కి.మీ పైన వేగంతో బంతులేసిన శంకర్.. ముష్ఫికర్ రహీం (18)ను ఔట్ చేసి తొలి అంతర్జాతీయ వికెట్ సాధించాడు. ఆఫ్ స్టంప్ మీద పడిన ఈ బంతిని రహీం కట్ చేయబోయి వికెట్‌కీపర్ దినేశ్ కార్తీక్‌కు క్యాచ్ ఇచ్చాడు. పది ఓవర్లకు బంగ్లా స్కోరు 3 వికెట్లకు 69 పరుగులు. ఆ తర్వాత ఓవర్లో కెప్టెన్ మహ్మదుల్లా (1)ను పెవిలియన్ చేర్చిన శంకర్.. బంగ్లాను పెద్ద దెబ్బ కొట్టాడు. ఆ తర్వాత ఆ జట్టు ధాటిగా ఆడలేకపోయింది. పేసర్లతో పాటు స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్ (0/23), చాహల్ (1/19) పొదుపుగా బంతులేయడంతో చివరి ఐదు ఓవర్లలో బంగ్లా 32 పరుగులే చేయగలిగింది. భారత ఫీల్డర్లు క్యాచ్‌లు విడిచిపెట్టడం, 15 అదనపు పరుగులు ఇవ్వడం కూడా బంగ్లాకు కలిసొచ్చింది.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తమిమ్ (సి) ఉనద్కత్ (బి) శార్దూల్ ఠాకూర్ 15; సౌమ్య సర్కార్ (సి) చాహల్ (బి) ఉనద్కత్ 14; లిటన్ దాస్ (సి) రైనా (బి) చాహల్ 34; ముష్ఫికర్ రహీం (సి) కార్తీక్ (బి) విజయ్ శంకర్ 18; మహ్మదుల్లా (సి) శార్దూల్ ఠాకూర్ (బి) విజయ్ శంకర్ 1; సబ్బీర్ రెహ్మాన్ (సి) కార్తీక్ (బి) ఉనద్కత్ 30; మెహదీ మిరాజ్ (సి) పాండే (బి) ఉనద్కత్ 3; తస్కిన్ అహ్మద్ నాటౌట్ 8; రుబెల్ హుస్సేన్ రనౌట్ 0; ముష్ఫికర్ రహీం నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 139; **వికెట్ల పతనం:** 1-20, 2-35, 3-66, 4-72, 5-107, 6-118, 7-134, 8-135; **బౌలింగ్:** జయ్‌దేవ్ ఉనద్కత్ 4-0-38-3; వాషింగ్టన్ సుందర్ 4-0-23-0; శార్దూల్ ఠాకూర్ 4-0-25-1; చాహల్ 4-0-19-1; విజయ్ శంకర్ 4-0-32-2

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) ముస్తాఫిజుర్ 17; ధావన్ (సి) లిటన్ దాస్ (సి) తస్కిన్ అహ్మద్ 55; రిషబ్ పంత్ (బి) రూబెల్ హుస్సేన్ 7; రైనా (సి) మెహదీ మిరాజ్ (బి) రూబెల్ హుస్సేన్ 28; పాండే నాటౌట్ 27; కార్తీక్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం:** (18.4 ఓవర్లలో 4 వికెట్లకు) **140; వికెట్ల పతనం:** 1-28, 2-40, 3-108, 4-123; **బౌలింగ్:** ముస్తాఫిజుర్ రెహ్మాన్ 4-0-31-1; తస్కిన్ అహ్మద్ 3-0-28-1; రూబెల్ హుస్సేన్ 3.4-0-24-2; మెహదీ హసన్ మిరాజ్ 4-0-21-0; సౌమ్య సర్కార్ 1-0-8-0; మహ్మదుల్లా 1-0-11-0; నజ్ముల్ ఇస్లాం 2-0-15-0





భార్య హసీన్ జహాన్ తాజా వ్యాఖ్యలు

పాకిస్థాన్ అమ్మాయి.. డబ్బిచ్చింది..!

ముంబయి: టీమ్ ఇండియా పేసర్ మహమ్మద్ షమీకి ఇతర మహిళలతో సంబంధాలున్నాయని ఆరోపణలు చేసిన అతడి భార్య హసీన్ జహాన్ తాజాగా మరికొన్ని సంచలన వ్యాఖ్యలు చేసింది. పాకిస్థాన్ మహిళ నుంచి షమి డబ్బు పొందాడని, ఐతే ఎందుకోసం అతడు తీసుకున్నాడన్న సంగతి తెలియదని చెప్పింది. తనను మోసం చేసిన అతడు దేశాన్నీ మోసం చేయగల ఘనుడని విమర్శించింది. "పాకిస్థాన్‌కు చెందిన అలీష్‌బా తనకు డబ్బు ఇచ్చిందని షమినే చెప్పాడు. ఎందుకోసం ఇచ్చిందన్న సంగతి మాత్రం చెప్పలేదు. నాకూ తెలియదు. ఐతే నన్ను మోసం చేసిన అతడు దేశాన్ని కూడా మోసం చేయగలడు. అలీష్‌బాతో షమికి సంబంధాలున్నాయనడానికి నా దగ్గర ఆధారాలున్నాయి. దుబాయ్‌లో వారు బస చేసిన హోటల్‌కు వెళ్తే అతడు గది తీసుకున్నాడా లేదా అన్నది తేలిపోతుంది. తాను డబ్బు తీసుకున్నానని షమి చెప్పిన రికార్డింగ్ కూడా నా దగ్గర ఉంది" అని హసీన్ చెప్పింది. ఒకానొక సందర్భంలో షమీ ఆత్మహత్యకు ప్రయత్నించాడని ఆమె తెలిపింది. "షమితో నాకు పరిచయం అవడానికి ముందు.. ఐదేళ్లు అతడు తన చుట్టాలమ్మాయితో సంబంధం కొనసాగించాడు. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుందాం అనుకున్నాడు. కానీ అతని ఇంట్లో వాళ్లు ఒప్పుకోకపోవడంతో ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు" అని హసీన్ పేర్కొంది. "అతని కోసం నేను చాలా చేశా. మోడలింగ్ కెరీర్‌ను వదులుకున్నా. ఉద్యోగాన్ని మానేశా. ఇళ్లు వదలి బయటకు కూడా రాలేదు. ఇవన్నీ చేసిన నన్ను వదిలించుకోవాలనుకున్నాడు. దక్షిణాఫ్రికా పర్యటన నుంచి తిరిగివచ్చాక ఆస్తి, బీమా పత్రాలు తీసుకుని నన్ను దూరం పెట్టే ప్రయత్నం చేశాడు. గత రెండేళ్ల నుంచి అతడు విడాకులు అడుగుతున్నాడు. కానీ నా ఊపిరి ఉన్నంత వరకూ అతనికి విడాకులు ఇవ్వను. నా దగ్గర అన్ని ఆధారాలున్నాయి. అతణ్ని కోర్టుకు లాగుతా" అని హసీన్ ఆరోపణలు చేసింది.

పిచ్చి పట్టింది: తన భార్య చేసిన ఫిక్సింగ్ ఆరోపణలను షమి ఖండించాడు. ఆమె మానసిక స్థితి సరిగా ఉండకపోవచ్చని చెప్పాడు. "హసీన్ వ్యాఖ్యలు చూస్తుంటే ఆమెకు పిచ్చి పట్టినట్టుంది. ఫిక్సింగ్ అభియోగాలు దారుణం. వాటిని నిరూపించాల్సిన అవసరముంది. సరైన విచారణ చేపట్టాలి. హసీన్‌తో మాట్లాడేందుకు నేను ప్రయత్నిస్తున్నా కుదరడం లేదు. ఆమె చుట్టూ ఉన్న వాళ్లు చేసిన కుట్ర ఇది. హసీన్ ఇప్పుడే ఈ ఆరోపణలు ఎందుకు చేస్తుందన్నదే అర్థం కావడం లేదు" అని షమి అన్నాడు.



కోహ్లిని ఎంపిక చేయడం వల్ల.. నా పదవి పోయింది

ముంబయి: విరాట్ కోహ్లి లాంటి నాణ్యమైన ఆటగాడిని జాతీయ జట్టులోకి ఎంపిక చేసిన ఏ సెలక్టర్‌కైనా అదో గొప్ప ఘనతగా మిగిలిపోవాలి..! కానీ టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్‌కు మాత్రం కోహ్లి ఎంపిక పదవి కోల్పోవడానికి కారణం అయ్యిందట. అతడే ఈ విషయాన్ని బయటపెట్టాడు. వెంగ్‌సర్కార్ 2006 నుంచి 2008 వరకు బీసీసీఐ చీఫ్ సెలక్టర్‌గా సేవలు అందించాడు. మరో ఏడాది అతడిని కొనసాగించే అవకాశమున్నా.. అందుకు అంగీకరించని బోర్డు అతడి స్థానంలో కృష్ణమాచారి శ్రీకాంత్‌కు బాధ్యతలు అప్పగించింది. "కోహ్లి సారథ్యంలో భారత్ అండర్-19 ప్రపంచకప్ గెలిచింది. 2008లో ఆస్ట్రేలియాలో జరిగిన వర్ధమాన క్రికెటర్ల టోర్నీలోనూ కోహ్లి రాణించాడు.. ఈ నేపథ్యంలో శ్రీలంక పర్యటనకు విరాట్‌ను ఎంపిక చేయాలని భావించాను. సహచర సెలక్టర్లు కూడా అంగీకరించారు. ఐతే కోహ్లి ఆటను చూడని ధోని, కిర్‌స్టన్‌లు అందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. ఐతే.. కోహ్లి ఆటను ప్రత్యక్షంగా చూశాను.. అతడిని జట్టులో ఆడించాలని వారితో చెప్పాను. వారు చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడైన బద్రినాథ్‌ను తీసుకోవాలని భావిస్తున్నట్లు నాకు తెలుసు. కోహ్లిని తీసుకుంటే బద్రినాథ్‌కు చోటుండదు. ఆ సమయంలో శ్రీనివాసన్ బీసీసీఐ కోశాధికారిగా ఉన్నాడు. బద్రిని ఎంపిక చేయకపోవడంపై అతడు అసంతృప్తి వ్యక్తం చేశాడు. అసలు ఏ కారణంతో బద్రిపై వేటు వేశారని ప్రశ్నించాడు. విరాట్ అసాధారణ ఆటగాడని చెప్పాను. బద్రినాథ్ తమిళనాడు తరఫున అద్భుతంగా ఆడుతున్నాడని శ్రీని వాదించడంతో.. అతడికి అవకాశం వస్తుందని అన్నాను. ఇప్పటికే అతడికి 29 ఏళ్లు ఇంకెప్పుడు అని ప్రశ్నించగా.. సమయం వచ్చినప్పుడు అని బదులిచ్చాను. ఆ తర్వాతి రోజే శ్రీనివాసన్.. శ్రీకాంత్‌ను వెంటబెట్టుకుని అప్పటి బీసీసీఐ అధ్యక్షుడు శరద్ పవార్ దగ్గరకు వెళ్లాడు. ఆ తర్వాత కొన్ని రోజులకే చీఫ్ సెలక్టర్‌గా నా పదవికి తెరపడింది" అని వెంగ్‌సర్కార్ వివరించాడు.



శ్రేయస్ అయ్యర్ (61)

దేవధర్ ట్రోఫీ ఛాంప్ భారత్-బి

ఫైనల్లో కర్ణాటక ఓటమి

ధర్మశాల: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీతో పాటు.. దేవధర్ ట్రోఫీ కూడా కైవసం చేసుకోవాలనుకున్న కర్ణాటకకు నిరాశే ఎదురైంది. దేవధర్ ట్రోఫీ ఆ జట్టు చేజారింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత్-బి గురువారం 6 వికెట్ల తేడాతో కర్ణాటకను ఓడించింది. 280 పరుగుల లక్ష్యాన్ని భారత్-బి 48.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కర్ణాటక రవికుమార్ సమర్థ్ (107) సీఎం గౌతమ్ (76) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 279 పరుగులు చేసింది. లక్ష్యాన్ని భారత్-బి పెద్దగా శ్రమించకుండానే ఛేదించింది. రుతురాజ్ (58), ఈశ్వరన్ (69) అర్ధసెంచరీలతో జట్టుకు శుభారంభం అందించగా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (61), మనోజ్ తివారి (59 నాటౌట్) జట్టును విజయపథంలో నడిపారు.

అజ్లాన్ షా కప్ హాకీలో ఈనాడు
భారత్ × ఐర్లాండ్
మ॥ 3..35 నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో

వివేక్, శేష్‌ల తొలగింపు

అధ్యక్ష, కార్యదర్శులను తప్పించిన అంబుడ్స్‌మన్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జి.వివేకానంద్, కార్యదర్శి శేష్‌నారాయణలపై అంబుడ్స్‌మన్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి వేటువేశారు. వారిద్దరిని ఆయా పదవుల నుంచి తప్పిస్తూ గురువారం ఆదేశాలు జారీ చేశారు. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు కలిగి ఉండటం.. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా కొనసాగుతుండటంతో హెచ్‌సీఏ అధ్యక్ష పదవికి వివేక్ అనర్హుడంటూ జస్టిస్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఏసీబీ అభియోగ పత్రంలో పేరున్న శేష్‌నారాయణ కార్యదర్శి పదవిలో కొనసాగేందుకు వీల్లేదని స్పష్టంచేశారు. హెచ్‌సీఏ నియమావళి ప్రకారం అధ్యక్ష, కార్యదర్శి పదవులకు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. అప్పటి వరకు తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రస్తుత ఉపాధ్యక్షుడు.. తాత్కాలిక కార్యదర్శిగా కోశాధికారి కొనసాగుతారు. వీరిద్దరు ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోరాదంటూ స్పష్టంచేశారు.

బీసీసీఐ ఎన్నికలు నిర్వహించండి

సుప్రీం కోర్టుకు సీఓఏ విజ్ఞప్తి ● ఆటగాళ్ల ఒప్పందాలపై సంతకాలు చేయను: బోర్డు కార్యదర్శి

దిల్లీ: బీసీసీఐ అధికారులు.. సుప్రీం కోర్టు నియమిత పాలకుల కమిటీ (సీఓఏ) మధ్య వైరం ముదురుతోంది. పదవీ కాలం ముగిసిన బోర్డు పాలక సభ్యులను వెంటనే తొలగించి, బీసీసీఐ ఎన్నికలు నిర్వహించేందుకు ఆదేశాలివ్వాలని సీఓఏ సుప్రీం కోర్టును కోరగా.. మరోవైపు తమను సంప్రదించకుండానే ఆటగాళ్ల వార్షిక ఒప్పందాలపై సీఓఏ నిర్ణయం తీసుకుందని, వాటిపై సంతకాలు చేసే ప్రసక్తే లేదంటున్నాడు బోర్డు కార్యదర్శి అమితాబ్ చౌదరి. లోధా కమిటీ సిఫార్సుల అమలుపై నియమితమైన సీఓఏ గురువారం సుప్రీం కోర్టుకు ఏడో ప్రగతి నివేదికను సమర్పించింది. బీసీసీఐ నియమావళి ప్రకారం.. తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరి, కోశాధికారి అనిరుధ్ చౌదరి, ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లాల పదవీ కాలం ఇప్పటికే ముగిసిపోయిందని వినోద్ రాయ్, డయానా ఎడుల్జీలతో కూడిన పాలకుల కమిటీ తన నివేదికలో కోర్టుకు తెలిపింది. వారి స్థానంలో కొత్త వారిని ఎంపిక చేసేందుకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. లోధా సిఫార్సుల ప్రకారం కొత్త నియమావళి ఇంకా అమల్లోకి రాకపోయినప్పటికీ.. వార్షిక సర్వ సభ్య సమావేశం నిర్వహించే అవకాశమివ్వాలని కోర్టును కోరింది. మరోవైపు భారత క్రికెటర్లకు కొత్తగా వార్షిక ఒప్పందాలు ఇచ్చిన తీరును బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరి తప్పు పట్టాడు. బోర్డు పాలక సభ్యులను సంప్రదించకుండానే ఒప్పందాలపై సీఓఏ తుది నిర్ణయం తీసుకుందని ఆరోపించాడు. ఒప్పంద పత్రాలపై తాను సంతకం చేయనని చెప్పాడు. ఐతే సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ అమితాబ్ ఆరోపణలను కొట్టిపారేసింది. పాలక సభ్యులకు మూడుసార్లు సమాచారం అందించినా ఎవరూ అందుబాటులోకి రాలేదని.. బీసీసీఐ ఫైనాన్స్ కమిటీ కొత్త కాంట్రాక్ట్‌లపై చర్చించిందని వివరించింది.



ఐ-లీగ్ ఛాంప్ మినర్వా

పంచకుల: మినర్వా పంజాబ్ ఫుట్‌బాల్ క్లబ్ సత్తాచూపింది. హీరో ఐ-లీగ్ ఫుట్‌బాల్ 2017-18 సీజన్ విజేతగా నిలిచింది. గురువారం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో మినర్వా పంజాబ్ 1-0తో చర్చిల్ బ్రదర్స్‌ను ఓడించి టైటిల్ గెలుచుకుంది. విలియమ్ అసైడు (16వ నిమిషంలో) గోల్ చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. మినర్వతో పాటు మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్, నెరోక ఎఫ్‌సీకు కప్ గెలిచేందుకు అవకాశం ఉంది. అయితే చర్చిల్ బ్రదర్స్‌ను ఓడించిన మినర్వ 35 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్ ఎగరేసుకుపోయింది.

సెన్సెక్స్ ▲ 318 **33352** | నిఫ్టీ ▲ 88 **10243** | డోజోన్స్ 24730 ▼ 68 | నాస్‌డాక్ 7411 ▲ 16 | రూపాయి 65.14 ▼ (ఒక అమెరికా డాలరుకు) 25 పైసలు | ముడి చమురు 63.89 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


ఈనాడు బిజినెస్

ఘనం (+) / గ్రహణం (-)


నిఫ్టీ	8న	మార్పు %	నిఫ్టీ	8న	మార్పు %
SBI	256.80	4.12	SUN PHARMA	514.60	-1.95
ICICI BANK	296.95	3.58	TATA STEEL	635.90	-1.82
ADANI PORT	387.95	2.92	YES BANK	308.55	-1.09
M & M	726.65	2.66	GAIL (INDIA)	436.45	-0.98
RELIANCE IND	911.45	2.44	TCS	3003.95	-0.78
HDFC	1798.75	2.10	HINDALCO	222.70	-0.78
ASIAN PAINTS	1127.60	1.84	TATA MOTORS	345.15	-0.76

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.08	68.51	బహ్రెయిన్ దీనార్	160.00	183.36
పౌండ్ స్టెర్లింగ్	82.14	95.27	కువైట్ దీనార్	179.14	223.00
యూరో	73.28	84.98	ఒమన్ రియాల్	156.68	179.26
జపనీస్ యెన్/100	55.68	64.59	సౌదీ రియాల్	15.71	18.62
ఆస్ట్రేలియా డాలరు	46.27	53.54	యూఏఈ దిర్హమ్	16.08	18.80
సింగపూర్ డాలరు	44.97	53.25	మలేషియా రింగిట్	14.81	18.22
థాయ్ బాత్/100	188.71	225.69	చైనీస్ యువాన్	7.26	11.77



విమానాశ్రయాల అభివృద్ధికి రూ.18,000 కోట్లు

- ఉడాన్‌తో సామాన్యుడికీ విమానయానం
- ఛార్జీలు ఇంకా తగ్గాలి
- పౌరవిమానయాన కార్యదర్శి ఆర్ఎన్ చౌబే
- వింగ్స్ ఇండియా 2018 ప్రారంభం



విమానయానంలో ఉన్న అవకాశాలపై శ్వేతపత్రం విడుదల చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఉషా పాధి, సందీప్ సోమాని, చౌబే, బీఎస్ భుల్లార్

ఈనాడు, హైదరాబాద్: సామాన్యులు సైతం విమాన ప్రయాణం చేయాలన్న కల నెరవేరేందుకు 'ఉడాన్' పథకం ఎంతో తోడ్పడుతోందని, ఇది మరింత ప్రయోజనకరంగా ఉండాలంటే విమాన టిక్కెట్ల ధరలు ఇంకా తగ్గాల్సిన అవసరం ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి రాజీవ్ నాయన్ చౌబే అన్నారు. దేశీయ విమానయాన రంగం గత కొనేళ్లుగా 20శాతం వృద్ధి సాధిస్తోందని తెలిపారు. ఈ ఏడాది 17.5శాతం వృద్ధి కనిపించిందన్నారు. మిగతా దేశాలన్నింటికన్నా ఇది అధికమని చెప్పారు. చిన్న పట్టణాలకూ విమాన సౌకర్యం ఉండాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'వింగ్స్ ఇండియా 2018' పౌర విమానయాన, ఏరోస్పేస్ ప్రదర్శన గురువారం హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో ప్రారంభమైంది. కేంద్ర పౌర విమానయాన శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ)లు ఈ ప్రదర్శనను సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ ప్రదర్శన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.టి.రామారావు హాజరయ్యారు. 10 దేశాల ప్రతినిధులు కూడా పాల్గొంటున్న ఈ ప్రదర్శనలో వివిధ కంపెనీలకు చెందిన విమాన విడిభాగాలతో స్టాళ్లను ఏర్పాటు చేశారు. దాదాపు 15 విమానాలను ప్రదర్శనలో ఉంచారు. 'ప్రపంచ విమానయాన రంగానికి భారత్ కేంద్రం' అనే ప్రధాన భావనతో దీన్ని నిర్వహిస్తున్నారు. విమాన రంగంలోని కంపెనీల మధ్య చర్చలు, పెట్టుబడుల ప్రతిపాదనలు, వివిధ పట్టణాల మధ్య విమాన సర్వీసుల అనుసంధానికి అవసరమైన చర్యలు తదితర అంశాలపై చర్చలకు ఈ సదస్సు వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చౌబే మాట్లాడుతూ.. విమానయాన రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పెంచేందుకు వీలుగా అవసరమైన చట్టాలను సవరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. విమానాశ్రయాల అభివృద్ధి కోసం రానున్న నాలుగైదేళ్లలో దాదాపు రూ.18వేల కోట్లను కేటాయించాలని ఏఏఐ నిర్ణయించిందని తెలిపారు. రానున్న 5-6 ఏళ్లలో దాదాపు 8,000-10,000 మంది పైలెట్ల అవసరం ఉందన్నారు. మిగతా విభాగాల్లో కూడా పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉడాన్ పథకం కింద 56 రూట్లను ఎంపిక చేశామనీ, ఇప్పటికే ఇందులో 19 రూట్లలో విమానాలు తిరుగుతున్నాయని అన్నారు. ప్రతి 15 రోజులకో విమానాశ్రయాన్ని ఈ పథకంలోకి తీసుకొస్తున్నామన్నారు. విమానాల్లో ఉపయోగించే ఇంధనం (ఏటీఎఫ్)పై వ్యాట్ 14-15 శాతం ఉంటోందని, విమాన టిక్కెట్ల ధరలు అధికంగా ఉండటానికి ఇదీ ఒక కారణం అవుతోందని అన్నారు. రాష్ట్రాలు ఈ పన్నును తగ్గించాల్సిందిగా కోరారు. తెలంగాణ మంత్రి కేటీఆర్ ఈ విషయాన్ని పరిశీలిస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. ముడి చమురు బ్యారెల్ ధర 80 డాలర్లలోపు ఉంటే.. రానున్న 20 ఏళ్లలో విమానయాన రంగం స్థిరంగా 15 శాతం వృద్ధితో ముందుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. గత 65 ఏళ్లలో 395 విమానాలు దేశంలో ఉంటే.. మూడేళ్ల కాలంలో 900 విమానాలకు ఆర్డర్లు ఇచ్చారని తెలిపారు. అలాగే 60 ఏళ్లలో 75 విమానాశ్రయాలు అందుబాటులోకి రాగా.. రెండేళ్లలో కొత్తగా 56 సిద్ధమయ్యాయని తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో దాదాపు 400 ఎయిర్ స్ట్రిప్‌లు నిర్మించారనీ.. ఇందులో కొన్నింటిని 51: 49 భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఏఏఐ రాష్ట్రప్రభుత్వాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న విమానాశ్రయాల సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తేనే.. రానున్న ఐదేళ్లలో వచ్చే రద్దీని తట్టుకునేందుకు సాధ్యమవుతుందని తెలిపారు. ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా చట్టాన్ని సవరించి, విమానాశ్రయాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచేందుకు వీలు కల్పించే ఉద్దేశంతో ఉన్నట్లు తెలిపారు. ఫిక్కీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సందీప్ సోమాని, డీజీసీఏ డైరెక్టర్ జనరల్ బీఎస్ భుల్లార్, పౌర విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా పాధి పాల్గొన్నారు.



హోండా జెట్‌తో ఆరో ఎయిర్‌క్రాఫ్ట్స్ ఒప్పందం

చిన్న విమానాలు, వ్యక్తిగత విమానాలు తయారు చేసే హోండా జెట్‌తో ఆరో ఎయిర్ క్రాఫ్ట్స్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. హోండా జెట్‌లను విక్రయించే అధీకృత డీలర్‌గా ఇక మీదట ఆరో ఎయిర్ క్రాఫ్ట్స్ సంస్థ వ్యవహరించనుంది. ఈ మేరకు ఉభయ వర్గాల మధ్య ఒప్పందం కుదిరింది.

అశోక్ గజపతి సేవలు అభినందనీయం

రాజకీయాల్లో కొన్నిసార్లు ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటాయని కేటీఆర్ అన్నారు. పౌర విమానయాన శాఖ మంత్రిగా వింగ్స్ ఇండియా 2018కి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిన కేంద్ర మంత్రి రాజీనామా ప్రకటన చూసి ఆశ్చర్యపోయానని పేర్కొన్నారు.

ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణ వేగవంతం

ఈనాడు, హైదరాబాద్: అప్పుల ఊబిలో కూరుకుపోయిన ప్రభుత్వ విమానయాన సంస్థ ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు పౌర విమానయాన శాఖ కార్యదర్శి రాజీవ్ నాయన్ చౌబే తెలిపారు. రానున్న రెండు మూడు వారాల్లో దీనికి సంబంధించి ఆసక్తి ఉన్న వారి నుంచి బిడ్లను స్వీకరిస్తామని పేర్కొన్నారు. 'వింగ్స్ ఇండియా 2018'లో ఆయన మాట్లాడుతూ.. పవన్ హన్స్‌కు సంబంధించి కూడా మరోసారి బిడ్లను ఆహ్వానించే అవకాశం ఉందని తెలిపారు. ఎయిరిండియాను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్న వారి కోసం తమ మంత్రిత్వ శాఖ చూస్తోందని, అదే సమయంలో పవన్ హన్స్‌లో కూడా పెట్టుబడుల ఉపసంహరణ వేగంగా పూర్తయ్యే విధంగా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. గత ఏడాది జూన్‌లో కేంద్ర ప్రభుత్వం ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణ చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ఏవియేషన్ హబ్‌గా తెలంగాణ: మంత్రి కేటీఆర్

తెలంగాణ రాష్ట్రంలో విమానయాన రంగం అభివృద్ధికి మంచి అవకాశాలున్నాయని మంత్రి కె.తారక రామారావు అన్నారు. ఇప్పటికే ఇక్కడ మూడు ఏరో స్పేస్ సెజ్‌లు ఉన్నాయనీ, నాలుగోదానిని హైదరాబాద్ శివారులోని ఎలిమినేడులో ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందని అన్నారు. ప్రపంచ స్థాయి విమానయాన సంస్థలు తెలంగాణతో కలిసి పనిచేస్తున్నాయన్నారు. వరంగల్ విమానాశ్రయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి గనులతో అనుసంధానం చేసేలా కొత్తగూడెంలో కొత్త విమానాశ్రయం ఏర్పాటుకు యోచిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని జీఎంఆర్ విమానాశ్రయం 1.8కోట్ల మంది ప్రయాణికులకు సేవలందిస్తోందనీ, ఏటా 125 మెట్రిక్ టన్నుల కార్గో ఇక్కడ నుంచి రవాణా అవుతోందని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా ఈ విమానాశ్రయం అనేక విభాగాల్లో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. హైదరాబాద్ విమానాశ్రయంలో ప్రత్యేకంగా ఫార్మా రవాణా సౌకర్యం ఉందనీ, రానున్న ఫార్మా సిటీకి ఇది ఎంతో తోడ్పడుతుందన్నారు. తెలంగాణలో ఇప్పటికే.. బేగంపేట, వరంగల్, హకీంపేట, దుండిగల్, నాదర్‌గుల్, రామగుండంలో విమానాశ్రయాలు ఉన్నాయన్నారు. బేగంపేట విమానాశ్రయంలో నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చూడాలని చౌబేని కోరారు. దీనివల్ల ఇక్కడి యువకుల్లో నైపుణ్యాలు పెరిగేందుకు తోడ్పడుతుందని తెలిపారు. అంతకు ముందు సీఈఓల సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు

బోయింగ్ హారిజన్‌ఎక్స్ 13 అంకురాల ఎంపిక

ఏరో స్పేస్ రంగంలో ఉన్న అంకురాలను ప్రోత్సహించేందుకు టి-హబ్, బోయింగ్ సంయుక్తంగా నిర్వహించిన హారిజన్‌ఎక్స్ కార్యక్రమానికి 13 అంకురాలు ఎంపికయ్యాయి. ఇది నవంబరు 28, 2017లో ప్రారంభమయ్యింది. మొత్తం 80 అంకురాలు దీనికి దరఖాస్తు చేసుకున్నాయి. ఎంపికైన సంస్థలకు బోయింగ్ యాక్సిలరేటర్ కార్యక్రమం కింద సాంకేతిక సహాయాన్ని అందిస్తుంది. ఏరోస్పేస్, అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫాక్చరింగ్, ఐఓటీ, ఆటోమేషన్, అనలటిక్స్, కృత్రిమ మేథ, మెషిన్ లెర్నింగ్ తదితర అంశాల్లో సహాయం అందిస్తుంది. యాక్సిలరేటర్ ప్రోగ్రాంను పూర్తి చేసుకున్న అంకురాన్ని తుది విజేతగా ప్రకటిస్తారు.



హెలీట్యాక్సీలు నడుపుతాం

పవన్ హన్స్ ఛైర్మన్ బి.పి.శర్మ

ఈనాడు, హైదరాబాద్: దేశీయంగా హెలికాప్టర్ సేవలనందించడంలో పవన్ హన్స్ కీలకపాత్ర పోషిస్తోందని సంస్థ ఛైర్మన్ బి.పి.శర్మ అన్నారు. దేశంలో 20 రాష్ట్రాలు తమ హెలికాప్టర్ సేవలను వినియోగిస్తున్నాయని తెలిపారు. 6 నుంచి 26 సీట్ల హెలికాప్టర్లను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 50 హెలికాప్టర్లు నిర్వహిస్తుండగా.. 2025కల్లా 100 హెలికాప్టర్ల కంపెనీగా గుర్తింపు పొందుతామన్నారు. రానున్న 10 ఏళ్లలో రూ.4వేల కోట్ల పెట్టుబడి పెట్టబోతున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన నగరాల్లో హెలీట్యాక్సీలను నడిపే ఉద్దేశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే చాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇక్కడ వీటిని నడపేందుకు ప్రతిపాదించిందని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో సరస్సులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సీప్లేన్‌లను నడిపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. కొండ ప్రాంతాలు, ద్వీపాలు, విమానాలు తిరిగేందుకు ఇబ్బందులున్న ప్రాంతాల్లోకి హెలికాప్టర్లను నడిపేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు వివరించారు.

వింగ్స్ ఇండియా 2018 పురస్కారాల ప్రదానం

జాతీయస్థాయిలో ఉత్తమ ప్యాసింజర్ ఫ్రెండ్లీ ఎయిర్‌లైన్స్‌గా విస్తారా, ఉత్తమ డొమిస్టిక్ ఎయిర్‌లైన్స్‌గా స్పైస్‌జెట్ సంస్థలు అవార్డులు గెలుచుకున్నాయి. ఏవియేషన్ ప్రదర్శనలో భాగంగా రాత్రి హోటల్ తాజ్‌కృష్ణలో వింగ్స్ ఇండియా 2018 పురస్కారాలు అందజేశారు. విమానయాన రంగంలో ప్రయాణికులకు సేవలందిస్తున్న సంస్థలకు 13 విభాగాల్లో ఈ అవార్డులు అందించారు. తెలంగాణ మంత్రి కె.తారకరామారావు, సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్.ఎన్.చౌబే, జాయింట్ సెక్రటరీ ఉషా పాధీ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం విభాగంలో ఇందిరాగాంధీ విమానాశ్రయం (దిల్లీ), ప్రయాణికులకు సేవలందించే విమానాశ్రయంగా ఛత్రపతి శివాజీ విమానాశ్రయం(మహారాష్ట్ర), బెస్ట్ స్టేట్ విత్ ఏ డెడికేటెడ్ ఔట్‌లుక్ పురస్కారం తెలంగాణ సొంతం చేసుకున్నాయి.

20 ఏళ్లలో 2,100 కొత్త విమానాలు కావాలి

బోయింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దినేశ్ కేసర్

భారత విమానయాన ప్రయాణికుల్లో ఏటా 20శాతానికి మించి వృద్ధి కనిపిస్తోందని, ప్రపంచ సగటు 7.3శాతంతో పోలిస్తే ఇది చాలా అధికమని బోయింగ్ కమర్షియల్ ఏరోప్లేన్స్ ఆసియా పసిఫిక్, ఇండియా సేల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దినేశ్ కేసర్ అన్నారు. రానున్న 20 ఏళ్లలో భారత్‌కు కనీసం 2,100 విమానాల అవసరం ఉంటుందని, వీటి విలువ దాదాపు 290 బిలియన్ డాలర్ల వరకూ ఉండవచ్చని తెలిపారు. 20 ఏళ్లలో భారత విమానయాన రంగం అంశంపై మాట్లాడారు. 2037కల్లా భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతోందనీ, ఇది విమానయాన రంగంలో వృద్ధిని కూడా పెంచుతుందని పేర్కొన్నారు. మరోవైపు రూపాయి ధర బలంగా ఉండటం కూడా నిర్వహణ ఖర్చుల్లో వీటికి కలిసొస్తుందన్నారు. అమెరికా సంస్థలతో పోలిస్తే, భారతీయ సంస్థలు 110శాతం ఎక్కువగా ఇంధనం కోసం ఖర్చు చేస్తున్నాయనీ, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇంధన వినియోగం తక్కువగా ఉండే ఇంజిన్ల తయారీకి బోయింగ్ కట్టుబడి ఉందన్నారు.

15 నుంచి బంధన్ బ్యాంక్ ఇష్యూ

ధరల శ్రేణి రూ.370- 375

ముంబయి: బంధన్ బ్యాంక్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా విక్రయించనున్న షేర్లకు ధరల శ్రేణిగా రూ.370- 375ను నిర్ణయించింది. ఈ పబ్లిక్ ఇష్యూ 15న మొదలై 19వ తేదీతో ముగియనుంది. ఇష్యూ ధరలో కనిష్ఠమైన రూ.370ను లెక్కలోకి తీసుకుంటే ఈ ఐపీఓ ద్వారా బంధన్ బ్యాంక్‌కు రూ.4,430 కోట్లు రావొచ్చు. అదే గరిష్ఠ ధరైన రూ.375 ద్వారా అయితే రూ.4,473 కోట్లు సమకూరుతాయి. ఐపీఓలో భాగంగా ప్రమోటర్లు 9.76 కోట్ల తాజా షేర్లను జారీ చేయనున్నారు. ఇక ప్రపంచ బ్యాంక్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్ప్ 1.40 కోట్ల షేర్లను, ఐఎఫ్‌సీ ఎఫ్ఐజీ ఇన్వెస్ట్‌మెంట్ 75.65 లక్షల వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో విక్రయించనున్నాయి. ఐపీఓ తర్వాత బ్యాంక్‌లో ప్రమోటర్ల వాటా 89 శాతం నుంచి 82 శాతానికి చేరనుంది. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను మూలధన అవసరాలకు వినియోగించనున్నట్లు బంధన్ బ్యాంక్ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ ఘోష్ తెలిపారు.



8న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) — కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	345	వరంగల్	347
చిల్లరగా(ఒక గుడ్డు)	4.05	విశాఖపట్నం	335
బెంగళూరు	375	చెన్నై	385
9వ తేదీకి...		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	328	నమక్కల్	370

ఉపశమన లాభాలు

సమీక్ష

- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- తోడైన షార్ట్ కవరింగ్
- 318 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

నష్టకష్టాలతో విలవిలలాడుతున్న మదుపరికి స్వల్ప ఉపశమనం. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు దన్నుగా నిలవడంతో ఆరు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. ఇటీవల బాగా నష్టపోయిన షేర్లలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలు తగ్గడం, మధ్యాహ్నం తర్వాత ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లకు షార్ట్ కవరింగ్ రావడం సైతం ఇందుకు తోడ్పడింది. ఆసియా షేర్లు లాభాల్లో ముగియగా, ఐరోపా మార్కెట్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సానుకూల ఆసియా సంకేతాల దన్నుతో సెన్సెక్స్ ఉదయం 33244.52 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. అనంతరం డీలాపడిన సూచీ.. ఒకానొకదశలో



33,037.48 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. అక్కడి నుంచి కొనుగోళ్ల మద్దతుతో బలంగా పుంజుకున్న సెన్సెక్స్ ఇంట్రాడేలో 33,439.97 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. చివరకు 318.48 పాయింట్ల లాభంతో 33,351.57 దగ్గర స్థిరపడింది. ఫిబ్రవరి 23 తర్వాత సెన్సెక్స్ నమోదు చేసిన ఒకరోజు అతిపెద్ద లాభం ఇదే. గత ఆరు సెషన్లలో సూచీ 1,412.66 పాయింట్లు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇక నిఫ్టీ సైతం కీలకమైన 10,200 మార్కును తిరిగి అందుకుంది. 88.45 పాయింట్లు పెరిగిన సూచీ.. 10,242.65 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,146.40- 10,270.35 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభాలతో ముగిశాయి. ఎస్‌బీఐ 4.09%, ఐసీఐసీఐ బ్యాంక్ 3.58%, అదానీ పోర్ట్స్ 2.95%, ఎం అండ్ ఎం 2.45%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.25%, హెచ్‌డీఎఫ్‌సీ 2.02%, ఎల్ అండ్ టీ 1.60%, ఏషియన్ పెయింట్స్ 1.59%, యాక్సిస్ బ్యాంక్ 1.43%, ఎన్‌టీపీసీ 1.32%, ఇన్ఫోసిస్ 1.22%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.93% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. టాటా స్టీల్ (1.98%), సన్‌ఫార్మా (1.85%), యెస్ బ్యాంక్ (1.63%), టీసీఎస్ (0.92%), టాటా మోటార్స్ (0.60%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి 1.63% రాణించింది. బ్యాంకింగ్, యంత్ర పరికరాలు, వాహన, విద్యుత్, మన్నికైన వినిమయ వస్తువులు, పీఎస్‌యూ, చమురు- గ్యాస్ షేర్లు అదే బాటలో నడిచాయి. లోహ, ఆరోగ్య సంరక్షణ, ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు డీలాపడ్డాయి.

జియోజిత్ 'ఫండ్స్ జీనీ' యాప్

కోచి: పెట్టుబడి సేవల సంస్థ జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 'ఫండ్స్ జీనీ' అనే వినూత్న యాప్‌ను ప్రారంభించింది. జియోజిత్ వ్యవస్థాపకుడు, ఎండీ సీజే జార్జ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సతీశ్ మీనన్, జియోజిత్ టెక్నాలజీస్ ఎండీ ఎ.బాలకృష్ణన్ సమక్షంలో టెలికాం కమిషన్ ఛైర్మన్, టెలికాం విభాగం కార్యదర్శి అరుణా సుందరరాజన్ యాప్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ యాప్ ద్వారా మదుపర్లు రెండే నిమిషాల్లో ఎలాంటి పేపర్ వర్క్ లేకుండా మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)లో మదుపు చేయడం ప్రారంభించవచ్చని, దాదాపు 14 వేల పైచిలుకు మ్యూచువల్ ఫండ్ల పథకాలు ఇందులో కనిపిస్తాయని జియోజిత్ సంస్థ పేర్కొంది.

మరో మూడు నెలలకు అమ్మకాల రిటర్న్ అదే!

దిల్లీ: జీఎస్‌టీ విధానంలో అమ్మకాల రిటర్న్ జీఎస్‌టీఆర్-3బీని మరో మూడు నెలలు ప్రభుత్వం కొనసాగించే అవకాశం కనిపిస్తోంది. రేపు జరిగే సమావేశంలో జీఎస్‌టీ మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. ఎందుకంటే రిటర్న్‌ల ప్రక్రియ సరళీకరణ అంశంపై ఈ సమావేశంలోనే కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది. ఒకవేళ రిటర్న్‌ల దాఖలుకు కొత్త విధానాన్ని తీసుకొని వస్తే, దానిని అమలు చేయడానికి కనీసం మూడు నెలల సమయం పడుతుందని పీటీఐ వార్తా సంస్థకు ఓ అధికారి వెల్లడించారు. అప్పటివరకు జీఎస్‌టీఆర్-3బీ దాఖలును ప్రభుత్వం కొనసాగిస్తుందని తెలిపారు. జీఎస్‌టీ అమలైన కొత్తలో.. రిటర్న్‌ల దాఖలుకు సంబంధించి వ్యాపారులు సమస్యలు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో సరళీకృత జీఎస్‌టీఆర్-3బీ దాఖలు వీలు కల్పించింది.

మార్కెట్ కబుర్లు

- తమ వ్యాపార విభాగాలన్నింటి నుంచి రూ.1,378 కోట్ల విలువైన ఆర్డర్లు లభించినట్లు, ఇంజినీరింగ్, సమీకరణ, నిర్మాణ దిగ్గజ సంస్థ **కేఈసీ ఇంటర్నేషనల్** వెల్లడించింది.
- ప్రమోటర్ సంస్థ ఎల్ అండ్ టీ కి షేర్లను ప్రిఫరెన్షియల్ పద్ధతిలో కేటాయించడం ద్వారా రూ.2,000 కోట్లు సమీకరించినట్లు **ఎల్ అండ్ టీ ఫైనాన్స్** తెలిపింది.
- బేయర్ కంపెనీ కూరగాయల విత్తనాల వ్యాపారాన్ని కొనుగోలు చేసేందుకు జర్మనీ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే తమ మాతృసంస్థ బీఏఎస్ఎఫ్ ఎస్ఈ చర్చలు జరుపుతోందని, రసాయనాల సంస్థ **బీఏఎస్ఎఫ్** పేర్కొంది.
- బెంగళూరు, పరిసరాల్లో 59 ఎకరాల స్థలాలు కలిగిఉన్న స్టెర్లింగ్ అర్బన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్‌లో 80 శాతం వాటాను రూ.336 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నట్లు స్థిరాస్తి సంస్థ **ప్రిస్టేజ్ గ్రూప్** వెల్లడించింది.
- దివాలా స్మృతి ప్రక్రియ అమలవుతున్న భూషణ్ స్టీల్ నుంచి, తమకు రావాల్సిన రుణాలకు ప్రాధాన్యమివ్వాలని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ని **ఎల్ అండ్ టీ** అభ్యర్థించింది. రూ.900 కోట్ల విలువైన యంత్రాలు సరఫరా చేసినట్లు తెలిపింది.
- విద్యుత్తు సరఫరా, పంపిణీ సేవలందించే **జ్యోతి స్ట్రక్చర్స్** పరిష్కార ప్రణాళికపై రుణదాతలు 2 వారాల్లో తుదినిర్ణయం తీసుకోనున్నారు. ఈనెల 5న రుణదాతల కమిటీతో జరిపిన సమావేశంలో, పెట్టుబడిదార్లు నెట్‌మ్యాజిక్ వ్యవస్థాపకుడు శరద్‌సంఘి ఆధ్వర్యంలో సంప్రదింపులు జరిపారు.
- జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నుంచి రూ.482.04 కోట్ల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ ప్రాజెక్ట్ లభించినట్లు **కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్** తెలిపింది.
- అంతర్జాతీయంగా మానవ వనరులు, వేతన చెల్లింపు సాఫ్ట్‌వేర్ సేవలు అందిస్తున్న **రామ్‌కో సిస్టమ్స్**కు, ఐరోపా నిర్మాణ దిగ్గజ సంస్థ పీఓఆర్ఆర్‌లో భాగమైన పీఓఆర్ఆర్ కతార్ కన్‌స్ట్రక్షన్ డబ్ల్యుఎల్ఎల్ నుంచి ఆర్డర్లు లభించాయి.
- మహారాష్ట్రలో 50 మెగావాట్ల పవనవిద్యుత్తు ప్రాజెక్టు దక్కించుకున్నట్లు **ఐనాక్స్ విండ్** తెలిపింది. రాబోయే 12-15 నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని, 25ఏళ్ల పాటు యూనిట్‌కు రూ.2.86 చొప్పున లభిస్తుందని వివరించింది.
- ద్విచక్ర వాహన టైర్ల తయారీ సంస్థ మాక్సిస్ గ్రూప్‌లోని **మాక్సిస్ ఇండియా,** గుజరాత్‌లోని సనంద్‌లో రూ.2,640 కోట్లతో ప్లాంట్‌ను ప్రారంభించింది. రోజుకు 20,000 టైర్లు, 40,000 ట్యూబ్‌లు ఈ ప్లాంటులో తయారు చేయవచ్చు.
- సిమెంట్ సరఫరా తిరస్కరించడం ద్వారా, విపణిలో తన స్థానాన్ని **జేఎస్‌డబ్ల్యు సిమెంట్** దుర్వినియోగం చేస్తోందని వచ్చిన ఆరోపణలను కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తిరస్కరించింది.
- **భారత్ ఎయిర్‌టెల్**తో విలీనం అవ్వాలన్న టెలినార్ ఇండియా ప్రతిపాదనకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం లభించింది. 2017 ఫిబ్రవరిలో ఇరు సంస్థలు ఒప్పందం చేసుకోగా, సీసీఐ, సెబీ, బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ఇప్పటికే అంగీకరించాయి.
- రూ.1,000 కోట్ల నిధులు వేరే అవసరాలకు బదిలా చేశారనే అంశంపై, **భూషణ్ స్టీల్** ఛైర్మన్ బ్రిజ్ భూషణ్ సింఘాల్‌ను తీవ్రనేరాల పరిశోధనా కార్యాలయం (ఎస్ఎఫ్ఐఓ) ప్రశ్నించింది.


ఆమె పెట్టుబడులు బీమావైపే

- ఆ తర్వాతి స్థానాల్లోనే డిపాజిట్లు, ఫండ్‌లు
- కుటుంబ ఆర్థిక భద్రతకూ మహిళల ఆసక్తి
- అసోచామ్-ఇండియాఫస్ట్‌లైఫ్ సర్వే

కోల్‌కతా: మహిళలు పెట్టుబడులు పెట్టే ముందు.. వారికి తొలుత గుర్తొచ్చేది జీవిత బీమానేనని అసోచామ్, ఇండియాఫస్ట్‌లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో తేలింది. ఎక్కువ మంది మహిళలు అంటే 72 శాతం వరకు జీవిత బీమానే తమ పెట్టుబడులకు తొలి ప్రాధాన్యంగా భావిస్తున్నారు. ఆ తర్వాత డిపాజిట్ల(ఫిక్స్‌డ్, రికరింగ్)పైన 69% మంది; మ్యూచువల్ ఫండ్‌లపై 61% మంది చొప్పున ఆసక్తి కనబరిచారు. మహిళలు తమ బాధ్యతలను ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వర్తించడానికి ఆర్థిక సాధికారత ముఖ్యమని చెబుతున్న ఆ సర్వేలోని ముఖ్యాంశాలు..

- ✦ మహిళలు కుటుంబానికి సైతం ఆర్థిక భద్రత కల్పించాలని భావిస్తున్నారు.
- ✦ బాండ్లు(19%), షేర్ల(21%)పై మాత్రం తక్కువ ఆసక్తిని కనబరుస్తున్నారు.
- ✦ పెట్టుబడుల విషయంలో సలహాల కోసం కుటుంబాలపై ఆధారపడతామని 69% మంది చెబుతుండగా.. స్వతంత్రంగా వ్యవహరిస్తామని 28% మంది పేర్కొన్నారు. ఆర్థిక సలహాదార్లను విశ్వసిస్తామని 23% మంది; స్నేహితులు, బంధువుల సూచనలు తీసుకుంటామని 14% మంది చెప్పారు.
- ✦ నెలవారీ పెట్టుబడులపై దృష్టి సారిస్తామని 42% మంది స్త్రీమూర్తులు పేర్కొన్నారు. త్రైమాసికం వారీగా 13% మంది, అర్థ సంవత్సరం 9%; సంవత్సరం వారీగా పెట్టుబడులు పెడతామని 17% వెల్లడించారు.
- ✦ నెలవారీ పెట్టుబడులు పెడతామన్న అతివల్లో వయసు పెరిగేకొద్దీ సంఖ్య పెరుగుతుండడం గమనార్హం. పెళ్లికాని యువతులు 39%; పెళ్లై పిల్లలు ఇంకా లేని వారు 40%; పెళ్లై పిల్లలు ఉన్న వారు 48%; యుక్త వయసుకొచ్చిన పిల్లలు ఉన్న వారు 53% మేర నెలవారీ పెట్టుబడులపై ఆసక్తి ప్రదర్శించడం గమనార్హం.
- ✦ ఏటా 30 ఏళ్లలోపున్న వారిలో 55 శాతం మంది బీమాలో పెట్టుబడులు పెడతామని చెప్పారు. అందులో 61 శాతం మంది ఏటా రూ.50,000 కంటే తక్కువ పెట్టుబడులు పెడతామని వివరించారు.
- ✦ ఇక 30 ఏళ్లలోపువారిలో 53% మంది; 31-45 ఏళ్ల వారిలో 46% మంది స్వల్పకాలానికి(అయిదేళ్ల పాటు) పెట్టుబడులు పెడతామని తెలిపారు.
- ✦ మనీ బ్యాక్ పాలసీలపై 47% మంది ఆసక్తి చూపారు. 35% మంది పూర్తి జీవిత బీమా పాలసీలకు మొగ్గుచూపారు. ఎండోమెంట్, యూనిట్ అనుసంధానిత బీమా పథకాలపై వరుసగా 25%, 20% మంది మాత్రమే ఆసక్తి వ్యక్తీకరించారు.





లింగ వైవిధ్యంలో భారత్ భేష్

అగ్రస్థానాల్లో 20 శాతం మహిళల వల్లే

దిల్లీ: లింగవైవిధ్యంలో భారత్ స్థానం మెరుగుపడిందని గ్రాంట్ థోర్న్‌టన్స్ నివేదిక పేర్కొంది. 2018లో దేశీయంగా సంస్థల అగ్రస్థానాల్లో 20 శాతం మంది మహిళలు ఉండటమే ఇందుకు కారణం. 2017లో వీరిసంఖ్య 17 శాతమే. 2014లో ఇది 14 శాతమే. అంతర్జాతీయంగా చూస్తే, మహిళలకు అగ్రాసనం విషయంలో, భారత్ కింద నుంచి అయిదో స్థానంలో ఉంది. వ్యాపారంపై మహిళల పాత్రకు సంబంధించి ఈ నివేదిక రూపొందించారు.

- ✦ 2017 జులై - డిసెంబరు మధ్య 35 దేశాల్లోని మధ్యస్థాయి విపణికి చెందిన 4,995 మంది ముఖ్య కార్యనిర్వహణాధికారులు, మేనేజింగ్ డైరెక్టర్లు, ఛైర్మన్లు, నిర్ణయాధికారం కలిగిన వారిని ఇంటర్వ్యూ చేసి ఈ నివేదికకు రూపకల్పన చేశారు.
- ✦ దేశీయ సంస్థల్లో మహిళా నాయకత్వం పెరిగినా, అభిప్రాయాలు వెల్లడించిన వారిలో 30 శాతం మంది, తమ కంపెనీల్లో ఆ స్థాయికి చేరిన మహిళలు లేరని వెల్లడించారు.
- ✦ మహిళా నాయకత్వం పెరుగుతున్నా, అందుకు అనుసరించే ప్రక్రియ నిదానంగా సాగుతోంది.
- ✦ లింగవివక్షను రూపుమాపే విధానాలు విస్తారంగా ఉన్నాయి.
- ✦ సంస్థల్లో ఒకే పని నిర్వహించే పురుషులు, మహిళలకు సమాన వేతనాలను 64 సంస్థలు అమలు చేస్తున్నాయి. నియామకాల్లో వివక్ష లేని విధానాలను 55 శాతం అనుసరిస్తున్నాయి.
- ✦ లింగవివక్ష నివారణకు చట్టసభల ద్వారానే ప్రభుత్వం మరిన్ని యత్నాలు చేయాలని 57 శాతం మంది పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, వ్యాపారులు కలిసి పనిచేయాలని 31 శాతం మంది అభిప్రాయ పడ్డారు.

ఆసియా దేశాల్లోనూ ఆకర్షణీయమే

విదేశీ మహిళలు విధులు నిర్వర్తించేందుకు ఇష్టపడే ఆసియా దేశాల్లో భారత్‌ది 7వ స్థానమని హెచ్ఎస్‌బీసీ సర్వే తెలిపింది. వాణిజ్యం, పెట్టుబడులు విస్తరించడమే దీనికి కారణం. ఈ జాబితాలో భారత్ కన్నా ముందు సింగపూర్, హాంకాంగ్, దక్షిణకొరియా, జపాన్, చైనా, మలేసియా ఉన్నాయని వెల్లడించింది. 'అంతర్జాతీయ నిపుణుల్లో మహిళా భాగస్వామ్యం మరింత ఉత్సాహాన్నిస్తుంది. ఇంటికి దూరంగా ఉండటం వల్ల సవాళ్లతో పాటు, ప్రయోజనాలూ ఉన్నాయి. కొత్త సంస్కృతి, జీవనశైలికి అలవాటు పడటం, సంక్లిష్ట ఆర్థిక వనరులు నిర్వహించడం, కుటుంబం- సన్నిహితులతో అనుబంధం కలిగి ఉండటం' కీలకమవుతాయని హెచ్ఎస్‌బీసీ, ప్రీమియర్ అండ్ హెల్త్ విభాగాధిపతి మార్క్ సర్జెనర్ తెలిపారు.



ఒక్కటయ్యారు

- ఎన్‌జీ రంగా ముని మనవడితో టీవీఎస్ వేణు శ్రీనివాసన్ కుమార్తె పెళ్లి
- జోధ్‌పూర్‌లో సన్నిహితుల సమక్షంలో వివాహం

చెన్నై: బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త మహేశ్ గోగినేనితో టీవీఎస్ వేణు శ్రీనివాసన్, టఫే ఛైర్‌పర్సన్ మల్లికా శ్రీనివాసన్‌ల కుమార్తె లక్ష్మీ వేణుల వివాహం గురువారం జోధ్‌పూర్‌లో జరిగింది. దక్షిణ భారత సంప్రదాయంలో జరిగిన ఈ పరిణయానికి కేవలం కుటుంబ సభ్యులు, అతి దగ్గరి స్నేహితులను మాత్రమే ఆహ్వానించినట్లు ఒక ప్రకటనలో కంపెనీ తెలిపింది. టి.ఎస్.శ్రీనివాసన్(టీవీఎస్), ఎ.శివశైలం(ద అమాల్గమేషన్స్ గ్రూప్)ల మనవరాలైన లక్ష్మీ వేణు.. ప్రస్తుతం సుందరమ్ క్లేటాన్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. టఫే మోటార్స్ అండ్ ట్రాక్టర్స్‌కు డైరెక్టర్‌గానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

లక్ష్మీ వేణు : యేల్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన లక్ష్మి యూనివర్సిటీ ఆఫ్ వార్విక్ నుంచి డాక్టరేట్ పొంది డాక్టర్ లక్ష్మి అయ్యారు. సుందరమ్ క్లేటాన్‌ను అంతర్జాతీయ వాహన దిగ్గజాలైన కమిన్స్, వోల్వో, హ్యుందాయ్, డైమ్లర్ వంటి కంపెనీలకు సేవలు అందించే స్థాయికి లక్ష్మి తీసుకెళ్లారు. అంతే కాకుండా.. అమెరికాలో సైతం సుందరమ్ క్లేటాన్ ప్లాంటును ఏర్పాటు చేసిన ఘనత కూడా ఈమెదే. కాగా, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణమూర్తి కుమారుడు రోహన్ మూర్తితో 2011లో ఈమె పెళ్లి జరిగింది. 2015లో పరస్పర అంగీకారంతో వీరిరువురు విడాకులు తీసుకున్నారు.

మహేశ్ గోగినేని: స్వతంత్ర పార్టీ అధ్యక్షుడు, పద్మ విభూషణ్ గ్రహీత ఎన్.జి. రంగా ముని మనవడు; డాక్టర్ కమలేంద్ర గోగినేని, సుగుణల కుమారుడే మహేశ్ గోగినేని. బిట్స్ పిలానీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లలో గ్రాడ్యుయేషన్ చేసిన ఈయన స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎమ్‌బీఏ చేశారు. తొలి అంకుర సంస్థ నుంచి విజయవంతంగా బయటకు వచ్చిన మహేశ్ ప్రస్తుతం గిఫ్‌స్కీ అనే రెండో సాంకేతిక అంకుర సంస్థ బాధ్యతలు చూసుకుంటున్నారు.

ముడి మద్యంపై 18% జీఎస్‌టీ?

- వ్యతిరేకిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు
- వ్యాట్‌ను కొనసాగిస్తామంటూ వాదన
- జీఎస్‌టీతో మద్యం ధరలు పెరిగే అవకాశం
- ఏకాభిప్రాయంపై కేంద్రం ఆశలు

ఈనాడు, దిల్లీ

మద్య పానీయాల తయారీలో కీలక ముడి సరుకు అయిన అదనపు-తటస్థ మద్యం(ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్-ఈఎన్‌ఏ))ను జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. రేపు(మార్చి 10న) జరగబోయే జీఎస్‌టీ మండలి సమావేశంలో ఆ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రజలు తాగే మద్యం(పోటబుల్ ఆల్కహాల్)పై జీఎస్‌టీ లేదు. ఇక ఈఎన్‌ఏపై రాష్ట్ర ప్రభుత్వాలు విలువ జోడించిన పన్ను(వ్యాట్), అమ్మకాల పన్ను విధిస్తున్నాయి.

రాష్ట్రాల వ్యతిరేకతకు కారణాలివీ..

ఈఎన్‌ఏను జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురావడాన్ని చాలా వరకు రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే ఈఎన్‌ఏపై జీఎస్‌టీ విధిస్తే. . అది పరోక్షంగా పోటబుల్ ఆల్కహాల్‌పైనా పన్ను భారం పడేలా చేస్తుంది. అంతే కాకుండా.. ఈఎన్‌ఏ అనేది జీఎస్‌టీ పరిధిలోకి వెళితే మద్యం ఉత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వాలు పర్యవేక్షణ చేయడం సాధ్యం కాదు. తాగే మద్యం ధర పెరిగే అవకాశం ఉండడం కూడా రాష్ట్రాలు వ్యతిరేకించడానికి ఒక కారణం.

న్యాయ సలహా కోరిన ఆర్థిక శాఖ

పై కారణాల వల్ల చాలా వరకు రాష్ట్రాల ఆర్థిక మంత్రుల నుంచి వ్యతిరేకత వస్తున్నా.. కేంద్రం మాత్రం ఈ విషయంలో ఏకాభిప్రాయాన్ని సాధించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 'కేంద్ర ఆర్థిక శాఖ ఈ విషయంలో భారత అదనపు సొలిసిటర్ జనరల్‌ను న్యాయ సలహా కోరింది. ఈఎన్‌ఏ అనేది తాగేందుకు పనికిరాదు కాబట్టి దానిపై జీఎస్‌టీ వేసుకోవచ్చని ఆయన అన్నారు. ఏకాభిప్రాయం ఉంటే ఈఎన్‌ఏపై జీఎస్‌టీ విధించడానికి రాజ్యాంగ సవరణకు వెళ్లాలా లేదంటే.. పాలనపరంగానే చేయొచ్చా అన్నది పరిశీలిస్తాం. ఒక వేళ ఏకాభిప్రాయం కుదిరితే.. 18 శాతం విధించడానికి ప్రణాళిక రచిస్తామ'ని ఆ పరిణామాలతో సంబంధమున్న సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

నిపుణులు ఏమంటున్నారంటే..

జీఎస్‌టీ పరిధిలోకి ఈఎన్‌ఏ వస్తే ఆ పన్ను ప్రభావం దాని ఉత్పత్తులపైనా పడుతుంది. అంటే తాగే మద్యం ధర పెరిగే అవకాశం ఉంటుందని మద్యం పరిశ్రమకు చెందిన నిపుణులు అంటున్నారు.

ఈఎన్‌ఏ అంటే

ఆల్కహాల్ గాఢత ఎక్కువగా ఉన్న మద్యాన్ని ఈఎన్‌ఏ(ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్) అంటారు. దీనిని నేరుగా తాగలేరు. మనుషులు తాగే ఆల్కహాల్(సాంకేతికంగా పోటబుల్ ఆల్కహాల్ అంటారు) ప్రస్తుతం జీఎస్‌టీ పరిధిలో లేదు. అయితే పోటబుల్ ఆల్కహాల్‌కు ముడిసరుకైన ఈఎన్‌ఏపై వ్యాట్ ఉంటోంది. ఇక పారిశ్రామిక అవసరాలకు వాడే ఆల్కహాల్ జీఎస్‌టీ కిందే ఉంది. రసాయనికంగా ఈఎన్‌ఏ అనేది చెరకు మొలాసిస్ నుంచి తయారు చేస్తారు. దాదాపు 80 శాతం అత్యధిక స్వచ్ఛత ఈఎన్‌ఏను పోటబుల్ ఆల్కహాల్ తయారీలో వాడతారు. మిగతా ఔషధ పరిశ్రమ ఉపయోగించుకుంటుంది.

కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూనే ఉండాలని వారు కోరుతున్నారు. భిన్నాభిప్రాయాలున్నప్పటికీ.. .ఈఎన్‌ఏ కొనుగోలుపై చెల్లించే వ్యాట్‌ను పోటబుల్ ఆల్కహాల్ విక్రయంపై చెల్లించాల్సిన వ్యాట్‌కు ఉపయోగించుకోవచ్చని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించగలమనే కేంద్రం భావిస్తోంది.



ఇ-వే బిల్లు నిబంధనల సడలింపు

- ఇ-కామర్స్, కొరియర్ కంపెనీలకు భారీ ఊరట
- ఎఫ్‌ఎమ్‌సీజీ సంస్థలకు సైతం

దిల్లీ: ఇ-కామర్స్ కంపెనీలకు ఊరట కలిగించే విషయం. ఇ-వే బిల్లుల నిబంధనలను ప్రభుత్వం సడలించింది. దీంతో ఆయా కంపెనీలు వస్తువుల రవాణాను సులువుగా చేసుకోవడమే కాకుండా.. వస్తువుల విలువను లెక్కించడం కూడా సులువు కానుంది. ఇ-వే బిల్లు నిబంధనల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం నోటిఫై చేసింది. దీని ప్రకారం.. వస్తువుల రవాణాకు సంబంధించిన ఎలక్ట్రానిక్ బిల్లులను జాబ్ వర్కర్లు సైతం జారీ చేయడానికి అనుమతులు ఉంటాయి. రూ.50,000కు పైబడిన విలువ గల వస్తువులను రాష్ట్రాల మధ్యలో రవాణా చెయ్యాలంటే ఎలక్ట్రానిక్ వే(ఇ-వే) బిల్లును తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధన అమల్లోకి వస్తుంది. తాజా సవరణలు ఇవీ..

- ✦ ఎఫ్‌ఎమ్‌సీజీ కంపెనీలకు భారీ ఊరటనిస్తూ.. ఇ-వే బిల్లు కోసం పన్ను వేసే సరఫరా విలువను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడానికి కంపెనీలకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. విక్రయ ఇన్‌వాయిస్‌లలో పన్ను వేసిన, మినహాయించిన వస్తువుల సరఫరా ఉన్న వాటికి ఇది వర్తిస్తుంది.

అంటే.. జీఎస్‌టీ పరిధిలోకి వచ్చే ఆహార ఉత్పత్తులను.. పన్ను మినహాయింపు ఉన్న పాలు వంటి వాటితో పాటు రవాణా చేయవచ్చన్నమాట. అపుడు కేవలం పన్ను పడే ఆహార ఉత్పత్తులనే ఇ-వే బిల్లుకు పరిగణిస్తారు.

- ✦ అంతే కాకుండా.. ఒకే రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వర్తించే చిన్న వ్యాపారులకు సైతం సహాయం చేయదలచింది ప్రభుత్వం. 50 కి.మీ.లోపు రవాణాకు వాహన వివరాలను ఇవ్వాల్సిన అవసరం లేకుండా చేసింది. అంతక్రితం ఇది 10 కి.మీ.గా ఉండేది.
- ✦ ప్రతీ కన్‌సైన్‌మెంట్ విలువ రూ.50,000లోపు ఉండి.. వాహనంలోని మొత్తం కన్‌సైన్‌మెంట్ల విలువ రూ.50,000 కంటే ఎక్కువగా ఉన్నా కూడా ఆ వస్తువుల రవాణా రాష్ట్రంలోపలే జరిగితే ఇ-వే బిల్లు అవసరం లేదు.

ఇది కొరియర్, ఇ-కామర్స్ కంపెనీలకు మంచి ప్రయోజనమే. పేపర్ పనిని తగ్గిస్తుందని పీడబ్ల్యూసీ అంచనా వేసింది. అదే సమయంలో రాష్ట్రాల మధ్య రవాణాకు సైతం ఈ సడలింపును కొనసాగించాలని సూచించింది.

- ✦ తాజా సవరణల ప్రకారం.. ఇ-వే బిల్లు గడువు ఆ బిల్లు జనరేట్ అయిన రోజు తర్వాతి రోజు అర్ధరాత్రి వరకు ఉంటుంది. అంతక్రితం అది 24 గంటలుగా ఉండేది.

ఉదాహరణకు మార్చి 8 సాయంత్రం మూడు గంటలకు బిల్లు జనరేట్ అయితే ఈ బిల్లు గడువు మార్చి 9 అర్ధరాత్రి వరకు ఇపుడు ఉంటుంది. అంతక్రితం అది మార్చి 9 సాయంత్రం 3 గంటలకు ముగిసేది.

- ✦ ప్రధాన తయారీదారు/బ్రాండ్ యజమానితో పాటు.. జాబ్ వర్కర్ కూడా అంతర్ రాష్ట్ర వస్తువుల రవాణా విషయంలో ఇ-వే బిల్లును ఇవ్వవచ్చు. అంతక్రితం కేవలం ప్రధాన తయారీదారుకు మాత్రమే ఆ అధికారం ఉండేది.

పాత వాహనాల విక్రయాల్లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్

చెన్నైలో తొలి విక్రయశాల 'వింటేజ్'

చెన్నై: ఖరీదైన బైక్‌ల తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్, పాత మోటార్ సైకిళ్లను విక్రయించే వ్యాపారంలోకి ప్రవేశించింది. వింటేజ్ పేరిట నెలకొల్పుతున్న విక్రయశాలల్లో, వినియోగ (పాత) రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను సంస్థ విక్రయించనుంది. తొలి విక్రయశాలను చెన్నైలో ప్రారంభించగా, క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించాలన్నది సంస్థ ప్రణాళిక. పాత, పునరుద్ధరించిన ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిళ్లను వీటిల్లో విక్రయిస్తారు. పాత వాహనాల నాణ్యతను పరిశీలించి, అవసరమైతే మరమ్మతులు చేసి, తగిన ధ్రువీకరణతో అమ్మకానికి ఉంచుతారు. 'ఒక యజమాని నుంచి కొనుగోలు చేస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్, నాణ్యతతో ఉంటుందనే భరోసా మరో కొనుగోలుదారుడికి ఈ విక్రయశాలలు అందిస్తాయి' అని రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇండియా వ్యాపారాధిపతి షాజి కోషి పేర్కొన్నారు. ఈ ఏడాదిలో మరో 10 వింటేజ్ విక్రయశాలలు ప్రారంభించాలన్నది తమ ప్రణాళికగా వివరించారు. ఈ వాహనాల కొనుగోళ్లకు రుణ సదుపాయం, మోటారువాహన బీమాతో పాటు విక్రయానంతర సేవలు కూడా వీటిల్లో లభిస్తాయని పేర్కొన్నారు.

దేశీయ ఉక్కు కంపెనీల విస్తరణకు అమెరికా సెగ



ముంబయి: ఉక్కు, అల్యూమినియంపై అమెరికా దిగుమతి సుంకం పెంపుతో దేశీయ దిగ్గజ ఉక్కు కంపెనీల సామర్థ్య విస్తరణ నెమ్మదించే అవకాశం ఉంది. పెరుగుతున్న గిరాకీకి తగ్గట్లుగా సామర్థ్యాన్ని పెంచుకునే నిమిత్తం నష్టాల్లో, దివాలా ప్రక్రియలో ఉన్న కంపెనీలు, ప్లాంట్లను కొనుగోలు చేసేందుకు ఇవి ఆసక్తి చూపుతోన్న సంగతి తెలిసిందే. భూషణ్ స్టీల్‌ను టాటా స్టీల్ చేజిక్కించుకోనుండగా. . మోనెత్ ఇస్పాత్ ఎనర్జీ కొనుగోలుపై జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కన్నేసింది. అయితే అమెరికా సుంకం పెంపుతో ఆ దేశానికి దిగుమతి చేసే ఉక్కు, అల్యూమినియంను ఇతర దేశాలకు మళ్లించాల్సి రావచ్చు. అది కూడా తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడొచ్చు. ఈ ప్రభావం కంపెనీల లాభదాయకతపై పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. దాదాపు మూడేళ్ల తర్వాత లాభాలబాట పట్టిన వీటికి ఇది ఇబ్బందికర పరిణామమే. అందువల్ల సామర్థ్యం పెంచుకునే ప్రణాళిక విషయంలో కంపెనీలు ఆచితూచి వ్యవహరించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం అమెరికాకు ఏటా 9-14 మిలియన్ టన్నుల ఉక్కు భారత్ నుంచి దిగుమతి అవుతోంది. భారత్ మొత్తం ఉక్కు దిగుమతుల్లో ఇది 2 శాతమే. మరోవైపు దివాలా ప్రక్రియలో ఉన్న వివిధ కంపెనీల ప్లాంట్ల వార్షిక సామర్థ్యం 22 మిలియన్ టన్నుల వరకు ఉండొచ్చు.

ఓసారి ఆలోచించండి

అమెరికా అధ్యక్షుడికి ప్రపంచ బ్యాంక్ సూచన

బ్రసెల్స్: ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాన్ని పెంచే ముందు జరగబోయే పర్యవసానాలపై ఆలోచించుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రపంచ బ్యాంక్ సూచించింది. సుంకం పెంపు అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. 'మీరు ఏదేని ఓ కారణంతో నిర్ణయం తీసుకుంటే.. తదనంతర పరిణామాలను కూడా ముందుగానే ఊహించాల్సిన అవసరం ఉంటుంద'ని వరల్డ్ బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి క్రిస్టాలినా జార్జివా తెలిపారు. 'వాణిజ్యం క్షీణిస్తే పేద ప్రజలపై ప్రభావం పడుతుంది. వస్తువులు మరింత ప్రియం అవుతాయి. వాటిని కొనాలంటే అధిక డబ్బును వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంద'ని అన్నారు. మరోవైపు అమెరికా దిగుమతి సుంకం పెంపుతో అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు దెబ్బతింటాయని యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ మారియో డ్రాఘీ ఆందోళన వ్యక్తం చేశారు.

ట్రంప్ సంతకం: ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీ స్థాయిలో సుంకం విధించే ప్రతిపాదనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి ఆదేశాలపై ఆయన సంతకాలు చేశారని ఓ వార్తా సంస్థకు అమెరికా శ్వేత సౌధం వాణిజ్య సలహాదారు పీటర్ నవర్రో తెలియజేశారు. సవరించిన దిగుమతి సుంకం రేట్లు మరో 15-20 రోజుల్లో అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. అమెరికా ఉత్పత్తిదార్లను రక్షించేందుకు ఉక్కుపై 25%, అల్యూమినియంపై 10% చొప్పున దిగుమతి సుంకం విధించేందుకు ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

హృద్రోగ సమస్యలను గుర్తించేందుకు కృత్రిమ మేధ

మైక్రోసాఫ్ట్‌తో అపోలో హాస్పిటల్స్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: గుండె సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు వీలుగా కృత్రిమ మేధ సేవలను వినియోగించుకునేందుకు అపోలో హాస్పిటల్స్, మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. లాస్‌వెగాస్‌లో జరిగిన హెల్త్‌కేర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ సొసైటీ కార్యక్రమంలో దీన్ని ప్రకటించింది. కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్‌లను ఉపయోగించుకొని ఆరోగ్య సంరక్షణ సేవలను విస్తరిస్తోన్న మైక్రోసాఫ్ట్ హెల్త్‌కేర్‌నెక్స్ట్‌లో ఇది ఒక భాగం. రోగుల హృద్రోగపు ముప్పును గుర్తించే నూతన మెషిన్ లెర్నింగ్ మోడల్స్‌ను అభివృద్ధి చేసి, వినియోగంలోకి తేవడం ద్వారా వైద్యులకు ఎప్పటికప్పుడు తమ చికిత్స ప్రణాళికలను మార్చుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. మైక్రోసాఫ్ట్ వినూత్న సాంకేతిక పరిజ్ఞానంతో గుండె జబ్బులను ముందే గుర్తించి, ఉత్తమ చికిత్సను అందించడానికి ఇది తోడ్పడుతుందని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి తెలిపారు.

పెరిగిన ప్రత్యక్ష పన్నుల వసూళ్లు

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఫిబ్రవరి మధ్య నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే 19.5 శాతం పెరిగి రూ.7.44 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు బాగా పెరగడంతో ఈ వృద్ధి నమోదైంది. 2018-19 కేంద్ర బడ్జెట్‌లో సవరించిన అంచనాల ప్రకారం మొత్తం రూ.10.05 లక్షల కోట్లలో 74.3 శాతం ప్రత్యక్ష పన్నులు ఫిబ్రవరి నాటికి వసూలయ్యాయి.

ఎస్‌పీపీకి ముగ్గురు న్యాయవాదులను ఎంచుకోండి

వాకపల్లి బాధిత మహిళలకు స్పష్టం చేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: వాకపల్లి గిరిజన మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసుల అత్యాచారం ఆరోపణ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఎస్‌పీపీ)ను నియమించేందుకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(ఆర్‌జీ) సిద్ధం చేసిన న్యాయవాదుల జాబితాను హైకోర్టు పరిశీలించింది. క్రిమినల్ కేసుల్లో అనుభవం ఉన్న న్యాయవాదులు టి.నిరంజన్‌రెడ్డి(హైకోర్టు సీనియర్ న్యాయవాది), కె.వి.రామమూర్తి(విశాఖ), సుంకర రాజేంద్రప్రసాద్(విజయవాడ), డి.శ్రీనివాసరెడ్డి(ఒంగోలు), ఈ.ఉమామహేశ్వరరావు(హైదరాబాద్), వి.సురేంద్రరావు(హైదరాబాద్), జీఎం.విజయకుమార్(సికింద్రాబాద్) ఆ జాబితాలో ఉన్నారు. వీరిలో ముగ్గురి పేర్లను ఎంపిక చేసి ఆ వివరాల్ని కోర్టుకు తెలపాలని గిరిజన మహిళల తరఫు న్యాయవాది వసుధా నాగరాజ్‌కు ధర్మాసనం సూచించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది.

గుంటూరులో తగ్గుముఖం పట్టిన అతిసారం

• కుదుటపడుతున్న బాధితుల ఆరోగ్యం

ఈనాడు, గుంటూరు: గుంటూరులో కలుషిత నీరు తాగి ఆస్పత్రులు, ఇళ్ల వద్దే ఉండి వైద్యసేవలు పొందుతున్నవారి ఆరోగ్య పరిస్థితి క్రమేణా మెరుగుపడుతోంది. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ గురువారం ఆస్పత్రులకు వచ్చిన వారి సంఖ్య స్వల్పంగా ఉంది. రెండు, మూడు రోజుల కిందట జీజీహెచ్‌లో చేరి పరిస్థితి విషమంగా ఉన్న పది మందిని గుంటూరులోని రమేష్ ఆసుపత్రికి పంపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యథావిధిగా పది వైద్య శిబిరాలు నడుస్తున్నాయి. అతిసారం బాధితులు ఉన్న బీఆర్ స్టేడియం, ఎల్‌బీ నగర్ స్టేడియం జలాశయాల పరిధిలోని పది వార్డుల నివాసితులకు ఇప్పటికీ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ జలాశయాల పైపులైన్లలో పరిశుభ్రత చర్యలను చేపట్టారు. పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి కరికాల్‌వలవన్, డైరెక్టర్ కన్నబాబు తమ సిబ్బందితో నగరంలో పర్యటించారు.



గుంటూరు పొన్నూరు రోడ్డు చిన్నబజార్‌లోని షాదీఖానాలో ఏర్పాటుచేసిన తాత్కాలిక వైద్య శిబిరంలో అతిసారం బాధితులను పరామర్శిస్తున్న పురపాలక ముఖ్య కార్యదర్శి కరికాల్‌వలవన్, డీఎంఏ కన్నబాబు, కమిషనర్ అనూరాధ తదితరులు

అతిసారంతో చనిపోయిన వారి కుటుంబీకుల వద్దకు వెళ్లి కారణాలు తెలుసుకున్నారు. 'కలుషిత నీళ్లు తాగి ఇంత మంది చనిపోవటం బాధాకరం. ప్రాథమికంగా క్షేత్రస్థాయి ఉద్యోగులను బాధ్యులను చేస్తూ ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు, ఫిట్టర్లు, చెత్త సేకరణను పర్యవేక్షించే శానిటరీ ఇన్‌స్పెక్టర్లను సస్పెండ్ చేయాలని కమిషనర్‌ను ఆదేశించామ'ని ముఖ్య కార్యదర్శి కరికాల్‌వలవన్ స్పష్టం చేశారు. తాగునీటి పైపుల్లోకి మురుగు నీరు ఎలా వెళ్లిందనేది పరిశీలించి నివేదించడానికి పురపాలక శాఖ డైరెక్టర్, ప్రజారోగ్య ఇంజినీరింగ్ ఇన్ చీఫ్, పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకులతో కమిటీని ఏర్పాటుచేశారు.

★ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నగరపాలక, పురపాలక సంఘాల్లో మురుగునీటి పైపుల కింద తాగునీటి పైపులైన్లు ఏమైనా ఉన్నాయా? అని సర్వే చేయాలని కమిషనర్లను ఆదేశించామని ముఖ్య కార్యదర్శి కరికాల్‌వలవన్ చెప్పారు. గుంటూరు ఉదంతం గుణపాఠాలు నేర్పిందని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించామని అన్నారు.

రూ.25 లక్షలతో సాహిత్య పురస్కారం ఏర్పాటు

జేసీబీ సంస్థ ప్రకటన

దిల్లీ: భారత రచయితల్లో కాల్పనిక సాహిత్య ప్రతిభకు గుర్తింపు కల్పించేందుకు సాహిత్య పురస్కారాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్మాణ రంగ యంత్రాల తయారీ సంస్థ 'జేసీబీ ఇండియా' వెల్లడించింది. విభిన్న భారతీయ భాషల్లో సాహిత్యానికున్న అడ్డంకులను అధిగమించడం కూడా దీని ఉద్దేశమని తెలిపింది. ఈ పురస్కారం మొత్తం కింద రూ.25 లక్షలను ప్రకటించింది. సాహిత్య రంగంలో ఇది దేశంలోనే అత్యంత భారీ పురస్కార మొత్తం. దీని కోసం ప్రముఖ నవలా రచయిత, వ్యాసకర్త రాణా దాస్‌గుప్తాను సాహిత్య డైరెక్టర్‌గా సంస్థ ఎంపిక చేసింది. మే 31 నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొంది. ఆంగ్లం, ఇతర భాషల నుంచి ఆంగ్లంలోకి తర్జుమా చేసిన రచనలకు వేరువేరుగా దరఖాస్తు చేయాలని కోరింది. ఒకవేళ అనువాద పుస్తకానికి పురస్కారం దక్కితే.. అనువాదకర్తకు రూ.5 లక్షలు ఇస్తామని పేర్కొంది.

అవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే

- **అతిసారం మృతుల ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరపాలి**
- **వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ**

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరులో అతిసారంతో పది మంది మృతి చెందారని, ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలోని అతిసారం రోగులను వైకాపా నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని నడిబొడ్డున ముఖ్యమంత్రి సహా ఇద్దరు మంత్రులు, ఉన్నతాధికారులు నివసిస్తున్న జిల్లాలో ప్రజలు అతిసారంతో మృతిచెందటం దారుణమని అన్నారు. కలుషిత నీరు అరికట్టలేక ప్రభుత్వం, అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. జీజీహెచ్‌లో ఎలుకల దాడిలో బాలుడి మరణం, కిడ్నీ రాకెట్.. ఇతర ఘటనలు చోటుచేసుకోవటం ఇక్కడి పరిపాలన దురవస్థను తెలియజేస్తుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుత్తేదారు నుంచి రూ.10 లక్షలు ఇప్పించాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 వేలను పార్టీ తరఫున అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయలలిత కాళ్లు తొలగించలేదు

• కారు డ్రైవరు అయ్యప్పన్ వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత కాళ్లను తొలగించలేదని ఆమె కారు డ్రైవరు అయ్యప్పన్ స్పష్టంచేశారు. ఈ విషయాన్ని ఆయన కమిషన్‌కు తెలియజేశారు. 2016 సెప్టెంబరులో అనారోగ్యానికి గురైన జయలలితను చెన్నై అపోలో ఆస్పత్రిలో చేర్చగా డిసెంబరు 5న ఆమె మరణించినట్లు వైద్యులు ప్రకటించిన విషయం తెలిసిందే. జయలలిత మృతిపై పలు అనుమానాలు తెరపైకి వచ్చినట్టే.. ఆమె కాళ్లను తొలగించినట్లు కూడా ప్రచారం జరిగింది. దీనిని ఆస్పత్రి యంత్రాంగం ఖండించింది. ఈ నేపథ్యంలో జయలలిత మృతిపై దర్యాప్తు చేస్తున్న జస్టిస్ ఆరుముఖస్వామి కమిషన్ సమక్షంలో జయ కారుడ్రైవరు అయ్యప్పన్ గురువారం హాజరయ్యారు. తర్వాత ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... జయలలిత ఐసీయూలో ఉన్నప్పుడు ఆమెను చూశానన్నారు. ఆమెకు ఆరోగ్యం బాగోలేదని రాత్రిపూట తనకు సమాచారం అందిందని తెలిపారు. ఆస్పత్రికి వెళ్లడానికి మొదట ఆమె నిరాకరించినట్టు



కమిషన్ ఎదుట హాజరై వస్తున్న అయ్యప్పన్

తెలిసిందని పేర్కొన్నారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన తర్వాతే ఆస్పత్రికి తీసుకెళ్లారని, చేరిన ముప్పావు గంట తర్వాత జయలలిత స్పృహలోకి వచ్చారని వెల్లడించారు. ఆస్పత్రిలో ఉన్నప్పుడు ఆమెను మూడుసార్లు చూశానని పేర్కొన్నారు. ఆమెకు కాళ్లు తొలగించలేదని, మరణించిన తర్వాత ఆమె కాలివేళ్లను తానే కట్టానని తెలిపారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

19 ఈనాడు
విజయవాడ
శుక్రవారం
మార్చి 9, 2018
vihari@eenadu.in

విహారి



విశాఖపట్నం అందరికీ తెలుసు. అక్కడికి దగ్గర్లో ఉండే అరకులోయ భూతల స్వర్గమని తెలుసు.. ఆ మధ్యలో వచ్చే బొర్రాగుహల గురించీ కొద్దో గొప్పో తెలుసు.. వీటికి సమీపంలో ఉన్న.. తాటిపూడి గురించి అడిగితే చాలామంది తడబడతారు. అరకు.. పచ్చటి ప్రకృతిని పరిచయం చేస్తుంది. బొర్రా గుహలు.. అంతుబట్టని ఆకారాలను చూపిస్తాయి. తాటిపూడి.. ప్రకృతి అందాల మధ్య అంతులేని ఆనందాన్ని కలగజేస్తుంది.

ఈ ఎండల్లో మినీ పాపికొండల్లో

ఎలా వెళ్లాలి?

తాటిపూడి జలాశయం విశాఖపట్టణానికి 65 కిలోమీటర్లు, విజయనగరం నుంచి 22 కిలోమీటర్ల దూరంలో ఉంది. బస్సులు, ప్రైవేట్ ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి. అరకు వెళ్లదలచిన వాళ్లు ముందుగా బొర్రాగుహలు సందర్శించి ఆ తరువాత తాటిపూడి చూసుకొని ముందుకుసాగుతారు.

విజయనగరం జిల్లా తాటిపూడిలో ఓ జలాశయం ఉంది. వేల ఎకరాల్లో పంటలూరిస్తోంది. విశాఖ వాసుల దాహార్తిని తీరుస్తోంది. సామర్థ్యం తక్కువే అయినా.. సౌందర్యానికి మాత్రం కొదవలేదు. ఎందుకంటే.. గో'దారి'లోని పాపికొండలను పోలిన కొండలు ఇక్కడ కనువిందు చేస్తాయి. సూది మొనంత చోటు లేకుండా పచ్చదనం కప్పుకొని నిండుగా ఉంటాయవి. ఆ పాపికొండల నలుపు గోదారి కడగలేకపోయిందేమో గానీ.. ఈ కొండల్లోని పచ్చదనం నీళ్లపై నీడలా తేలుతూ.. గోస్తనీ నదికి పచ్చబొట్టేసిన భావన కలుగజేస్తాయి. ఉభయ సంధ్యల్లో ఈ పచ్చదనం కాస్తా మాయమై జలాశయం అంతా కాషాయం రంగును పులుముకుంటుంది. అందుకే తాటిపూడి గ్రామం.. విశాఖ, విజయనగరం వాసుల వారాంతపు విహార కేంద్రంగా మారింది. అరకు, బొర్రాగుహలు వెళ్తున్న పర్యాటకులూ ప్రయాణంలో వెసులుబాటు చూసుకొని మరీ తాటిపూడికి వెళ్తుంటారు.

గాలివాలులో..

చుట్టూ చెట్లు, చేమలు, కొండలు, కోనలు.. మధ్యలో విస్తరించి ఉంది తాటిపూడి జలాశయం. అందులో నౌకా విహారం చేసే వాళ్లంతా... 'లాహిరి లాహిరి..' అని పాడుకోకుండా ఉండలేరు. కొండల మీదుగా వచ్చిన స్వచ్ఛమైన చల్లగాలి వేసవి తాపాన్ని ఇట్టే మాయం చేస్తుంది. ఆ గాలిని పీల్చగానే శరీరం మునుపెన్నడూ లేని ఉత్సాహాన్ని పొందుతుంది. మరబోట్లో విహారం వేగంగా సాగుతుంది. అయితే, బోటు



ఇంజిన్ శబ్దం.. మనసున తొణికే మధురభావాలను ఎప్పటికప్పుడు ఆటంకపరుస్తుంటుంది. అందుకే చెవులకు స్వరవాణి తగిలించుకుని మీ మనసు కోరే పాటలను మంద్ర స్థాయిలో వింటూ ప్రయాణిస్తే భలేగా ఉంటుంది. నాటు పడవ ఎక్కితే.. గాలివాలులో సాగే నావతో ఎన్ని ఊసులైనా పంచుకోవచ్చు.

తరచి తరచి చూస్తూ..

అలలపై అలా అలా సాగిపోయే పడవలు జలాశయం మధ్యలో మూడెకరాలున్న ముచ్చటైన ద్వీపానికి చేరుకుంటాయి. 'గిరి వినాయక ఎకో టూరిజం' పేరిట పర్యాటక శాఖ ఇక్కడ వివిధ రకాల సేవలు అందిస్తోంది. ప్రకృతి ఒడిలో హాయిగా కూర్చున్నట్టున్న వినాయకుడి భారీ విగ్రహం ఒకటుంది. దాన్ని చూసి.. అక్కడే ఐదారు ఫొటోలు దిగి.. రెస్టారెంట్‌కు వెళ్తారు యాత్రికులు. నచ్చిన భోజనం చేసి.. కాసేపు సేదతీరుతారు. ఈ ద్వీపంలో చాలా సినిమాల షూటింగ్‌లు జరిగాయి. ఆ విశేషాలన్నీ తెలుసుకొని.. వాటి గురించి చర్చిస్తూ.. పడవలో మళ్లీ తిరుగు ప్రయాణం అవుతారు. మూడుకొండల మధ్య పాపిటలా ఉన్న పాయల గుండా ప్రయాణిస్తూ.. పాపికొండలను చుట్టొచ్చామన్న అనుభూతికి లోనవుతారు. పక్షుల కిలకిలారావాలు, నీటి గలగలలు వినిపిస్తున్న వేళ.. సాయం సంధ్య సమీపిస్తున్న సమయాన.. ఎర్రనీళ్లు దిష్టి తీసి చల్లినట్టున్న గోస్తనీ జలాలను తరచి తరచి చూస్తూ పర్యాటకులు తిరుగు ప్రయాణం అవుతారు.

ఇజ్జగిరి రంజిత్, ఈనాడు పాత్రికేయ పాఠశాల
ఫొటోలు: సీహెచ్. సత్యనారాయణ, విజయనగరం

ఈనాడు టూరిజం ఫెయిర్

ఎప్పుడు: ఈ నెల 10, 11
ఎక్కడ: ప్రసాద్ మల్టీప్లెక్స్. నెక్లెస్ రోడ్, హైదరాబాద్
సమయం: ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు
ప్రవేశం: ఉచితం

వేసవి వినోదాలలో విహారం ప్రధానమైనది. అయితే సెలవుల్లో ఎక్కడికి వెళ్లాలి, ఎలా వెళ్లాలి, ఎంత ఖర్చు అవుతుంది.. ఇవన్నీ తెలుసుకుని వెళ్తే ప్రయాణం హాయిగా సాగిపోతుంది. విహారయాత్రలోని సందేహాలను తీర్చడానికి ఈ నెల 10, 11 తేదీల్లో 'ఈనాడు' ట్రావెల్ టూరిజం ఫెయిర్- 2018 నిర్వహిస్తోంది. తెలంగాణ, పశ్చిమ బెంగాల్ పర్యాటక శాఖలతో పాటు కాసియో వంటి జాతీయ, అంతర్జాతీయ పర్యాటక సంస్థలు ఇందులో పాల్గొంటున్నాయి. టూరిజంలో వస్తున్న మార్పుల గురించి ఇవి



వివరించనున్నాయి. ప్రయాణానికి ఎంచుకోవలసిన మార్గాలు ఆయా సంస్థల ప్రతినిధులు వివరిస్తారు. అభిరుచికి తగిన ప్రాంతాలేమిటో సూచిస్తారు. ఫెయిర్‌కు హాజరైన వారిలో విజేతలను ఎంపిక చేసి బహుమతి కూడా అందజేయనున్నారు. మరిన్ని వివరాలకు 91000 24085 ఫోన్ నెంబర్‌ను సంప్రదించండి.

మణికట్టు కనికట్టు



వనవిహారంలో ఎక్కువగా ఇబ్బంది పెట్టేవి దోమలు. సాయంత్రం అయ్యిందంటే చాలు దోమలు స్వైరవిహారం చేస్తాయి. దోమతెరలు ఎంత ఉపయోగించినా.. వాటిని కట్టడి చేయడం కష్టమే. ఈ ఇబ్బందికి చెక్ పెడుతూ వచ్చినవే 'మస్కిటో రిప్పెలెంట్ బ్యాండ్స్'. దీనిని మణికట్టుకు గడియారంలా పెట్టుకుంటే చాలు.. కనికట్టు జరిగిపోతుంది. దోమలు మీ దరిదాపుల్లోకి అస్సలు రావు. ఫిట్‌నెస్ బ్యాండ్‌లా కనిపించే మస్కిటో బ్యాండ్స్ ఆన్‌లైన్ అంగట్లో లభ్యమవుతాయి. వీటి ధర రూ.200 నుంచి పలుకుతోంది.

అడుగులు వదిలి.. జ్ఞాపకాలతో కదిలి..




ఆ ఇల్లు ఒక మ్యూజియంలా ఉంటుంది. దేశవిదేశాలకు చెందిన వస్తువులు, పతాకాలు, నాణేలు.. ఇలా ఎన్నో దర్శనమిస్తాయి. ఇవన్నీ ఎవరో తెచ్చి ఇచ్చినవి కావు. ఆ ఇంటి యజమాని స్వయంగా సేకరించినవి. ఇన్నిటి మధ్య తీరిక లేకుండా ఉంటాడా వ్యక్తి. ఆయన పేరు ఇంద్రనీల్ చౌధురి. ఊరు హైదరాబాద్. ఎప్పుడూ ఏదో దేశానికి వెళ్లడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తూ ఉంటారు. ఇప్పటి దాకా 107 దేశాలు తిరిగొచ్చిన ఆయనను పలకరించింది విహారి. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

"గ్రీన్‌లాండ్‌లో అతిథులను బాగా గౌరవిస్తారు! మంగోలియాలోనూ అంతే! 'పెరూలోని ఇన్కా కోటల్లో విహారం మరచిపోలేని అనుభూతినిచ్చింది. బ్రెజిల్‌లో జరిగిన ఫుట్‌బాల్ వరల్డ్ కప్ క్షణాలు మళ్లీ మళ్లీ రావాలనిపిస్తుంటుంది! ఆ దేశాల గురించి గంటలకొద్దీ చెప్పొచ్చు. ఒక్కో పర్యటన గురించి ఒక్కో పుస్తకం రాసేయొచ్చు. ఈ ప్రపంచాన్ని చుట్టిరావాలని 1990 ప్రాంతంలో అనుకున్నాను. 150 దేశాలైనా పర్యటించాలని సంకల్పించా. ఇప్పటి వరకు 107 దేశాలు తిరిగాను. విలువైన సమయాన్ని వెచ్చించి.. అంతకన్నా ఘనమైన ప్రదేశాలను చూశాను. ఆయా దేశాల్లో అడుగులు వదిలి.. మధురమైన జ్ఞాపకాలతో ముందుకు కదిలాను. విదేశాల నుంచి ఎన్నడూ ఖాళీగా రాలేదు.. బ్యాగు నిండా అక్కడ దొరికే అరుదైన వస్తువులను మోసుకొచ్చినా.. మనసులో మోయలేనంత ఆనందాన్ని సొంతం చేసుకున్నాను.

ఇక్కడికి ఎందుకొచ్చావన్నారు?

నేను పర్యటించిన దేశాల్లో అందరికీ తెలిసిన దేశాలు ఉన్నాయి. పేరు చెప్పడానికి నోరు తిరగని దేశాలూ ఉన్నాయి. సంపన్న దేశాలూ ఉన్నాయి.. పేదవీ ఉన్నాయి. తూర్పు ఆఫ్రికా దేశాలన్నీ చూశాను. కరేబియన్ దేశాలూ చుట్టేశాను. కొన్ని దేశాలూ కుటుంబంతో కలిసి వెళ్లాను. కొన్ని ఒంటరిగా చూసొచ్చాను. ఈ ప్రయాణంలో చిత్ర విచిత్రమైన సంఘటనలు ఎన్నో!. ఆగ్నేయ యూరప్‌లోని కోసోవో దేశ పర్యటనలో గమ్మత్తయిన అనుభవం ఎదురైంది. ఒక భారతీయుడు వెకేషన్ కోసం తమ దేశానికి రావడం ఏంటని అక్కడి ఎంబసీ అధికారులకు అనుమానం వచ్చింది. 'ఇలా దేశాలు తిరగడం నా అభిరుచి' అని చెప్పినా నమ్మలేదు వాళ్లు. అరెస్ట్ చేసినంత పని చేశారు. ఇలాంటి తమాషా సందర్భాలు చాలానే ఉన్నాయి. ఒంట్లో శక్తి ఉన్నంత కాలం ఇలా దేశవిదేశాలు పర్యటిస్తూనే ఉంటాను. నా ముందున్న లక్ష్యం 150 దేశాల పర్యటన పూర్తి చేయడమే.



గొప్ప సందేశం..

విదేశీ పర్యటనల్లోనే అంతర్జాతీయ క్రీడా వేదికలు ఉండేలా జాగ్రత్తపడతాను. ఫుట్‌బాల్ కప్‌లు, వింటర్ ఒలింపిక్స్, సమ్మర్ ఒలింపిక్స్, టెన్నిస్ క్రీడలు ఎక్కడ జరిగితే అక్కడ వాలిపోతా. ఒక బహుళజాతి సంస్థ అంతర్జాతీయ మార్కెటింగ్ విభాగం హెడ్‌గా పని చేస్తున్నా. నాకొచ్చే వేతనంలో సింహభాగం ప్రయాణానికే వెచ్చిస్తుంటా. ఈ విషయంలో నా భార్యకు ధన్యవాదాలు చెప్పాలి. పర్యటనలకు నేనెంత ఖర్చు చేసినా ఏమనదు. అవకాశం ఉంటే కుటుంబంతో వెళ్తుంటాను. ఒక అభిరుచిగా మొదలైన విదేశీ విహారం నా వ్యక్తిత్వంపై ఎంతో ప్రభావం చూపింది. ఇంత పెద్ద ప్రపంచాన్ని చూస్తున్నప్పుడు అందులో నేనెంత అనే భావన కలుగుతుంది. ఇంతకు మించిన సందేశం ఏముంటుంది.

చుట్టూ సముద్రం..
మధ్యలో నలభై అడుగుల ఎత్తున్న రాతి గోడలు.
ఆ గోడల వెనుక.. రాచరిక వైభవం!
మూడున్నర శతాబ్దాలు దాటుతోన్నా తరగని సౌందర్యం!
కట్టుబానిసలుగా మన దేశానికి వచ్చినవారి పట్టుదలకు నిదర్శనం.. మహారాష్ట్రలోని జంజీరా కోట!!
22 ఎకరాల్లో.. 22 సంవత్సరాల్లో.. 22 బురుజులతో.. కట్టిన అరుదైన నిర్మాణం ఇది.
కొంకణ తీరంలో తిరుగులేని శక్తిగా ఎదిగిన సిద్దీల రాజధానిగా వెలుగొందింది. ఎందరో రాజుల దాడులను తట్టుకొని.. శత్రు దుర్భేద్యమైన దుర్గంగా పేరొందింది. శతాబ్దాలుగా సముద్ర అలలు దాడి చేస్తున్నా.. అంతే అందంగా, అంతే దర్జాగా కనువిందు చేస్తోంది.

అలల పోటులో.. చెదరని కోట



అరబిక్ కడలి అంచున ఉన్న చారిత్రక ప్రదేశాల్లో మురుద్ ఒకటి. ఆ పట్టణంలో ఒక అందమైన రాజ భవనం ఉంది. చుట్టూ పెద్ద ప్రహరీ గోడ. ప్రధాన ద్వారానికి భారీ ఇనుప గేట్లు ఉంటాయి. ఆ పక్కనే 'అనుమతి లేకుండా ప్రవేశం లేదు' అని ఒక సూచిక వేలాడుతూ ఉంటుంది. ఊరి నడి బొడ్డున ఉన్న నవాబుల వారసుల భవనమది. కానీ, నగరంలో ఉన్న ఈ మహల్‌ను చూసేందుకు అనుమతి తీసుకోవాలి. అందుకే కాబోలు అక్కడికి ఎవరూ వెళ్లరు. ఇక్కడికి సమీపంలో వీరి తాతముత్తాతలు పాలించిన కోట ఉంది. నడి సముద్రంలో ఉన్నా... దానిని చూసేందుకు అలల ఆటుపోట్లకు వెరవకుండా నాటు పడవల్లో తండోపతండాలుగా వెళ్తుంటారు.

ఒకప్పుడు జంజీరా కోటలో పాగా వేయాలని పోర్చుగీసువారు ప్రయత్నించారు. కుదరలేదు. ఇదే కోటలో కాలుమోపాలని మరాఠా యోధులు యుద్ధాలు చేశారు. వారికీ సాధ్యపడలేదు. ఇప్పుడు ఓ యాభై రూపాయల టికెట్ కొంటే చాలు ఎవరైనా.. ఈ కోటలో రాజులా విహరించవచ్చు! అక్కడి వింతలు చూసి, విశేషాలు తెలుసుకొని ఆశ్చర్యపోవచ్చు. మురుద్ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది రాజ్‌పురి గ్రామం. అక్కడి నుంచి జంజీరా కోటకు వెళ్లాలంటే సముద్రంపై ప్రయాణం చేయాలి. మరబోట్లు, నాటు పడవల్లో ప్రయాణంతో అందమైన విహారం మొదలవుతుంది.



ఘనమైన చరిత్ర

రాజ్‌పురి తీరం నుంచి సముద్రంలో సుమారు కిలోమీటర్ ప్రయాణిస్తే జంజీరా కోట ప్రధాన ద్వారం వస్తుంది. నలభై అడుగుల కోట గోడ. పాతిక అడుగులకు మించిన లోహ ద్వారం. ఆ కోటలోకి అడుగుపెట్టగానే.. ముందుగా అందరి కళ్లు పడేది.. గోడపై చెక్కిన ఒక శిలాఫలకంపైనే! ఒకే ఒక్క పులి.. ఆరు ఏనుగులను వేటాడుతున్నట్టు ఉంటుంది. ఆ కోటను ఏలినవారు ఎంతటి ధీశాలురో చెప్పకనే చెబుతుందా చెక్కడం. శతాబ్దాల కిందట ఆఫ్రికా ఖండం నుంచి సిద్దీ జాతికి చెందిన వారు వేలాదిగా భారతదేశానికి వలస వచ్చారు. వీరిలో కట్టుబానిసలు కూడా ఉన్నారు. వారే తర్వాతి కాలంలో కొంకణ్ ప్రాంతంలో చక్రం తిప్పారు. రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నారు. నమ్మకానికి, వీరత్వానికి ప్రతీక వీళ్లు. అందుకే అహ్మద్‌నగర్‌ను పాలిస్తున్న నిజాంషాహీ ప్రభువు సిద్దీలను స్వయం ప్రతిపత్తి కలిగిన రాజులుగా గుర్తించాడు. అలా 17వ శతాబ్దం ప్రారంభంలో జంజీరా ప్రాంతానికి సిద్దీ మాలిక్ అంబర్ కొన్నాళ్లు ప్రధానిగా ఉన్నాడు. ఆయన హయాంలోనే కోట నిర్మాణం మొదలైంది. ఆ తర్వాత సిద్దీ సురల్ ఖాన్ రాజుగా ఉన్నప్పుడు కోట నిర్మాణం పూర్తయింది. కాలక్రమంలో ఈ కోటపై ఎందరి కళ్లో పడ్డాయి. దాడులకు దిగారు. యుద్ధాలు చేశారు. కోట నీడను కూడా తాకలేకపోయారు. భారత స్వాతంత్ర్యం వచ్చే వరకు జంజీరా స్వతంత్ర రాజ్యంగానే ఉంది. 1948లో భారత్‌లో విలీనమైంది.

ఫిరంగుల మోత

కోట చరిత్ర ఎంత గొప్పదో.. కోట లోపల వింతలూ అంతే ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. రాజ ప్రాసాదాలు, దర్బార్ హాల్, రాణివాసం, ధాన్యాగారం ఇలా ఎన్నో! 22 ఎకరాల్లో దీర్ఘవృత్తాకారంగా ఉన్న ఈ కోట చుట్టూ 22 బురుజులు ఉన్నాయి. కోటపై 557 ఫిరంగులు ఉండేవి. కోటపై ఏ దిక్కు నుంచి శత్రువుల కన్ను పడినా.. ఫిరంగుల మోత మోగేది. ప్రస్తుతం ఈ ఫిరంగుల సంఖ్య వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. వీటిలో కలాల్ బాంగ్‌డీ ఫిరంగి ప్రత్యేకమైనది. మన దేశంలోనే రెండో అతిపెద్ద ఫిరంగిగా పేరున్న దీని పొడవు 18 అడుగులు. బరువు విషయానికి వస్తే 20 టన్నుల పైమాటే!

ఎన్నో విశేషాలు..

1970 వరకు కొన్ని కుటుంబాలు కోటలోనే నివసించేవి. మంచి నీళ్ల బావి ఈ కుటుంబాల తాగునీటి అవసరాలు తీర్చేది. ఇప్పటికీ ఇక్కడ మంచినీళ్ల బావిలో నీళ్లు అంతే తియ్యగా, స్వచ్ఛంగా ఉన్నాయి. సముద్రం మధ్యలో ఉన్న చిన్న ద్వీపంలో మంచి నీళ్ల బావి ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. దీనికి సమీపంలోనే అంతఃపుర కాంతల స్నానాల కోసం నిర్మించిన కొలను ఉంటుంది. కోటలో ప్రత్యేక ఆకర్షణ సురల్ ఖాన్ ప్యాలెస్. ఏడు అంతస్తులుగా నిర్మించిన ఈ ప్రాసాదం కాలపరీక్షను ఎదుర్కొంటోంది. పైమూడు అంతస్తులు కూలిపోయి.. నాలుగు అంతస్తులే మిగిలాయి. అయినా మహల్ ఠీవీ ఎంత మాత్రం తగ్గలేదు. మంచి నీళ్ల బావి ఎదురుగా ఉండే మసీదు, సీస్ మహల్ పర్యాటకులకు కనువిందు చేస్తాయి. కోట గోడల నిర్మాణంలో రాళ్ల మధ్య.. పాదరసం, సీసం, బెల్లం మిశ్రమం వినియోగించారట అందుకే శతాబ్దాలుగా కడలి కెరటాలు దాడి చేస్తున్నా.. కోట గోడలు బీటలు వారింది లేదు. జంజీరా కోటలో విహరిస్తున్నంత సేపు ఏదో సాహస యాత్ర చేస్తున్న అనుభూతి కలుగుతుంది. సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లో సముద్రంలో ఇలాంటి నిర్మాణం ఎలా కట్టారో అనిపిస్తుంది. సూర్యాస్తమయ వేళ మరింత అందంగా కనిపించే కోటను చూస్తూ.. పర్యాటకులంతా పడవల్లో తిరుగు ప్రయాణం అవుతారు.




ఏడాదంతా అనుకూలం

- ఏడాదంతా జంజీరా కోటను సందర్శించవచ్చు. వేసవి విడిది కోసం లోనావాలా, ఖండాలా వెళ్లే పర్యాటకులు పనిలో పనిగా జంజీరా కోట చుట్టేసి వస్తుంటారు.
- విహారానికి అనుకూలంగా ఉండే నవంబర్-ఫిబ్రవరి మధ్య జంజీరాకు పర్యాటకుల తాకిడి ఎక్కువ.

ఎలా వెళ్లాలంటే?

- జంజీరా కోట ముంబయి నుంచి 158 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లే స్టేట్ హైవే-92 మీదుగా వెళ్తే జంజీరా చేరుకోవచ్చు. బస్సులు, ప్రైవేట్ ట్యాక్సీలు ఉంటాయి.
- పుణె నుంచి 182 కిలోమీటర్లు, రాయ్‌గఢ్ నుంచి 85 కిలోమీటర్లు ఉంటుంది. ప్రముఖ పర్యాటక కేంద్రం లోనావాలా నుంచి మురుద్‌కు దూరం 117 కిలోమీటర్లు. రాయ్‌గఢ్, పుణె నుంచి మురుద్‌కు బస్సులు అందుబాటులో ఉన్నాయి.
- సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి పుణె వరకు రైలులో వెళ్లాలి. అక్కడి నుంచి బస్సులో మురుద్-జంజీరా చేరుకోవచ్చు.



ఇక్కడ ఉండొచ్చు..

- మురుద్‌లో గోల్డెన్ స్వాన్ బీచ్ రిసార్ట్ అందంగా ఉంటుంది. వారాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందుకు తగ్గట్టే గదుల అద్దె కూడా పెరుగుతుంది.
- సాండ్ పైపర్ రిసార్ట్స్, షోర్‌లైన్ రిసార్ట్స్, సీషెల్ రిసార్ట్స్‌లో ఆతిథ్యం బాగానే ఉంటుంది.

గది అద్దె: రూ.3,000 నుంచి రూ.12,000

ఈనాడు సినిమా

మరో ప్రేమ ప్రయాణం


నాగచైతన్య


సమంత

వెండితెరపైనే కాకుండా... నిజ జీవితంలో భలే జోడీ అనిపించుకొన్నారు నాగచైతన్య - సమంత. ఈ ఇద్దరూ మరోసారి కలిసి నటించబోతున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ సంస్థ రూపొందించనున్న చిత్రంలో సమంతతో కలిసి తెరను పంచుకొంటున్నట్టు నాగచైతన్య గురువారం ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. 'ఇది మరో ప్రేమ ప్రయాణం' అని ఆయన స్పష్టం చేశారు. పెళ్లి తర్వాత నాగచైతన్య, సమంత కలిసి నటిస్తున్న తొలి చిత్రమిదే. నిర్మాతలు సాహు గారపాటి, హరీష్ పెద్ది మాట్లాడుతూ "దర్శకుడు శివ నిర్వాణ 'నిన్ను కోరి'తో మంచి విజయాన్ని సొంతం చేసుకొన్నాడు. ఆయన తయారు చేసిన కథ ఆకట్టుకొనేలా ఉంది. త్వరలోనే చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళతాం. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం. వచ్చే నెలలోనే మా సంస్థ నుంచి 'కృష్ణార్జున యుద్ధం' ప్రేక్షకుల ముందుకు రానుంది" అన్నారు.

దారే దొరకని చీకటిలో
తానే వెలుగై నడిచాడు
జాతే నా వెలుగన్నాడు
జాతి పిత మన జాతిపిత

గీతం: నూటికో కోటికో ఒక్కరు...
చిత్రం: విశ్వరూపం(1981)
రచన: దాసరి నారాయణరావు

గీతోపదేశం

మీకు నచ్చిన సినిమా పంచ్ డైలాగ్‌లు, పాటల్లోని సందేశాలను మాకు రాసి పంపించండి. వాటిని మీ పేరుతో ప్రచురిస్తాం!

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్- 501512

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

రామ్... 'హలో గురు..'!

రామ్ కథానాయకుడిగా శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్న కొత్త చిత్రం 'హలో గురు ప్రేమ కోసమే'. త్రినాథరావు నక్కిన దర్శకుడు. ఈ సినిమా గురువారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అతిథులు ఎర్నేని నవీన్, స్రవంతి రవికిశోర్ స్క్రిప్టును దర్శకుడికి అందించారు. వంశీ పైడిపల్లి క్లాప్ కొట్టారు. అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేయగా హరీశ్ శంకర్ ముహూర్తపు సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఇందులో రామ్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరన్ నటిస్తోంది. 'ఉన్నది ఒకటే జిందగీ' తర్వాత వీరిద్దరి కలయికలో వస్తోన్న రెండో చిత్రమిది. ప్రకాశ్‌రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. 'నేను లోకల్' వంటి హిట్ తర్వాత త్రినాథరావు దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై మంచి అంచనాలేర్పడ్డాయి. మార్చి 12 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలందిస్తున్నాడు. రచన: సాయికృష్ణ, కళ: సాహి సురేశ్, కూర్పు: కార్తీక్ శ్రీనివాస్, ఛాయాగ్రహణం: విజయ్ కె. చక్రవర్తి.


అనుపమ పరమేశ్వరన్, రామ్

'అమర్ అక్బర్ ఆంటోనీ' ప్రారంభం


వెంకట్ సి.దిలీప్, రవి శంకర్, రవితేజ, శ్రీను వైట్ల, అను ఇమ్మాన్యుయేల్, నవీన్

రవితేజ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'అమర్ అక్బర్ ఆంటోనీ'. అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక. శ్రీనువైట్ల దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ చెరుకూరి (సి.వి.ఎం) నిర్మిస్తున్నారు. గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. దేవుడి పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి శ్రీనువైట్ల పెద్ద కుమార్తె ఆనంది వైట్ల క్లాప్‌కొట్టగా, రెండో కుమార్తె ఆద్య వైట్ల కెమెరా స్విచ్చాన్ చేశారు. కథానాయకుడు రవితేజ దర్శకుడికి స్క్రిప్టుని అందజేశారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఆకర్షణీయమైన కలయికలో రూపొందుతున్న చిత్రమిది. 'దుబాయ్ శీను' తర్వాత రవితేజ, శ్రీనువైట్ల కలిసి చేస్తున్న చిత్రాన్ని మేం నిర్మిస్తుండడం ఆనందంగా ఉంది. మా సంస్థకి ఇదొక ప్రత్యేకమైన చిత్రం. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తామ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "యేడాది కిందటే ఈ కథకి బీజం పడింది. పది నెలల పాటు కష్టపడి స్క్రిప్టు పనుల్ని పూర్తి చేశాం. నిర్మాతలకి, కథానాయకుడికీ కథ చాలా బాగా నచ్చింది. నా హీరో రవితేజతో మళ్లీ ఇన్నాళ్లకి కలిసి చిత్రం చేస్తుండడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చిత్రీకరణ అమెరికాలోని న్యూయార్క్, డెట్రాయిట్, సాల్ట్ లేక్ సిటీ తదితర ప్రాంతాల్లో జరుపనున్నాం. అత్యధిక శాతం అమెరికాలో చిత్రీకరణ జరుపుకొంటున్న మొట్టమొదటి తెలుగు చిత్రమిది. ఇందులో సునీల్ హాస్య ప్రధానమైన ఓ పూర్తి స్థాయి పాత్రని పోషిస్తున్నారు. అలాగే నిన్నటితరం కథానాయిక లయ, ఆమె కుమార్తె శ్లోక, రవితేజ తనయుడు మహాధన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీళ్లంతా చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తార"న్నారు. అభిమన్యు సింగ్, తరుణ్ అరోరా, విక్రమ్‌జీత్‌సింగ్, రాజ్‌వీర్ సింగ్, సాయాజీ షిండే, ఆదిత్య మేనన్, వెన్నెల కిషోర్, సత్య, జయప్రకాష్‌రెడ్డి, షకలక శంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కళ: ఎ.ఎస్.ప్రకాష్, కూర్పు: ఎం.ఆర్.వర్మ, సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: విజయ్ సి.దిలీప్, కథ: శ్రీనువైట్ల, వంశీ రాజేష్ కొండవీటి.

అదే చట్టం కావాలి!


నయనతార

'ప్రజలకి ఏది అవసరమో అదే చట్టమవ్వాలి కానీ, చట్టాన్ని ముందు తయారు చేసి దాన్ని ప్రజల మీద రుద్దకూడదు' అంటోంది ఓ మహిళా కలెక్టర్. ఆమె ఆ మాటని ఏ పరిస్థితుల్లో చెప్పారో తెలియాలంటే 'కర్తవ్యం' చూడాల్సిందే. నయనతార ప్రధాన పాత్రధారిగా నటించిన చిత్రమిది. గోపీనైనర్ దర్శకత్వం వహించారు. తమిళంలో విజయవంతమైన 'ఆరమ్'కి అనువాద రూపమైన ఈ చిత్రాన్ని, నిర్మాతలు ఆర్. రవీంద్రన్, శరత్‌మరార్ సంయుక్తంగా ఈ నెల 16న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. నయనతార కలెక్టర్ పాత్రని పోషించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం టీజర్‌ని విడుదల చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ "నయనతార సినీ జీవితంలోనే అతి పెద్ద విజయంగా నిలిచి, తమిళ ప్రేక్షకుల హృదయాల్ని దోచుకొన్న చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల్నీ అదే స్థాయిలో అలరిస్తుంది. చిన్నారులు బోరు బావుల్లో పడిపోయాక, అక్కడ జరిగే ఆపరేషన్‌నే కథా వస్తువుగా తీసుకొని వాస్తవానికి అద్దం పట్టేలా చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు. నయనతార అభినయం ఆకట్టుకుంటుంది" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, ఛాయాగ్రహణం: ఓం ప్రకాష్.

వందమందిని చంపితే వీరుడంటారు.
ఒకరిని కాపాడితే దేవుడంటారు.

చిత్రం: బాహుబలి

- పంపినవారు: పి.మల్లిఖార్జున నాయుడు, పి.ఎం.కొండాపురం

పంచ్ డైలాగ్

విజయ్ దేవరకొండ 'నోటా'


విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా స్టూడియో గ్రీన్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. మెహరీన్ కథానాయిక. ఆనంద్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మాత. ఇటీవలే ప్రారంభమైన ఈ చిత్రానికి 'నోటా' అనే పేరును ఖరారు చేశారు. ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థులు ఎవరూ నచ్చలేదని ఓటరు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం కోసం ఎన్నికల సంఘం నన్ ఆఫ్ ది ఎబౌ (నోటా)ని అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. పేరునుబట్టి విజయ్ దేవరకొండ చిత్రం ఎన్నికల నేపథ్యంలో సాగే కథ అని అర్థమవుతోంది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీతం: సి.ఎస్.శ్యాం, ఛాయాగ్రహణం: శాంత.


మంచు లక్ష్మీప్రసన్న

తుమ్హారీ సులు... మంచు లక్ష్మి

మంచు లక్ష్మీప్రసన్న సినీ ప్రయాణం కొత్త పంథాలో సాగుతోంది. 'బాస్మతి బ్లూస్', 'వైఫ్ ఆఫ్ రామ్' వంటి వైవిధ్యమైన కథలతో అటు హాలీవుడ్, ఇటు కోలీవుడ్‌లోనూ మెరిసే ప్రయత్నం చేస్తోంది. ఇప్పుడు తమిళంలో మరో సరికొత్త పాత్రలో నటించే అవకాశాన్ని దక్కించుకుంది మంచులక్ష్మి. బాలీవుడ్‌లో విజయవంతమైన 'తుమ్హారీ సులు' సినిమాను తమిళ్‌లోకి రీమేక్ చేయబోతున్నారు. ఇందులో విద్యాబాలన్ పోషించిన పాత్రను జ్యోతిక చేస్తుండగా, నేహా ధూపియా నటించిన పాత్ర కోసం మంచు లక్ష్మిని ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "హిందీలో వచ్చిన 'తుమ్హారీ సులు' నేను చూడలేదు. కానీ నేహాధూపియా పాత్ర గురించి తెలుసు. చాలా స్టైలిష్‌గా ఉంటుంది. ఇప్పటికే డీ గ్లామర్ పాత్రలు చేసి విసుగొచ్చేసింది. అందుకే ఈ పాత్ర కోసం చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. నన్ను ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకున్నందుకు సూర్య, జ్యోతికలకు కృతజ్ఞతలు. నేహా పాత్రలాగే నా మైండ్ చాలా కమాండింగ్‌గా ఉంటుంది. ఇవన్నీ తెలిసే ఈ క్యారెక్టర్‌కు నేనైతేనే కరెక్ట్ అని అనుకున్నార"న్నారు. ఈ చిత్ర షూటింగ్ మే నెల నుంచి ప్రారంభం అవుతుంది. ప్రస్తుతం మంచు లక్ష్మి నటిస్తున్న 'వైఫ్ ఆఫ్ రామ్' త్వరలో విడుదల కాబోతుంది. ఇందులో నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా నమ్మే ఒక విచిత్రమైన పాత్రలో ఆమె కనిపిస్తుంది.

ప్రేక్షకులకి స్వేచ్ఛ కల్పించాలి


శ్రీధర్ మర్రి

"కథానాయకుల ఇమేజ్‌ని మనసులో పెట్టుకొని సినిమాలు తీయకూడదు. అలా తీస్తే మూసతో కూడిన చిత్రాలే వస్తాయి. భిన్న పోకడలతో కూడిన చిత్రాలు చూసే స్వేచ్ఛను ప్రేక్షకులకి కల్పించాలనే ఆలోచనతోనే 'ఏ మంత్రం వేశావే' చిత్రాన్ని తెరకెక్కించా" అన్నారు శ్రీధర్ మర్రి. ఆయన దర్శకత్వంలో విజయ్ దేవరకొండ కథానాయకుడుగా తెరకెక్కిన చిత్రమిది. మల్కాపురం శివకుమార్ సమర్పణలో శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాత శ్రీధర్ మర్రి గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు. "విజయ్ దేవరకొండకి 'పెళ్లిచూపులు', 'అర్జున్‌రెడ్డి' చిత్రాలతో వచ్చిన క్రేజ్‌ని అనుసరించి తీసిన సినిమా కాదిది. ఆ రెండు చిత్రాలకంటే ముందే మా సినిమా చిత్రీకరణ మొదలైంది. నేను అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డాను. అందులో తీరిక లేకుండా ఉండటంతో చిత్రనిర్మాణాన్ని నా వీలును బట్టి నిర్వహించా. అధునాతన సాంకేతిక విజ్ఞానం వల్ల నవతరం సామాజిక మాధ్యమాల రూపంలో తమ అభిప్రాయాల్ని పంచుకుంటున్నారు. మునుపటిలాగా ప్రత్యక్షంగా కలిసి అనుబంధాలను పంచుకోవాలని ఎదురుచూడటం లేదు. ఓ యువకుడు కూడా ఇలానే తయారవుతాడు. కంప్యూటర్ గేమ్స్‌కి అలవాటు పడిన అతను తన వాళ్లని మరచిపోతాడు. ఈ దశలో ఆ కంప్యూటర్ గేమ్స్ ద్వారానే ఓ అమ్మాయి అతనికి దగ్గరవుతుంది. అప్పుడు అతనిలో నిద్రాణమైన మానవత్వపు విలువలు ఎలా బయటికొచ్చాయనే ఇతివృత్తంతో 'ఏ మంత్రం వేశావే..' తెరకెక్కించా. నిజానికి ఈ కథని తీయడానికి ఎవరూ ముందుకు రారు. అందుకే నేనే తీశా. నా కథ, సినిమా నచ్చి మల్కాపురం శివకుమార్ ఇప్పుడు నాతో కలిసి విడుదల చేస్తున్నారు. కథానాయకుడు విజయ్ దేవరకొండ తన పూర్తి సహకారాన్ని అందించారు. నా దగ్గర కొత్త రకమైన కథలు చాలా ఉన్నాయి. ఈ సినిమా తర్వాత ఏ నిర్మాతయినా నా దర్శకత్వంలో సినిమా తీయడానికి ముందుకొస్తే నేను చేస్తా, లేదంటే నేను రాసిన కథల్లో ఒక కథని మళ్లీ నేనే దర్శకనిర్మాతగా తెరకెక్కిస్తా" అన్నారు.


షకీలా, గీతాంజలి

యథార్థ సంఘటనలతో..

షకీలా ప్రధాన పాత్రధారిగా సాయిరామ్ దాసరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శీలవతి'. గీతాంజలి (ఫ్రూటీ) ముఖ్య భూమిక పోషించారు. గణేష్, వీరు బాసింశెట్టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జి స్టూడియోస్ సమర్పిస్తోంది. హైదరాబాద్‌లో టీజర్ విడుదల కార్యక్రమం జరిగింది. షకీలా మాట్లాడుతూ "నా కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రమిది. కేరళలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు. తర్వాత సన్నివేశం ఏంటనేది నాక్కూడా తెలియకుండా జాగ్రత్తపడుతూ చాలా సహజంగా వచ్చేలా చిత్రాన్ని తీర్చిదిద్దారు. నేను నటించిన 250వ చిత్రంలో ఇంత మంచి పాత్రని చేసినందుకు చాలా ఆనందంగా ఉంది" అన్నారు. గీతాంజలి (ఫ్రూటీ) మాట్లాడుతూ "ఒక మంచి కథతో తెరకెక్కిన చిత్రమిది" అన్నారు. "సైకలాజికల్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిన ఈ చిత్రంలో హారర్‌తో పాటు కామెడీ కూడా ఉంటుంది. మేలో చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు నిర్మాత.

కథ చెప్పే దెయ్యం


సుప్రియ, శివ

శివ, సుప్రియ జంటగా నటించిన చిత్రం 'దెయ్యం చెప్పిన కథ'. ప్రదీప్‌రాజ్ దర్శకత్వం వహించారు. పెనాక దయాకర్ రెడ్డి నిర్మాత. నవన్.జె స్వరకర్త. గురువారం హైదరాబాద్‌లో పాటల విడుదల కార్యక్రమం జరిగింది. వి.సాగర్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సాయివెంకట్ ముఖ్య అతిథులుగా హాజరై పాటల సీడీని విడుదల చేశారు. అనంతరం వాళ్లు మాట్లాడుతూ "ప్రచార చిత్రంతో పాటు, గీతాలు చాలా బాగున్నాయి. కొత్తతరహాలో సాగే ఈ హారర్ సినిమా విజయాన్ని పొందుతుందనే నమ్మకం మాకుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఊరి బయటకి వచ్చిన వాళ్లని ఓ దెయ్యం అంతం చేస్తుంది. అలా చేయడానికి కారణమేంటో చెబుతూ ఓ కథ కూడా చెబుతుంది" అన్నారు. "దెయ్యం కథలతో చిత్రాలు వచ్చాయి. కానీ దెయ్యం చెప్పే కథతో ఏ సినిమా రాలేదు. ప్రేక్షకులకి కొత్త అనుభవాన్ని పంచుతుందీ చిత్రం. ఏప్రిల్‌లో విడుదల చేస్తామ"న్నారు నిర్మాత. "ఇదే నా తొలి చిత్రం. నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంద"ని సంగీతదర్శకుడు నవీన్.జె చెప్పారు. కార్యక్రమంలో ఎస్.ఎన్.రావు, కథానాయకుడు శివ, హారిక, గాయని బృంద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒక్కపాట...నలుగురు అతిథులు


సల్మాన్‌ఖాన్


రేఖ

ధర్మేంద్ర ప్రధాన పాత్రలో 'యమ్లా పగ్లా దీవానా: ఫిర్ సే' తెరకెక్కుతోంది. ఇందులో ఓ ప్రత్యేక గీతం ఉంది. అందులో ధర్మేంద్రతో పాటు సల్మాన్ ఖాన్, రేఖ ఆడిపాడినట్టు బాలీవుడ్ సమాచారం. 'రాఫ్తా రాఫ్తా దేఖో ఆంఖ్ మేరీ లేడీ హై' పాటను ఈ చిత్రంలో రీమేక్ చేస్తున్నారు. ఒరిజినల్ పాటలో ధర్మేంద్ర, రేఖ ఆడిపాడారు. రీమేక్‌లో వాళ్లిద్దరితో పాటు సల్మాన్ స్టెప్పులేశాడు. వీళ్లతో పాటు సోనాక్షి సిన్హా, శత్రుఘ్న సిన్హా కూడా ఆడిపాడినట్టు సమాచారం. డియోల్ సోదరులతో పాటు అభయ్ డియోల్ ఇందులో నటిస్తున్నారు.

విడుదలకు సిద్ధం

అందమైన ప్రతీకారం... నాలుగోసారి!

ఎరోటిక్ థ్రిల్లర్ జోనర్‌లో వచ్చిన 'హేట్ స్టోరీ' సిరీస్ చిత్రాలు ఓ వర్గం ప్రేక్షకులను ఆకట్టుకొని బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లు అందుకున్నాయి. ఇప్పటి వరకూ ఈ సిరీస్‌లో విడుదలైన మూడు చిత్రాలు విజయాన్నందుకున్నాయి. నాలుగో చిత్రంగా 'హేట్ స్టోరీ 4' తెరకెక్కింది. 'హేట్ స్టోరీ 2', 'హేట్ స్టోరీ 3' చిత్రాల దర్శకుడు విశాల్ పాండ్య నాలుగో చిత్రాన్నీ తెరకెక్కించాడు. 'గ్రేట్ గ్రాండ్ మస్తీ'లో నటించిన ఊర్వశి రౌటెలా ప్రధాన పాత్రలో నటించింది. ఇహనా ఢిల్లాన్, వివాన్ భటేనా, కరన్‌వాహి కీలక పాత్రల్లో నటించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఈ చిత్ర విశేషాలివీ.

సింగ్ సాబ్ ది గ్రేట్, సనమ్ రే, గ్రేట్ గ్రాండ్ మస్తీ చిత్రాల్లో నటించడంతో పాటు కాబిల్, భాగ్ జానీ చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో అందాలు ఆరబోసి గుర్తింపు తెచ్చుకుంది ఊర్వశి రౌటెలా. ఇప్పుడు ఈ భామ 'హేట్ స్టోరీ 4'తో తొలిసారిగా ప్రధాన పాత్రలో నటించింది. ఈ సినిమా ప్రచార చిత్రాల్లో హాట్ హాట్‌గా కనిపించి ప్రేక్షకుల గుండెల్లో గుబులు రేపింది ఊర్వశి. సినిమాలోనూ అందాల ప్రదర్శనతో పాటు అభినయంతోనూ ఆకట్టుకుంటుందని చిత్ర బృందం చెబుతోంది.

కథేంటి: ఇద్దరు అన్నదమ్ములు. ఒకరంటే ఒకరికి ప్రాణం. అయితే ఆ ఇద్దరూ ఒకే అమ్మాయిని ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమిస్తారు. ఎలాగైనా సరే ఆ అమ్మాయిని దక్కించుకోవాలనుకుంటారు. ఆ అమ్మాయి అందగత్తే కాదు, అమాయకురాలు కూడా. అయితే అది పైకి కనిపించేవరకే. లోపల మాత్రం ప్రతీకారంతో రగిలిపోతుంటుంది. ఇంతకీ ఆమెకు ఎవరి మీద పగ? ఆమెకు ఎవరు అన్యాయం చేశారు? ప్రతీకారం కోసం ఆమె ఎలాంటి పథకం వేసిందన్నది చిత్రంలో చూడాలి.

■ బాలీవుడ్‌లో ఇప్పటి వరకూ నాలుగు చిత్రాలు విడుదలైన సిరీస్‌లు 'రాజ్', 'గోల్‌మాల్' మాత్రమే. ఇప్పుడు 'హేట్ స్టోరీ' సిరీస్ కూడా వాటి సరసన చేరింది.

■ కార్పొరేట్ కల్చర్‌లో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది.


ఊర్వశి రౌటెలా



ఎంబ్రాయిడరీ హంగులతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన అనార్కలీ

ఫ్యాషన్ ఫ్యాషన్

చిన్నారులు చమక్కుమనేలా!

విందూ వినోదాలంటే.. సందడంతా పిల్లలదే! మరి వేడుకేదైనా ఆటపాటలకూ అలంకరణకూ ప్రాధాన్యమిచ్చే మీ బుజ్జాయిల కోసమే ఈ ఆధునిక వస్త్రశ్రేణి. ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఈ దుస్తులు ఎంపిక చేసి చూడండి. మీ చిన్నారి కళగా మురిసిపోతూ మెరిసిపోవడం ఖాయం.



హుందాగా తీర్చిదిద్దిన గాగ్రాకు కళ తెచ్చిన ఎంబ్రాయిడరీ పనితీరు... నెట్ దుపట్టా అదనపు ఆకర్షణ.



పూలతలు పరుచుకున్నట్టు అద్భుతంగా మలచిన సిల్కు గౌను సోయగం.



డిజిటల్ రెట్రో ప్రింట్.. ఆధునికంగా రూపొందించిన క్రోషెట్ ఈ గౌనుకు ప్రత్యేకం.

మోడళ్లు: బేబీ సమ్రీన్, అక్షర, చైత్ర
ఫొటోలు: దండా శ్రీనివాసరావు

జీవితంలోనూ నాయికే!

అదొక చిన్న గ్రామం. ఆ గ్రామం పేరు ధన్‌పురా. ఆ ఊళ్లో ఏ ఇంట్లోనూ మరుగుదొడ్డి ఉండదు. అయితే 14 ఏళ్ల మల్లమ్మ అనే అమ్మాయి మాత్రం మరుగుదొడ్డి కట్టించాలని అమ్మానాన్నల్ని అడుగుతుంది. డబ్బులేకపోవడంతో ఆమె అడిగింది చేయడానికి ఒప్పుకోరు. దాంతో మూడురోజులపాటు అన్నం మానేస్తుంది. ఆ చిన్నారి బాధను అర్థం చేసుకున్న తల్లిదండ్రులు అప్పు చేసైనా మరుగుదొడ్డి కట్టిస్తామని ఆమెకు చెబుతారు. ఇది కన్నడంలో 'సందాస్' పేరుతో తీస్తున్న చిత్రం. ఇందులో ప్రత్యక్ష అనే అమ్మాయి మల్లమ్మ పాత్రను పోషిస్తోంది. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే...



ప్రత్యక్ష వయసూ దాదాపు 14 సంవత్సరాలే. ఈ అమ్మాయి తొమ్మిదో తరగతి చదువుతోంది. షూటింగ్ కోసం దాదాపు నలభైరోజులు కర్ణాటకలోని ధన్‌పురా గ్రామంలోనే ఆ అమ్మాయి ఉండాల్సి వచ్చింది. ఈ సమయంలో ఆ గ్రామంలోని వారు ముఖ్యంగా అమ్మాయిలూ, మహిళలు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసింది. అక్కడ దాదాపు మూడువందల కుటుంబాలు ఉంటున్నాయి. అందులో ఎనభైశాతం మరుగుదొడ్లు లేని ఇళ్లే. అమ్మాయిలూ, యువతులు తెల్లవారుజామునే ఊరు నిద్రలేవకముందే బహిర్భూమికి వెళతారు. మరుగుదొడ్లు లేక వారు పడుతున్న బాధ ఆ అమ్మాయికి ప్రత్యక్షంగా కనిపించింది. దాంతో ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది. తను పనిచేస్తున్న సినిమాకు తీసుకునే పారితోషికం దాదాపు లక్ష రూపాయలతో ఆ గ్రామంలో మరుగుదొడ్లు కట్టించాలనుకుంది. "మల్లమ్మ కథకు ప్రభావితమై నేను ఈ నిర్ణయం తీసుకోలేదు. ఇక్కడి మహిళల బాధ నాలో ఈ ఆలోచనను రేకెత్తించింది. ఈ సమస్యకు నావంతుగా సాయం చేయాలనుకున్నా" అని చెబుతుంది ప్రత్యక్ష. ఈ అమ్మాయి తీసుకున్న నిర్ణయాన్ని మెచ్చుకుంటూ చిత్ర బృందం కూడా తమ వంతు సాయం అందించడానికి ముందుకు వచ్చి 100 మరుగుదొడ్లు నిర్మించాలని నిర్ణయం తీసుకుంది.

నజరానా

కూరగాయలు వడలిపోయినట్లు అనిపిస్తున్నాయా... నిమ్మరసం లేదా ఉప్పు కలిపిన నీటిలో పావుగంటపాటు ఉంచితే సరిపోతుంది.



తల్లో పొట్టు రాలుతోంది... తగ్గించేదెలా?

మా పాపకి ఏడునెలలు. తనకి జుట్టు కాస్త తక్కువ. తలస్నానం కోసం షాంపూలు కాకుండా సున్నిపిండి వాడుతున్నా. అది ఇంట్లోనే తయారు చేశా. సమస్యేంటో తెలియదు కానీ... తలంతా దురదగా ఉండి... గోకుతోంది. అలానే తెల్లగా పొట్టు కూడా రాలుతోంది. పైగా గోకడం వల్ల రక్తం వచ్చి చర్మం పెచ్చులు కడుతోంది. ఇదేమన్నా ప్రమాదకరమైన సమస్యా? ఎందుకిలా అవుతోంది?

- సుమతి, విజయవాడ

మీరేమీ కంగారుపడాల్సిన అవసరం లేదు. ఇది పిల్లల్లో కనిపించే సర్వసాధారణ సమస్య. ప్రమాదమేమీ కాదు. ఇది పలు కారణాల వల్ల రావచ్చు.

వైద్యపరంగా చెప్పాలంటే.. దీన్ని సెబరేటిక్ డెర్మటైటిస్‌గానీ, క్రెడిల్ కాప్ అని గానీ అంటాం. ఈ సమస్య ఫంగల్ ఇన్‌ఫెక్షన్ (టీన్యా క్యాప్టిస్) లేదంటే ఎగ్జిమా వల్ల కూడా రావచ్చు. సెబరేటిక్ డెర్మటైటిస్ అయితే... మాడుపై పొరలుగా కనిపిస్తుంది. కాస్త లేత పసుపు రంగులో పొలుసులు ఉంటాయి. ఇది జిడ్డుగా ఉన్న చోట ఎక్కువగా ఉంటుంది. మాడు ఎర్రగా మారి కందినట్టు అవుతుంది. దురదా బాధిస్తుంది. ఒకవేళ ఫంగల్ ఇన్‌ఫెక్షన్ అయితే వాపు కూడా ఉంటుంది. ఎర్రగా ఇబ్బందికరంగా అనిపిస్తుంది. ఎగ్జిమా అయితే చిన్న చిన్న కురుపులు వస్తాయి. ఒక్కోసారి వాటి నుంచి పస కూడా కారుతుంది. చర్మం పెచ్చులు కట్టి దురద వస్తుంది. గీరిన కొద్దీ ఎక్కువ అవుతుంది.

కారణాలు:

సెబరేటిక్ డెర్మటైటిస్: దీనికి కారణమంటూ చెప్పలేం. కొన్నిసార్లు హార్మోన్ల వల్ల కూడా రావచ్చు. అలానే జిడ్డు చర్మతత్వం ఉన్నవారిలో మేల్‌స్సీజీయా అనే ఫంగస్ వల్లా వచ్చే ప్రమాదం ఉంటుంది.

ఫంగల్ ఇన్‌ఫెక్షన్: ఇది రింగ్‌వార్మ్ ఇన్‌ఫెక్షన్ వల్ల వ్యాపిస్తుంది. చాలా తక్కువ మందిలో ఉంటుంది. అలానే డెర్మోఫైట్స్ అనే ఫంగస్, పరిశుభ్రంగా లేకపోవడం వల్లా రావచ్చు.

ఎగ్జిమా: కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఉంటే ఎగ్జిమా త్వరగా వస్తుంది. ముఖ్యంగా పొడి చర్మతత్వం ఉన్న చిన్నారులకు త్వరగా వ్యాపిస్తుంది. దాంతోపాటు కుటుంబంలో ఎరికైనా ఉబ్బసం, అలర్జీలు ఉన్నా ఇది బాధిస్తుంది. సువాసనలు వెదజల్లే సబ్బులు వాడినా, ఎక్కువ సమయం స్నానం చేయించినా ఈ సమస్య రావడం సహజం.

చికిత్స:

సెబరేటిక్ డెర్మటైటిస్: దీన్ని తగ్గించడం చాలా కష్టం. శుభ్రతతో ఈ సమస్యకి సంబంధం ఉండదు. దానంతట అదే పోతుంది. అయినా కొన్నాళ్లపాటు గాఢత తక్కువున్న షాంపూతో తలస్నానం చేయించాలి.

ఫంగల్ ఇన్‌ఫెక్షన్ : ఈ సమస్య ఉన్నట్లయితే యాంటీఫంగల్ షాంపూతోనే తలస్నానం చేయించాలి. పిల్లలకి ప్రత్యేకంగా దువ్వెన పెట్టాలి. వారి దుస్తుల్ని విడిగా శుభ్రం చేయాలి.


ఎగ్జిమా: ఈ సమస్యకి ఎప్పుడూ మాయిశ్చరైజర్లు వాడుతుండాలి. అలానే పిల్లలకి పీహెచ్ 5.2 నుంచి 5.5 శాతం ఉన్న షాంపూలనే ఎంచుకోవాలి. పళ్లు సున్నితంగా ఉన్న దువ్వెనతో దువ్వుతుండాలి. మినరల్ నూనెతో తలకు మర్దన చేసి.. వేణ్నీళ్లలో ముంచిన తువాలుతో అద్దాలి. తరవాత తలస్నానం చేస్తే పెచ్చులు రాలిపోతాయి. అలానే ఎప్పుడూ గోరువెచ్చటి నీళ్లతో తక్కువ సేపు స్నానం చేయించాలి. సువాసనలు లేని సబ్బులు ఎంచుకుని.. తరచూ మాయిశ్చరైజర్, మినరల్ నూనెలు రాసి చర్మాన్ని తేమగా ఉంచాలి. దుస్తులు కూడా గాఢత తక్కువగా ఉన్న డిటర్జెంట్లతో ఉతకాలి. పూర్వం పెద్దలు ఉపయోగించినట్లుగా ఆముదంతో మర్దన చేయడం, మినరల్ నూనెలు రాయడం వంటివి చేయొచ్చు. నలుగు అసలు పెట్టకూడదు. మినరల్ నూనెల్ని నిపుణుల సలహాతో ఎంచుకోవాలి.

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

- మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.



బంగారం వెండి

8న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,500	31,620	31,500	31,550
ఆర్నమెంట్	29,420	29,540	29,200	29,250
వెండి (కిలో)	39,490	39,940	40,000	40,200
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	31,350	31,450	31,150	31,230
ఆర్నమెంట్	29,030	29,120	29,150	29,240
వెండి (కిలో)	39,700	40,000	39,900	39,300
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	31,340	31,480	-------	-------
ఆర్నమెంట్	29,150	29,280	2,915	2,925 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.50	41.80 గ్రా

రోగనిరోధకశక్తి కోసం...

దుమ్ముకి అలెర్జీ వస్తున్నా, పక్కవాళ్లు తుమ్మితే మనకు జలుబు చేస్తున్నా... వ్యాధినిరోధకశక్తి లోపించిదని అర్థం. మరెలా అంటే... ఆ శక్తిని పెంచుకునేలా చూసుకోవడమే పరిష్కారం.

- శరీరానికి తగిన పోషకాలు అందేలా చూసుకోవాలి. ముఖ్యంగా మాంసకృత్తులూ, విటమిన్లూ, పీచూ, సి విటమిన్ బాగా అందితే... రోగనిరోధకశక్తి పెరుగుతుంది.



- ప్రతీరోజూ వ్యాయామం చేయడం వల్ల శరీరానికి ప్రాణవాయువు బాగా అందుతుంది. ఉదయం పూట సూర్యకిరణాలు మన శరీరంపై పడేలా వ్యాయామం చేస్తే.. డి విటమిన్ కూడా అందుతుంది. ఆరోగ్యంగా ఉంటాం.
- బయటికి వెళ్లి, ఇంటికొచ్చిన వెంటనే, ఆహారం తీసుకునే ముందూ చేతుల్ని శుభ్రం చేసుకోవాలి. లేదంటే బ్యాక్టీరియా తీసుకునే ఆహారంతోపాటు శరీరంలోపలికి వెళ్లి, అనారోగ్యాలు వస్తాయి.



పాతికేళ్లకే ఐటీబీపీ తొలి అధికారిణిగా

భద్రతా దళాల్లో మహిళా అధికారులను నియమించేందుకు 2016లో ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అంతేనా కేంద్ర సాయుధ పోలీసు దళాల పరీక్షలను నిర్వహించింది. ఆ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది ప్రకృతి. పాతికేళ్ల ఈ అమ్మాయి ఇకపై ఇండో టిబెటన్ సరిహద్దు పోలీస్ దళం(ఐటీబీపీ) తొలి మహిళా అధికారిణిగా అసిస్టెంట్ కమాండెంట్ హోదాలో బాధ్యతలు నిర్వహిస్తుందన్నమాట. మొదటి ప్రయత్నంలోనే అనుకున్నది సాధించిన ఈ అమ్మాయి గురించి మరిన్ని విషయాలు ఇదిగో.. మీకోసం!

విజయం: ప్రకృతి డెహ్రాడూన్‌లోని ఐటీబీపీకి చెందిన ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో చేరనుంది. ఈ శిక్షణ అయ్యాక ఐటీబీపీ తొలి మహిళా అధికారిణిగా బాధ్యతలు తీసుకుంటుంది. ప్రస్తుతం అక్కడ 83వేల మంది విధులు నిర్వర్తిస్తుంటే వారిలో కేవలం 15 వందల మంది మాత్రమే మహిళలున్నారు. అంటే 1.75శాతం అన్నమాట. ఈ మహిళలు కూడా ఇప్పుడక్కడ కానిస్టేబుల్ ర్యాంకుతోనే పనిచేస్తున్నారు. పాతికేళ్ల ప్రకృతి ఏడాది కఠోర శిక్షణ అనంతరం తొలిమహిళా అసిస్టెంట్ కమాండెంట్ హోదాతో విధుల్లో చేరుతుంది.

నేపథ్యం: ప్రకృతి బిహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో పుట్టి పెరిగింది. చదివింది కూడా అక్కడే. ఆమెది మధ్య తరగతి కుటుంబం. తండ్రి ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేసేవాడు. తల్లి గృహిణి.

చదువు: ప్రకృతి చిన్నతనం నుంచీ చదువుల్లో ముందే. పరీక్షలంటే చాలు చదువే లోకం. అయితే తను సాయుధ పోలీస్ దళాల పరీక్ష రాయడానికి ముందు... ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పట్టా పుచ్చుకుంది.

లక్ష్యం: తనకి చిన్నతనం నుంచి ఓ లక్ష్యం ఉంది. దేశానికి సేవ చేసే రంగంలో ఉండాలని, గర్వించే యూనిఫాం ధరించాలని కలలు కనేది. కారణం ఆమె తండ్రి. ఎయిర్‌ఫోర్స్ దుస్తుల్లో ఊహ తెలిసినప్పట్నుంచీ చూస్తోంది. దాంతో లక్ష్యంపట్ల చిన్నతనంలోనే ఓ స్పష్టత తెచ్చుకుంది.

సాధించిందెలా: 2016లో ఐటీబీపీలో మహిళా అధికారులను నియమించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ వార్తను ఓ ఆంగ్ల పత్రికలో చూసిన ప్రకృతి.. సవాళ్లతో కూడిన ఆ ఉద్యోగాన్ని ఎలాగైనా సాధించాలనుకుంది. తన కల కూడా అదే కాబట్టి... అలా కేంద్ర సాయుధ పోలీసు దళాల ప్రవేశ పరీక్ష గురించి తెలుసుకుని గతేడాది దరఖాస్తు చేసింది. విజయవంతంగా పరీక్ష రాసి ఫలితాల్లో అనుకున్నది సాధించింది.


ఇంటి పేరు నచ్చదు: అదేంటి ఎవరికైనా పేరుతోపాటు అది ముఖ్యం కదా అనుకుంటున్నారు కదూ! కానీ ప్రకృతికి అది ఇష్టం ఉండదు. కేవలం సర్టిఫికెట్లలో రాస్తుంది తప్ప.. ఎక్కడా ఇంటి పేరును తన పేరు పక్కన రాసుకోదు. అంతేకాదు కుల మతాల ప్రస్తావన కూడా తీసుకురాదు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు రావాలని ఆశపడుతుంది తప్ప.. ఇంటి పేరు, తండ్రి పేరు చెప్పుకోవడం ఆమెకు నచ్చదు. ప్రకృతికి వివక్ష అన్నా గిట్టదు. తన తల్లిదండ్రులు.. సోదరులూ, తనని ఏ మాత్రం చిన్న చూపు చూసినా ఊరుకోదు.

ప్రోత్సాహం: ఐటీబీపీలోకి వెళ్లాలన్న ఆలోచనను ప్రకృతి తన తల్లిదండ్రులకు చెప్పినప్పుడు కాస్త కంగారుపడ్డారు. కానీ తన మీద నమ్మకంతో ఆమెను ప్రోత్సహించారు. 'వాళ్లే కనుక ఒప్పుకొని ఉండకపోతే నేను ఈ గుర్తింపు సాధించి ఉండేదాన్ని కాదు. పిల్లలు తమ లక్ష్యం గురించి తల్లిదండ్రులకు స్పష్టంగా వివరించాలి. ఈ విషయంలో అపోహలు ఉంటే తొలగించాలి. అప్పుడే అమ్మానాన్నలకు తెలుస్తుంది. తల్లిదండ్రులు ఒప్పుకోవట్లేదని చాలామంది పిల్లలు తమ లక్ష్యానికి దూరం కావడం నేను చాలా దగ్గరగా చూశాను. వారిని ఒప్పించుకునే బాధ్యత మనదే' అంటూ ఈతరం విద్యార్థులకు హితబోధ చేస్తోంది ప్రకృతి.

రయ్ రయ్

■ autopage@eenadu.in

మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512



ఇది సల్మాన్ సైకిల్..

బీయింగ్ హ్యూమన్ బ్రాండ్‌తో బాలీవుడ్ హీరో సల్లూభాయ్ టీషర్టులు, ఫ్యాషన్ యాక్సెసరీస్ అమ్ముతున్న సంగతి తెలిసిందే. దీనిద్వారా వచ్చే సంపాదనని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నాడు. ఈ వరుసలో రెండు విద్యుత్తు సైకిళ్లు కూడా విడుదల చేశాడు సల్మాన్‌ఖాన్. అమ్మకాలు జోరు మీదున్నాయి. ఆ వివరాలు.

మోడల్ పేరేంటి?

బీహెచ్ 27, బీహెచ్ 12 పేరుతో అమ్ముతున్నారు.

ప్రత్యేకతలు..

అత్యధిక వేగం గంటకి వరుసగా 30/ 25కిమీలు. తెలుపు, పసుపు, ఎరుపు, నలుపు రంగుల్లో లభ్యం. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) ఆమోదం కూడా ఉంది ఈ సైకిళ్లకి. మూడుగంటల ఛార్జింగ్‌తో బ్యాటరీ ఫుల్ అవుతుంది. ఎల్‌సీడీ డిస్‌ప్లే, ఎల్ఈడీ హెడ్‌లైట్, 36వోల్టుల లిథియం అయన్ బ్యాటరీతో నడుస్తుంది.

ధర: రూ.40వేలతో ప్రారంభం.

ఎక్కడ దొరుకుతాయి?

అమెజాన్‌తోపాటు ఇతర ఆన్‌లైన్ ఈ-కామర్స్ వెబ్‌సైట్లు.. దేశంలోని ప్రధాన నగరాల్లోని ఎంపిక చేసిన షాపుల్లో లభ్యమవుతున్నాయి.

రాయల్ ఎన్‌ఫీల్డ్ అనగానే గుర్తొచ్చేది 'బుల్లెట్' బైకే. డుగ్‌డుగ్‌డుగ్ అంటూ ఆ ద్విచక్రవాహనం చేసే శబ్దం వాహనప్రియుల గుండెల్లో గిలిగింతలు పెట్టేది. ఈ సంస్థది వందేళ్లు దాటిన హిస్టరీ. అమ్మకాలు చాలా ఏళ్లపాటు టాప్‌గేర్‌లో ఉండేవి. మొదట్లో భారతీయ సైన్యం, పోలీసులు మాత్రమే ఉపయోగించే బుల్లెట్‌ని రాజసానికి గుర్తుగా చూసేవారు. రాన్రాను సామాన్యుల చెంత చేరింది. సాంకేతికంగా అదుర్స్ అనిపించడం.. మంచి మైలేజీ.. భారీ రూపం.. అప్పట్లో ఇదో సంచలనం. అయితే ఏళ్లకొద్దీ ఒకే మోడల్‌ని కొనసాగించడం.. మేటి ఫీచర్లతో పోటీ బైక్‌లు రావడంతో గిరాకీ పడిపోయింది. నెంబర్‌వన్‌గా ఉన్న కంపెనీ కాస్తా తొంభైల్లో చివరికొచ్చేసరికి నెలకి వెయ్యి, రెండువేలు కూడా అమ్మలేని దుస్థితి.

డుగ్‌డుగ్‌డుగ్..

టాప్‌గేర్‌లో రాజసం!

కాలేజీ కుర్రాడు.. స్టైల్‌గా పోజు కొట్టే ఉద్యోగి.. లాంగ్‌టూర్‌లకెళ్లే సాహసి...
ఎవరైనా 'నీకిష్టమైన బైక్ ఏద'ని అడిగి చూడండి...
ఎక్కువమంది చెప్పే పేరు రాయల్ ఎన్‌ఫీల్డ్...
మెట్రోసిటీల నుంచి చిన్నపట్టణాల దాకా ఎక్కడైనా ఇదే ట్రెండు...
అందుకే మరి ప్రస్తుతం 350సీసీ విభాగంలో ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడయ్యే బైక్ రాయల్ ఎన్‌ఫీల్డ్.
దివాళా అంచు నుంచి టాప్ పొజిషన్‌కి దూసుకొచ్చిన ఈ ఆటోమొబైల్ కంపెనీ కథ ఆసక్తికరం.



అదిగో అప్పుడు ఎంటరయ్యారు సిద్ధార్థలాల్. కుర్రకారు నాడి పట్టేలా కొత్త కొత్త మోడళ్లు తీసుకొచ్చారు. నాణ్యతలో రాజీ పడలేదు. ఒకట్రెండు మోడళ్లకే పరిమితమైన కంపెనీని క్లాసిక్ 350, డిజర్ట్‌స్టార్మ్, క్లాసిక్ క్రోమ్, థండర్‌బర్డ్, బుల్లెట్ 500, హిమాలయన్ గ్రే, స్టెల్త్ బ్లాక్.. అంటూ 15 మోడళ్ల కంపెనీగా మలిచాడు. పోటీలేని 350-500 సీసీ సెగ్మెంట్‌పైనే దృష్టిపెట్టారు. కొత్త తరహా ప్రచారం పోటెత్తేది. కొత్త బైక్ లాంచ్ అయిన ప్రతిసారీ పెద్దపెద్ద పోస్టర్లు ముద్రించి పంచేవారు. టీషర్టులు, హెల్మెట్లు, జాకెట్లు.. ఇతర యాక్సెసరీస్ అమ్మడం మొదలైంది. 'రైడర్ మానియా' పేరుతో అధికారిక లాంగ్‌టూర్లు ప్రారంభించారు. వీటికోసం దేశంలోని కొత్త ప్రదేశాలు వెతకడానికి ఇరవైమందితో కూడిన ఓ బృందమే పనిచేస్తోంది. 'షో అండ్ సెల్' కాన్సెప్ట్‌తో వాహనాలు అమ్మే షోరూం రూపాల్ని పూర్తిగా మార్చేశారు. వీటిల్లోకి వెళ్తుంటే ఒక మాల్, పబ్‌ల్లోకి వెళ్తున్న అనుభూతి కలిగేలా తీర్చిదిద్దారు. ఇక ఈ బైక్‌ల్ని ఇష్టపడేవారు తమంతట తాముగా 'రాయల్ ఎన్‌ఫీల్డ్ రైడర్స్ క్లబ్'నే ఏర్పాటు చేసుకున్నారు. అందులో అత్యధికంగా మూడున్నర లక్షలమంది సభ్యులున్నారు. మొత్తానికి రాయల్ ఎన్‌ఫీల్డ్ అందరి మనసు గెల్చుకుంది. రాయల్ ఎన్‌ఫీల్డ్‌ని నడిపే వాళ్లు అర్జున్‌రెడ్డి సినిమాలో హీరోలా పోజు కొడుతున్నారు. అమ్మకాలు పోటెత్తడంతో కంపెనీ మళ్లీ టాప్ పొజిషన్‌కి చేరుకుంది. పోటీ సంస్థల ద్విచక్రవాహనాల అమ్మకాలు పదిశాతం పెరగడమే గగనమవుతుంటే ఆర్ఈ మాత్రం 25శాతం చొప్పున దూసుకెళ్తోంది.

మరింత దూకుడుగా



350సీసీ విభాగంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మార్కెట్ లీడర్. ఆ స్థానాన్ని మరింత పదిలపరుచుకునే ఉద్దేశంతో ఎప్పటికప్పుడు కొత్త మోడళ్లు తీసుకొస్తోంది. ఆ ఊపులో థండర్‌బర్డ్ 350ఎక్స్, థండర్‌బర్డ్ 500 ఎక్స్ అని రెండు కొత్త మోడళ్లు తెచ్చింది. వాటి వివరాలు.

- ఆర్ఈ బైక్‌లు గతంలో కొద్దిపాటి రంగులకే పరిమితమయ్యేవి. ఆ కొరత తీర్చేలా డ్రిఫ్టర్ బ్లూ, గేట్‌వే ఆరెంజ్, రోవింగ్ రెడ్, విమ్‌సికల్ వైట్.. అనే కొత్త రంగుల్లో వచ్చాయి ఈ బైక్‌లు.
- రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌కి 1980ల్లో మాత్రమే అలాయ్ చక్రాలుండవి. ఈ ట్రెండ్‌ని మళ్లీ తీసుకొచ్చారు.
- వెనక కూర్చునే సహ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా సీటును మరింత వెడల్పుగా మలిచారు. ట్యూబ్‌లెస్ టైర్లు మరో ప్రత్యేకత.
- కొంచెం కిందికి వంగిన హ్యాండిల్‌బార్ వీటి ప్రత్యేకం. ఇంజిన్‌లో ఎలాంటి మార్పుల్లేవు. థండర్‌బర్డ్ 350ఎక్స్ 346సీసీ, థండర్‌బర్డ్ 500ఎక్స్‌ది 499సీసీ సామర్థ్యం.
- మడ్‌గార్డ్, హెడ్‌ల్యాంప్ కేసింగ్, సైడ్‌ప్యానెళ్లు, మెకానికల్స్, ఇంధన ట్యాంకుని పూర్తిగా మార్చేయడంతో బైక్ పూర్తి ఆధునికంగా కనిపిస్తోంది.
- 350ఎక్స్ ధర రూ.1.56లక్షలు. 500ఎక్స్ రూ.1.98లక్షల్లో లభ్యమవుతోంది (దిల్లీ ఎక్స్ షోరూం).

ఇదొక స్టేటస్ సింబల్



బైక్ రైడింగ్ ఇష్టపడే ప్రతి కుర్రాడు జీవితంలో ఒక్కసారైనా మనాలీ నుంచి లేహ్ టూర్ పూర్తి చేయాలనుకుంటాడు. అదే ఇష్టంతో నేనూ కన్యాకుమారి నుంచి కశ్మీర్ యాత్ర చేశా. నాలాగే ప్రతి సీజన్‌లో వేలమంది లాంగ్‌టూర్లు చేస్తుంటారు. అయితే అందరిలో కనిపించే కామన్‌పాయింట్ ఏంటంటే ప్రతి వెయ్యి మంది బైకర్లలో తొమ్మిదివందల మందికి పైగా రాయల్‌ఎన్‌ఫీల్డ్‌నే వాడుతున్నారు. బైక్ రైడింగ్, ఆఫ్‌రోడింగ్‌లను ఇష్టపడే ప్రతి ఒక్కరి ఛాయిస్ ఆర్ఈనే. ఈ బైక్‌పై ఏకధాటిగా వెయ్యికిలోమీటర్లు ప్రయాణించినా ఇంజిన్ హీటెక్కదు. ఇతర ద్విచక్రవాహనాల్లో లీటరు, లీటరున్నర సామర్థ్యం ఉన్న ఇంజిన్ ఉంటే రెండున్నర లీటర్ల ఇంజిన్ దీని సొంతం. మరమ్మతులు తక్కువ ఉండటంతో నిర్వహణ ఖర్చులూ పెద్దగా ఉండవు. మట్టిరోడ్లు, ఘాట్‌రోడ్లు, హైవేలు.. ఎలాంటి రోడ్లపై అయినా దుమ్మురేపుకుంటూ దూసుకెళ్లే సత్తా ఈ బండికుంది. కొందరు మధ్యతరగతి కుర్రాళ్లు ఈ బైక్‌ని ఒక స్టేటస్‌సింబల్‌గా భావిస్తుంటే.. ఇంకొందరు డుగ్‌డుగ్‌డుగ్ అనే బీట్ కోసమే రాయల్‌ఎన్‌ఫీల్డ్‌ని కొనేస్తున్నారు.

- సుమన్ కన్నయ్యగారి, బైకర్

బుల్లెట్ రాజా



మాసిన గెడ్డం.. ఒంటిపై నిత్యం బైకర్ జాకెట్.. నిర్లక్ష్యపు చూపులు.. వేలకోట్లకు అధిపతి అయినా రాయల్ ఎన్‌ఫీల్డ్ సారథి సిద్ధార్థ విక్రమ్‌లాల్ రూపం ఇది. తనకు తాను ఒక బైకర్‌గా చెప్పుకోవడానికే ఇష్టపడతారాయన. వ్యాపార నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టి, ఇంగ్లండ్‌లో ఆటోమొబైల్ ఇంజినీర్‌గా శిక్షణ పొందిన సిద్ధార్థ దివాళా అంచున ఉన్న రాయల్‌ఎన్‌ఫీల్డ్‌ని టాప్ సెల్లింగ్ మోటార్‌సైకిల్ కంపెనీగా తీర్చిదిద్దారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ ఐషర్ మోటార్స్‌లో ఒక భాగం. ఇరవైఆరేళ్ల వయసులో సిద్ధార్థ ఆ సంస్థలో అడుగుపెట్టే సమయానికి కంపెనీ పీకల్లోతు కష్టాల్లో ఉంది. సంస్థను మూసేయడం లేదా అమ్మేయాలనే నిర్ణయానికొచ్చారు. 'రెండేళ్ల సమయం ఇవ్వండి. ఏదో ఒకటి చేసి చూపిస్తా' అని అడిగారు. బోర్డు సమ్మతించింది. అప్పట్లో ఐషర్ మోటార్స్‌కి ట్రాక్టర్లు, ట్రక్‌లు, బైక్‌లు, దుస్తులు సహా పదిహేను రకాల వ్యాపారాలుండేవి. వచ్చీ రాగానే 13రకాల వ్యాపారాలను అమ్మేసి బైక్‌లు, ట్రక్‌లమీదే దృష్టి పెట్టారు. ఆటోమొబైల్ రంగంలో ఎదగడం పెద్ద జోక్ అని చాలామంది వేళాకోళమాడారు. సిద్ధార్థ మాత్రం కొత్తదారిలో వెళ్లారు. మార్కెటింగ్ వ్యూహాలకు పదును పెట్టారు. కిందిస్థాయి ఉద్యోగుల నుంచి ప్రపంచంలోని ప్రముఖ ఆటోమొబైల్ రంగ నిపుణులతో కలిసి పనిచేశాడు. రాత్రీపగలూ ఇదే జపం. రెండేళ్ల కష్టంతో 'థండర్‌బర్డ్' సిద్ధమైంది. హెడ్‌ల్యాంప్స్ నుంచి టెయిల్ దాకా పూర్తిగా రూపం మారిపోయింది. ముఖ్యంగా దృఢమైన ఇంజిన్, గేర్‌బాక్స్‌ల వ్యవస్థ. ఇక ఆపై అంతా చరిత్రే. పదేళ్ల కిందట కనాకష్టంగా నెలకి రెండువేల బైక్‌లు అమ్మే సంస్థ ఇప్పుడు డెబ్బై మూడువేలు అమ్ముతోంది. 'బుల్లెట్ నడిపిస్తుంటే ప్రపంచమే దారి ఇస్తుంది' అనేది రాయల్ ఎన్‌ఫీల్డ్ నినాదం. దాన్ని అక్షరాలా నిజం చేసింది కంపెనీ మేనేజింగ్ డైరెక్టరే కాదు.. బ్రాండ్ అంబాసిడర్ కూడా అయిన సిద్ధార్థలాల్.

జరభద్రం

క్షణాల్లో.. కాపాడుతుంది!

భవిష్యత్తులో ప్రతి కారులో ఎయిర్‌బ్యాగ్‌లు ఉండాలంటోంది ప్రభుత్వం. వాటి అవసరం ఏంటి? ఎలా పని చేస్తాయంటే?

ఎయిర్‌బ్యాగ్‌ని నైలాన్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేస్తారు. ఇవి చాలా దృఢంగా ఉంటాయి. ఇందులో క్రాష్ సెన్సర్లు, ఇన్‌ఫ్లేటర్ అనే రెండు ముఖ్య భాగాలుంటాయి. ప్రమాదం జరిగినపుడు సెన్సర్లు ఆ విషయం పసిగట్టి సంకేతాలు పంపుతాయి. ఇన్‌ఫ్లేటర్ దాన్ని గ్రహించి ఎయిర్‌బ్యాగ్ వెంటనే తెరుచుకునేలా చేస్తుంది. కళ్లు మూసి తెరిచేలోగా ఇది జరుగుతుంది. బ్యాగ్‌లో ఉండే సోడియం యాసిడ్ నైట్రోజన్ గ్యాస్‌తో డీకంపోజ్ కాగానే ఎయిర్‌బ్యాగ్ పని మొదలవుతుంది. ఈ వాయువు ఎయిర్‌బ్యాగ్‌లోకి ప్రవేశించగానే అది విచ్చుకొని అరసెకనులో మెత్తని దిండులా తయారై వేగంగా బయటికొస్తుంది. కారు డ్రైవర్, పక్కసీటు, వెనకసీట్లలో కూర్చున్న వారి తల, ఛాతి భాగానికి దెబ్బలు తగలకుండా రక్షణగా మారుతుంది. కారు స్టీరింగ్ చక్రం మధ్యభాగం,



కారు ఖరీదును బట్టి వెనకసీట్లోకి ఇరుపక్కల ఎయిర్‌బ్యాగ్‌లు అమర్చుతారు. ప్రమాదం జరిగినపుడు ఎయిర్‌బ్యాగ్ తెరుచుకోవడానికి ఒక వెంట్ ఉంటుంది. దీని ద్వారానే నైట్రోజన్ గ్యాస్ విడుదల అవుతుంది. ప్రమాదం జరిగిన వెంటనే వ్యక్తికి గాయం కాకుండా అది తెరుచుకునే వరకు అందులో గ్యాస్ నిలిచి ఉంటుంది. తర్వాత గాలి బయటికి విడుదలై ఎయిర్‌బ్యాగ్ ముడుచుకుపోతుంది. పెద్దపెద్ద ప్రమాదాల్లో సైతం ఎయిర్‌బ్యాగ్‌ల కారణంగా ప్రాణాలు దక్కిన సందర్భాలు ఎన్నో చూసుంటాం మనం. వాడుతున్న కారును బట్టి ఒక్కో ఎయిర్‌బ్యాగ్ ఖరీదు రూ.24వేల నుంచి రూ.50వేల వరకు ఉంటుంది.

- సంతోష్ కుమార్ తల్లం

పరిచయం



నయా సివిక్.. ఆకట్టుకునే లుక్

కార్లతో కాస్త పరిచయం ఉన్న ఎవరికైనా హోండా 'సివిక్' గురించి తప్పక తెలిసే ఉంటుంది. దశాబ్దం వెనక్కి వెళ్తే దేశంలోని టాప్ మోడళ్లలో ఇదొకటి. ఐదేళ్ల కిందట మార్కెట్ నుంచి వైదొలిగాక మళ్లీ అదే పేరుతో మరింతగా ముస్తాబై వస్తోంది. ఈ ఏడో జనరేషన్ కారులోని కబుర్లు, ప్రత్యేకతలు ఏంటంటే.

1. సివిక్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా హ్యాచ్‌బ్యాక్, కూపె, సెడాన్ విభాగాల్లో కార్లు అమ్ముతోంది హోండా. ఇండియాలో మాత్రం సెడాన్ సెగ్మెంట్ మాత్రమే అందుబాటులో ఉంది.
2. గ్రౌండ్ క్లియరెన్స్ అతి తక్కువగా ఉండే లో-స్టాన్స్ స్పోర్ట్ లుక్ కారుగా అప్పట్లో సివిక్ బాగా పేరుండేది. సిటీ, అకార్డ్ మోడళ్ల మధ్య అంతరాన్ని పూడ్చడానికి దీన్ని మళ్లీ తీసుకొస్తున్నారు.
3. గతనెలలో జరిగిన ఆటోఎక్స్‌పోలో ఈ మోడల్‌ని ప్రదర్శించారు. బాగా మెరుగులద్దిన ఈ కొత్త సివిక్ ఇప్పటికే అమెరికా, యూరోప్ మార్కెట్లో అందుబాటులో ఉంది.
4. స్పోర్టీ లుక్ డిజైన్, అత్యంత ప్రకాశవంతమైన హెడ్‌ల్యాంప్ క్లస్టర్లు, స్టైలిష్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, అలాయ్ చక్రాలు, విశాలమైన ఇన్ఫోటైన్‌మెంట్ తాకే తెర, ప్రీమియం ఇంటీరియర్లు, అత్యాధునికంగా తీర్చిదిద్దిన క్యాబిన్.. కొత్త జనరేషన్ కారుకి అదనపు హంగులు.
5. 1.8లీ పెట్రోల్ ఇంజిన్, 1.6లీ ఐ-డీటెక్ డీజిల్ ఇంజిన్, మాన్యువల్‌తోపాటు ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఇతర సాంకేతిక అంశాలు. ధర రూ.13 నుంచి రూ.18లక్షలు.


మెకానిక్ గురూ

కొత్తకారుకి కోరుకున్న సీటు కవర్లు

■ ఈమధ్యే కొత్త టాటా నెక్సన్ నీలిరంగు కారు కొన్నాం. దానికి సీటు కవర్లు కొనాలనుకుంటున్నాం. ఎలాంటి మెటీరియల్ ఉన్న కవర్లు కొంటే బాగుంటుంది? వీటి మన్నిక ఎక్కువ కాలం ఉండాలంటే ఏం చేయాలి? ఇది కాకుండా కారుకి రక్షణ కోసం ఎక్స్‌టీరియర్ పెయింట్ వేయించవచ్చా?

- రాజా రుష్యేంద్ర, ఈమెయిల్

సీటు కవర్లు మన మనసును ఉల్లాసభరితం చేసే పరికరాలు. అయితే ఒక్కోసారి వాటి గురించి మనం సరిగ్గా తెలుసుకోకపోతే మోసపోవడానికీ అవకాశం కూడా ఉంటుంది. ముప్ఫై నుంచి నలభైవేలు భరించగలిగే స్తోమత మీకుంటే మీ కారుకి స్టాన్లీ సీటు కవర్లు ఎంపిక చేసుకొమ్మని నేను సూచిస్తాను. నాణ్యతకు మారుపేరైన ఈ బ్రాండ్‌లో చాలా రకాల రంగులు, డిజైన్లు లభిస్తున్నాయి. వీటి తయారీలో రెగ్జిన్‌తోపాటు కాటన్ మిశ్రమం కూడా ఉండటంతో రెగ్జిన్ నుంచి వెలువడే వేడి గణనీయంగా తగ్గుతుంది. ఇందులోనూ కుదిరితే సన్నని రంధ్రాలుండే డిజైన్ కవర్లు తీసుకోండి. వేసవికాలంలో చెమట నుంచి కూడా ఉపశమనంగా ఉంటుంది.



- సాయిభరత్ బొప్పరాజు, www.motofix.in